మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.01.2024

భస్మ మోహిని

మిసిమి

చింతనాత్మక సారస్వతం



చెన్నకేశవ స్వామి

మాసపత్రిక, ఫిబ్రవరి , 2024 ₹ 50/-

ISSN 2454–4329

ద్రోణాచార్య

ఖేమూర్ చిత్రకళ

అశ్వద్ధామ

చిత్రకారుడు : ధర్మ

మిసిమి

మాసపత్రిక

సంపుటి 35 సంచిక 2

ఫిబ్రవరి - 2024

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : వోలేటి పార్వతీశం

KALA JYOTHI Since 1946

Printed & Published by

BAPANNA ALAPATI

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

1-1-60/5, R.T.C. 'X' Roads, Musheerabad,

Hyderabad - 500 020.

Ph: 040 - 27612436, 27645538.

Editor: **V. ASWINI KUMAR**

Ph: 994 951 6567

చందా వివరాలు:

₹ 600/- (సంవత్సర చందా),

₹ 1200/- (రెండు సంవత్సరాలకు),

₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : **జి. ఉమాసుందరి**

040-27645536

Scan QR to Pay

Misimi Publication

LIBRARY OF CONGRESS

LCCN 91-903060

UGC Care

INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE

ISSN 2454-4329

misimi90monthly@gmail.com

www.misimimonthly.com

YouTube : **Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**

అట్టతో కలిపి 84 పేజీలు

మిసిమి

ఫిబ్రవరి నెల సూచికలు...

గిరిజన యువతి

ఎడిటర్స్ డైరి : ... 3
ఉపనిషత్ ఉద్యానవనం : ఆచార్య పప్పు వేణుగోపాలరావు ...5
భిక్షతో కట్టిన విశ్వవిద్యాలయం : డా. కిల్లాడ సత్యనారాయణ ... 9
గేయ కావ్యాలు : డా. సి.నా.రె : డా. కె. మధుజ్యోతి ... 15
ఆధునిక తెలుగు కవిత్వం-జలసంరక్షణ : ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు ... 21
రాజాం పట్టణ భౌగోళిక చరిత్ర : గార రంగనాథం ... 27
గిరిజనుల జీవనం : తోట రామకృష్ణ ... 32
శతక సాహిత్యం : డా. డి. యువశ్రీ ... 35
తెలుగు కన్నడ పత్రికలు-ప్రజా చైతన్యం : డా. డి.కె. ప్రభాకర్ ... 41
హాన్స్ హెూల్ బయిన్ రాయబారులు : తంగెడ విశ్వేశ్వర ప్రసాద్ ... 45
సుబ్బయ్య గారి మేడ-నవలాహృదయం : రాజా రామమోహన రావు ... 51
రాజస్థాన్ కోటలు : ప్రొ. లక్ష్మీ అయ్యర్ ... 52
చిత్రగీతాలు-హిందుస్థానీ బాణీలు : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 55
సూక్తి సురభి : రెంటాల సాంబశివరావు 57
నగ్నముని గారితో : మిసిమి ... 59
శ్రీవేంకటేశ పదములు : మోదుగుల రవికృష్ణ ... 65
చివరి తత్త్వవేత్త విట్ గెన్ స్టీన్ : ముక్తవరం పార్థసారధి ... 68
సరిహద్దులు దాటి... : సి.ఎస్. రాంబాబు ... 77
చదవండి : మిసిమి ... 78

మిసిమి లో డా. శేషగిరి

ఫిబ్రవరి - ఆలపాటి రవీంద్రనాథ్ 28వ వర్ధంతి

అట్టమీది బొమ్మలు

చెన్నకేశవ స్వామి

ద్రోణాచార్య

అశ్వద్ధామ

భస్మ మోహిని

బేలూరు — చిత్రకారుడు : ధర్మ — బేలూరు

విజ్ఞులయిన **మిసిమి** పాఠకులు తరచూ అడుగుతుంటారు. మీరు డైరీ ప్రతినెలా రాయండి అని! ఇదొక వర్తమాన ప్రక్రియ. మాసపత్రికలో వార్తలుండవు. వార్త వర్తమానంలో క్షణికం – దృశ్యమాధ్యమాలు వచ్చిన తర్వాత – తక్షణికం! అలాంటిది మాన పత్రికలో వర్తమాన విషయాలు చర్చించటం ఇబ్బందికరమే – ఇన్ బిట్వీన్ లైన్స్ మాదిరి వర్తమాన దృశ్యాలకు నేపథ్యమేమిటో చూస్తుండాలి – వ్యక్తులెవ్వరో గుర్తించాలి – చెప్పవలసిన విషయాలను గుది గుచ్చాలి – కొంత హెచ్చరిక – కొద్దిగా చతురత కలగలసి – హైద్రాబాదీ రూఫ్ అఫ్ జా – లేదా ఫలూదా గుబాళించాలి!! చివరిలో 'కొస'–మెరుస్తుండాలి – **మిసిమి**ని వర్తమానంలో నిలబెట్టటమే దీని లక్ష్యం – అది పాఠకులకు చేరటమే పరమార్థం – రెండు రోజుల క్రితమే ఎవరిదో వ్యాసం – ఎవరిదో కాదు – కిల్లాడ వారి 'భిక్షతో కట్టిన విశ్వవిద్యాలయం' చదువుతుండగా నిమ్స్ నుండి వీడియో కాల్ వచ్చింది నా ఫోన్‌కే! ఆశ్చర్యపోవటం నావంతయింది '...నేను ఫలానా – నిమ్స్ నుంచే మాట్లాడుతున్నాను' అని '**మిసిమి**' పత్రిక చదువుతూ కనిపించారు. నమస్కారం అని పలకరించారు. ఇది చిన్నవిషయం కాదు – 'నాకు రేపు ఆపరేషన్ చేస్తున్నారు. కాన్సర్‌కు సంబంధించిన ట్యూమర్ తొలగించటానికి – **మిసిమి** నాకు ఎంతో ధైర్యాన్నిస్తున్నది – నేనేమీ భయపడటం లేదు...' మరికొన్ని వివరాలు చెప్పారు – కొత్త ముఖ్యమంత్రి లక్షరూపాయలు ఒక్కరోజులో ఇచ్చే ఏర్పాటు చేశారు – నా అభ్యర్థన విని – అనికూడా చెప్పారు. చూశారా మరి ఇవి వార్తల్లో రావు కదా!

* ఒక కార్డు ముక్క వచ్చింది. ఈరోజుల్లో ఉత్తరాలు రాసేదెవరు – అదీ కార్డు! రాత అర్థమవుతోంది – దాని సారాంశం – నా జీవితంలోని అదృష్టాలలోకెల్ల పెద్ద అదృష్టం '**మిసిమి**' చందాదారుని కావటం! మోహనరావు, (కాకినాడ) '**మిసిమి**' పఠనం – నా ఆయుష్షు పెంచుతున్నది – వేరే ప్రాణవాయువు కోసం పాకులాడవలసిన పనిలేదు – మీకు వేన వేల ధన్యవాదాలు....'

* ఆశ్రమంలో అప్పుడే సాత్వికాహారం ఆరగిస్తుండగా సెక్రటరీ చెన్నకేశవ రావు గారు మీరొకసారి కిందకు వస్తారా అని ఫోను! ఎందుకో అని వెళ్తే – ఆయన కార్యాలయంలో ముగ్గురు వ్యక్తులు నన్ను చూసి నిలబడుతూ నమస్కారం చేస్తుంటే వారించాను!! ఉడయవర్లు – రామ్మూర్తి – లక్ష్మణరావు – విశాలాంధ్ర – ప్రజాశక్తి– అందరూ పత్రికా ప్రపంచంలో పండినవారే – పేర్లు తెలుసు కానీ కలవటం ఇదే – ఏటుకూరి, బొమ్మారెడ్డి – రాఘవాచారి ఇలా అందరి కబుర్లు అయిన తర్వాత ఉడయవర్లు ఒక చిన్న రంగు మారిన కాగితం (12 ఏప్రిల్ 1970 నాటిది) తీశారు. దాని సారాంశం !



* ఉదయం కాఫీ ఘుమఘుమలంత సామాన్యమైపోయాయి ఉక్రైన్–ఇజ్రాయిల్ యుద్ధ వార్తలు. రెండో ప్రపంచయుద్ధం తరువాత ప్రపంచంలో ఎక్కడో ఒకచోట రావణకాష్ఠం తగులబడుతూనే ఉంది. మిగతా ప్రపంచానికి బుల్లెట్లు గాయాలు, మృత్యుఘోష లేకపోయినా యుద్ధ ప్రభావాలు పడని ప్రదేశం అంటూ ఉండదు పరోక్షంగా. ఈ యుద్ధాలు, వాటి వార్తలు మానవజాతి మానవత్వాన్ని మొద్దుబారుస్తున్నాయి. పైన చెప్పినట్లు కాఫీ వాసనంత సామాన్యమై పోయింది. రక్తపు మడుగులు, శవాల గుట్టలు అలవాటు చేశాయి వార్తలు, సినిమాలు. దీని పర్యవసానం ఎలా ఉంటుందో చెప్పగలం అందరికీ అర్థమయ్యే భాషలోనే. ఒకప్పుడు మంచి మనసులు, ఉమ్మడి కుటుంబం, మా ఇంటి మాలక్ష్మి లాంటి సినిమాలు వస్తుండేవి. తరువాత ఖైదీ, రాక్షసుడు, అత్తకు మొగుడు, ముఠామేస్త్రీ అలా మారిపోయింది. ఆ తరువాత కిల్లర్, కిక్, రారా, పోరా, ఏం పీకుతావు, దెయ్యాలు, భూతాలు. ఇక ఇప్పుడు పిండం, యానిమల్ వచ్చేసాయి. మనకేమీ మిగల్లేదు. హింస కాఫీ అంత మామూలైపోయింది. పక్కవాడి బాధ, పదిమంది మేలు ఆలోచనే పోయింది. మనం చాలా అదృష్టవంతులం. టమాటా ధర, పొటాటో రేటు, ట్రాఫిక్ ఇబ్బంది ఇవే మనకు పెద్ద బాధలు!

* జనవరి 3వ తేదీన **మిసిమి** ఒక పండుగ చేసింది. యాత్రాకథనాల పుస్తకం విడుదల కార్యక్రమం. వేదిక రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్. ఆచార్య కొలకలూరి ఇనాక్, ఆచార్య ఎన్. గోపి, ఆచార్య మృణాళిని గార్లు ఒక వేదిక పంచుకోవటం ఇదే మొదటిసారి అయి ఉండాలి. వారి శిష్యులు, అభిమానులతో సమావేశ మందిరం నిండుగా కళకళలాడిపోయింది. ఆహ్లాదకరంగా జరిగిన పుస్తకావిష్కరణ చక్కని ప్రసంగాలతో పరిమళించింది. గ్రంథకర్త డా. శేషగిరి 45 నిమిషాలు వారి అనుభవాలు ఉత్సాహభరితంగా వినిపించారు. ఆచార్య గోపి కవిత్వాన్ని అద్దారు. మృణాళిని గారు పుస్తకంలోని విషయాలను గ్రంథకర్తకు అన్వయించి చెప్పారు. అధ్యక్షులు తొలి, మలి పలుకులలో పుస్తకాన్ని పూసగుచ్చినట్లు వివరించారు. అనువాదకులు అట్లూరి జయశ్రీ, ఆదినారయణ తమ అనుభవాలను గుర్తు చేశారు. రేడియో రాంబాబు కార్యక్రమాన్ని నైపుణ్యంగా సమన్వయం చేసారు. **మిసిమి** అతిథులందరిని సత్కరించింది.

ప్రొ. పార్థసారథి, డా. బాలాచారి వేదికకు నిండుతనం తెచ్చారు. గోపీచంద్, రవీంద్రనాథ్ గారిని గుర్తు చేసుకుంటూ కృతజ్ఞతా స్తుతులను అందించారు. మూడుగంటల పాటు సాగిన సభా కార్యక్రమంలో పెద్దలు శ్రీ ఆలపాటి బాపన్న, రచయిత్రి కిలారి స్వర్ణ, అనిల్ అట్లూరి, వేమూరి సత్యం, రాయవరపు సత్యన్నారాయణ, డా. వల్లభనేని నాగేశ్వర రావు, దాసరి అమరేంద్ర, ప్రొఫెసర్ గోపీ పర్యవేక్షణలో యాత్రాచరిత్రలపై పరిశోధన చేసిన మత్సా హరిదాస్, డా. శేషగిరి మాతృమూర్తి, బంధుమిత్రులు పాల్గొన్నారు. గ్రంథకర్త గురువులు అంబటి రమణమ్మ, విద్యాసాగర్ గార్లు తొలి ప్రతులు అందుకున్నారు.

యాత్రాకథనాలు - ఆవిష్కరణ

* రెండు విషయాలని నివేదించి ముగిస్తాను. మొదటిది నగ్నముని ఫోన్ చేసి నిన్ను చూడటానికి వస్తున్నాను అంటే వద్దండి చాలా పనిలో ఉన్నాను అంటూ నసుగుతుంటే మూడు గంటలకు వస్తున్నాను ఉండండి అని ఫోన్ ముగించారు. నిజానికి పనిలోపడి ఆ సంగతే మర్చిపోయి గ్రంథాలయంలో డా. శేషగిరితో ఇంటర్వ్యూ రికార్డు చేస్తున్నాం. ఏదో పనితో క్రింద ఆఫీసుకి వచ్చి, చాలా నిశ్శబ్దంగా, బుద్ధిమంతునిలా కూర్చుని ఉన్న మునివర్యులను చూసి అయ్యో అనుకోవటం నా వంతయింది. మీరు పని ముగించండి నేను వేచి ఉంటాను అన్నారు. తరువాత లంచ్ బ్రేక్, మళ్లీ డాక్టర్‌గారితో సంభాషణ, ఫోటో షూట్, డాక్టర్ గారికి వీడ్కోలు ఇలా ఐదు గంటలు అయింది. సందడిగా ఉన్నా లోపల నాకు గిల్టీగానే ఉంది. ముని మీరు ప్రశాంతంగా కూర్చోండి అని, నేను కూర్చున్న తరువాత నెమ్మదిగా ఆయన దగ్గర ఉన్న సంచిలోంచి ఒక కవరు అందులో చాలా ఫొటోలు తీసి ఒక్కొక్కటి నా ముందు పెట్టారు. ఒక్కసారిగా నాకు టైమ్ మిషన్‌లో అర్ధశతాబ్దం గతంలోకి వెళ్లిన భావన కలిగింది. ఏమిటి ఆ ఫొటోలు, మద్రాసు సెంట్రల్–పెరంబూర్ కోచ్ ఫ్యాక్టరీ – తరువాత చిన్న రైల్వే స్టేషన్ విల్లివాక్కమ్! ఆయన అక్కడకు ఎందుకు వెళ్లారు? ప్రత్యేకంగా ఫొటోలు తీసి నాకెందుకు చూపించారు? ఈ టైమ్ షాక్ నాకెందుకు? ఇవన్నీ తెలియాలంటే ***'పారిజాతం'***లో 'రాణి విఠోబా' చదవాలి. ఇక్కడ అవన్నీ చెప్పలేం కదా.

విల్లివాక్కంలో నగ్నముని

* మరోవిషయం 10 సంవత్సరాలుగా విజయనగర్ కాలనీలో ఒక క్షురకుని దగ్గరకి వెళుతున్నాను నెలకో రెండు నెలలకో. మరోచోటకి ఒకటి రెండుసార్లు వెళ్లినా చేదు అనుభవం మిగిలింది. ఈ రంగయ్యో, రామయ్యో (పేరు తెలీదు) కు ఎందుకు అలవాటు పడ్డాను? అయిదు అడుగులే ఉంటాడు. నేరేడుపండు రంగు, నవ్వినా శబ్దం రాదు. నేను కారు పార్క్ చేయటం దగ్గర్నుంచి గమనిస్తాడు. లోపలికి రాగానే ప్రత్యేకమైన కుర్చీ దులిపి కూర్చోబెడతాడు. మెడకు అప్రాన్ చుడతాడు. టి.వి ఆపేస్తాడు. అంతే నేను ధ్యానంలోకి వెళ్లిపోతాను. సార్ అని మెత్తగా పిలుస్తాడు ఒక పావుగంట తర్వాత. నాకు కత్తెర శబ్దం వినపడదు. నీటి తడి తెలియదు, మెత్తగా మెల్లిగా తన కళను పూర్తిచేస్తాడు. వెనక అద్దంపెట్టి చూపిస్తాడు. ఏముందు చూడటానికి నవ్వొస్తుంది ఇద్దరికీ నిశ్శబ్దంగానే. మెత్తని ఉడత బ్రెష్‌తో పౌడర్ అద్దుతాడు. అప్రాన్ తీసేసి పక్కన నిలబడతాడు. నేను ఇచ్చింది తీసుకుని కొద్దిగా వంగుతాడు. అంతే మళ్లీ నెలకో, రెండు నెలలకో. హైదరాబాద్‌లో ఎక్కడున్నా ఇక్కడికే వస్తాను. అలాగే మొన్న '23 చివరిలో వెళ్లాను . షాపు తీసే ఉంది. ఎవరూ లేరు. నేను రెండు నిమిషాలు లోపల ఉన్నాను. ఇంతలో ఒక 20 ఏళ్ల కుర్రాడు వచ్చాడు. ఏమనడగాలి? పేరు తెలీదే? 'పెద్దాయన..' అని అంటుండగా నాన్నగారు పోయారు రెండు నెలలయింది. అంతే విషాదం నన్ను అలుముకుంది. నీ పేరు? రమేష్, అన్న జాబ్ చేస్తున్నాడు, నేనూ వెళ్లిపోతాను – అంటే షాపు? అతని సమాధానం కోసం చూడలేదు 100 రూపాయలు అతని చేతిలో పెట్టి త్వరగా వచ్చేశాను. నాకు ఈ బాధ రెండు రోజులుగా మెలిపెడుతోంది. నాకేమీ కానీ అతని గురించి ఎందుకు నాకీ విషాదం? చెప్పుకుంటే తగ్గుతుందని డా. శేషగిరి (సైకియాట్రిస్ట్) ఆయన ఇంటర్వ్యూలో చెప్పారు. అందుకే మీకు చెబుతున్నాను.

ఉపనిషత్ ఉద్యానవనం
ఈశావాశ్య ఉపనిషత్తు

– పప్పు వేణుగోపాల రావు

మనం క్రిందటి నెల ఉపనిషత్తుల గురుంచి ఉపోద్ఘాతంలో వాటి స్వరూపం తెలుసుకున్నాం. అందులో వేదాంతులు ప్రముఖంగా 11 ఉపనిషత్తులను ప్రధానంగా పరిగణిస్తారు. ఆ పదకొండు : ఈశ, కేన, కఠ, ప్రశ్న, ముండక, మాండూక్య, తైత్తరీయ, ఐతరేయ–ఛాందోగ్య, బృహదారణ్యక, శ్వేతాశ్వతర ఉపనిషత్తులు. ఈ పదకొండులో ఉన్నవే మిగిలిన ఉపనిషత్తులలో మళ్ళీమళ్ళీ చెప్పడం కనిపిస్తుంది. అందుకే ఇవి చదివితే అన్ని ఉపనిషత్తుల సారం ఇంచుమించుగా తెలుస్తుంది. వీటిలో మొదటి పది ఉపనిషత్తులకే ఆది శంకరులు, రామానుజులు, మధ్వాచార్యులు వ్యాఖ్యానాలు వ్రాసేరు.

వీటిలో మొదటి ఉపనిషత్తు ఈశావాశ్య ఉపనిషత్తు. ఈ ఉపనిషత్తునే పండితులందరూ మొట్టమొదటి ఉపనిషత్తుగా పరిగణిస్తారు. ఇందులో 18 శ్లోకాలే ఉన్నాయి, కానీ ఇది భగవద్గీతను ప్రభావితం చేసిన ఉపనిషత్తు. ఆదిశంకరాచార్యుల వారు భగవద్గీతకు వ్యాఖ్యానం వ్రాస్తూ దీనిని 'సమస్త వేదార్థ సార సంగ్రహం' అని పేర్కొన్నారు. ప్రాచీన, ఆధునిక వేదాంత పండితులందరికీ ఇది మార్గదర్శకం అయింది. ఇందులో ఏముందో సంక్షిప్తంగా తెలుసుకుందాం. ఈ ఉపనిషత్తు శుక్ల యజుర్వేద శాఖకు చెందినది. ప్రతి ఉపనిషత్తుకు ముందు ఒక శాంతి మంత్రం ఉంటుంది. అదే మంత్రం 2–3 ఉపనిషత్తులకు కూడా ఉండవచ్చు. ఇందులో మనకి తెలిసినవే కొన్ని అసతోమా సద్గమయ, ఓం సహనావవతు, ఓం పూర్ణమిదం ఇలా ఇంతకుముందెప్పుడో ఒకప్పుడు మనం విన్నవే.

ఈ శాంతిమంత్రాలు మనం చదవబోయే ఉపనిషత్తుకు ప్రాతిపాదిక వంటివి, ఒక కోవెలకు ప్రాకారంలా అవి ఒక ఆధ్యాత్మిక వాతావరణాన్ని కలిగించి మనస్సును ఉపనిషత్తును అర్థం చేసుకొనేలా చేస్తాయి. ఇందులో శాంతి మంత్రం ఇది:

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే

ఓం శాంతిః శాంతిః శాంతిః

తాత్పర్యం ఏమిటి అంటే : ఆ భగవంతుడు పరిపూర్ణుడు, ఈ లోకం పరిపూర్ణమైనది. ఆ పరిపూర్ణత నుంచే ఈ పరిపూర్ణత ఏర్పడింది. ఒక పరిపూర్ణం లోంచి ఇంకో పరిపూర్ణం తీసివేసినా, మిగిలింది కూడా పరిపూర్ణమే! దీనిని స్వామి జ్ఞానానందులవారు ఇలా వివరించేరు. ఎలా అంటే ఒక దీపం నుంచి మరో దీపం వెలిగించేం అనుకోండి, మొదటి దీపం దీపమే, రెండోదీపం దీపమే. దేనికది పరిపూర్ణం. భగవంతును అనంతుడు. ఆయన సంపూర్ణత ఆయన చేసే సృష్టివల్ల తరగదు.

ఈ శ్లోకం 'ఓం శాంతిః శాంతిః శాంతిః' అనే పాదంతో ముగుస్తుంది. వేద మంత్రాలన్నీ ఈ పాదం తోనేముగుస్తాయి. ఈ శాంతిః అనే పదాన్ని మూడు సార్లు ఎందుకు చెప్తాం అంటే, మనకు మూడు విధాలయిన ఆటంకాలు ఎదురవుతాయి. ఆ మూడు

1. ఆధ్యాత్మికం : మనవల్ల మనకు కలిగేవి, అనారోగ్యము,మానసిక అస్థిరత లాంటివి 2. ఆధి భౌతికము : ఇతర ప్రాణుల వలన కలిగే విఘ్నాలు. 3. ఆధి దైవికం : ప్రకృతి వైపరీత్యాలు,వానలో, వరదలో,

పిడుగులో లాంటివి. మూడు సార్లు ఈ విఘ్నాలు తొలగడానికి 'ఓం శాంతిః శాంతిః శాంతిః' అని శాంతిః అనే పదాన్ని మూడు సార్లు చెప్తాము.

ఈశావాశ్య ఉపనిషత్తు: ఉపనిషత్తులు వేదానికి శిరసు వంటివి. ఆ ఉపనిషత్తులలో తలమానికమైనది ఈశావాశ్యం. ఇంకో విశేషం ఏమిటంటే మనం ఇంతకు ముందు వ్యాసంలో చెప్పినట్టు, వేదాలలో మొదటి భాగం సంహిత-మంత్రం భాగం, రెండవది బ్రాహ్మణం, కర్మకాండ, మూడవది ఆరణ్యకం-ఒకరకంగా చెప్పాలంటే జ్ఞాన కాండకు పునాది, చివరి భాగం ఉపనిషత్తులు-జ్ఞానకాండ. మిగతా ఉపనిషత్తులలా కాకుండా మొదటి భాగం అయిన సంహిత, అంటే మంత్రభాగంలోనే ఈశావాస్యం ఉండడం విశేషం. ఈ ఉపనిషత్తులో 18మంత్రాలే ఉన్నాయి. ఎక్కువగా మంత్రాలు చెప్పకుండా సారాంశం చెప్తూ అవసరమైన మేరకు మంత్రాలు ఉటంకిస్తాను.

ఈ ఉపనిషత్తులో మొదటి మంత్రంలోనివి రెండు పాదాలు ముఖ్యమైనవి మొదటి పాదం 'ఈశావాస్య మిదం సర్వం' ఈ ప్రపంచం అంతా భగవంతునితో నిండి ఉంది. ఆయన లేని చోటులేదు అని అర్థం. ఇక మూడవ పాదం - తేన త్యక్తేనభుఞ్జథా -త్యాగబుద్ధితో అనుభవించు అని అర్థం. ఈ రెండు పాదాలు తరచూ ఉపనిషత్తులు ప్రవచనం చేసేవారి నోట వింటూఉంటాం. తాత్పర్యం ఏమిటి అంటే, ఈ ప్రపంచమంతా భగవంతునితో నిండిఉంది, సమస్తము భగవంతునిదే అనే త్యాగభావంతో అనుభవించాలి. నేను, నాది అనే అహంకారాన్ని వదిలి పెట్టాలి. పనిచేయడం మన విధి. కర్మ చేయడం వలన జ్ఞానం కలుగుతుంది. భగవద్గీతలో చెప్పినట్టు ఫలితం మీద ఆసక్తి లేకుండా కర్మ చెయ్యాలి. నేను ఈ పనిచేసేను అనే దురహంకారం ఉండకూడదు. అలా అహంకారం లేకుండా చేసిన కర్మ వలన లభించే ఫలం అనుభవించడంలో తప్పులేదు. మొదటి శ్లోకం ఎదుటివారి సంపదను ఆశించవద్దు అని కూడా చెప్తుంది.

త్యాగం అనేది ఒక యోగం. తనకు లభించిన దానితో సంతృప్తిపడే భోగం కూడా యోగమే. త్యాగం భోగం ఈరెండిటి సమన్వయాన్ని ఈ ఉపనిషత్తు చెపుతుంది. సాటి ప్రాణులతో నీరు, గాలి, ప్రకృతి ఎలా అనుభవిస్తున్నామో అలాగే సంపదలనూ అనుభవించాలి. అంటే అందరికీ మన సంపదలు పంచమనికాదు, ఎదుటివారి సంపదలు ఆశించకుండా మనకి లభించిన దానితో సంతృప్తి కలిగి త్యాగ భోగాలను అనుభవించాలి. అది కర్మ యోగము, జ్ఞాన యోగం, ఆత్మయోగానికి పునాది. మనందరికీ శరీరం, మనసు వీటి ఉనికి తెలుసు, ఆత్మ గురుంచి ఏదో తెలిసినట్టు ఉంటుంది గాని, సరిగా ఇది అని తెలియదు. అసలీ ఆత్మ అంటే ఏమిటి అనేది 4-5 శ్లోకాలలో ఈ ఉపనిషత్తు చెప్తుంది. ఆత్మ చలనం లేనిది, స్థిరమైనది, కాని మనసుకంటే వేగవంతమైనది. విజ్ఞానశాస్త్ర దృష్టితో చూస్తే ప్రతి చలించే వస్తువుకి చలించని ఒక ఆధారం కావాలి. రైలుబండి నడవడానికి చలించకుండా ఉండే రైలు పట్టాలు అవసరం కదా. అలాగే శరీరానికి ప్రాణానికి జీవరాసులన్నిటికీ ఆధారం ఆత్మ.

అలా ఆత్మ చలనం లేనిది, చలనం గలది కూడా, మనకి ఎంత దగ్గిరగా ఉంటుందో అంత దూరంగానూ ఉంటుంది, మన లోపలా ఉంటుంది, మన బయటా ఉంటుంది. అన్ని ప్రాణులలోను ఉంటుంది, ఆ ఆత్మే సర్వవ్యాపకమైన పరమాత్మ. ఇలా ఆత్మను గ్రహించినవాడు మిగిలిన ప్రాణులను హింసించడు, గౌరవిస్తాడు. అన్నిటిలో ఆత్మను, ఆత్మలో అన్నిటిని చూడగలిగినవాడు ఎవరినీ ద్వేషించడు. అటువంటి వానికి దుఃఖము, మోహము రెండూ ఉండవు. ఈ అనుభూతినే ఆత్మానుభూతి అంటారు. ఆత్మానుభూతి పొందినవారు మనసును నిగ్రహించుకోగలరు. కోరికలకు, వ్యామోహాలకు అతీతులౌతారు. అలా ఆత్మానుభూతిని పొందినావారు తేజోమయమైన, నిరాకారుడయిన భగవంతుని దర్శించగలుగుతారు.

ఇది మొదటి 8 శ్లోకాల భావం.

మనకి సందేహాలు ఎక్కువ! అంతా చదివేక సందేహాలు కలగవచ్చు. మనకి చదవకముందే ఊరన్ని సందేహాలు. అసలు ఈ సందేహం అన్నమాట సం దేహం సందేహం! దేహమున్నన్నాళ్ళు దాన్ని ఆవరించి ఉండేవి సందేహాలు! మనకిప్పుడు ఒక సందేహం, అయితే ఈ ఆత్మానుభూతి కలిగినవాడు, అన్ని జీవరాశులలో ఒకే ఆత్మ ఉందని తెలిసినవాడు, భగవంతుని తెలుసుకున్నవాడు - 'ఏ పనీ చెయ్యక్కరలేదా?' అని! ఈశావాశ్య ఉపనిషత్తులో ఆ విషయం 9-14 శ్లోకాలలో వివరించబడింది. కేవలం కర్మగాని, కేవలం ధ్యానం గాని ఎందుకూ పనికిరావు.

కర్మవల్ల ఒకరకమైన ఫలితం ఉంటుంది, ధ్యానం వల్ల ఇంకో రకమైన ఫలితం ఉంటుంది. అసలు కర్మ లేకుండా జీవితం నడవదు. అన్ని ప్రాణులు ఎల్లప్పుడూ ఎదో ఒక పని చేస్తూనే ఉంటాయి. ధ్యానం, కర్మ రెండూ తెలుసుకుని కర్మలుచేస్తే ధ్యానం వలన ముక్తి లభిస్తుంది. లోకంలో విద్య అవిద్య అని రెండు ఉన్నాయి. తెలిసినది విద్య, తెలియనిది అవిద్య. ఇంకోలా చెప్పాలంటే జ్ఞానం విద్య, అజ్ఞానం అవిద్య. చేసే పనిని ఫలం ఆశించకుండా చేస్తే అది జ్ఞానం కలిగిస్తుంది.

ఉదాహరణకి మనం ఎదో వ్రతమో పూజయో చేసేమనుక్కోండి. అప్పుడు చేసే దానం వ్రతాన్ని పూర్తి చేయడం కోసం, పూజలో భాగంగా చేసే దానం, ఫలితం ఆశించకుండా చేసినది అవుతుంది. పూజా ఫలితం వేరు. అదే దానం, పేరు ప్రతిష్ఠలకోసం చేస్తే, అవి నిలుపు కోడానికి దానాలు చేస్తూనే ఉండాలి, ఎవరిమీదనో పోటీకి చేసే పనులు దుఖాన్ని కలిగిస్తాయి. కర్మకు లొంగకుండా జ్ఞాని కర్మలను చేస్తాడు. కర్మబందాలనుంచి విముక్తుడౌతాడు. కర్మ ఈ రకంగా ఆచరించాలి అని తెలుసుకున్నాం కదా.

ఇక ధ్యానం ఎలా చెయ్యాలి.

ధ్యానం రెండు రకాలు, సాకార ఉపాసన నిరాకార ఉపాసన. అంటే ఎదో ఒక ఆకారాన్ని, ఒక రూపంలో ఉన్న భగవంతుని పూజించడం. రెండవది ఏ ఆకారం, రూపమూ లేని భగవంతుని ధ్యానించడం. ఇందులో మొదటిది మొదటి మెట్టు, రెండవది రెండవ మెట్టు. అందుచేత ఈ రెండిటి కలయిక వలన చేసే ధ్యానం మంచి ఫలితాలను ఇస్తుంది అని ఈ ఉపనిషత్తు చెప్తుంది. ఎందుకు ఇలా అంటే ఒక రూపంలో దేవుని పూజించే వాళ్ళు, వాళ్ళు వాళ్ళు పూజించే దేముడే గొప్ప అనే ఒక మానసిక స్థితికి చేరుకుంటారు. అదే ఇవాళ మన సమాజంలో కలహాలకి కారణం. నాదేవుడు గొప్ప, నీ దేముడు అసలు దేముడే కాదు, నామతం గొప్ప, ఇలాంటి అజ్ఞానం రోజు రోజుకి ప్రబలం అయిపోతోంది. అక్కడితో ఆగదు, నాకులం గొప్ప, నేనే గొప్ప దాకా వెళుతుంది ఈ సంకుచిత తత్వం. అన్ని జీవరాశులలో ఆత్మని చూడగలిగినవాడు నాదేవుడు గొప్ప, నీదేవుడు తక్కువ అనే సంకుచిత భావాలకు లోనుకాడు. 15-18 మంత్రాలలో ఆ భగవంతుని తేజస్సుకు ఆవల ఏముంది అనేదానిని గురుంచి గొప్ప ప్రార్థన ఉంది. దానినే వేదాంతులు 'ఈశ విద్య' అంటారు. మాయ ఏమిటంటే ఈ మార్గం చెప్పినంత సులభం కాదు. మనం మళ్ళీ మళ్ళీ లోకంలోని ఆకర్షణలకు లొంగిపోయి వెనకకు ప్రయాణం చేస్తూ ఉంటాం. ఎందుకంటే ఈ ధ్యానం, తపస్సు, ప్రార్థన కంటే లౌకికమైన కోరికలు ఆకర్షణీయంగా ఉంటాయి. అదే మాయ. మాయ అనేది రెండు సంస్కృత పదాల కలయిక, మా ం యా మాయ !

మా అంటే కాదు అని అర్థం

యా అంటే ఏదయితే అని అర్థం.

రెండూ కలిపితే ఏదికాదో అదే అది అదే అనుక్కోడం. తాడును చూసి పాము అనుకున్నట్టు. దీనినే వేదాంతులు రజ్జుసర్ప భ్రాంతి అంటారు. ప్రతి ఉపనిషత్తులో ఒకటి రెండు చోట్ల ఆ ఉపనిషత్తుకు మూలభూతమైన మంత్రాలు నిక్షిప్తమై ఉంటాయి. ఈశావాశ్య ఉపనిషత్తులో 15-16 మంత్రాలు సూర్యునికి, 18వ మంత్రం అగ్నికి సంబంధించిన అత్యంత ప్రభావంగల మంత్రాలు. ఆ మాయ తెర తొలగడానికి చేసే ప్రార్థన 15-18 మంత్రాలలో ఉంది. మనం భగవంతుని దర్శించిన తరువాత ఇంకొక మెట్టు ఉంది. అదే తేజోమయమైన భగవంతుని ఆవల ఉన్నది, అదే సత్యం. అంధకారం లోంచి వెలుగును చూసే మార్గం వివరించమని భగవంతునికి చేసే ప్రార్థన. అది మనం సూర్యునికి చేసే ప్రార్థన 15-16 మంత్రాలు. ఆయన ప్రచండమైన ప్రకాశంలో ఆవెనుక ఉన్న సత్యం కనిపించదు.

హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖం

తత్ త్వం పూషన్ అపావృణు సత్య ధర్మాయ దృష్టయే 15 ఇది సత్యం బంగారు గిన్నెలో మూయబడి ఉంది. ఆ తెరని తొలగించమని సూర్యుని ఉద్దేశించి చేసే ప్రార్థన. 16వ మంత్రంలో సూర్యుని 'ఓ సూర్యదేవా ! సకల జీవరాశిని రక్షించే నీవు, నీ కిరణాల వేడిమిని, నీ తేజస్సును కొంచెంతగ్గించుకొని నీ కల్యాణప్రదమైన రూపాన్ని కృపతో నన్ను చూడనీ' అని ప్రార్థన. ఆత్మతత్వం ఎరిగినవారు సూర్యునిలోనూ తమను తాము చూసుకో గలరు అని చెప్తుంది ఈ మంత్రం. శరీరం అగ్నికి ఆహుతయిపోతుంది, పంచభూతాలతో చేసిన శరీరం పంచభూతాలలో విలీనం అయిపోతుంది. ఈ ప్రాణం

మరణం లేని అనంతమైన అన్నిచోటులా వ్యాపించి ఉన్న ప్రాణంలో కలిసిపోతుంది. దీనికి సాక్షి మన శరీరాన్ని బూడిద చేసిన అగ్ని దేవుడే. అందుచేత అగ్నిని ప్రార్థించడంతో ఈ ఉపనిషత్తు ముగుస్తుంది. అగ్నిని ఏమని ప్రార్థించాలో చూడండి. 17-18 మంత్రాలు.

వాయురనిలమమృతమథేదం భాస్మాన్తగ్ం శరీరమ్

ఓం ఓం ఓం క్రతో స్మర కృతగ్ం స్మర-క్రతో స్మర కృతగ్ం స్మర 17

మనం చేసిన పనులొకసారి ఆలోచించి సింహావ లోకనం చేసుకోమని చెప్తుంది ఈ ఉపనిషత్తు. అన్నీ భగవంతునికి అర్పణగా చేసి ఉంటే, 'అగ్నిదేవా నేను చేసినవన్నీ భగవంతుడు చెప్తే చేసిన పనులే. నీకు అన్నీ తెలుసు, తెలియనిది ఏమీ లేదు. అందుచేత నేను చేసిన తప్పులనుండి నన్ను కాపాడి, నాకు సరి అయిన మార్గం చూపించు.' అని ప్రార్థించాలి. అగ్నేనయ సుపథా, ఓ అగ్ని దేవుడా నన్ను మంచి మార్గంలోకి నడిపించు.

యుయోధి అస్మత్ జుహురాణాం ఏన మా

ఘోరమైన తప్పులను నశింప జేయి. అని 18వ మంత్రం చెపుతుంది.

అలా ఆత్మని ఆత్మకు సమర్పించుకోవడమే ఈ ఉపనిషత్తు చెప్పిన రహస్యం. ఈశావాశ్యం ఉపనిషత్తు భగవంతుని సర్వవ్యాపకత్వంతో ప్రారంభించి, త్యాగంతో కూడిన భోగమే సరి అయిన మార్గం అని సూచించి, విద్యకు అవిద్యకు భేదాన్ని చెప్పి, ఆత్మతత్వం ఎరిగినవారు సర్వత్ర ఒకే ఆత్మని దర్శించడం వలన అన్ని జీవ రాశులలోను భగవంతుని చూడగలరని చెప్తుంది. కర్మ ధ్యానం రెండిటిని నిర్వచిస్తుంది. తరువాత సాకార, నిరాకార ఉపసనలు రెండిటిని తెలుసుకొని ఆచరించమని చెపుతుంది. తేజోమయమైన సూర్యునిలోను అదే ఆత్మ ఉన్నది అని తెలియజేస్తుంది. చివరికి అగ్నిని మన దుష్కర్మలను నశింప జేసి మార్గదర్శనం చేయమని ప్రార్థన మంత్రంతో ఈ ఉపనిషత్తు పూర్తవుతుంది

ఓం పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే
ఓం శాంతిః శాంతిః శాంతిః

ఆచార్య పప్పు వేణుగోపాల రావు
e-mail: pappuvenu@gmail.com

దేవులపల్లి సుబ్బరాయశాస్త్రి

బుజ్జాయి పేరుతో ఎన్నో కామిక్ కథలు వివిధ పత్రికలకి వేసిన వీరి అసలు పేరు దేవులపల్లి సుబ్బరాయ శాస్త్రి. ముఖ్యంగా పంచతంత్రం కామిక్ కథల్లో వారు సృష్టించిన జంతువుల పాత్రలు చిత్రణలో కొత్త ఒరవడిని సృష్టించాయి. 1931 సెప్టెంబర్ 11 తేదీన పిఠాపురంలో జన్మించిన వీరు తెలుగు మహాకవి పద్మభూషణ్ దేవులపల్లి వెంకట కృష్ణశాస్త్రి గారబ్బాయి. 'నాన్నా - నేను' అనే ఆత్మకథ గ్రంథంతో పాటు అనేక పుస్తకాలు వీరు సచిత్రంగా రచించారు.



దేవగుప్తం శ్రీనివాస చక్రవర్తి

కార్టూనిస్టు 'చక్రవర్తి' అసలు పేరు దేవగుప్తం శ్రీనివాస చక్రవర్తి. జూలై 7, 1966న జన్మించిన వీరు నాలుగు వేలకు పైగా కార్టూన్లు వేశారు. 1983లో హాస్యప్రియ మాన పత్రికలో తొలి కార్టూన్ ప్రచురించబడ్డ వీరి కార్టూన్లు ప్రముఖ, దిన, వార, పక్ష, మాస పత్రికలలో ప్రచురించబడ్డాయి. 2012 నుంచి 2016 వరకూ హాస్యానందం పత్రిక నిర్వహించే తలిశెట్టి రామారావు కార్టూన్ పోటీల్లో వరసగా ఐదుసార్లు విశిష్ట బహుమతి సాధించారు. ఈయనకి ఎన్నో సన్మానాలు, అవార్డులు లభించాయి.

(మన కార్టూనిస్టుల రూపు రేఖలు - శంకర్ నారాయణ)

పండిట్ మదన్ మోహన్ మాలవ్య

భిక్షతో కట్టిన విశ్వవిద్యాలయం

– కిల్లాడ సత్యనారాయణ

"మహారాజా! విశ్వవిద్యాలయ నిర్మాణానికి స్థలం కోసం వచ్చాను." అని ఒక మహానుభావుడు అడిగారు.

తలపాగా టోపీలా గుండ్రంగా చుట్టుకున్నారు. తెల్లని తువ్వాలు మెడచుట్టూ తిప్పుకున్నారు. తెల్ల షేర్వాణి ధరించారు. నిర్మలమైన కళ్ళు. నుదుటి మీద బొట్టు. తెల్లని మీసాలు. అతనిలో అణువణువునా ఆధ్యాత్మికత ఉట్టిపడుతుంది. కాశీరాజు ప్రభునారాయణ్ సింగ్ ఫలహారం తీసుకుంటున్నారు. "రండి. ముందు మా ఆతిథ్యం స్వీకరించండి. తర్వాత వ్యవహారం మాట్లాడుకుందాం" అంటూ రాజుగారే స్వయంగా ఫలహారం ప్లేటును ఆయనకు అందించారు. రాజుగారికి ఆయనంటే చాలా గౌరవం. ఇద్దరూ ఫలహారం గ్రహించారు. కుశలక్షేమాలు అయ్యాయి. "చెప్పండి పంతులుగారూ! మీరు ఏదో అడుగుతున్నారు." అన్నారు రాజుగారు. "విశ్వవిద్యాలయం కట్టాలంటే చాలా భూమి కావాలి మహారాజా. మీ ఆశీర్వాదం లభిస్తేనే నా సంకల్పం నెరవేరుతుంది." అన్నారు ఆ మహానుభావుడు.

"అరె. మీరు చాలా గొప్పపని చేస్తున్నారు. విద్యా జ్యోతిని ప్రతీ ఇంట్లో వెలిగించబోతున్నారు. ఆ మహా కార్యానికి మీరు అడిగినంత భూమి ఇస్తాను." అన్నారు కాశీరాజు. మాలవ్యగారు సంకోచంలో పడ్డారు. ఎంత అడగాలి? ఎక్కువగా అడిగితే ఏమనుకుంటారో? తక్కువ అడిగితే, మిగతాది ఎలా సమకూర్చాలి? "తమరు ఇవ్వగలిగినంతా ఇవ్వండి మహారాజా" అన్నారు ఆ మహానుభావుడు సంకోచంతో. రాజుగారు కొంతసేపు ఆలోచించారు. "కాశీలో విశ్వవిద్యాలయ స్థాపన అందరికీ గర్వకారణం. ఈ విశ్వవిద్యాలయం దేశంలోనే పెద్దది కావాలి. చరిత్రలో నిలిచిపోవాలి" అంటూ...

"సూర్యోదయం నుండి సూర్యాస్తమయం దాకా మీరు ఎంతదూరం నడిస్తే అదంతా మీ విశ్వవిద్యాలయానిదే. " అన్నారు రాజుగారు. దృఢసంకల్పంతో ఉన్న ఆ మహాను భావుడు ఈ పోటీకి అంగీకరించారు. మరుసటిరోజు నడక ప్రారంభించారు. కాశీకి దక్షిణంలో. ఎక్కడైతే గంగామాత ఉత్తరదిశకు మళ్ళుతుందో అక్కడ నుండి. ఎక్కడైతే పంచక్రోశియాత్ర ప్రవేశ ద్వారముందో అక్కడ నుండి. ఆయన సూర్యాస్తమయానికి 1300 ఎకరాలు నడిచారు. అదంతా కాశీరాజు విశ్వవిద్యాలయానికి దానంగా ఇచ్చారు. చెట్లు, పొలాలు. భవననిర్మాణానికి కొంత ధనసహాయం కూడా చేసారు. పై కథనం కాశీప్రజల నాలుకలపై నలుగుతున్న కథ. అయితే కాశీరాజు ప్రభు నారాయణ్ సింగ్ 1300 ఎకరాలు, ధనం దానం చేయడం రికార్డుల్లో ఉన్నదే.

ప్రభునారాయణ్ గారి కుమారుడు ఆదిత్య నారాయణ సింగ్ మరో 2700 ఎకరాలు విశ్వవిద్యాలయానికి దానం చేసారు. ఇది మీర్జాపూర్ జిల్లాలో ఉంది. కాశీకి అరవై కిలమీటర్ల దూరం. ఇక్కడ 'కృషివిజ్ఞాన కేంద్రం' (అగ్రికల్చర్ యూనివర్శిటీ) ఉంది. బనారస్ హిందూ విశ్వవిద్యాలయ మొత్తం విస్తీర్ణం నాలుగువేల ఎకరాలు. ఇది ఆసియాలోనే అతిపెద్ద విశ్వవిద్యాలయం. ఈ స్థలంలో సుమారు 150 విద్యా సంస్థలున్నాయి. అందులో మెడికల్ కాలేజీ, పెద్దప్రజా హాస్పిటల్, ట్రౌమా సెంటర్, ఐ.ఐ.టి, వెటర్నరీ సైన్స్, మేనేజ్ మెంట్ కళాశాల, న్యాయశాస్త్రం, సంస్కృత కళాశాల, హార్టికల్చర్, హోమ్ సైన్స్, హిందూ, బౌద్ధ, జైన ధర్మ అధ్యయనం, హిందూ న్యాయశాస్త్రం, యోగ, విభిన్న భారతీయ భాషల సాహిత్యాల అధ్యయనం, హ్యుమనిటీస్, సైన్స్, కామర్స్, గ్రంధాలయాలు, హాస్టల్స్,

బనారస్ హిందూ విశ్వ విద్యాలయం

స్పోర్ట్స్ సౌకర్యాలు, ఆధ్యాపకుల వసతి సౌకర్యాలు, అతిధిగృహాలు చుట్టూ పెద్ద ప్రహారీ. రాజద్వారం. ఆ ద్వారం ముందు ఒక మానవమూర్తి పెద్ద విగ్రహం.

ఎవరా మానవమూర్తి?

ఇంత విశాల విశ్వవిద్యాలయం కోసం భూమి సేకరించిన మహానుభావుడు. చిల్లిగవ్వంత ప్రభుత్వ సహకారం లేకుండా ఇన్ని భవనాలు కట్టించిన కర్మయోగి.

తనవద్ద పైసా లేకున్నా కోట్ల రూపాయలు సేకరించిన భిక్షాయోగి. ఒక్క రూపాయి వృధా కాకుండా తనకొచ్చిన సొమ్మును కూడా ప్రజలకోసం వెచ్చించిన మహాత్యాగి. ఆ మహనుభావుడు ఎవరు? భారతరత్న, మహామాన శ్రీ మదన్ మోహన్ మాలవ్య. ఆయన కలగన్నారు. ఆ కలకు రెక్కలు తొడిగారు. రెక్కలొచ్చిన ఆ పావురాన్ని దేశమంతా ఎగురవేసారు. ఎలా? తనకు తాను మననం చేసుకున్నారు. పాశ్చాత్య చరిత్రకారులు చెప్పినట్లు బ్రిటిష్ వాళ్ళు రాకముందు మన దేశంలో విశ్వవిద్యాలయాలు లేవా? ఇక్కడ శాస్త్రాలు, పురాణాలు కల్పితాలేనా? మన ఆశ్రమ విద్యాపద్ధతి వృధాయేనా? ఇక్కడి వేద వేదాంగాలు, దర్శనాలు, శాస్త్రాలు, వ్యాకరణాలు, దేవవిద్య, బ్రహ్మవిద్య, జ్యోతిషం ఆయుర్వేదం వీటన్నింటికీ వీడ్కోలు చెప్పాల్సిందేనా? ఆలోచించారు. ఇప్పుడు విద్యాసంస్థల్లో బ్రిటిష్ చరిత్రను బోధిస్తున్నారు. పాశ్చాత్య సాహిత్యం చెబుతున్నారు. ప్లేటో, అరిస్టాటిల్, స్పినోజా, కాంట్‌ల తత్వాలను వివరిస్తున్నారు.

మన చరిత్ర, మన సంస్కృతిని నిర్లక్ష్యం చేస్తున్నారు. ఆయన బాధపడ్డారు. తన కలకు ఓ రూపం ఏర్పడింది. ఆ రూపాన్ని ఎక్కడ ప్రతిష్టించాలి? పుట్టినూరు ప్రయాగలోనా? కర్మభూమి కాశీలోనా? నలుగురు జైనమునుల జన్మస్థలం కాశీ. బుద్ధుడు లోకానికి ధర్మప్రవచనం చేసిన ప్రదేశం కాశీ. ధన్వంతరీ, అగస్త్య, సుశ్రుతుడు, పతంజలి వంటి మహనీయుల కర్మభూమి కాశీ. ఆదిశంకరుల జ్ఞానచక్షువు తెరచుకున్న స్థలం కాశీ. కబీరు, రవిదాసుల జన్మస్థలం కాశీ. రామానందుడు, తులసీదాసులు లోకకల్యాణం కోసం మార్గం చూపిన మట్టి కాశీ. కళాసాహిత్యాలకు కేంద్రం కాశీ. భారతీయ సంస్కృతికి రాజధాని కాశీ. స్థానం నిశ్చయం అయింది. రూపం తయారయింది. సాకారం ఎలా చేయడం? పెద్దవాళ్లను సంప్రదించాలి. తోటివాళ్ళతో చర్చించాలి. సహయోగుల అభిప్రాయం అడగాలి.

మోతీలాల్ నెహ్రూను సంప్రదించారు. ఆయన ప్రయాగలో ప్రముఖ బారిష్టరు. మాలవ్యగారి కన్నా పెద్దవారు. ఆయన – "నీ బుర్ర సమంగా పనిచేస్తుందా? ఒక స్కూల్లో, కాలేజో కడతానంటే ఒక అర్థం ఉంది. కానీ విశ్వవిద్యాలయం కట్టించడం ఒకరివల్ల అయ్యే పనేనా?" అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు గోపాలకృష్ణ గోఖలేను అడిగారు. ''మాలవ్యా! నీకేమైనా పిచ్చివట్టిందా? విశ్వవిద్యాలయం ఎలా కడతావు?" అన్నారు గోఖలే. మాలవ్య పట్టు వీడలేదు. తను స్వప్నాన్ని వెంబడించే మనిషి. 1905 బెంగాల్ విభజన తర్వాత కాశీలో కాంగ్రెస్ సమావేశం జరిగింది. ఆ సమావేశానికి లాల్, బాల్, పాల్‌లు హాజరయ్యారు. గోఖలే అధ్యక్షత వహించారు. ఆ సభలో మాలవ్యగారు తన కలను అందరికీ అంద

జేసారు. ఆయన స్వప్నాన్ని ఇలా ఆ సభ ముందుంచారు. నేను తలపెట్టిన విశ్వవిద్యాలయంలో –
1) శ్రుతులు, స్మృతులు, పురాణాలలో చెప్పిన సనాతనధర్మ జ్ఞానాన్ని అందించడం 2) సంస్కృత భాష, సంస్కృత సాహిత్య అధ్యయనం 3) భారతీయ భాషల సాహిత్య అధ్యయనం 4) సాంకేతిక, వైజ్ఞానికజ్ఞాన ప్రశిక్షణ 5) విభిన్న మతాలు, సాంప్రదాయాల అధ్యయనం 6) కళలు, శాస్త్రాలు, మానవశాస్త్రాలు అధ్యయనం. ఒక్క మాటలో చెప్పాలంటే ఈ విశ్వవిద్యాలయం తూర్పుపడమరల మేలు కలయిక. వ్యక్తిత్వనిర్మాణానికి వేదిక. ఆ సభలో పెద్దలంతా ఇది సాధ్యం కాదన్నారు. కానీ లాలా లజపతిరాయ్ 'ఈ విశ్వవిద్యాలయం కట్టి తీరుతాం" అన్నారు. మాలవ్యగారి సంకల్పయాత్ర ముందుకు నడిచింది. అప్పటికే అనీబిసెంట్ బనారస్‌లో సెంట్రల్ హిందూ స్కూలు (1898) స్థాపించారు. 'భారత్ మరణిస్తే, ప్రపంచం ఎలా బ్రతుకుతుంది?' అన్నారామె.

మదన్ మోహన్ మాలవ్యగారు ఆమెను సంప్రదించారు. ఇద్దరి ఆశయాలు కలిసాయి. దర్భంగా మహారాజు శ్రీ రామేశ్వరసింగ్ కాశీలో 'శారదావిద్యాపీఠం' స్థాపించే పనిలో ఉన్నారు. మాలవ్యగారు ఆయనను కలిసారు. మహారాజు తన ఆలోచనను విరమించుకున్నారు. విశ్వవిద్యాలయ స్థాపనకు సహకరిస్తానన్నారు. డిశంబర్ 31, 1905న బనారస్ టౌన్ హాల్లో విద్యావేత్తలు సమావేశం అయ్యారు. ఒక కమిటీ ఏర్పడింది. మార్చి 12, 1906 న 'కాశీ హిందూ విశ్వ విద్యాలయ' రూపురేఖలు తయారు చేసారు. ఈ పుస్తకం ప్రతులు విభిన్న ప్రాంతాలలో పంచారు. అదే సంవత్సరం ప్రయాగలో కుంభమేళా జరిగింది. సాధు, సన్యాస, మహాత్ములకు మాలవ్య విశ్వవిద్యాలయ పుస్తకాన్ని అందించారు. అందరూ సంతోషం వ్యక్తపరిచారు. అక్కడ ఒక వృద్ధుడు ఆయనకు ఒక పైసా చందా ఇచ్చారు. విశ్వవిద్యాలయానికి లభించిన రెండవ దానం ఇది.

తొలిదానం తన తండ్రి పం. బ్రజనాథ్ వద్ద నుండి తీసుకున్నారు. ఆ సమయంలో తాను లాయరుగా చేసేవారు. సమాజసేవలోనూ ఉండేవారు. 'రెండు పడవలమీద నడొద్దని' తండ్రి సలహా చెప్పారు. వృత్తిని పక్కన బెట్టారు. నల్లకోటును మేకుకు తగిలించారు. మాలవ్యగారు విశ్వవిద్యాలయ స్థాపనకు అనుమతి కోసం వైస్రాయికి అర్జీ పెట్టారు. విశ్వవిద్యాలయం పేరు మీద 'కోటి రూపాయల ధనం' చూపిస్తే, అనుమతిస్తామంది ప్రభుత్వం. విద్యారంగ మహామునికి ఇది ఒక సవాలు. అంగీకరించారు. భిక్షకోసం ఊరూ వాడా తిరిగారు. ఒకరు రూపాయి ఇస్తే, మరొకరు లక్ష. దేన్నీ కాదనలేదు. అందర్నుండీ అన్నీ స్వీకరించారు. 1911లో బనారస్ హిందూ యూనివర్శిటీ సొసైటీ స్థాపించారు. దీనికి దర్భంగారాజు అధ్యక్షులు. అనీబిసెంట్ ఉపాధ్యక్షులు. అలహాబాద్ హైకోర్టు ప్రముఖ బారిష్టర్ సుందరలాల్ కార్యదర్శి. కాశీరాజు ప్రభు నారాయణ్ సింగ్, మాలవ్య దీని సభ్యులు. విశ్వ విద్యాలయం కోసం సేకరించిన ధనాన్ని మున్షీ మాధోలాల్ బ్యాంకులో దాచేవారు. "విశ్వవిద్యాలయ చందాకోసం నేనెక్కడికి వెళ్లినా ఖాళీచేతులతో తిరిగిరాను." అన్నారు మహామాన మాలవ్య.

దర్భంగా రాజుగారు ఇరవైఐదు లక్షల రూపాయలు ఇచ్చారు. అలా కోటి అరవైనాలుగు లక్షల రూపాయలు సేకరించారు. 22 మార్చి 1915న అప్పటి విద్యామంత్రి హార్కోర్ట్ బట్లర్ ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో బెనారస్ హిందూ యూనివర్సిటీ బిల్లును ప్రవేశపెట్టారు. "ఈ యూనివర్శిటీ భారతీయ విద్యాచరిత్రలో ఒక నూతన అధ్యాయం ప్రారంభిస్తుంది. ఇది మిగతా యూనివర్శిటీల కంటే భిన్నమైనది. హిందూ ధర్మ జీవనప్రదాయినీ శక్తి అవుతుంది." అన్నారు బట్లర్. 1916 ఫిబ్రవరి 4న అప్పటి వైస్రాయ్ లార్డ్ హార్డింగ్ 'కాశీ హిందూ విశ్వవిద్యాలయానికి' శిలాన్యాసం చేసారు. శ్రీమతి అనీబిసెంట్ తన సెంట్రల్ హిందూ కళాశాలను మాలవ్యగారికి అప్పగించారు. తాత్కాలికంగా విశ్వవిద్యాలయం ఆ కళాశాలలో నడిచింది. ఈ విశ్వవిద్యాలయ ప్రథమ కులపతి సర్ సుందర్ లాల్. 1918లో వీరి అకాలమరణం వల్ల పి.ఎస్. శివస్వామి అయ్యర్ కులపతి అయ్యారు. భవన నిర్మాణానికి నిధులు కావాలి. మాలవ్యగారు 'భిక్షాయాగం' చేసారు. ఈ యాగం కాశ్మీరు నుండి హైదరాబాద్ వరకూ సాగింది. ఉదయపూర్ నుండి కలకత్తా వరకూ కొనసాగింది. అశ్వమేధయాగంలా ఈ భిక్షాయాగంలో ఎప్పుడూ ఆయన విజయంతోనే తిరిగొచ్చేవారు.

హైదరాబాద్ నిజాం కుబేరుడు. మాలవ్యగారు హైదరాబాద్ వెళ్లారు. విశ్వవిద్యాలయం కోసం చందా ఇవ్వమని అక్కడ నిజాముని అడిగారు. కానీ నిజాం అందుకు అంగీకరించలేదు. విశ్వవిద్యాలయం పేరులో హిందూ శబ్దం ఉండటం వల్ల. "ఎంతోకొంత మీరు చందా ఇచ్చేవరకు నేనిక్కడి నుండి వెళ్ళను" అన్నారు మాలవ్య. నిజాంగారికి కోపం ముంచెత్తింది. "అంత మొండిపట్టు పడుతున్నావు కాబట్టి ఇవిగో మా పాతబూట్లు

తీసుకెళ్లు" అని మాలవ్యాకు తన పాతబూట్లిచ్చారు నిజాం. మాలవ్యగారు ఏమాత్రం బాధపడలేదు. శాంతంగా ఆ బూట్లను తీసుకున్నారు. వాటిని తనున్న గదికి తీసుకెళ్లారు. ఆరోజు సాయంత్రం హైదరాబాదులో దప్పు వేయించారు.

'నిజాంసాహెబ్ హిందూ విశ్వవిద్యాలయం కోసం నాకు ఒక జత పాతబూట్లు దానం చేసారు. వాటిని నేను వేలం వేస్తున్నాను. రేపు చార్మినార్ వద్ద ఈ వేలంలో అందరూ పాల్గోవాలని కోరుతున్నాను. నిజాముగారి బూట్లను పొందే అదృష్టాన్ని పరీక్షించుకోండి. ఎక్కువలో పాడినవారికే ఇవి దక్కుతాయి.' డప్పుప్రకటన గురించి నిజముగారికి తెలిసింది. తనను అవమానిస్తున్నట్లుగా నిజాం భావించారు. వెంటనే మాలవ్యాను పిలిపించారు.

"నా రాజ్యంలో నన్నే అవమానిస్తున్నావా? తక్షణమే హైదరాబాద్ విడిచిపెట్టి వెళ్ళు. లేకుంటే నిన్ను జైలుకు పంపిస్తాను" అన్నారు నిజాం. మాలవ్య శాంతస్వరంలో ఇలా అన్నారు–" మీరిచ్చిన బూట్లతో చిన్న గోడను కూడా కట్టలేను. కనీసం వాటిని వేలంవేస్తే వచ్చే డబ్బుతో ఏదో ఒకటి కట్టొచ్చని అనుకున్నాను. మీ బూట్లకు మీ రాజ్యంలో అయితే ఎక్కువ విలువ ఉంటుంది. అందుకే ఇలా చేయాల్సి వచ్చింది." "నేను అందుకు అంగీకరించను. నా మాటను ధిక్కరిస్తే నిన్ను జైల్లో వేస్తాను." అని నిజాం హెచ్చరిక చేసారు. "అది మీ ఇష్టం. కానీ మీ నుండి చందా తీసుకెళ్లకుండా నేను ఇక్కడినుండి వెళ్ళను." అని మాలవ్య సమాధానం ఇచ్చారు. నిజాంకు కోపం రెట్టింపయింది. మాలవ్యాను బంధించమని ఆదేశాలిచ్చారు. నిజాం ప్రధానమంత్రి కలుగజేసుకున్నారు. "మాలవ్య సామాన్య వ్యక్తి కాదు. ఆయనను బందిస్తే భారత జాతీయ కాంగ్రెస్, ఆంగ్లప్రభుత్వం కూడా మిమ్మల్ని వ్యతిరేకిస్తాయి. మీ సింహాసనం గండంలో పడొచ్చు. దయచేసి మీ ఆదేశాల్ని వెనక్కి తీసుకోండి." అని నిజాంకు నచ్చచెప్పారు ఆయన ప్రధాని. నిజాంకు పరిణామం అర్థమైంది. తన ఆదేశాన్ని వెనక్కి తీసుకున్నారు. అప్పుడు ప్రధానమంత్రి ద్వారా మాలవ్య నిజాం ముందు ఒక ప్రతిపాదన చేసారు. విశ్వవిద్యాలయంలో ఆధ్యాపకులకోసం వసతి నిర్మాణం చేయమని కోరారు. ప్రతిగా ఆ కాలనీకి 'హైదరాబాద్ నిజాం కాలనీ' అని పేరు పెడతామన్నారు. నిజాం లక్షరూపాయలు విరాళం ఇచ్చారు. నిజాం మీద మాహామాన శాంతస్వభావం గెలిచింది. విశ్వవిద్యాలయంలో హైదరాబాద్ కాలనీ, హైదరాబాద్ గేటులను చూసినప్పుడల్లా ఈ సంఘటన జ్ఞప్తికొస్తుంది.

1911 సెప్టెంబర్ లో కొలకత్తా టవున్ హాల్‌లో ఒక మీటింగ్ జరిగింది. దానికి మహామాన హాజరయ్యారు. అక్కడున్నవాళ్ళను విశ్వ విద్యాలయానికి చందా ఇవ్వమని మాలవ్య వేదిక పైనుండి అడిగారు. అప్పటికప్పుడే ఐదులక్షల రూపాయల చందా వచ్చింది. ముజఫర్‌పూర్‌లో ఒక భిక్షురాలు తనకు రోజంతా వచ్చిన ఒక రూపాయి భిక్షాన్ని చందాగా మహామానాకు ఇచ్చింది. ఒక బెంగాలీ కుటుంబం తమ ఆభరణాలను విశ్వవిద్యాలయానికి దానం చేసారు. ఈ చందాలు తీసుకునే క్రమంలో ఒక ఆసక్తికర ఘటన జరిగింది. ఒక వ్యాపారి మాలవ్య గారికి ఐదులక్షల రూపాయలు చందా ఇస్తానన్నారు. కానీ తర్వాత అతని వ్యాపారం దివాలా తీసింది. ఆయన మాలవ్యగారి ముందు దీనంగా నిలబడి "ఇప్పుడు నేను తమకు ఏ విధంగానూ సహాయపడలేను" అన్నారు. "మీరు బాధపడకండి. నాకు ఐదులక్షల రూపాయల చెక్కు రాసివ్వండి. మీ వ్యాపారం బాగున్నప్పుడు ఆ డబ్బు తీసుకుంటాను." అన్నారు మాలవ్య. "నా వ్యాపారం కుదుటపడే మార్గం కనపడట్లేదు. అయినా చెక్ రాసిస్తాను." అని బాధతో చెక్ ఇచ్చాడు వ్యాపారి. ఆ వ్యాపారి చందాను పత్రికల్లో ప్రముఖంగా ప్రకటించారు మాలవ్య. అది చాలామంది చదివారు. ఐదులక్షలు రూపాయలు చందా ఇచ్చాడంటే అతని వ్యాపారానికి ధోకాలేదని భావించారు. అతనికి అప్పు పుట్టింది. వ్యాపారం పుంజుకుంది. లాభాలొచ్చాయి. మాలవ్యాగారికి చందా డబ్బులు ముట్టాయి.మహామానా బుద్ధికి ఇది నిదర్శనం.

విశ్వవిద్యాలయానికి చందాలు తీసుకునే క్రమంలో మాలవ్యగారు అమృత్సర్ వెళ్లారు. అక్కడ రెండురోజుల్లో 5000 రూపాయల చందా వచ్చింది. కానీ 25 వేల రూపాయల చందా వచ్చేవరకూ నేను అన్నపానీయాలు ముట్టుకోను అన్నారు. మాలవ్యగారి ప్రతిజ్ఞ గురించి స్థానిక నాయకులకు తెలిసింది. వాళ్లు మాలవ్య గారిని ఒక పెద్దవ్యాపారి వద్దకు తీసుకెళ్లారు. అతను చాలా లోభి. అతని నుండి చందా తీసుకోవడం దేవుడితరం కూడా కాదన్నారు వాళ్ళంతా. మాలవ్యగారిని, మిత్రులనూ ఆ వ్యాపారి ఆహ్వానించారు. ఫలపానీయాలు తెప్పించారు. "క్షమించండి సేఠ్ జీ. మీ ఆతిథ్యాన్ని మేం స్వీకరించలేం." అన్నారు మాలవ్య. "ఎందుకని? నేనేం తప్పుచేసాను?" అని ఆశ్చర్యంగా అడిగారు సేఠ్ జీ. "అదేమీలేదు. ఈ నగరం నుండి 25వేల రూపాయల చందా దొరికే వరకు అన్నపానీయాలు ముట్టనని మాలవ్యగారు ప్రమాణం

చేసారు. ఆయనతో పాటు మేం కూడా తీసుకోవడంలేదు." అన్నారు మాలవ్య గారి సహచరులు. "ఓస్ ఇంతేనా! దానికి నగరమంతా ఎందుకు?" అని లోపలకు వెళ్లి 25 వేల రూపాయలు తీసుకొచ్చి, మాలవ్యగారి చేతిలో పెట్టారు సేఠ్ జీ. మహాలోభి అయిన వ్యాపారి మహాదాత అయ్యాడు. ఇది మాలవ్యగారి చాతుర్యం. ఆ తర్వాత మహామాన చందాకోసం బీకనీర్ వెళ్లారు. బీకనీర్ మహారాజు సంతోషంగా చందా ఇచ్చారు. బీకనీర్‌లో చాలా సంపన్నుడైన వ్యాపారి గురించి మాలవ్య గారికి తెలిసింది. ఆయన నుండి చిల్లిగవ్వ కూడా తీసుకు రాలేరన్నారు రాజుగారు. మాలవ్య గారు ఆవ్యాపారి ఇంటికి వెళ్లారు. ఆయనను అభ్యర్థించారు. "నేను జైనసంస్థలకు తప్ప ఎవరికీ చందా ఇవ్వను" అన్నారు వ్యాపారి. "నేను మీ నుండి లక్షరూపాయలు తీసుకెళ్దామని వచ్చాను. కనీసం పాతిక వేలైనా ఇవ్వండి" అనడిగారు.

"నయాపైసా కూడా ఇవ్వను" అని ఖండితంగా చెప్పాడు ఆ వ్యాపారి. ఖాళీచేతులతో రాజుగారి వద్దకు వచ్చారు మాలవ్య. "నేను ముందే చెప్పాను కదా" అన్నారు రాజుగారు. కానీ మాలవ్యగారు పట్టువిడవలేదు. ఎవరి ద్వారా చెప్పిస్తే ఆ వ్యాపారి వింటారో తెలుసుకున్నారు. వ్యాపారి గురువు జైనముని వద్దకు మాలవ్య వెళ్లారు. కాశీ హిందూ విశ్వవిద్యాలయంలో జైన ధర్మంకోసం ఒక సంస్థను నిర్మిస్తామని చెప్పారు. మాలవ్యగారు యువత కోసం, భారతసంస్కృతి కోసం కృషి చేస్తున్నట్లు జైనముని గ్రహించారు. జైనముని చెప్పగా, ఆ వ్యాపారి రెండులక్షల రూపాయలు విరాళమిచ్చారు. మాలవ్యగారి సంకల్పం ముందు ఎవరైనా తలొగ్గాల్సిందే.

విశ్వవిద్యాలయానికి గోడ కావాలి. రెండువేల ఎకరాల చుట్టూ గోడ. చాలా ఖర్చవుతుంది. మహారాజా బలరాంపూర్ స్వర్గస్తులయ్యారు. పెద్దకర్మకు మాలవ్య వెళ్లారు. ఆయన మహారాణిని పుత్రవతి కమ్మని ఆశీర్వదించారు. రాజుగారు మరణించిన మూడునెలలు తర్వాత ఆమెకు కొడుకు పుట్టాడు. కొన్ని సంవత్సరాల గడిచాక ఆ కుమారుడికి యజ్ఞోపవీతం చేయమని వారు మాలవ్యగారిని పిలిచారు. యజ్ఞోపవీతం తర్వాత రాజమాత ఇలా అన్నారు – "వంతులుగారూ! మీ ఆశీర్వాదం వల్ల మా రాజ్యానికి వారసుడు లభించాడు. మీరు ఏం అడిగితే అది మేం దానం ఇస్తాం. అడగండి." మాలవ్యగారు చతురతకు మారుపేరు. "సాంప్రదాయం ప్రకారం యజ్ఞోపవీతం తర్వాత వస్త్రదానం చేస్తారు. నాకు అవే ఇప్పించండి." అన్నారు మాలవ్య. రాజమాతకు అర్థం కాలేదు. ఏదైనా కోరుకోమంటే ఈ పంతులుగారు వస్త్రాలు ఇమ్మంటారేంటి? సంకోచిస్తున్నారనుకుని – "బట్టలిస్తాం. మరేమైనా అడగండి. అందులో మీతోపాటు మా సంతోషం కూడా ఉంది." అన్నారామె.

"మాతా సరస్వతికి వస్త్రాలు లేవు. అంటే మా విశ్వవిద్యాలయానికి ప్రహారీ లేదు. అది మీరిస్తే సరస్వతీ మాత ప్రసన్నురాలవుతుంది." అన్నారు మాలవ్యగారు. రాజమాత అంగీకరించారు. 1936 లో విశ్వవిద్యాలయానికి ప్రహారీ కట్టారు. కలకత్తాలో ఒక మార్వాడి వ్యాపారికి కాలు విరిగింది. ఆయనను చూడడానికి మహామాన వెళ్లారు. ఆయన మంచం మీద చాలా ఇబ్బంది పడుతున్నారు. 'ఆర్థోపెడిక్ బెడ్ మీద పడుకొండి.' అని మాలవ్యగారు సలహా ఇచ్చారు. వారం రోజుల తర్వాత ఆయనను చూసేందుకు మళ్ళీ వెళ్లారు. "మీరు చెప్పిన ఉపాయం బాగా పనిచేసింది. ఇప్పుడు బాగుంది." అన్నారు వ్యాపారి. "మీరు దానధర్మాలు కూడా చేయండి. మంచిది" అన్నారు మాలవ్యగారు. "ఏం చేయాలో మీరే చెప్పండి. మీ సలహాను పాటిస్తాను." అన్నారు వ్యాపారి. "మా విశ్వవిద్యాలయంలో వంద బెడ్‌లతో ఒక ఆర్థోపెడిక్ విభాగాన్ని కట్టించండి." అని అడిగారు. ఆ కలకత్తా వ్యాపారి దానంతో బీ హెచ్ యూ ఆర్థోపెడిక్ విభాగం రూపుదాల్చింది. మహామానా ఉదయపూర్ వెళ్లారు. దానం చేయమని ఉదయపూర్ రాజును కోరారు. "నేను మీకు దానం ఇస్తాను. కానీ మీకోసం నేనిచ్చింది గ్రహించాలి." అని షరతు పెట్టారు. విశ్వవిద్యాలయానికి రెండులక్షల రూపాయలు, మాలవ్యగారి కోసం లక్ష రూపాయలు ఇచ్చారు. మాలవ్యగారు బనారస్ తిరిగొచ్చారు. "విశ్వవిద్యాలయం నుండి నేను వేరుకాదు. అందుకే మీరిచ్చిన మొత్తాన్ని విశ్వవిద్యాలయ కళాసంకాయ భవనం (ఆర్ట్స్‌శాఖ) నిర్మాణానికి ఖర్చు చేస్తున్నాం" అని రాజుగారికి తెలియజేశారు. అలాగే కాశ్మీరురాజుగారు రెండులక్షల రూపాయలిచ్చారు.

1922 చౌరీ – చౌరా ఘటనలో చాలామందికి ఉరిశిక్ష పడింది. ఆ కేసు అప్పీలు అలహాబాద్ హైకోర్టుకు వచ్చింది. మాలవ్యగారు మళ్లీ నల్లకోటు తొడిగారు. అద్భుతంగా వాదించారు. 156 మందిని ఉరిశిక్ష నుండి కాపాడారు. ప్రధాన న్యాయమూర్తి సర్ గ్రిమవుడ్ పీయర్స్ మూడుసార్లు మాలవ్యను ప్రశంసించారు. ఇటువంటి వాదన నేను ఇంతవరకూ వినలేదన్నారు. కొందరు

మాలవ్యాకు పదివేల రూపాయలు ఫీజు ఇవ్వబోయారు. 'ఇది దేశం కోసం పోరాడిన కేసు' అని ఆయన తిరస్కరించారు. వాళ్ళు ఆ రాశిని విశ్వవిద్యాలయానికి ఇచ్చేసారు. శ్రీ మదన్ మోహన్ మాలవ్య గారి గురించి గోపాలకృష్ణ గోఖలే ఇలా అన్నారు – "త్యాగం మదన్ మోహన్ మాలవ్య నుండి నేర్చుకోవాలి. బాల్యంలో పేదరికం అనుభవించారు. ఐశ్వర్యం వస్తున్నప్పుడు దాన్ని దేశసేవకు అర్పించారు." విశ్వకవి రవీంద్రుడు మాలవ్యకు 'మహామాన' అని బిరుదు ఇచ్చారు. గాంధీజీ మాలవ్యను 'గొప్ప బిచ్చగాడ'ని (గ్రేట్ బెగ్గర్) ప్రశంసించారు. నిజమైన బ్రాహ్మణుడు భిక్ష మీదనే జీవిస్తాడు. మాలవ్యగారు స్వచ్ఛమైన బ్రాహ్మణుడు. ఆయన భోజనం బాబూ శివప్రసాద్ గారి ఇంటి నుండే వచ్చేది. 1919లో మహామాన కులపతి పదవిని స్వీకరించారు. ఆయనకు ఇష్టంలేదు. కానీ తప్పలేదు. 1939 వరకూ కొనసాగారు. శ్రీ సర్వేపల్లి రాధాకృష్ణన్ (1939-48) మాలవ్య తరువాత హిందూ విశ్వవిద్యాలయ కులపతిగా చేరారు. వీరిద్దరూ విశాలదృక్పథం గలవారే. వేర్వేరు రాజకీయ దృక్పథం గలిగిన పీ. సి. జోషీ, డా. వీ. ఎస్. మంజే, డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ, శ్రీమతి సరోజినీ నాయుడు వంటివారిని విశ్వవిద్యాలయానికి ఆహ్వానించేవారు.

"హిందూ విశ్వవిద్యాలయానికి సర్వేపల్లి కులపతిగా (1940లలో) ఉన్న రోజులవి. ఆయన భగవద్గీత మీద ప్రతీరోజు పాఠం చెప్పేవారు. అది వినడానికి నగరం నుండి అనేకమంది వచ్చేవారు. ఆ కాలంలో కార్లు అంతగా లేవు. రిక్షాలు, ఇక్కాలలో వచ్చేవారు. మహామాన మాలవ్యగారు కూడా వచ్చేవారు. అప్పటికి ఆయన బాగా వృద్ధులయ్యారు. ఆయన శ్రోతల మధ్య కూర్చొని వినేవారు. ఆయనకు దగ్గర్లో కూర్చునేందుకు మేం పోటీపడేవాళ్ళం." అని శ్రీ బేనీమాధవ్ శుక్లా గారు శ్రీ జితేంద్రనాథ్ మిశ్రాతో తన జ్ఞాపకాలను ఒక ముఖా ముఖిలో పంచుకున్నారు.

శ్రీ బేనీమాధవ్ శుక్లాగారు శ్రీ మదన్ మోహన్ మాలవ్యగారి శిష్యులు. వీరు గోరఖ్ పూర్ విశ్వవిద్యాలయ కులపతిగా చేసారు. "మేం చదువుకున్నప్పుడు స్టూడెంట్ పార్లమెంట్ జరిగేది. ఢిల్లీ పార్లమెంటుకు తీసిపోని విధంగా జరిగేది. నన్ను హెల్త్ మినిస్టర్‌గా నియమించారు. తేజూభయ్యా ప్రైమ్ మినిస్టర్. జాతీయ, అంతర్జాతీయ విషయాలపై వేడివేడి చర్చ జరిగేది. ఇప్పుడు పార్లమెంట్ స్థానంలో స్టూడెంట్ యూనియన్ వచ్చింది. చర్చలుపోయి సమ్మెలొచ్చాయి" అన్నారు శ్రీ బేనీమాధవ్ శుక్లా.

బనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఆరు పెద్ద విద్యా సంస్థలున్నాయి. నూటనలభై విభాగాలున్నాయి. సుమారు ముప్పైవేల మంది విద్యార్థులు చదువుతున్నారు. నలభైఎనిమిది దేశాల నుండి విద్యార్థులు ఉన్నారు. అరవైఐదు హాస్టళ్లు ఉన్నాయి. భారత ప్రభుత్వం ద్వారా 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏమినెన్స్'గా ప్రకటించిన ఎనిమిది సంస్థల్లో ఈ విశ్వవిద్యాలయం ఒకటి. భారతదేశం నుండి బ్రిక్స్ యూనివర్శిటీల లీగ్‌లో స్థానం పొందిన పన్నెండు సంస్థల్లో ఈ విశ్వవిద్యాలయం ఒకటి. పరిశోధనలో బి.హెచ్.యుకు ప్రముఖస్థానం ఉంది. వైజ్ఞానిక శాస్త్రాల్లో బి.హెచ్.యు ఖ్యాతి ప్రపంచమంతా వ్యాపించింది.

బి.హెచ్.యులో ఆధ్యాపక పదవికి ఆల్బర్ట్ ఐన్ స్టైన్ దరఖాస్తుచేసారు. ఆ సమయంలో మాలవ్యగారు బనారస్‌లో లేరు. సరైన సమయంలో ఐన్ స్టైన్‌కు సమాధానం అందలేదు. ఫలితంగా బి.హెచ్.యు ఈ యుగమేధావి సేవల్ని కోల్పోయింది. శాంతిస్వరూప్ భట్నాగర్, భారతరత్న సి.ఎన్. అర్ రావుగారు ఇక్కడ ప్రొఫెసర్‌గా చేసారు. సర్ సి.వి. రామన్, డా. అబ్దుల్ కలాంలు ఇక్కడ విజిటింగ్ ఫాకల్టీగా చేసారు. 1909, 1918లో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడుగా మాలవ్య పనిచేసారు. జాతీయోద్యమంలో చురుకుగా పాల్గొన్నారు. కానీ ఆయన మనసంతా విశ్వవిద్యాలయం మీదనే. దానికోసమే తన జీవితాన్ని అర్పించాలని నిశ్చయించారు. ఆయన కలలో లక్షలమంది కలలు పండుతున్నాయి. తరతరాలు ఆ వెలుగులో తమ జీవితాల్ని వెలిగించుకుంటున్నాయి.

భారతదేశంలో ప్రజలకోసం, ప్రజలద్వారా, ప్రజల చేత కట్టబడిన తొలి విశ్వవిద్యాలయం బనారస్ హిందూ విశ్వవిద్యాలయం. భూమి – భవనాలు, బల్లలు – బోర్డులు అన్నీ ప్రజలిచ్చిన భిక్షతోనే. మన దేశంలో దానంతో కట్టిన ఏకైక విశ్వవిద్యాలయం ఇది. భారతీయ సంస్కృతి పునాదిమీద ఆధునిక విద్యాసౌధాన్ని నిలబెట్టిన మనీషి శ్రీ మదన్ మోహన్ మాలవ్య. డా. సర్వేపల్లి రాధాకృష్ణన్ మాటల్లో "ఈ గొప్ప విశ్వవిద్యాలయం పుట్టుక, వృద్ధి, అభివృద్ధి పం.మాలవ్య గారి కఠోరపరిశ్రమ ఫలితమే. దీనికోసం ఆయన తన సువర్ణ జీవితాన్ని, శక్తినీ త్యాగం చేసారు. పం.మాలవ్యగారు రెండు గొప్పగుణాల సంగమం. ఒకటి శ్రీకృష్ణుడి బుద్ధి, రెండవది అర్జునుడి కార్యసిద్ధి. ఆయన చాలా గొప్ప కర్మయోగి. ఆయన కలను వాస్తవం చేసారు. ఈ గొప్ప విశ్వ విద్యాలయాన్ని అందించారు."

డా. కిల్లాడ సత్యనారాయణ
ఫోన్ : 8333987838



డా. సి. నారాయణ రెడ్డి

డా. సినారె
చారిత్రక గేయ కావ్యాల రసజ్ఞత

- కొలకలూరి మధుజ్యోతి

సినారె రచనలు చేసే నాటికి దేశం స్వాతంత్ర్య పోరాటం సముపార్జించుకొంది. తెలంగాణ చుట్టూ నిజాం వ్యతిరేకోద్యమాలు విస్తృతంగా జరుగుతున్నాయి. వానమామలై వరదాచార్యులు, కాళోజి, దాశరథి ద్వయం, వట్టికోట ఆళ్వారుస్వామి వంటి ఎందరో సాహిత్య రంగంపై తమ ముద్రను వేస్తున్న కాలం అది. సామాజిక రంగంలో కమ్యూనిజం తన తీవ్ర ప్రభావాన్ని ప్రసరిస్తుంటే అది సాహిత్యంపై కూడా అంతే ప్రభావాన్ని చూపింది. 1952 దేశ ఎన్నికలలోనూ కమ్యూనిజం తమ గుర్తింపును పొందింది. సాహిత్యం భావకవిత్వ ధోరణి నుంచి అభ్యుదయ ధోరణి వైపు పరిణామం చెందిన కాలం. ప్రవాహం అంతా అభ్యుదయం వైపు సాగుతుంటే , సినారె హృదయగత కళాగత మానవీయ అంశాల ప్రాధాన్యంతో భావస్ఫోరక రసప్లావిత రచనలను చేశారు. వారి మూడు చారిత్రక గేయ కావ్యాలు ఆ కోవలోవే.

1.చారిత్రకత: డా.సి. నారాయణరెడ్డి రచించిన మూడు చారిత్రక కావ్యాలూ చరిత్ర ఆధారిత రచనలే. కల్పన, పాత్రచిత్రణా సామర్థ్యం, సంభాషణ చతురత, రసానుగుణ ఉద్వేగ చిత్రణ ఈ కావ్యాలకు శాశ్వతత్వాన్ని ఇచ్చాయి.

1.1. నాగార్జునసాగరం (1955) : నాగార్జున కొండ చారిత్రక ప్రసిద్ధి కలది. బౌద్ధం విరాజిల్లిన ప్రాంతం. ఒకనాడు విద్యా బోధనలో పరమోత్కృష్టస్థితిని పొందింది. ఒకనాటి శ్రీపర్వతం, నాగార్జునుడనే బౌద్ధ గురువు పేరిట నాగార్జునకొండగా ప్రసిద్ధి గాంచింది. ఇక్ష్వాకుల కాలంలో బౌద్ధం హిందూ మతంతో పాటు పోషింపబడింది. ఇక్ష్వాకులకు పూర్వమే విజయపురి అనే పట్టణానికి దగ్గరలో ఉన్న శ్రీపర్వతానికి నాగార్జున కొండ అనే ప్రసిద్ధి ఏర్పడింది. ఇక్ష్వాకులకు ఇతడు ఎంత పూర్వుడో తెలియదు. ఆ తర్వాత వచ్చిన సిద్ధ నాగార్జునుడి పేరిట ఈ కొండకు ఆ పేరు వచ్చిందేమో అనే ఆలోచనా లేకపోలేదు. నాగర్జునుడు బోధించిన బౌద్ధం మాధ్యమిక బౌద్ధమతశాఖ ఇక్కడ నుంచే విదేశాలకు వెళ్ళిందనే వాస్తవం చరిత్ర చెప్తూ ఉంది. స్తూపాలు, చైత్యశాలలు, విహారాలు వంటి విశేషాలు- చారిత్రక వాస్తవాలు- ఈ కావ్యంలో నిల్చాయి. అందుకే నాగర్జున సాగరం అనే చారిత్రక కావ్యంలో, 'పద్మదేవుడు కల్పిత పురుషుడే కాని, అతడు నిర్మించెనని వర్ణించిన శిల్పములన్నియు నాగర్జునకొండ యందు దొరికిన ప్రాచీన శిల్పములే' (ప్రస్తావన డా. పుట్టపర్తి శ్రీనివాసాచార్యులు పు. 38). డా.సి.నారాయణరెడ్డి ఆ శిల్పాలనే అక్కడ కనిపించే కథలనే పద్మదేవుడు చెక్కినట్టు కల్పన చేశారు.

నాగర్జున సాగర్ ఆనకట్ట నిర్మాణం కృష్ణానది పై జరిగింది. 1955- 1967 దాకా. 26 గేట్లతో, 124.663 ఎత్తుతో, 9.8లక్షల ఎకరాల భూమి సాగుకు ఉపయోగపడుతూ, 150 మీటర్ల ఎత్తుతో, 1.6 కిలో మీటర్ల పొడవునా ఉండి నేడు పర్యాటకులను ఆకర్షిస్తూ ఉంది(వికిపిడియా). నాటికిది ప్రపంచంలోకే ఎత్తైన ఆనకట్ట. దీనివల్ల, విశేషమైన బౌద్ధ సంపదకు ఆలవాలమైన నాగర్జున కొండ, ముంపుకు గురి అయ్యింది. నిర్మాణానికి పూర్వమే బౌద్ధ కళాసంపద, శాసనాలను అక్కడ నుంచి తరలించారు. ఆ సమయమే కవి హృదయ స్పందనకు కారణమయి కావ్యావిష్కారానికి అంకురార్పణ చేసింది.

1.2. కర్పూర వసంతరాయలు(1957) : కుమార గిరిరెడి (క్రీ.శ.1386- క్రీ.శ.1400) పాలనా కాలంలో బెంగాల్ వరకు రెడ్డిరాజ్యంలో భాగం అయ్యాయి. రాజ్య కార్యకలాపాలు ప్రధానమంత్రి అయిన కాటయవేముడు చూసుకొనేవాడు. కుమారగిరిరెడ్డి, కాటయవేముడిని రాజమహేంద్రవరానికి రాజుగా చేశాడు. పెదకోమటి వేమారెడ్డి మూలంగా పదవీచ్యుతుడై, కుమారగిరిరెడ్డి

రాజమహేంద్రవరంలో కాటయవేముడి ఆశ్రమంలో ఉన్నాడు. అతడి మరణాంతరం ఇరు రెడ్డిరాజ్యాల మధ్యపోరు చెలరేగి రెడ్డిరాజ్యాలు పతనం అయ్యాయని చరిత్ర చెప్తూ ఉంది. కుమారగిరిరెడ్డి పాలనలో వసంతోత్సవం ప్రసిద్ధం. రతీమన్మథులు, విష్ణు లక్ష్మీలు, శివశక్తులు, ఇంద్రశచీదేవీలను కొలచేవారు. ఈ కావ్యంలో మన్మథపూజ సన్నివేశం శ్రీహర్షుడు రాసిన 'రత్నావళి'లోని ఘట్టాన్ని తలపిస్తూ ఉంది అంటాడు డా.జి గోవర్ధన్ నారాయణరెడ్డి కవిత్వము సంప్రదాయములు: ప్రయోగము). కుమారగిరిరెడ్డి ఈ సందర్భానికి సుగంధ ద్రవ్యాలను తెప్పించి వెదజల్లేవాడని ప్రతీతి. వసంతోత్సవం మహావైభవంగా జరిపేవాడు కాబట్టి అతడిని కర్పూర వసంతరాయలు అనేవారు. కుమారగిరిరెడ్డి సభలో లకుమ అనే నాట్యగత్తె ఉండటం, ఆమె అద్భుత నాట్య విలాసానికి రాజు ఆకర్షితుడు కావటం, ఆమె కోసం విలాసవంతమైన భవనాన్ని నిర్మించటం, వసంతరాజీయమనే నాట్యశాస్త్ర గ్రంథాన్ని రాయటం చరిత్ర తెల్పుతూ ఉంది. కాటయ వేముడు రాసిన కాళిదాసు శాకుంతల వ్యాఖ్య వల్ల కూడా కుమారగిరిరెడ్డి 'వసంతరాజీయం' రాశాడని తెలుస్తూ ఉంది. కాని నేడు అది అలభ్యం.

1.3.విశ్వనాథనాయడు(1959) : ఇది చారిత్రక కావ్యం. శ్రీకృష్ణదేవరాయల సేనాని అయిన నాగమ నాయడి కుమారుడు విశ్వనాథనాయడు. దక్షిణ ప్రాంతాలలో నాయక రాజుల పాలన ఇతనితోనే ఆరంభం అయ్యింది.

విజయనగర సామ్రాజ్య సేనాని వీరుడు నాగమ నాయకుడు. మధురను వీరశేఖర చోళుడు ఆక్రమించి పాండ్యరాజు చంద్రశేఖర పాండ్యన్‌ను గద్దె దింపాడు. విజయనగరానికి సామంతుడైన పాండ్యరాజు అభ్యర్థనతో రాయలు నాగమ నాయడిని మధురపైకి పంపాడు. యుద్ధానికి వెళ్ళిన నాగమ నాయడు పాండ్యరాజును అణచి మధురను తిరిగి పొందాడు. కాని రాజ్యాన్ని పాండ్య రాజుకు అప్పగించక,తానే రాజుగా ప్రకటించుకొన్నాడు. కృష్ణరాయలపై ఈ రాజ ధిక్కారాన్ని అణచటానికి నాగమ నాయడి కుమారుడు విశ్వనాథనాయడు ముందుకు వచ్చాడు. పెద్ద సైన్యంతో వెళ్ళి తండ్రిని బంధించి రాజు ముందు నిల్చాడు. తత్ఫలితంగా చక్రవర్తి విశ్వనాథ నాయడిని మధురై తదితర తమిళ ప్రాంతాలకు రాజుగా ప్రకటించాడు. అలా నాయక రాజు రాజ్యం క్రీ.శ.1529న ఏర్పడింది. క్రీ.శ.1736 వరకు కొనసాగింది.

2. వస్తువు : సి.నారాయణరెడ్డి మూడు కావ్యాలు మూడు భిన్న వస్తువులు.

2.1. నాగర్జునసాగరం : చారిత్రక నాగర్జున కొండ బౌద్ధ వికాస హేతువు. బౌద్ధ మత శిల్ప రామణీయకతను చరిత్ర స్పష్టపరుస్తుంటే, ఆ నేపథ్యం నుంచి కల్పనాత్మకంగా రూపు దాల్చారు పద్మ దేవుడు (శిల్పిగా, చిత్రకారుడిగా గాయకుడిగా) శాంతిశ్రీ (బౌద్ధమత తత్వాన్ని నేర్చుకోవటానికి వచ్చిన విద్యార్థిగా, సౌందర్యవతిగా). వారిరువురి నడుమ ఉన్న కళ, కళాత్మకత ఆకర్షణ కారకమై, ప్రణయాంబుధిలో ఓలలాడించింది. కాని, వైరాగ్య ప్రధానమైన మత తత్వాన్వేషణకి కళాసౌందర్యాలాసలో జీవితం గడిపే శిల్పికి మధ్య కుదరని అనుబంధం ఘర్షణ ఉంది. మతం చెప్పే ధర్మానికి ఒగ్గి బౌద్ధాన్ని స్వీకరించిన శాంతిశ్రీ పట్ల నైరాశ్యంతో ఆ ఊరిని వదిలి వెళ్ళాడు పద్మదేవుడు. వీరి ప్రణయగాథ విషాదాంతంగా ముగిసింది. కథ బౌద్ధ మతనిష్ఠ ప్రధానంగా నిల్చింది. ఉత్తరోత్తరా ఉత్తమోత్తమంగా కావ్యమల్లటం మహాద్భుతం. అదే ఈ కావ్యాన్ని ఉత్తమ గ్రంథ రాజ పరంపరలో నిలిపింది.

2.2. కర్పూరవసంతరాయలు : కర్పూరవసంతరాయలు కుమారగిరి రెడ్డి. అతడి ఆస్థాన నర్తకి లకుమ. వారిరువురి ప్రణయమపూర్వం. ఆమె పట్ల ఆకర్షితుడై, ఆమె ప్రేమ పొందుతూ, ఆమే లోకంగా ఉంటూ, రాణికి రాజ్యానికి పరాన్ముఖుడై ఆమె నాట్య కళాభిజ్ఞతకు, మైమరచిపోయి ఆస్వాదించిన రాజుకుమారగిరి రెడ్డి. ఆమె కలిగించిన ప్రేరణతో 'వసంతరాజీయ'మనే నాట్యశాస్త్ర గ్రంథాన్ని రాశాడు. లకుమాదేవికి కాలు బెణికిందని తెలిసి, వెళ్ళక వెళ్ళక వెళ్ళిన రాజసభనుంచి హుటాహుటిన వెనుతిరిగి పోయాడు. రాజు రాజ్యక్షేమాన్ని కూడా విస్మరించటం సహించలేని మహారాజ్ఞి అతడికి దూరంగా వెళ్ళమని చెప్పటంతో, లకుమ ఎంతో విచికిత్సానంతరం తన శివతాండవ నృత్య ప్రదర్శనలో ఆత్మార్పణ చేసుకొంది. కూమారగిరి రెడ్డి దుఃఖం వర్ణనాతీతం. వీరి అద్భుత ప్రణయం, దేశసౌభాగ్యం కోసం ప్రాణమిచ్చిన లకుమ మరణంతో విషాదాంతంగా నిల్చింది. ఇది ప్రణయనిష్ఠ ప్రధానంగా సాగిన రచన.

2.3. విశ్వనాథనాయడు : విశ్వనాథనాయడు చారిత్రక వ్యక్తి. శ్రీకృష్ణదేవరాయల సేనాని నాగమనాయడు. అతడి కుమారుడు విశ్వనాథనాయడు. చక్రవర్తి పంపున మధురకు వెళ్ళి, దురాక్రమణ చేసిన చోళరాజును దించి, పాండ్య రాజకు ఇవ్వక రాజ్యాన్ని కైవసం చేసుకొని తనను తాను రాజుగా ప్రకటించుకొన్నాడు. ఉగ్రుడైన రాయలు, సభలో అతడిని బంధించి తేవటానికి ఎవరు సమర్థులని ప్రశ్నిస్తే,

విశ్వనాథనాయడు ముందుకొచ్చాడు. తండ్రిని బంధించి తెచ్చాడు. ప్రతిగా రాయలు నాయడిని మధుర రాజుగా చేశాడు. ప్రభుభక్తిని చాటే ఈ కథలో ధర్మనిష్ఠ ప్రధానంగా కనిపిస్తుంది.'విశ్వనాథ నాయడులో...ఎక్కడా వేగం చెడకుండా కొంచెం కృత్రిమం కూడా కన్పించకుండా, స్వచ్ఛంద నిర్ఝర ప్రవాహంలాగా నడకధార సాగిపోతుంది. రూప పరంగా ఆయన బహుకాలం సాగించిన పరిశ్రమ అక్కడ సమగ్రంగా ఫలించింది (సినారె గేయకావ్య సంప్రదాయం, డా.జి.లక్ష్మీనారాయణ, సినారె సాహిత్య సమాలోచన, సం.దేవులపల్లి రామానుజరావు, డా.రవ్వా శ్రీహరి, డా. ఎల్లూరి శివారెడ్డి, పు.77).

3. సమతూకం : సి.నారాయణరెడ్డి ఈ చారిత్రక కావ్యాలన్నిటిలో పాత్రల నిర్వహణలో సమతూకాన్ని పాటించటం విశేషం. ఏ పాత్ర స్వభావాన్ని ఆ పాత్రలో ఉంచుతూనే, రెండు పాత్రల మధ్య ఘర్షణ తలెత్తినప్పుడు ఏ పాత్రనూ న్యూనపరచలేదు. ప్రతి పాత్రకు ఆయా కథల పరిధిలో వారిదైనా వ్యక్తిత్వాన్ని నిల్పారు. దాని వలన ఏ పాత్రా అనుచితంగా కనిపించదు. సాధారణంగా నాయక ప్రతినాయకుల ఘర్షణను ఆస్వాదించే క్రమంలో ప్రతి నాయక పాత్ర పట్ల వ్యతిరేక భావం తలెత్తటం పరిపాటి. కాని, ఈ మూడు కావ్యాలలో అలాంటి భావం తలెత్తనివ్వ లేదు కవి. ప్రతి పాత్ర నిర్దేశిత ప్రాంగణంలో ఉంటూ పాఠకుల అభిమానాన్ని చూరగొనింది

3.1.నాగర్జున సాగరం : నాగర్జున సాగరంలో పద్మదేవుడు శాంతిశ్రీ పాత్రలు కాక మతాచార్యుల పాత్ర ప్రధానంగా కనిపిస్తుంది. నాయికా నాయకుల అనురాగం, బౌద్ధారామాలలో అనంగీకారం. శాంతిశ్రీ పరధ్యాస నియమ నిబంధనలలో నడిచే ఆవరణంలో గురువుకు అంగీకారం కాదు. ఆమెకు దీక్షను ఇచ్చిన నాడు, బౌద్ధ మత బోధనలను పొందే విద్యార్థిగా పద్మదేవుడి సమక్షాన్ని కాంక్షించే ప్రణయినిగా శాంతిశ్రీ డోలాయమానంగా ఉన్న మనసు పడిన వేదనతో నలిగి పోయింది. 'బౌద్ధమత సారమూ సాధన మ్మొనరింప బ్రతుకంత గడుపగా ప్రతినబూనెద నేను' నిశ్చయించుకొంది (118). చివరికి ఆమెకై వచ్చిన పద్మదేవుడిని నిలువరించిన గురువు ఆమె అతడిని చూడనన్నది అని తెల్పినప్పుడు ఆమె విచికిత్సలో హృదయ ఘర్షణే తప్ప, గురువు ఒత్తిడి ఏ మాత్రమూ లేదు. మత శుష్క జీవితం వద్దు పద్మ దేవుని కళా భాగినిగా ఉండాలని అనుకొన్నా దాని వల్ల కలిగే చిన్న చూపుకు వెరచింది. అంతఃక్షాళన కన్న అమల సాధనములేదన్న గురువు బోధ ఆమెలోని విచికిత్సకు కారణం అయింది.

ఆమెను మతం పేరుతో గురువు మాయచేశాడు అనీ 'మతసూక్తులు జీవిత నిర్మాణమ్మును చేయలేవు. సరికద, పచ్చని బ్రతుకును, సన్యాసముత్రోయు' (122) అని పద్మదేవుడు ఆక్షేపించాడు. కోపించిన గురువు అతడి కళలు ఇక తమకు అక్కర లేదు వెళ్ళిపొమ్మన్నాడు. వారిరువురి మధ్య వాదం పెరిగింది. 'మానవత్వ సంరక్షణ/ మహాప్రయోజనము కొరకు/ మతముగాని మీరేమో/ మతము కొరకు మతమందరు', (125) కళా సౌందర్యాన్ని అంగీకరించలేరు కాని మత ప్రచారానికి తాము కావాలి మీకు అంటూ 'మీ మతమునకై నా కళ/ మీదుగట్టి యుంటకన్న/ మానవునిగ చేతు దీన/ మానవకోటుల సేవలు' (126) అంటూ భగ్న హృదయావేదన వెళ్ళగక్కి వెళ్ళిపోయాడు. వీరి వాదనలో గురువు చేసిన వ్యాఖ్యల కంటే పద్మ దేవుడి వ్యధనే కవి ఎక్కువగా చిత్రించాడు. గురువు సంరక్షించవలసిన చైత్యవిహార నియమాలు, శాంతిశ్రీ బుద్ధజయంతి నాడు స్వీకరించిన దీక్షతో సంరక్షించబడ్డాయి. కాని, పద్మ దేవుడికి కలిగిన ఆశాభంగం, కనీసం ఒక్కసారైనా శాంతిశ్రీని చూసే అవకాశం లేకపోవటం ఆ సున్నిత హృదయుడికి శరాఘాత మయ్యింది. మతం పేరిట అరాచకం జరుగుతున్నదన్న ఆక్రోశం నుంచి వచ్చిన మాటలవి. మాటకు మాటగా గురవు వాదించి ఉంటే, అతడి పట్ల వ్యతిరేకత కలిగే అవకాశం ఉంది. వాదం అధికంగా పద్మదేవుడి వైపు నుంచే ఉంచి, అతడి పట్ల జాలిని కలిగించింది కవి కలం. అన్ని పాత్రలనూ సగౌరవంగా చిత్రించారు డా.సి.నారాయణరెడ్డి.

3.2.కర్పూర వసంతరాయలు : కుమారగిరిరెడ్డి, లకుమ, మహారాణి, మహాసైన్యాధిపతి, బావమరిది అయిన కాటయవేముడు ప్రధాన పాత్రలు, కుమార గిరిరెడ్డి ధీరలలితుడు, లాలిత్యం కళాభిజ్ఞత సౌందర్యపిపాస రాజు వ్యక్తిత్వాంశాలు. రాజ్య నిర్వహణలో కుడి భుజంగా నిల్చిన కాటయవేముడు, రాజు కళాసక్తిలో మగ్నమవ్వటానికి కారణం కూడా. ఆ కళాభిరుచే ఆస్థాన నర్తకి లకుమ పట్ల ఆకర్షితుడవ్వటానికీ ఆమె పట్ల అనన్య అవ్యాజ అనురాగానికీ 'వసంతరాజీయమ'నే గ్రంథరచనా ప్రేరణ అయ్యింది. రాణిని, రాజ్యాన్ని పట్టించుకోని రాజుకు కాటయవేముడు రాణి మంచం పట్టిన విషయం చెప్పి, రాజ్య నియమాలు గతి తప్పే ప్రమాదాన్ని హెచ్చరించి ఆస్థానానికి రమ్మంటే వెళ్ళాడు. కాని, లకుమ కాలు బెణికిన వార్త విని అర్ధాంతరంగా సభ నుంచి నిష్క్రమించాడు. 'రాణి అనగ భూదేవికి/ ప్రతినిధి; ఆమెపై నాకు/అనురాగమ్మననుగాని/

ఆదరమ్ము గలదెంతో/'(316) అని రాణి ముందు నిలబడటానికి జంకుతాను అనే రాజు మనసు లకుమ పట్ల ఎంతగా మగ్నమయ్యిందీ తెలుస్తుంది. లకుమ నర్తించే పాదాలు బెణికితేనే తల్లడిల్లిన వాడు రాజు. కాని రాజ్యక్షేమం కోసం, 'వ్యష్టికన్నను దేశదృష్టియె గరిష్ఠమని ఆత్మార్పణ చేసుకొన్న లకుమ మరణం అతడికి కమ్మిన మాయపొరలు తొలగించింది. రాణిపై రాజ్యంపై ప్రజలపై మనసు నిల్పగలిగాడు.

లకుమ రాజు ప్రేమను పొందిన నాట్యగత్తె. ఆమె నర్తనం, సౌందర్యం రాజులో మోహాన్ని కలిగించాయి. అనునిత్యం తన వెంటే ఉన్న రాజు ప్రణయానికి లకుమ దాసోహమయ్యింది. రాజు అభీష్టానుసారం మెలిగింది. కాటయవేముడు హెచ్చరించినప్పుడు, రాజును ఆస్థానానికి పంపింది. రాణి దిగులుతో మంచం పట్టిందని తెలిసినప్పుడు 'మీ మంగళ మూర్తియె రా/ జ్ఞీమతల్లి కొక నూతన/ జీవనమ్ము నూదును స్వా/మీ! వెడలుడు సత్వరమ్ము'(315) అని నిస్సంకోచంగా సూచించింది. లకుమ కాలు బెణికిందని తెలిసి రాజు అర్ధాంతరంగా రాజ్య సభను వదిలి వెళ్ళటం భరించలేని రాణి అర్ధరాత్రి స్వయంగా వచ్చి, దేశాన్ని కాదని రాజు నిన్ను కోరుతున్నాడు దేశం కోసం 'భూపతిని ఎటులైన విడిపోవుటయె నీకు అవశ్యమమ్మా! (321) అన్నప్పుడు తల్లడిల్లిపోయింది. ప్రాణలకంటే మిన్నగా నమ్మిన రాజును ఎలా వీడిపోవాలి? రాజు బెంబేలెత్తిపోతాడు. అఖిలరాజ్యాన్నే నాకోసం తోసి రాజన్న రాజును ఎలా వీడాలి? 'ఎటుల వాగ్దానమ్ము తీర్తును/ ఎటుల రాయని వీడ నేర్తును' (323) అని పరితపించింది. చివరకు రాజు అవసరమున్న రాజ్యం కోసం శివతాండవ నృత్యం చేస్తూ చురకత్తితో ఆత్మార్పణ చేసుకొంది. మహారాణి గంభీర. భర్త అయిన కుమార గిరిరెడ్డి లకుమ పట్ల ఆకర్షితుడై, ఆమెతో కలిసి ఉంటే మనోవేదనతో కృంగి కృశించింది. కాటయవేముడి మాటను మన్నించి రాజు సభకు వచ్చినా లకుమ కాలు బెణికిన వార్తతో వెళ్ళిపోవటం ఆమె అంగీకరించలేక పోయింది. పరస్త్రీ కోసం తనను దూరం చేసినా సహించింది. సోదరుడితో ఏ మాత్రం ఆవేదనాగ్నిని పంచుకోలేదు. పరస్త్రీ కోసం రాజు రాజ్యాన్ని తృణీకారంతో చూడటం మాత్రం ఆమెకు అంగీకారం కాలేదు. రాజు రాజ్యాన్ని అలక్ష్యం చేయటం సరికాదని సోదరుడి ద్వారా తెల్పినా ప్రయోజనం లేకపోయింది. 'రేడు నా అంత: పురమునకు/ రాడనెడు దుఃఖమ్ము కన్నను/ రాచగద్దెను విడిన వార్తయె/రంపమున గోసినది తండ్రీ/ ఆటకత్తెల నాదరించుట/ అధిపులకు ధర్మమ్మె కానీ' (309) ఇది సహించలేకపోయింది. తానే స్వయంగా అర్ధరాత్రి లకుమ భవనానికి వెళ్ళింది. రాణి పాదాలకు మొక్కి కంటనీరు నింపి తన ప్రాణమివ్వటానికైనా సిద్ధపడిన లకుమతో 'నిన్ను రాయలు కన్నులందున/ నిలిపినందుకు పరితపించను/ కాని దేశమ్మును తృణమ్మటు కాలద్రోయుట ఎట్లు సైతును' (321) అని, 'గుండె రాయిగ చేసుకొని కడ/ కొక మాటయె అందునమ్మా? (321) అంటూ రాజును విడిచిపొమ్మని కోరింది. రాణి తన సంయమనాన్ని ఎట్టి పరిస్థితిలోనూ కోల్పోలేదు. కోరిన కోరిక లకుమకు శరాఘాతమని తెలుసు. అందుకే గుండె రాయిగా చేసుకొని అన్నది ఆ మాట. రాజు లకుమల అనుబంధం పట్ల రాణిలో వ్యతిరేకత లేదు. దేశ సంరక్షణా దృష్టి మాత్రమే ఆమె ఉద్దేశం. లకుమ రాసిన మరణ పత్రంతో మబ్బులు వీడిన 'ప్రభువు కన్నులకు కన్పడెనప్పుడు కొండవీ/దును, మహారాజ్ఞియును, జనమహాంబోధియును'(329)రాణి ప్రయత్నం లకుమ త్యాగంతో ఫలించింది.

కాటయవేముడు మహాసేనాన్ని. రాజ్యవిస్తరణలో ఇతడిది ప్రధాన పాత్ర. రాజు రాజ్యవ్యవహార విముఖుడైనా సమర్థించగలవాడు. లకుమ సన్నిధిలో కాలం గడిపే రాజు అనుమతితో విజయ నగర పాలకుడు హరిహరరాయలను ఓడించి వచ్చాడు. సోదరి యోగక్షేమాలు గుర్తిస్తూ ఉన్నాడు. రాజు, రాణి పట్ల రాజ్యం పట్ల పరాన్ముఖుడు కావటాన్ని హెచ్చరించాడు. ఎంత బంధుత్వమున్నా మహారాజును సగౌరవంగా దిశా నిర్దేశం చేశాడేకాని, ఏ సందర్భంలోనూ పరిహాసంలోనూ హద్దు మీరలేదు. ఈ కావ్యంలో లకుమ, ఆమె మరణం విషాదాన్ని అందించినా, లకుమ, రాణీలలో ఎవరి పట్లా వ్యతిరేక భావాలు జనించవు. ఆ శక్తి సినారె కలానిది.

3.3.విశ్వనాథనాయడు : విశ్వనాథ నాయడు కావ్యంలో ప్రధానంగా కనిపించే పాత్రలు నాగమనాయడు, విశ్వనాథనాయడు, శ్రీకృష్ణదేవరాయలు. నాగమనాయడు మల్లికాంబ దంపతులకు ఎంతో కాలపు పరితాపం అనంతరం శివ కటాక్షంతో కలిగిన సంతానం విశ్వనాథ నాయడు. శివ సానిధ్యంలో తేజోమయమైన వింత అనుభూతికి వారు లోనయ్యారు. జ్యోతిషులు జగదేకవీరుడు పుడతాడన్నారు. అలా జన్మించిన విశ్వనాథుడిని యుక్త వయసులో రాయలు సేనానిగా నియోగించాడు. తండ్రి కుమారు'డెంత కాలమని రాయల నీడలోన ఒదిగి ఒదిగి

నిల్చునవి వితర్కించెను' (33). రాజు కావలసినవాడు, దళవాయిగా ఉండటమా రాజెప్పుడవుతాడో అనే ఆలోచన సాగింది. అదే సమయంలో చోళరాజు పాండ్యరాజును తొలగించి మధురను చేజిక్కించుకొన్నాడు. చోళరాజు పాండ్యరాజు ఇద్దరూ సామంతులే. రాయలు పాండ్యరాజ అభ్యర్థనపై ఈ దుశ్చర్యను సరిచేయమని నాగమనాయడిని పంపాడు. 'ఇంతకాలము దేనికైమి/రెక్కి చూచెనొ తాను, నేడది/తీర వచ్చెను; వెదకబోయిన తీగ కాలికి తగిలినట్టుగ/ రాజకార్యము తోడ తీరును నైజకార్యము' (36) అనుకొన్నాడు. తన కుమారుడు మధుర తంజావూరు తదితర దక్షిణావథానికి సార్వభౌముడవుతాడని ఆనందించాడు. చోళుడిని తరిమి రాజ్యాన్ని కైవసం చేసుకొని తనను తాను రాజుగా ప్రకటించుకొన్నాడు.రాయల అంగీకారంతో తనపై యుద్ధానికి వచ్చిన విశ్వనాథుడిని నిందించాడు. అతడిపై కత్తి ఎత్తాడు దుఃఖంతో. తండ్రిపై కత్తి ఎత్తిన దుష్టులు ఈ జగత్తులో ఉన్నారా? అని ప్రశ్నించాడు. రాయల కాళ్ళొత్తుతావా, 'ఒకరిని శాసించెడి జా/తకము తుడిచి వేస్తావా' అన్నాడు 'నిను దక్షణ దేశాధీ/ శునిగా నొనరించుటకై/ నే పన్నిన వ్యూహమ్మును నెత్తుట ముంచెత్తదవా?' అని ప్రశ్నించాడు. పుత్రుడి చేతిలో బంధి అయ్యాడు. పుత్రుడిని రాజుగా చూడాలని నాగమ కోరిక అతడి చర్య ప్రభుధిక్కారమే. అయినా పుత్ర ప్రేమ రాయల స్నేహాన్ని సాన్నిహిత్యాన్ని విస్మరించేలా చేసింది. కుమారుడిని రాజుగా ప్రకటించినప్పుడు తన కోరిక ఫలించిన ఆనందం అతడిలో పొడసూపింది.

విశ్వనాథనాయడు బహుకాలపు ఎదురు చూపు అనంతరం కలిగిన గారాల బిడ్డడు. సకల విద్యలూ నేర్చాడు. రాయలు అతడిని తన సేనానిగా నియోగించాడు. సేనానిగా రాజ్యానికి విజయపరంపరలను అందించాడు. ఆ తరుణంలో తండ్రి దుశ్చర్య, రాజధిక్కారం. తండ్రి చేసిన పని తెలిసి 'మొదట మ్రాన్పడె; అం/తట తరళాక్షుండయ్యెను/పిమ్మట లజ్జా విషాద/ పిహిత చేతసుండయ్యెను' (41). అరవైయేళ్ళలో ఏ మచ్చాలేని తండ్రి ఎందుకిలా చేశాడు. ఈ వయసులో ఈ కోరిక ఏమిటో అని వితర్కించి 'తనకు రాజ్యలోభమున్న/దను సంగతి యింతవరకు/నాకు తెలియనీయ డిదం/తయు తనకో నా కొరకో'(42) అనే ఆలోచనలో తండ్రి హృదయం తెలిసిన తీరు ఉంది. తిన్నింటి వాసాలు ఎంచడం తప్పని భావించాడు. ఈ ధిక్కారాన్ని సహించలేని రాయలు నాగమ నాయడను ఎవరు బంధించి తెస్తారన్నప్పుడు విశ్వనాథుడు ముందుకు వచ్చాడు.

'..ఎవరొ ఒకరు / సాహసించక తప్పదు గదా/ కన్నతండ్రి యటన్న ఎవ్వడు/ కరగిపోవడు కాని స్వామీ/ ధర్మదండము బూనినప్పుడు/ తండ్రి యెవ్వడు? తనయు డెవ్వడు' అని 'స్తుతులకో సమ్మతులకో యీ/ ప్రతిన బూనగలేదు, ధర్మ/ క్షతిని చూడగలేక ధ్వజమె/ త్తితిని ..' అని పేర్కొన్నాడు. ససైన్యంగా యుద్ధానికి వెళ్ళాడు. తండ్రికి లేఖ వంపాడు. 'ప్రాణము పోయిన గానీ పాండ్య రాజ్యమివ్వ' (60) నన్న తండ్రి మాటలకు ఎంతో సంఘర్షణకు గురయ్యాడు.'దాయలతోనే యుద్ధము/సేయగ జంకెను కిరీటి/కన్న తండ్రిపై నేనెటు/ కత్తిని జళిపించ గలను'(61) అని వ్యథ చెందాడు. ఇప్పుడు తండ్రని వెను తిరిగితే ధర్మచ్యుతి కలుగుతుంది. లేదంటే తండ్రి మీది కత్తి ఎత్తిన అపవాదు కలుగుతుంది అని దిగులుపడ్డాడు. తండ్రికి 'దయతో యుద్ధమునకు సి/ద్ధము కమ్మని కబురంపెను' (62). తల్లి పిలుపున వెళ్ళిన విశ్వనాథుడిని చూడగానే తండ్రి కరవాలం దూస్తే, తానూ ఖడ్గాన్ని దూశాడు. తల్లి కేకతో కత్తి వదిలి తండ్రి ముందు నిల్చాడు. తండ్రి నిష్ఠూరాన్ని సహించాడు. తండ్రి రాజ్యాధికారాన్ని ఆశగా చూపినా 'మీ మమతను త్రోసి పుచ్చ/గా మనసొప్పదుగానీ/అది ధర్మమునకు సంకెల/యైపోయిన సైచుటెట్లు?' (75) అని తండ్రి కల్పించే ఆశలను నిరాకరిస్తూ 'మీరు మాటి మాటికి నా/మేలు కోసమని యందురు/ఇది సైతము స్వార్థమై' అని స్వామి ద్రోహం శిక్షార్హం అన్నాడు. యుద్ధాన తండ్రిని బంధించి రాయల ఎదుట నిల్పాడు. రాయలు ఆలిగనం చేసుకొని, నాయడి చర్యను క్షమించాడు. విశ్వనాథుడిని నేటి నుండి సమాన స్కంధుడవని ఆదరించాడు. రాజు చర్యతో పాండ్యరాజు తన రాజ్యానికి రాజుగా విశ్వనాథుడే యోగ్యుడన్నాడు. రాజ్యాన్నతడి చేతిలో పెట్టమన్న పాండ్యరాజు సహృద్భావాన్ని అంగీకరించి అధికారిక ప్రకటన చేశాడు రాయలు. విస్మితుడైన విశ్వనాథుడు 'బంటేమిటి రాజ్యమేమిటి, మొగలిపాన్పు వద్దన్నాడు. మీ నీడ చాలన్నాడు. నేనేదో గొప్పచేశాననుకోవడం మీ గొప్పతనం అన్నాడు. 'ప్రతిఫలమ్ము కొరకేనా/ప్రాణములు పిండిపోసి/ నను పెంచిన తండ్రిని కద/ నమ్మున కీడ్చినది ప్రభూ 'అన్నాడు. యుగాల నుండి పెరుగుతున్న ధర్మాగ్ని గుండంలో తానూ ఒక గరిటెడు నేయ వేశానన్నాడు.

అంతేకాని; 'రాజ్యమ్ము మాత్రమ్మూ వలదు' అన్నాడు. రాయలు తప్పదన్నప్పుడు సరే నన్నాడు. అందరూ ఆనందించినా, విశ్వనాథుడు వేదనతో తండ్రి పాదాలపై వాలి క్షమాపణ కోరాడు. విశ్వనాథుడి ప్రభు భక్తి ముందు అనుబంధాలు నిలవలేదు. అత్యాశ అంతకంటే లేదు. తండ్రి కోరినదే జరగటం, తండ్రికి అంతటి పరాభవా నంతరం అది ఆనందమే.

శ్రీకృష్ణదేవరాయలు సామనస్వీగా చరిత్రలోనూ కావ్యంలోనూ నిలిచాడు. పుత్రార్థి అయి తపిస్తున్న నాగమ నాయణ్ణి బాలచంద్రుడి వంటి కొడుకును పొందుతావని ఊరడించాడు. నాయడి పుత్రుడు దినదిన ప్రవర్ధమానంగా ఎదగటం చూసి ఇరవై ఏళ్ళైనా రాక మునుపే సేనానిగా నియమించాడు. పాండ్యరాజు దురాక్రమణ చేసిన చోళ భూపతిపైకి నాగమను పంపాడు. జయించిన రాజ్యాన్ని పాండ్యరాజుకు అప్పగించక తానే రాజ్యం చేస్తున్న నాగమను విషయం తెలిసి తిరిగి రమ్మన్నా, రాక పోవటంతో అతడిని బంధించి ఎవరు తెస్తారని సభలో ప్రశ్నించాడు. ముందుకు వచ్చి విశ్వనాథుడిని చూసి విన్మయుడై 'విశ్వనాథా/ నీ మగంటిమి/విదితమీ పరిషత్తుకైనను/పరుల చెండుట వేరు తండ్రిని/ పట్టి తెచ్చుట వేరు సుమ్మా!'(50). రాగబంధాన్ని తెంచటం మునులకే సాధ్యం కాదు. మీరిరువురు కలిసి దండయాత్ర చేస్తానని శంకించటం లేదు. నీహృదయం నాకు తెలుసు. ఎంత ప్రభుభక్తి ఉన్నా ఇంత సాహసం తగదన్నాడు. విశ్వనాథుడి వాదన విని అతడిని ఆశీర్వదించాడు. బంధించి తెచ్చిన నాగమనాయడితో, కొడుకు కోసం చేశాడని తెలిసింది అంటూ 'అమృత భక్షణ సేయు వీరుడు/ఆశ పడునా దొంగ కూటికి' అని అతడి ఉన్నత గతచరిత్రని తలచి అతడిని మన్నించాడు. నీకొడుకు కీర్తితో నీ మచ్చ తొలగి పోతుందన్నాడు. విశ్వనాథుడి ధర్మనిరతిని స్తుతించిన రాయలు 'నీవు బంటువు మేము ప్రభువను/ నేమమింతటి తోడ తీరెను/ మా సమాన స్కంధుడవు సుమ్మా! కుమారా! నేటి నుండియె'(87) అని పుత్రాభిమానాన్ని ప్రకటించాడు. రాజ్యాన్ని పాండ్యరాజు విశ్వనాథుడికే ఇవ్వమన్నప్పుడు నిరాకరిస్తున్న విశ్వనాథుని అంగీకరింపచేశాడు. రాజును చేశాడు. రాయలు ఔదార్యం తండ్రీ కొడుకుల విషయాన స్పష్టం. నాగమ చర్య వెనుక అతడి హృదయాన్ని కుమారుడి పట్ల ప్రేమని గుర్తించిన హృదయం రాయలది.

ముగింపు : సి.నారాయణరెడ్డి మాత్రాఛందస్సుకు ఈ చారిత్రక గేయకావ్యాలలో పెద్దపీట వేశారు. త్ర్యస్ర, చతురస్ర, ఖండ, మిశ్రమ, సంకీర్ణమనే ఐదు రకాలుగా సాగే గణాలు వరుసగా మూడు, నాలుగు, ఐదు, ఆరు ఏడు మాత్రలుంటాయి. సి.నారాయణరెడ్డి నాగర్జున సాగరంలో (1955) ఖండగతిని అంటే ఐదు గణాల లయతో సాగే రచనను చూపారు. మిగిలిన గతులను సందర్భానుసారంగా వచ్చి నిల్చాయి. 'ఆధునిక కవిత్వం వచన కవిత్వంవైపు మలుపు తిరుగుతున్న దశలో నారాయణరెడ్డి ఒక్కడే గేయ కవిత్వానికి పట్టుగొమ్మ అయినాడు(డా.గి. చెన్న కేశవరెడ్డి, ఆధునికాంధ్ర గేయ కవిత్వం, పు.361). కర్పూర వసంతరాయలు (1957) కావ్యంలో త్ర్యస్ర, మిశ్రమ, చతురస్ర గతులు కనిపించాయి. విశ్వనాథనాయకుడిలో (1959) ప్రసిద్ధమైన ఖండగతి, మిశ్రగతి త్రిశ్రగతులను బహుళంగా వాడుకొన్నాడు. చతురస్రగతిని క్వాచిత్కంగా వాడుకొన్నాను (నహృదయులకు, పు:7) అని వారే పేర్కొన్నారు. నన్నివేశానుగుణంగా భావానుగుణంగా గతిని వాడుకోవటం సినారె శక్తి. 'తెలుగు గేయానికి నాట్యం నేర్పిన కవి సి.నారాయణరెడ్డి గారు. గేయగర్భంలో దాగిన నాట్యగుణాన్ని పట్టుకొన్న కవిగా కూడా ఆయనను గుర్తించవచ్చు. గేయం తనంతట తాను ఎన్ని వయ్యారాలు పోతుందో ప్రదర్శించడమే గాక, గేయాన్ని ఎన్నెన్ని వయ్యారాలు తిప్పగలరో కూడా రుజువు చేశారు సినారె (జలపాతం వంటి కావ్యం విశ్వగీతి సినారె కవిత్వాను శీలనం, రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, నవతెలంగాణ పబ్లిషింగ్‌హౌస్, ఎమ్‌హెచ్ భవన్, పు33)

తన రచనలు విషాదాంతాలయినా, కాకపోయినా కావ్యాన్ని రసరమ్యం చేశారు కవి. పద్మదేవుడు శాంతిశ్రీ కల్పిత పాత్రలు. కాని లకుమ కుమార గిరిరెడ్డి; నాగమనాయడు విశ్వనాథనాయడు కృష్ణదేవరాయలు చారిత్రక వ్యక్తులు. సినారె ఎవరిని ప్రధాన భూమికగా తీసుకొన్నా, ప్రతి పాత్రనూ ప్రేమించి పాఠకులతో ప్రేమింప చేశారు. అది వారి అద్భుత కవన ప్రవాహ ప్రదర్శిత శక్తి. అందుకే నేటికీ నూతన తరాలకు రసానుభూతిని అందిస్తూ ఆస్వాద యోగ్యంగా ఉన్నాయి.

ఆచార్య కొలకలూరి మధుజ్యోతి
వైస్ ఛాన్స్‌లర్, ద్రవిడ విశ్వవిద్యాలయం, కుప్పం
ఫోన్ : 9441923172

జల సంరక్షణ కవిత్వం

– దార్ల వెంకటేశ్వరరావు

ప్రకృతిలో గాని, మానవుని శరీరంలో గాని అత్యధిక శాతం ఉండేది నీరే. పంచభూతాలలో ఒకటిగా కూడా నీటిని చెప్తారు. వీటిలో గాలి, నీరు లేకపోతే సమస్త జీవకోటి ఆగిపోతుంది. మనిషికి మాత్రమే కాదు ఈ ప్రకృతి మనగలడానికి కూడా నీరు ఎంతో అవసరం. నీటి ప్రాధాన్యాన్ని, దాన్ని సంరక్షించుకునే విధానాన్ని గురించి మన సంప్రదాయ కవులు మాత్రమే కాకుండా ఆధునిక కవులు కూడా కవిత్వం రాశారు. ఆధునికతను వస్తుతత్వంగాను కాలవాచికగాను గుర్తించే అవకాశం ఉంది. ఈ పత్రంలో మాత్రం ఆధునికతను కాలవాచికగానే స్వీకరిస్తున్నాను. నీటి ప్రాధాన్యాన్ని, దాన్ని పరిరక్షించుకోవలసిన అవసరాన్ని అనేకమంది కవులు తమదైన అభివ్యక్తులతో కవిత్వీకరించారు. ఆధునిక కవిత్వంలో నీటితోనూ కన్నీటితోనూ తడవని కవిత్వం లేదు. డా.ఎన్.గోపి రచించిన 'జలగీతం' అనే దీర్ఘ కవితలో తెలుగు సాహిత్యంలో నీటి పొదుపు, నీటితో మానవుడికి ఉన్న సంబంధాన్నీ హృద్యంగా వర్ణించారు. అందువల్ల సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రధాన సంపాదకులుగా, డాక్టర్ కే.వీరయ్య, వనపట్ల సుబ్బయ్య, డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, డాక్టర్ గుంటి గోపి సంపాదకులుగా వ్యవహరించిన *తెలంగాణ జలకవితోత్సవం* పేరుతో 2018లో బృహత్ కవితా సంకలనం వెలువడింది. 2018 విళంబినామ ఉగాది వేడుకలలో భాగంగా 74 మంది కవులతో 'నీరుచెరువు' అంశంపై ప్రత్యేక కవి సమ్మేళనాన్ని విజయవంతంగా నిర్వహించింది. ఆ కవితలన్నిటినీ కలిపి *'అలుగు దుంకిన అక్షరం'* పేరుతో కవితా సంకలనాన్ని ప్రచురించారు. దీనితో పాటు విడిగా కూడా కొన్ని కవితలు వచ్చాయి. వాటన్నింటినీ ఈ పత్రంలో రాయాలంటే చోటు సరిపోదు. వీటిలో జల సంరక్షణ అంశాన్ని వస్తువుగా తీసుకున్న కొన్ని ముఖ్యమైన కవితలను ఈ వ్యాసంలో వివరించే ప్రయత్నం చేస్తాను. ముందుగా జలసంరక్షణ ఆవశ్యకతను వివరించి, ఆ వస్తువుతో వచ్చిన కవిత్వాన్ని విశ్లేషించుకుందాం.

జలసంరక్షణ ఆవశ్యకత: మనకు భూమిపై మూడొంతుల నీళ్ళే ఉన్నప్పటికీ, అవన్నీ త్రాగడానికీ, గృహావసరాలకు ఉపయోగపడవు. రోజు రోజుకీ జనాభా పెరుగుతుంది. వీళ్ళందరికీ కూడా నీళ్ళు అవసరమవుతాయి. దీనితో పాటు వ్యవసాయ అవసరాలకు నీటిని ఉపయోగించుకోవాలి. వర్షం కురిసినా దాన్ని సముద్రంలోకి పోకుండా పొలాలకు ఉపయోగపడే విధంగా ఉపయోగించుకోవాలి. ఇంకా మిగిలిన నీటిని భూమిలోకి ఇంకిపోయేలా చేయాలి. దీని వల్ల పంటపండించుకోవడానికి, పర్యావరణాన్ని పరిరక్షించుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. నీటిని సద్వినియోగం చేసుకోకపోవడం వల్ల పంటలు లేక కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీనితో ప్రజలు వలసలు వెళ్ళిపోవలసి వస్తుంది. కురుస్తున్న వర్షం, ప్రవహిస్తున్న నదుల నీటిని అన్నిప్రాంతాల వారు సక్రమంగా వినియోగించుకుంటే దేశమంతా సశ్యశ్యామల మవుతుంది. 'భూమ్మీద ఉన్న నీటిలో 97.5 సముద్రపు నీరే. అవి మన ఉపయోగానికి పనికిరావు. మిగిలిన 2.5 శాతం నీటిని మాత్రమే మనం ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. ఈ నీటిలోనూ ఎక్కువగా గ్లేషియర్లు, మంచు కొండల రూపంలో ఉంది. వాటిని వినియోగించుకోలేమ'ని నిష్ణాతులు వివరిస్తున్నారు. మన దేశం 24 శాతం మేర భూగర్భ జలాలను వినియోగించుకుంటోంది. భారత దేశం ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశాల్లో రెండో స్థానంలో ఉంది. కానీ ఇంత జనాభాకి ఈ నీరు సరిపోదు. నీరు తగ్గిపోవడం వల్ల వాతావరణంలో కూడా మార్పులు వస్తున్నాయి. గణాంకాల ప్రకారం మన దేశంలోని 60 మిలియన్ల మంది నీరు లేక ఇబ్బంది పడుతున్నారు. 2050 నుంచి కరువు బారిన పడి బిలియన్ల మంది బాధపడతారని గణాంకాలు చెబుతున్నాయి. 2040 వరకూ ప్రపంచంలోని 33 దేశాల్లో నీటి కొరత ఏర్పడుతుందని కూడా హెచ్చరిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో నీటిని

పొదుపుగా వాడుకోవడంతో పాటు, జల సంరక్షణకు కొన్ని పటిష్ఠమైన చర్యలను చేపట్టాలి. అవి నిత్య జీవితంలో వృథాగా నీటిని వృధాచేస్తుంటాం. అవన్నీ చిన్న చిన్న పనులులా కనిపించవచ్చు. కానీ, దేశవ్యాప్తంగా అలాగే నీటిని వృథా చేస్తే నీటిసమస్య పెరిగిపోతుంది. అందువల్ల నీటి పొదుపుతో పాటు, ఉన్న జలాల్ని సంరక్షించుకోవడానికి కూడా కొన్ని పనులు చేయాలి. గృహావసరాలలో మనం నీటిని పొదుపుగా వాడుకుంటూ, నీటిని వృధాచేయకుండా ఉండడానికి కొన్ని పనులు చేయాలని నిపుణులు కొన్ని సూచనలు చేస్తున్నారు.

1. స్నానం చేసేటప్పుడు షవర్ బాత్ కంటే బకెట్‌ని ఉపయోగించడం నీటి వృధాను అరికట్టవచ్చు.

2. మనం బ్రష్ చేసేటప్పుడు, గెడ్డం గీసుకొనేటప్పుడు కుళాయిలు విప్పి అలాగే తమ పనిని చేస్తుంటారు. మనకి కావలసినప్పుడు మాత్రమే కుళాయిని (నల్లాను) విప్పుకోవాలి. మిగతాసమయంలో దాన్ని కట్టేయాలి.

3. బాత్ రూమ్‌లో రోజువారీ దినచర్యలకు కూడా నీళ్ళు బకెట్ల కొద్దీ వృధాచేస్తుంటారు. దానికి బదులు లెట్రిన్‌లో ఫ్లష్ చేయడం ద్వారా తక్కువ నీటితో శుభ్రం చేసుకోవచ్చు.

4. మనం ఇళ్ళలో నీటిని వాడుకున్న తర్వాత కొంతమంది పైప్‌లను అలాగే వదిలేయడం లేదా లీక్ అవుతుంటే పట్టించుకోకపోవడం వల్ల మనదేశంలో సెకనుకు ఒక చుక్క చొప్పున అయినా ఏటా 10,200 లీటర్లనీరు వృథా అవుతుందని గణాంకాలు చెబుతున్నాయి. అందువల్ల లీక్ అయ్యే వాటర్ అరికట్టే చర్యలు తీసుకోవాలి.

5. మైక్రో ప్రాసెసింగ్ టెక్నాలజీ వల్ల నీరు నిమిషానికి ఆరువందల మిల్లీ లీటర్ల మేర ఆదా అవుతుందట. దీనివల్ల రోజూ ఎంతో నీరు వృథా కాకుండా చూసుకోవచ్చు. ఇక సెన్సార్‌లను ఫిట్ చేయడం వల్ల మనం చేతులు పెట్టినప్పుడే నీళ్లు వచ్చే అవకాశం ఉంటుంది. దీని ద్వారా నీరు వృథాగా పోకుండా కాపాడుకోవచ్చు.

6. కిచెన్‌లో ఆర్ ఓ ఉపయోగించేవారు ఈ మధ్య కాలంలో ఎక్కువయ్యారు. ఇది నేరుగా కుళాయి నుంచి నీళ్లు తీసుకొని దాన్ని తాగే నీటిగా తయారుచేస్తుంది. ఇలా తయారుచేసే క్రమంలో కొంత నీటిని వృథాగా వదిలేస్తుంది. చాలామంది ఈ నీటిని సింక్‌లోకి వదిలేస్తుంటారు. అయితే ఇలా వదిలేయకుండా ఆ నీటిని బకెట్‌లో పట్టి వాటిని కూరగాయలు కడిగేందుకు, గిన్నెలు కడిగేందుకు ఉపయోగించడం వల్ల నీటిని పొదుపు చేసినవారవుతారు.

7. గిన్నెలను వీలైనంత ఎక్కువగా చేత్తోనే కడిగేందుకు ప్రయత్నించండి. డిష్ వాషర్ ఉపయోగించడం వల్ల ఎక్కువ నీరు వృథా అవుతాయి. ఒకసారి డిష్ వాషర్ ఆన్ చేస్తే ఎనిమిది లీటర్ల నీళ్లు ఖర్చవుతాయి. అందుకే గిన్నెలను చేత్తోనే కడిగేయాలి. అప్పుడొకటి ఇప్పుడొకటి కాకుండా అన్ని గిన్నెలు ఒకేసారి కడగడం వల్ల తక్కువ నీళ్లు ఖర్చవుతాయి.

8. పండ్లు, కూరగాయలు కుళాయి కింద పెట్టి కడిగితే చాలా నీళ్లు వృథా అవుతాయి. దీనికి బదులుగా ఒక పెద్ద గిన్నెలో నీళ్లు పోసి అందులో కూరగాయలన్నీ కడిగేస్తే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల నీళ్లను మరోసారి ఉపయోగించుకునే వీలుంటుంది. ఈ నీటిని గిన్నెలు కడిగేందుకు లేదా గార్డెన్‌లో మొక్కలకు నీళ్లు పోయడానికి దీన్ని ఉపయోగించవచ్చు. ఇలాగే గిన్నెలు కడిగిన నీళ్లను కూడా బకెట్‌లో పట్టి వాటిని కూడా గార్డెన్‌లో మొక్కలకు పోయడం వల్ల చాలా నీటిని పొదుపు చేయవచ్చు.

9. వంట చేసేటప్పుడు ఎక్కువ నీటిని పోసి ఉడికించడంవల్ల ఆ తర్వాత ఆనీటిని వృథాగా ఒంపేయాల్సి వస్తుంది. దీంతో కూరగాయలు, ఆకుకూరల్లోని పోషకాలు కూడా నీటి ద్వారా వెళ్లిపోతాయి. కాబట్టి వీలైనంత తక్కువ నీళ్లు పోసి లేదా ఆవిరిపై ఉడికించడం వల్ల నీరు వృథా కాకుండా చూసుకోవచ్చు. దీంతో పాటు మూత పెట్టి ఉడికించడం వల్ల నీరు ఎక్కువగా ఉపయోగించాల్సిన అవసరం ఉండదు.

10. చాలామంది ఏ రోజు బట్టలు ఆరోజు ఉతుకుతూ ఉంటారు. మీ ఇంట్లో ఎక్కువ మంది సభ్యులు ఉంటే ఫర్వాలేదు కానీ మరీ తక్కువ మంది ఉండి రెండు మూడు దుస్తులు మాత్రమే ఉంటే రోజూ బట్టలు ఉతక్కపోవడం మంచిది. రెండు రోజులు లేదా మూడు రోజులకోసారి మెషీన్ నిండుగా ఉన్నప్పుడే బట్టలు ఉతకండి. దీనివల్ల మీకు పని తగ్గడంతో పాటు నీళ్లు కూడా తక్కువగా అవసరం అవుతాయి. వాషింగ్ మెషిన్ పాతబడిపోయి తరచుగా రిపేర్లు చేయవలసి వస్తుంటే దాన్ని మార్చేయడం మంచిదని వివిధ సూచనలు చేశారు. ఇటువంటి వాటిని కవులు తమకవితల్లో వర్ణించేప్రయత్నం చేశారు.

జల సంరక్షణ -సకలజనుల సంరక్షణ : వర్షం రూపంలో వచ్చే నీటిని మనం జాగ్రత్తగా సంరక్షించుకుంటే అది రకరకాల రూపాల్లో మనకి ఉపయోగపడుతుంది. నీటిని

మానవీకరించిన డాక్టర్ ఎన్. గోపి ఆ నీరు వివిధ రూపాలను పొందే స్థితిని 'జల గీతం'లో కవిత్వీకరించారు. ఒక్కొక్క బిందువు చిన్నచిన్న కాలువలుగా మారుతుంది ఆ కాలువలు వాగులుగా మారతాయి. ఆ వాగుల ద్వారా చెరువులు, ఆ చెరువుల ద్వారా అనేక వందలాది పొలాలను బంగారంగా మారుస్తుందని చెప్తూ ఇలా కవిత్వీక రించారు. ***''వాగుల రాకతో/చెరువు మనసు నిండి పోతుంది./చెరువు మరింత నిండాలనుకోదు./సంతృప్తి దాని సంస్కృతి/కట్టకు మించిన నీటిని/మత్తడిగా వదిలేస్తుంది/ మరో వాగును ప్రేమిస్తుంది/మత్తడి పుత్తడిని మోసుకెళ్లి/ వాగు మరో చెరువును బంగారం చేస్తుంది/మిగులు సమృద్ధిని/మరో చెరువుకు దానం చేసే/సౌజన్య శీలి చెరువు/వాగుల కొంగులతో ముడివేసుకున్న/సకల కళ్యాణ భావన చెరువు'' (డాక్టర్ ఎన్ గోపి, జల గీతం, పుటः 2).*** మనం వర్షపు నీటిని సక్రమంగా వాడుకుంటే మనం కాపాడుకున్న జలమే ఈ సమాజాన్ని కాపాడుతుందన్నారు. అది సమాజ కళ్యాణానికి ఎలా దోహదపడుతుందో వర్ణించడం ద్వారా కవి ఎంతో ఉదాత్తమైనటువంటి భావాన్ని వ్యక్తీకరించారు. మన కళ అంతా అంటే మన సంతోషాలన్నీ నీటితోనే ముడిపడి ఉన్నాయి కనుక నీటిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని పరోక్షంగా సూచిస్తూ డా.నందిని సిద్ధారెడ్డి ఇలా వర్ణించారు.

''జలం లేని కళ ఏది?/జలం లేకనే కదా రైతుకళ తప్పింది/రుతుకళలన్నీ జలమే/ రాళ్ళు విసిరినా రంభను పంపినా/తపోభంగం కాదు. ''(డా. నందిని సిధారెడ్డి, కవి నది, పుటः 5) ఇలా వర్ణించడం ద్వారా కవి నీటి ప్రాధాన్యాన్ని వివరించడమే కాదు, ప్రభావం ఉన్న ప్రకృతి ఎంత సౌందర్యవంతంగా ఉంటుందో కూడా వివరిస్తున్నాడు కవి. 'జలం లేకనే కదా రైతు కళ తప్పింది' అంటే తన పొలంలో నీళ్ళు లేక పంట పండక పోవడం వలన ఆ జీవితంలో వచ్చిన నిరాశ నిస్పృహ. అది కేవలం ఒక కుటుంబానికి సంబంధించింది మాత్రమే కాదు. సాయి మీద ఆధారపడిన వాళ్లంతా జీవం కోల్పోయినట్లే అవుతుంది. ఈ కవితలు జలం ప్రాధాన్యాన్ని చెప్పడమే కాకుండా ఆ జలం మీద ఆధారపడే ఈ ఋతువులన్నీ ఆహ్లాద భరితంగా ఉంటున్నాయని చెబుతూ 'రుతు కళలన్నీ జలమే' అన్నాడు కవి. నిత్య వసంతంలో బ్రతికే మానవుడికి తగినంత నీళ్ళు లభ్యమైతే ఆకాశం నుండి రంభ వచ్చినా తాము చేసే పని ఆగదని చెప్తున్నాడు కవి.

జల సంరక్షణ : గ్రామీణ వృత్తుల పరిరక్షణ : నీటిని మనం జాగ్రత్తగా వాడుకుంటే అది ఊరిలోని అన్ని వృత్తుల వారికి ఎలా ఉపయోగపడుతుంది. ఈ భావాన్ని డాక్టర్ నాశేశ్వరం శంకరం గ్రామీణ వృత్తుల కేంద్రంగా జల సంరక్షణను కవిత్వీకరించారు. సాధారణంగా వర్షం కురిసినప్పుడు ఆ నీటిని వివిధ చెరువులలో భద్రపరుచుకుంటారు. అప్పుడు ఆ చెరువు ఆ గ్రామంలోని వాళ్ళందరికీ ఉపయోగపడు తుంది. నీళ్లు తాగడానికి, బట్టలు ఉతుక్కోవడానికి, పశు వులను కాపాడుకోవడానికి, ఆ చెరువులో చేపలు పెంచుకోవడానికి ఉపయోగపడుతుందని కవి ఇలా చెప్తారు. ***''చాకలి ఊరి మలినాన్ని తెచ్చి వుతికినా/కరణం గేదెల్నీ మునసబు దూడల్నీ కడుక్కుపోయినా/బిడ్డకు పాలిచ్చినట్టు/యోధుడికి ఖడ్గానిచ్చినట్టు/మావూరుకు బతుకునిచ్చేది ఈ చెరువే!''చెరువులోని నీరు అనేక జీవులకు ప్రాణాధారంగా ఎలాగవుతుందో చెబుతూ (మా వూరు మానవతార, పుటः 12)*** *''చినిగిన బతుకుల చినుగుల్ని కుట్టడానికి/ చేపలు చేపల్నీ పాములు కప్పల్నీ చంపుకు తినేకథల్ని చెరువు గట్టున చేరగానే చెవిలో చెబుతుంది''* అనడం ద్వారా పర్యావరణ స్పృహను కూడా నీటి సంరక్షణతో ముడిపడి ఉన్న విధానాన్ని కవిత్వీకరిస్తున్నాడు కవి. నీటిని పరిరక్షించుకోకపోతే నీటి ద్వారా పోరాటాలు వచ్చే అవకాశం కూడా ఉందని చెబుతూ కవి-*''ఈ చెరువుకు ద్రవించటం తెలుసు ప్రవహించటం తెలుసు/ ఉద్యమించటం తెలుసు అసువులు బాయటం తెలుసు ఊరు ద్వారం వద్ద చల్లె కల్లాపి స్వరంలో /స్వరం కలిపి రోదించటం తెలుసు/ ఎల్లవేళలా కాపాడే పోరాటాల ఇలవేల్పు మా చెరువు మావూరి ప్రతిరూపమే ఈ చెరువు''* అన్నారు.

మనిషి సుఖ సంతోషాలతో జీవించాలని ఆ మనిషి పోరాటాలు చేయాలన్న నీటితోటి ముడిపడిన ఒక అవినాభావ సంబంధాన్ని కవిత్వీకరించడం ద్వారా ఆ నీటిని మనం పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని పరోక్షంగా నూచిస్తున్నాడు కవి. చెరువు కథ పేరుతో డాక్టర్ ఎ.జయంతి రాసిన కవితలో కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రజా సంబంధాలు నీటితో ఎలా ముడిపడి ఉన్నాయో ఆ కవితలో చక్కగా వర్ణించారు.

జల సంరక్షణ-పశుపక్ష్యాదుల పరిరక్షణ : పర్యావరణ సమతుల్యం కొనసాగాలంటే కేవలం మనుషులు మాత్రమే కాదు, వశువక్షాదులు కూడా జీవించాలి. అవి జీవించాలంటే జల సంరక్షణ చేయాలి. అలా చేయగలిగితే

గనక "నీటిఅద్దం మీద కొంగలు/సింగారించుకునే దృశ్యం/ శత సహస్రాలుగా విస్తరించే/ జీవరాశి పరిమళం" ఆస్వాదించడం సాధ్యమవుతుందని జలదృశ్యం కవితలో డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి చక్కని దృశ్యాన్ని ఆవిష్కరించారు.

జల సంరక్షణ -వలసల నివారణ : నీటిని కాపాడుకోవడ మనేది ఎంతో తెలివితేటలతో ముడిపడిన ఒక జ్ఞానం. కురిసిన ప్రతి నీటి చినుకుని ఒడిసి పట్టుకోవడం, దానికి కావలసిన ప్రాజెక్టును నిర్మించడం పాలకుల విధి విధానాలతో కూడా ముడిపడి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు కరువులతో అల్లాడిన తెలంగాణలోని ప్రాంతాలు తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జలంతో చెరువవులు కళకళలాడడానికి, చేలన్నీ పంట పొలాలుగా మారడమనేది పాలకులు తీసుకున్న నిర్ణయాలే ప్రధాన కారణమంటూ, జల సంరక్షణ ప్రభుత్వ విధివిధానాలతో ముడిపడి ఉందనే విషయాన్ని జూలూరి గౌరీ శంకర్ 'జలకళకుజరీ చీర' పేరుతో చక్కని కవితను రాశారు. ప్రభుత్వ విధానాల వలన ప్రత్యేక రాష్ట్రంలో ప్రాజెక్టులు వేగవంతంగా కట్టడం వలన తెలంగాణ రాష్ట్రంలో నీళ్లు ప్రవహిస్తున్నాయని, దీని వల్ల ఈ ప్రాంత ప్రజలు వలసలు పోవాల్సిన కష్టాలు తప్పుతున్నాయనే ఉద్దేశంతో డాక్టర్ ఎస్ రఘు అభిషేకం వేరుతో ఒక కవిత రాశారు. ***"పై ళ్ళలో దాగిన ప్రాజెక్టులు/ఫలితాలవైపు ప్రవహిస్తున్నాయి!/నీళ్ళు పల్లాన్ని మరచి/ప్రత్యేక రాష్ట్రం వైపు పరుగులు తీస్తున్నాయి!/వలసల ఎడారుల్లో/చిక్కుకున్న బడుగుజీవి/నదీ పరివాహకంగా మారుతున్న/తన నేలమీద/ కొత్తవిత్తనమైమొలకెత్తుతున్నాడు!/దేహంలో ఉరకలెత్తుతున్న/ నీళ్ళలో ఆత్మాభిమానానికి అభిషేకం జరుగుతుంది!" (పుటः 21)***. సాధారణంగా నీరు పల్లానికి ప్రవహిస్తుందని అంటారు. అది నిజమే కావచ్చు. కానీ, దాన్ని అలాగే పోనిస్తే నీటినెలా పరిరక్షించుకున్నట్లవుతుంది. దాని మాట ఎలా ఉన్నా, పల్లానికే వెళ్తున్నాయంటూ కోస్తాప్రాంతానికే తరలించుకుపోయేవారనే ఒక వాదన ఉంది. అటువంటి "పల్లాలు" శబ్దం ద్వారా కవి శబ్దవిన్యాస వక్రతతో 'పల్లం' పేరుతో జరిగిన రాజకీయాల్ని చెబుతూనే, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తర్వాత పాలకులు తమ రాష్ట్రానికే వినియోగపడేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకొంటున్నారని వ్యాఖ్యానిస్తున్నాడు. అంతేకాదు, అలాంటి చర్యలు తీసుకోవడం వల్ల కరువుకి తట్టుకోలేక వలసవెళ్లిపోయే ప్రజలు తమ ప్రాంతాల్లోనే ఉండి పనులు చేసుకోగలుగుతున్నారన, అదొక ఆత్మగౌరవంగా భావిస్తున్నారని చిన్న చిన్న పదాలతోనే లోతైన భావాలను అభివ్యక్తీకరించేలా కవిత్వీకరించాడు.

కురిసే ప్రతి చుక్కను పరిరక్షించకోవడం : తుఫాన్లు, వరదలు వచ్చినప్పుడు నీళ్ళు వృధాగా సముద్రంలోకి వెళ్ళిపోతుంటాయి. నిజానికి ఆ నీటిని జాగ్రత్తగా భద్రపరుచుకోగలిగితే నీటి కరువు అనేదే ఉండదు. త్రాగడానికి, ఇంటి వాడకానికి, పొలాలకు, తోటలకు నీటి కొరతే ఉండదు. కానీ, ఆ నీటిని భద్రపరుచుకోవడం అనేది మానవుని తెలివితేటలపైనే ఆధారపడి ఉంటుంది. అందుకే అలా ప్రతి చినుకుని ఒడిసి పట్టుకోవడమనేది ఒక యుద్ధం చేయడం లాంటిదేనంటాడు కవి వనపట్ల సుబ్బయ్య. ***"నదులు ఉప్పొంగి/వాగుల నదుములిరిగి/జలప్రళయాల బీభత్సంతో చేసి/దేశమంతా జలమయమై/లక్షల క్యూసెక్కుల నీళ్ల/బురదపాల్జేసిన రాజకీయ చిత్రాలు/పచ్చి పాలసముద్రం లాంటి చెరువు/పగిలిన కుండయింది/ నీటిబొట్టు లేక బోర్లిచ్చిన బండయ్యింది/...../నది నీటిని మలుపడం/యుద్ధాన్ని గెలువడమే" (గణప సముద్రం నవ్వింది, పుటः 28-30)*** ఒకప్పుడు తెలంగాణ ప్రాంతాన్ని పాలించిన కాకతీయుల కాలంలో ఇలాంటి నీటిని చెరువుల ద్వారా భద్రపరిచే వారని చరిత్ర చెబుతుంది. మరలా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత మాత్రమే ఆ యుద్ధంలో గెలిచి ఆ పెద్ద చెరువుని నిండేలా ప్రతి చినుకునీ మళ్ళించ గలిగి యుద్ధాన్ని తెలుస్తున్నారనే సంతోషాన్ని వ్యక్తంచేస్తాడు కవి.

కోట్ల వెంకటేశ్వర రెడ్డి జల స్వప్న సాకారం కవితలో, ***రాలిన ప్రతి చినుకు /సంతకం చేయాల్సింది/ఈ నేల మీదే!/ ప్రవాహశీలమైన నీటికి/ క్రమశిక్షణ ఉండదు/ నడకలు నేర్పాల్సింది మనమే!/ఏనదీ/ సముద్రంలో కలిసి / రూపరహితమవ్వాలని కోరుకోదు!*** అనడం ద్వారా నీటిని ఎలా వాడుకోవాలో మానవుడే తన తెలివితేటలు ఉపయోగించుకుని జలాల్ని పరిరక్షించుకోవాలని కవి సూచిస్తున్నాడు.

జలాంజలి కవితలో డాక్టర్ రాపోలు సుదర్శన్ నీటితో మాట్లాడుతూ నీటిని ఎవరైనా వృధా చేస్తే ఒక అదృశ్య దేవతలా వచ్చి వాళ్ళని నాశనం చేయమని కూడా చెబుతాడు. ***నిన్ను వృధా చేస్తే /అందని అదృశ్య దేవతవై /వారి బ్రతుకు ఎడారిగా మార్చెయ్/ నీకోసం పన్ను చెల్లింప***

జేస్తే /నిన్నువాణిజ్య వస్తువుగా మారిస్తే /వారి బ్రతుకు నీరు గార్చేయ్! (పుటః 40) అనడం ద్వారా నీటిని వృధాగా పాడు చేసే వారి పట్ల కవి ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నాడు.

ఆధునిక కవిత్వం -ఛందోబద్ద పద్యాల్లో జలసంరక్షణ :

ఆధునికత కాలానుగుణంగా తీసుకున్నప్పుడు, ఛందోబద్దమైన కవిత్వం కూడా పరిశీలించవలసి ఉంటుంది. చాలామంది కవులు ఛందోబద్దమైన పద్యాల్లో జలసంరక్షణ గురించి తమ భావాలను వ్యక్తీకరించారు. మరికొంతమంది పాటల రూపంలో వ్యక్తం చేశారు. ఇప్పుడు పద్యాల్లో వ్యక్తమైన భావాల్ని కొన్నింటిని చూద్దాం.

ఆర్ చెన్నయ్య గారు పద్యాలలో ఇంకుడు గుత్తుల ప్రాధాన్యాన్ని దాని ద్వారా నీటిని సంరక్షించుకునే మార్గాన్ని సూచిస్తున్నారు.

గగన సీమనుండి గంగభువికిరాగ
వనదికిని వదలక వనరుతోడ
నిలుపరేల జనులు నీటిగుంతలతోడ
వినరచెన్నకేశ కనకభూష

ఇంటికొకటి చాలు ఇంకుడుగుంతలు
ఊరుకొకటి చాలు ఊర చెరువు
జిల్లా కొకటి చాలు జలసాగరంబురా
వినరా చెన్నకేశ కనక భూష (జల రక్షణ జనజీవన సంరక్షణ, జల కవిత్వం, పుటః 179)

చుక్కాయపల్లి శ్రీదేవి 'జన వనరుల ఖిల్లా' పేరుతో ఛందోబద్ధమైన కవిత్వంలో గోదావరి నది మహారాష్ట్రలో పుట్టి, కర్ణాటకలో అడుగుపెట్టి, అది తెలంగాణలో ప్రవేశించి అందరికీ నేడు ఎలా ఉపయోగపడుతుందో చక్కని పద్యాల్లో చెప్పారు. ఆ సందర్భంగా నీటిని పొదుపు చేసుకుంటే అంటే జల సంరక్షణ చేస్తే వచ్చే ప్రయోజనాలను అద్భుతమైన పద్యంలో చెప్పారు.

వాన నీరు తుదకు వాటమౌ రీతిగా
బొట్టు బొట్టు నొడిసి పట్టుకొనగా
సంతసం బొసగుచు సంధానకర్తయై
భారమైన బతుకు బరువు దింపె

వాగులున్ వంకలై వరదలై దొరలుచు
నదులు సంద్రమందు నాట్యమాడె
నరుల యుసురు నిల్పునమృతంపు కలశమై
సిరుల పంటలసగి జీవమిడును

పక్షి సంతతులకు ప్రాణాభిక్షను బెట్టి
జంతు జాలములకు జవమునిచ్చు
బావులన్ చెరువులన్ పావనంబై దాగి
తరుల యునికి నిలుపు దైవమగును

చల్లదనము నిచ్చి యల్లసింపగ జేయు
ధరణి యందు దాగి దప్పి దీర్చు
నీటి పొదుపు మేలునింకుడు గుంతలున్
నీటి కన్న ధనమదేటి గలదు? (జల కవితోత్సవం, పుటః 201,202)

గన్నోజు శ్రీనివాసాచారి ఛందోబద్ధ పద్యాలలో నీటి ప్రాధాన్యాన్ని చెప్తూ అటువంటి నీటిని కాపాడుకోవాలని 'జలజీవన సారం' పేరుతో కొన్ని పద్యాలను వర్ణించారు.

నీరులేకజీవి నిల్చునా జగతిలో
కూరలోన తినెడి కూడుకైన
ప్రాణరక్షణంబు పావనచరితంబు
జలము మానవాళి కలల పంట!

జలము కల్గెనేని జవసత్వములు నిండి
మనిషి జీవనమ్ము మహినివెలుగు
నీరు లేని యెడల నినదించు లోకాలు
ప్రాణప్రదము నీరు పరమహితము

తల్లిగర్భమందు ఉమ్మనీరే యుక్తి
మట్టిపొరల యందు మహితశక్తి
నీరులేక జీవి నిల్చనాయెటులైన
జలము చేతనంబు జగతిలోన (జల కవితోత్సవం, పుటః 239)

జల సంరక్షణ చేస్తే కరువులు, కాటకాలనుండి రక్షించబడి ప్రజలు మరలా తమ తమ ప్రాంతాలలోనే పంటలు పండించి ఆనందంగా ఉంటారనేది చక్కని భావన. కురిసే వర్షంతో పాటు పల్లపు ప్రాంతాలకు తరలిపోతున్న నీటిని మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి వివిధ ప్రాజెక్టులు కట్టి అడ్డుకట్ట వేసి ప్రజలకు అందించినటువంటి పథకాల వల్ల గొప్ప మార్పు సాధించిందని కవి వివరిస్తాడు. డాక్టర్ గుడేలి శీనయ్య ఛందోపరమైన పద్యాలలో ఈ భావాలను ఇలా వివరించారు.

పొట్ట కూటికై పట్నము పోయినట్టి
పేద రైతుల కృష్ణమ్మ పిలిచె నిటకు
అండ నుండ కేల గండమనుచు
అభయమిడె కొల్లపురపు ప్రజాళికెల్ల

నీరసించిన భూములు నీటతడిపి
పారె కృష్ణమ్మ పంటకాల్వలను నింపి
హలము చేబూనె రైతన్న హర్షమొంది

కోనసీమగ మారెను కొల్లపురము (చేలు పచ్చచీరగట్టె, పుటః 341)

దార్ల వెంకటేశ్వరరావు తన 'దార్ల మాట శతకం'లో నీటి పొదుపు, జల సంరక్షణ గురించి కొన్ని పద్యాల్లో వర్ణించాడు. ఇంకుడు గుంతల వల్ల వర్షపు నీటిని పరిరక్షించుకొని భూజలాల్ని పెంచేలా దోహదపడవచ్చు. దీన్ని ఈ పద్యంలో ఇలా వర్ణించాడు కవి.

వరదవోలెమనము వదిలెడు జలమును
మంచినీరువోలె మరలమనకె
ఇచ్చునండి మార్చి ఇంకుడుగుంతలే
దారి పూల తోట దార్ల మాట! (దార్ల మాట శతకం, పద్య సంఖ్య: 35)

ఒకప్పుడు దారంటా వచ్చేపోయేవాళ్ళ కోసం చేదబావులను తవ్వించేవారు. అవి బాటసారులకు ఎంతగానో ఉపయోగపడేవి. ఆ విధంగా మానవత్వాన్ని చాటడంతో పాటు, నీళ్ళు అవసరమైనవాళ్ళకి అందించే సౌకర్యాన్ని పొందేలా చేశారు. అలాగే, వర్షం నీళ్ళు వృధాగా పోతుంటే వాటిని జాగ్రత్తగా మనం రకరకాలైన పద్ధతుల్లో పరిరక్షించుకొంటే కోటాను కోట్ల జీవులను ఆ నీళ్ళు ఉపయోగపడతాయంటూ ఈ కింది పద్యాన్ని వర్ణించాడు కవి.

దాహమైనవారు దారంతవెతుకుచు
వెతికి పట్టు బావి వెతలు తీరు
నీటివాలునటులె నిలుబెట్టిపట్టరా
దారి పూల తోట దార్ల మాట! (37)

మనం ఈ వ్యాసంలో నిష్ణాతులైనవారు చెప్పినట్లే పళ్ళు తోముకునేటప్పుడు, గెడ్డం గీసుకొనేటప్పుడు నల్లాలను విప్పేస్తుంటాం. దీన్ని గమనించిన కవి అలా నల్లాలను విప్పేసి ఉంచవద్దు, నీటిని వృధాచేయవద్దని ప్రబోధిస్తూ ఈ పద్యాల్ని వర్ణించాడు కవి.

విప్పియుంచకండి విచ్చలవిడిగాను
పళ్ళతోమునపుడు పట్టనట్టు
ఎల్లవేళలందు నల్లాను బిగియించు
దారి పూల తోట దార్ల మాట! (38)

గెడ్డమెపుడుగీయు నడ్డదిడ్డంబుగా
వ్యర్థముగను నీళ్ళు వదులచుండ్రు
కొద్ది నీళ్ళె కోట్ల గొంతు తడిపె చూడు
దారి పూల తోట దార్ల మాట! (39)

నీటిని పొదుపు చేసుకోకపోతే, అందుబాటులో ఉన్న జలాన్ని సంరక్షించుకోకపోతే మనిషికి మాత్రమే కాదు, ఈ ఈ ప్రకృతికి అది ఒక శాపంగా మారుతుందని, నీటి వృధా అరి కట్టడం ద్వారా భవిష్యత్తును నిర్మించుకోవచ్చు నని ఈ కవులు తమకవితల ద్వారా వివరిస్తున్నారు. ఆధునిక కవిత్వంలో పద్యకవిత్వం కూడా ఒక భాగమే. ఇలా చాలామంది పద్యాల్లోకూడా సమకాలీన విషయాల్ని వర్ణిస్తున్నారు. జల సంరక్షణ చేయండి అంటే కవి నినాదాలుగా చెప్పడు. జల సంరక్షణ చేయడం వలన వచ్చే ఫలితం ఏమిటో జీవితంతో ముడిపెట్టి చెప్తాడు. ఈ కవులు కూడా తమ భావాల్ని వచన కవిత్వంలో, పద్యకవిత్వంలో, పాటల రూపంలో చెప్పారు. వీరందరి భావన ఒకటే. కురిసే ప్రతి చినుకుని జాగ్రత్తగా పరిరక్షించుకొంటే అది మనల్ని కాపాడుతుంది. అలాగే జలాల్ని వృధాచేయకుండా తగిన చర్యల్ని ప్రతి ఒక్కరూ చేయాలి. దీనితో పాటు పాలకుల విధి విధానాలు కూడా జల సంరక్షణలో ప్రధానభూమికను పోషిస్తాయని, దీనికి నిదర్శనంగా తెలంగాణ రాష్ట్రంలో ఒకప్పుడు వలసలు, కరువులు ఉంటే నేడు అవి చాలావరకు తగ్గిపోయాయిని, దీనికి కారణం పాలకులు మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ వంటి ప్రాజెక్టులు అని చెప్పారు. దీనితో పాటు చెరువులు నిండడం,బావులు నిండడం అనేది ఒక పథకం ప్రకారం చేసిన పనుల ఫలితంగా వివరించారు. జలాల్ని కాపాడు కుంటే వచ్చే ఆనందమేమిటో తెలియాలంటే ముఖ్యంగా తెలంగాణ ప్రాంత కవుల కవిత్వాన్ని చూస్తే అర్థమవు తుంది. జలసంరక్షణ గురించి కవితల్ని సేకరిస్తుంటే వందలాది కవితలు కనిపిస్తున్నాయి. వాటన్నింటినీ ఈ పత్రంలో చెప్పలేకపోవచ్చు. కానీ, ఆ కవితలు, పాటలు కూడా జల సంరక్షణ ఆవశ్యకతను ఎంతో హృద్యంగా, సందేశాత్మకంగా తెలియజేశాయని మాత్రం చెప్పక తప్పదు.

ఆచార్య దార్ల వెంకటేశ్వర రావు
తెలుగు శాఖ అధ్యక్షులు, మానవీయ శాస్త్రాల విభాగం,
యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, హైదరాబాద్
ఫోన్ : 9182685231

రాజాం పట్టణ భౌగోళిక చరిత్ర

– గార రంగనాథం

మట్టిపొరల్లో కూరుకుపోయి రూపుమాసిపోయిన నాణేన్నితీసి, కడిగి, శుభ్రంచేసి, దానికి పట్టిన తుప్పును తొలగించి పూర్వపు మెరుపును తీసుకొచ్చినట్టు చరిత్రకారుడు చరిత్రను బైటకు వెలార్చాలి. ఆ వెలుగులో ఆనాణెం ఏకాలానిది? ఏ లోహంతో తయారయింది? ఏ పాలకులు ముద్రించారు? అనే ప్రశ్నలకు సమాధానాలు రాబట్టాలి. ఆనాణెం ఆధారంగా ఆ కాలంనాటి సంస్కృతిని, చరిత్రను బైటపెట్టాలి. చరిత్రకు సంబంధించిన శిలా విగ్రహాలు, శాసనాలు, తాళపత్ర గ్రంథాలు, కైఫీయతులు, గ్రంథాలు, ప్రజలు చెప్పుకొనే కథలు ఇలా ఏ ఒక్కదానినీ వదలకూడదు. ఆవిధంగా కనిపిస్తున్న రాజాంచరిత్రలోని ఒక ముక్కను ఇక్కడ ప్రదర్శిస్తాను.

పూర్వం ఈ కళింగం నిండా మూలవాసులైన ఆదివాసీలు, దళితుల (అందునా మాలసామాజిక వర్గం)తో నిండిఉండేదని చరిత్ర చెబుతోంది. ఈప్రాంతానికి వచ్చి స్థిరులైన గాంగరాజులు ముఖలింగంలోని నవర రాజులను కొండలపైకి తరిమి ఆరాజ్యాన్ని ఆక్రమించు కొన్నారనేది చరిత్ర. నవరరాజధాని యైన ముఖలింగం అనంతర కాలంలో గాంగుల రాజధాని అయింది. మరికొన్నాళ్ళకు మాధ్వమతస్తుడైన నరహరితీర్థుల కాలంలో మరొకసారి ఆదివాసీలను కొండలమీదికి తరిమిన చరిత్ర ఉంది. కపిలేశ్వరగజపతి కాలంలో కూడ వారిని గిరులపైకి తరిమి పార్వతీపురం, గజపతినగరం వంటి పట్టణాలను నిర్మించినట్టు రాతలు ఉన్నాయి. ఈ విధంగా గిరులపైకి తరమబడ్డ ఆదివాసీలే గిరిజనులయ్యారు. అలా తరుమగా మిగిలిన ఈ రాజాం సమీపంలోని ఆదివాసీలే సారథిగెడ్డ ఒడ్డున గల తిమ్మయ్యపేట, మారేడుబాకగెడ్డ ఒడ్డున గదబపేట, ఓ మారుమూలనున్న గోపాలపురంలకు చేరి నేటికీ బతుకుతున్నారు. రాజాం మండలంతో పాటు ఇతర మైదాన మండలాల్లో ఈ గదబపేటల్ని మండలానికి రెండు మూడింటిని నేటికీ చూడవచ్చు.

రాజాం పట్టణము

శాతవాహనులకు ముందర ఇక్కడిదళితులు బౌద్ధం, జైనం స్వీకరించడం వలనగాని, మరేకారణాలవలన గానీ మైదానపు అడవుల్లో ఉండిపోగలిగారు. అపుడంతా ఈప్రాంతం చిట్టడవులతో నిండిఉండేది. అలాఉండిపోయిన వారు బొబ్బిలిరాజులు రాకముందు ఈ రాజాంకు మూలవాసులయ్యారు. గొఱ్ఱెలను మేపడమే వృత్తిగా గల గొల్లలు మరికొన్నాళ్ళకు ఈ ప్రాంతానికి చేరి, స్థిరనివాసం ఏర్పరచుకొని ఉంటారు. అందుచేతనే రాజాంలో దళితుల వీథిని అనుసరించే గొల్లవీథి ఉంది. ఈ రెండువీథులే రాజులు రాకముందే చిన్న గ్రామంగా ఉండి ఉంటుంది.

పద్మనాయకులు ఈ ప్రాంతానికి 1655లో వచ్చారు. తొలుత లింగాల వలనను నిర్మించుకొని నివసిస్తూ, కొద్ది సంవత్సరాలలో ఈ రెండువీథులకు తూర్పున కోట కట్టుకున్నారు. ఈకోట కాల్చిన ఇటుకలతో కట్టిన వెడల్పైన ప్రహరీ కలిగి ఉండేది. దానిమధ్య పెంకుటింటి పెడకగల పెద్ద దర్బార్‌హాలు, ఇతర ఖాళీస్థలాల్లో రాణివాసం ఇళ్ళు ఉండేవి. క్రీ.శ 1700 ప్రాంతంలో రాజాం నుండి బొబ్బిలి చేరిపోయిన రాజులు రాజాంకోటలోని దర్బార్‌హాలును 1865లో జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఫస్ట్‌క్లాస్‌కోర్టు ఏర్పాటుకు ప్రభుత్వానికి అందజేశారు. అనంతరం 1984లో ఇందులోనే సబ్‌కోర్టును ప్రభుత్వం నెలకొల్పింది. కోర్టుకార్యక్రమాల నిర్వహణ జరిగినన్నాళ్ళూ ఆ దర్బార్‌హాల్‌లో దసరారోజున కోర్టుబంట్రోతులు కోటదుర్గను పూజించేవారు. దసరానాడు పూజచేయకపోతే కోటదుర్గ అక్కడి న్యాయస్థానం

ఉద్యోగులకు కీడు తలపెడు తుందని నమ్మేవారు. కొత్తభవనంలోకి కోర్టు మారిన తరువాత కోట దుర్గపూజ మానేశారు. 1980వరకూ ఈకోటకు ఉత్తరప్రవేశం వద్ద రెండు పాడుపడిన ఫిరంగులు త్రోవకు చెరొకవైపున ఉండేవి. వాటిని వదులుగా అనుసంధానం చేస్తూ, ఇనపగొలుసులు ఉండేవి. కోర్టు లోపలికి వెళ్ళాలంటే వాటిని దాటి వెళ్ళవలసివచ్చేది. ఈకోటలో కోర్టుభవనాలు పనిచేస్తుండగానే ఆ ఉత్తర ద్వారానికి లోపల ఇటూ అటూ నబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, వశువుల ఆస్పత్రి, వ్యవసాయశాఖ కార్యాలయం, టెలిఫోన్ కార్యాలయం, పంచాయతీ కార్యాలయం, పంచాయతీ గ్రంథాలయం లను ఏర్పరిచారు. పంచాయతి లైబ్రరీని హొటలు నిర్వహణకు ప్రైవేట్ వ్యక్తులకు అద్దెకిచ్చారు. రిజిస్ట్రార్ కార్యాలయం వెనుక విద్యుత్ కార్యాలయం నిర్మించారు. ఈ కోట ప్రహరీకి పడమటి ప్రక్క బజారువైపు చిన్నగేట్ ఉండగా, దక్షిణ ప్రక్క ఎలిమెంటరీ పాఠశాల (బజారు బడి), రామాలయం, దక్షిణ, వడమర దిశల్లో మరికొన్నాళ్ళకు ఇతర వాణిజ్య దుకాణాలు ఏర్పడ్డాయి. బహుశా ఈ ఎలిమెంటరీ పాఠశాల కోటను ఆనుకొని ఉంది గనుక అప్పట్లో రాజుల కచేరీగా ఉండేదని ఊహించ వచ్చు. ఉత్తరద్వారం ముందునుండే శ్రీకాకుళం– బొబ్బిలి గోర్జిమార్గం మూడువందల ఏండ్ల క్రితానికి ఉండడమో, లేక తరువాత ఏర్పడడమో జరిగి ఉంటుంది. విజయనగరం నుండి, అప్పటికే జాతాపుల రాజధానియైన పాలకొండ వరకు కూడ ఈ ఉత్తరద్వారం ముందునుండే త్రోవ ఉండి ఉంటుంది. 5వజార్జి పట్టాభిషేకం సందర్భంగా బ్రిటిషు రాజు నుండి, ఆయాజమీలలో ప్రజోపయోగ సంస్థల్ని ఏర్పాటు చేయమని ఇండియాలోని అందరు జమీందారులకూ తాఖీదులు అందాయి. వాటికి అనుగుణంగా రావువారు తమరాజధాని బొబ్బిలిలో చాలా నిర్మాణాలు చేశారు. ఆ తాఖీదుల మేరకు రాజాంలో కూడ ఈకోట ఉత్తర ద్వారానికి ఎదురుగా జార్జికారో నేషన్‌క్లబ్ 1912లో ప్రారంభించారు. నాటి ప్రారంభ శిలాఫలకాలు రెండు నేటికీ క్లబ్ లోపల గోడకు అతికించి ఉన్నాయి. దాని వెనుక పంచాయతి పార్క్ ఉండేది. 50 ఏళ్ళ క్రిందట అది బస్టాండ్ అయింది. వాయవ్య దిశలో ఆర్&బి కార్యాలయం నిర్మించారు. ఇప్పటికీ ఖాళీస్థలాలు, చెఱువు గట్ల మీద ప్రభుత్వ సంస్థల్ని ఏర్పాటు చేస్తూనే ఉన్నారు.

ఈ కోటకు తూర్పున ఏనుగుల, గుఱ్ఱాల శాల ఉండేది. దానినే జార్జి కారోనేషన్ సందర్భంగా ఆస్పత్రిగా మార్చారు. అదే సందర్భంగా దానికి తూర్పున ఉన్నత పాఠశాల భవనం నిర్మించారు. పాఠశాలకు తూర్పున బొబ్బిలి రాజులు సత్రవు కట్టించారు. తరువాతి రోజుల్లో దానిని శ్రీనివాసా టాకీసుగా మార్చడానికి పునాదులు తవ్వుతుంటే గంజాయిగొట్టాలు బయటపడ్డాయని చెలికాని గోపాలరావు 40 ఏళ్ళక్రిందట చెప్పారు. మొత్తంమీద కోటనుండి ఉన్నతపాఠశాల వరకూఉండే కాంప్లెక్స్‌కు నాల్గువైపులా రహదారి ఇప్పటికీ ఉంది. ఈ పట్టణంలో జి.సి.క్లబ్, ఆస్పత్రి, రెండు ఎలిమెంటరీ పాఠశాలలు, పోలీస్ స్టేషన్, ఉన్నత పాఠశాల పాత భవనం అన్నీ క్రీ.శ1900 తరువాత కట్టబడి, ఒకే బ్రిటిషు నిర్మాణ శైలిలో ఉండేవి. దీర్ఘచతురస్రాకారపు గోడలకు పెంకుటి పెడకలు ఉండేవి. ఆ పైన గోడల్ని ఇంకా పెంచి, వాటి వెన్నుపై ఒక పెంకుటి పెడక ఉండడం వీటి ప్రత్యేకత. అంతే కాకుండా భవనానికి మధ్య పెద్దహాలు, పెరటిలోకి ద్వారాలు పెట్టేవారు. ఇరు వైపులా వరండాలనానించి నాల్గుగదులు, వాటికి కిటికీలు, క్రింది పెడకలకు పైన గోడలకు వెంటిలేషన్ సదుపాయం ఏర్పాటు చేసేవారు. చిన్నచిన్న తేడాలతో అన్ని భవనాలూ ఇలాగే నిర్మించారు. రాజాంలో అప్పటి భవనాలన్నిటి స్థానంలో కొత్తభవనాలు వెలశాయి. కాని ఇతరపట్టణాలలో ఎక్కడైనా ఇంకా అలాంటి వాటిని చూడవచ్చు.

ఇంకొక విశేషం. కోటలో నుండి దక్షిణగా చిన్న చెఱువులోకి సొరంగమార్గం ఉండేదని, మాధవ బజార్‌లో నిర్మాణాలకు పునాదులు తవ్వితే, ఆసొరంగం కనిపించేదని వ్యాపారస్తులు చెప్పగా విన్నాను. ఆ చెఱువు ఉత్తర గట్టును ఆనుకొని ఒక సొరంగం లాంటి రాతినిర్మాణం నిన్నమొన్నటి వరకూ ఉండేది. దానిగుండా కోటలోని రాణివాసం స్త్రీలు చెఱువులోకి వచ్చి స్నానంచేసేవారని చెప్పుకుంటారు. ఇది లోతైన కోనేరు. ఆ చెఱువుక దక్షిణగట్టు ఆగ్నేయమూలన ఒక ఇనప స్తంభం ఉండేది. విజయనగరం నుండి శత్రు సంచారాన్ని పసికట్టడానికి అదొక దీపస్థంభం అని, అక్కడ కొందరు భటులు కావలా ఉండేవారని అంచనా వేయవచ్చు. ఈ ఇనప ఆనవాళ్ళన్నిటినీ ఆర్థిక నేరగాళ్ళు దఫదఫాలుగా దొంగిలించి ఉంటారు.

పట్టణ వీధుల ఏర్పాటును పరిశీలిద్దాం. ఈ ఊరిలో నేటికీ పద్మనాయక వెలమలలో చెలికాని వారే అధికం. వారు ఠాణావీధిలో ఉంటారు. ఈ వీధిలోనే అప్పటి ఠాణా కార్యాలయం ఉంది. నిన్నమొన్నటి వరకూ తహసీల్దార్ కార్యాలయం అందులోనే ఉండేది. దానికి లావుపాటి ఇనప

కటకటాలతో రికార్డుల గది ఉంది. బహుశా నేరస్తుల్ని బంధించి ఉంచడానికి దానిని కట్టి ఉంటారని చెప్పవచ్చు. రాజుల కాలంలో రక్షణ, న్యాయం, శిక్ష అన్నీ వారి చేతుల్లోనే ఉండేవికదా! ఠాణా వెనుకే వందేళ్ళ క్రిందటి వరకూ సైనికుల ఇళ్ళు ఉండేవని చెబుతారు.

ఈ పద్మనాయకులు విశిష్టాద్వైతులు. అందుచేత వారి ఇళ్ళకు తూర్పున రాజగోపాలస్వామి(ఆండాళ్) ఆలయం ఉంది. ఆ ఆలయానికి ఆనించి తూర్పున వైష్ణవులకు విశాలమైన భవనం ఉంది. రాజుల కాలంలో ఆ భవన యజమానులు ఆ కోవెలకు అర్చకులై ఉంటారు. ఈ ఊరిలో బ్రాహ్మణ వైష్ణవుల ఇల్లు ఇదొకటే! ఆ ఇంటికి తూర్పు రోడ్డును ఆనించి అగ్రహారం వీధి, రామ లింగేశ్వరాలయం ఉన్నాయి. బ్రాహ్మణులు స్మార్తులు. అందుకే అక్కడ శివుడు. అక్కడి దేవుడు స్ఫటికలింగం. దీనిని తాండ్రపాపారాయుడు అనునిత్యం పూజించేవాడని చెప్పుకుంటారు. ఈ కారణం వలన కూడ ఈ తాండ్ర పద్మనాయకుడు కాదు. తెలగతాండ్ర అని చెబుతుంటారు. విశేషం ఏమంటే తాండ్ర వారు వెలమలలోన, తెలగాల లోన కూడ ఉన్నారు. వెలమదొరలు గొప్ప వైష్ణవ భక్తు లయినప్పటికి, మతసహనం కలిగిన వారనడానికి ఈ రెండు ఆలయాలతో పాటు, డోలపేటలో ఒకే ప్రహరీలో కట్టిన శైవ వైష్ణవాలయాలే నిదర్శనం.

ఈ అగ్రహారం వీధికి ఉత్తరానికి ఆనుకొని కూరాకుల వీధి ఉంది. అప్పటి ఠాణా కార్యాలయానికి ఆగ్నేయంగా సాయిబుల వీధి ఉంది. వీరు దూదేకులవారు కాగా, ఈవీధి చిన్నది. ఆండాళ్ కోవెలకు పడమటి గోడను అనుసరించి చిక్కాల వీధి. చిక్కాల ఇంటిపేరుగా గలవారు ఉన్నవీధి చిక్కాలవీధి. దానికి పడమరన బుక్కావీధి ఉంది. ఆండాల్ కోవెలకు ఈశాన్యాన ఉత్తర ద్వారాన్ని అనుసరించే నెయ్యిలవీధి (జాలరివీధి) ఏర్పడి ఉంది. ఈ జాలారులలో విష్ణుపాత్రునివారు ఉన్నారు. ఈ కోవెల నిర్మాణ సందర్భంలో వారి నివాసాలకు కొంత ఇబ్బంది రాగా, వారు దానిని భరించి నందున, 'మీరు విష్ణువు దయకు పాత్రలవుతారని' అప్పటి వైష్ణవజియ్యరులు అని ఉంటారు. లేదంటే ఈ ఉత్తర ద్వారానికి, వారి నివాసాలకు, వారి ఇంటిపేరుకు మరోలా సంబంధాన్ని చెప్పలేం! ఇంతవరకూ చెప్పిన కోవెలలు, వీధులు అన్నీకూడ కోటకు దక్షిణాన రాజుల కాలంలో ఏర్పడినవే.

ఇక పడమర దిక్కు ఒకటే ఉంది. ఈ దిక్కున కుమ్మరి, తెలుకలి, సెగిడి వీధులున్నాయి. సెగిడివీధినే ప్రస్తుతం గాంధీ బొమ్మపెట్టి గాంధీవీధి అంటున్నారు. వీటికి ఉత్తరాన కొరగంజివీధి, మంగలివీధి ఉన్నాయి. ఈ విజయనగరం, బొబ్బిలి రాజులు గోల్కొండ నవాబుకు చెందిన షేర్‌మహమ్మద్‌ఖాన్ సర్దారులుగా ఈ ప్రాంతానికి వచ్చి రాజ్యాలు స్థాపించారు కదా! అలా వారివెంట తెలంగాణా నుండి వచ్చినవారే మాదిగలు. వీరికి తెలంగాణలో ప్రాబల్యం ఎక్కువ. అదే మాదిగవీధి అయింది. ఎఱ్ఱచెఱువుకు పడమరన కల్లుగీత ప్రధాన వృత్తిగా కలిగిన యాతవీధి ఉంది. నాలుగైదు ఇళ్లవారు వందేళ్ళనాడు సాలూరు నుండి ఇక్కడకు వచ్చారు. స్థలాలు కొనుక్కొని స్థిరనివాసం ఏర్పాటు చేసుకున్నారు. ఆగ్నేయంగా బొబ్బిలి రహదారికి ఉత్తరాన చాకలి వీధి ఉంది. దాని వెనక ఒక చెఱువు. చాకళ్ళు బట్టలు ఉతకడానికి వీలుగా చాకిరేవులు కలిగి ఉండేది. ఈ చెఱువు కాలుష్యంతో నిండి, రేవులపని లేకుండా పోయింది. కోటలోని వారి అవసరాలు తీర్చడానికి, అప్పటి వివిధ వృత్తులవారు కోటబైట వీధుల్లో ఉండేవారు. అప్పటి ఆనవాళ్ళు రాజాంలో నేటికీఉన్నాయి. రాజుఉండే ఊరు రాజాం.

ఒకప్పుడు ఈ వీధులు కొంచెం దగ్గర దగ్గరగా ఉండేవనుకుంటాను. 1794లో పద్మనాభయుద్ధం జరిగి విజయనగర రాజులు నిర్వీర్యులయి, ఉత్తరాంధ్ర బ్రిటిషు వారి హస్తగత మయింది. అనుకోకుండా అటు నిజాం ప్రభువు చలవ, ఇటు బ్రిటిషువారి ఆదరణ వలన, ఆ సంవత్సరమే బొబ్బిలి రావు వారికి తిరిగి బొబ్బిలి సంస్థానం దక్కింది. బ్రిటిషువారి బలం అంతా మందు గుండులోనే ఉందికదా! కలకత్తాలో చేనేత వృత్తి కలిగిన దేవాంగులు బ్రిటిషువారివద్ద ఉంటూ, అదనపు విద్యగా మందుగుండు కట్టడం నేర్చుకున్నారు. ఇండియాలో బ్రిటిషు వారి తొలి రాజధాని కలకత్తాయే కదా! వీరు ఏయే ప్రాంతాలను వశపరచుకొన్నా ఆయాప్రాంతాలలో తమ సైనికావసరాలకోసం ఈ దేవాంగులను తీసుకుపోయి ఉంచేవారు. ఆవిధంగా రాజాంతో పాటు, ఈ ప్రాంతంలో చాలా గ్రామాలలో దేవాంగులు స్థిరనివాసులయ్యారు. వీరిది ప్రధానవృత్తి చేనేత కనుక సరులు చెయ్యడం కోసం విశాలమైన వీధుల్ని ఏర్పరచవలసి వచ్చింది. అలా ఏర్పాటు అయినవే పాత రాజాంలో దేవాంగుల వీధులు. కస్పావీధి, కాలెవుపువీధి, కొండకవీధి, కాకర్లవీధి, పుత్సలవీధి, ఆశపువీధి ఇలా. ఇన్ని వీధుల్లో వెలసిన వీరు తరువాతి కాలంలో మెజారిటీ వారయ్యారు.

రాజాంలో ఒక దృశ్యం

దేవాంగులు వచ్చిన క్రీ.శ 1800 ప్రాంతానికి తెలగాలు, వెలమదొరలు తదితరులు సైన్యంలో భాగస్వాములై, యుద్ధాలలో పాలొంటున్నా నమ్మకంగా కోటను కాపలా కాసేవారు కాపులే! అందుకే వారు కాపులయ్యారు. వీరు బుక్కావీధి, కస్పావీధి ప్రాంతాలలో ఉండేవారు. ఇక్కడి రాజులు బొబ్బిలి తరలిపోవడం, బ్రిటిషు వారు వచ్చిన తరువాత కోట రక్షణబాధ్యత అవసరం లేకపోవడంతో ఇక్కడి కాపులను గెడ్డ ఆవలివైపున గల దిబ్బమీదకు వెళ్ళమని రాజులు ఆదేశించారు. అదే నేడు సారథిగా పిలువబడుతోంది. వారు ఖాళీచేసిన స్థలాలలో కస్పావీధి, బుక్కావీధి, చిక్కాలవీధిని ఏర్పాటు చేశారు. ఈ దేవాంగుల, కాపుల విషయాలను నాకు 40 ఏళ్ళ క్రిందట అప్పటి సారథిగ్రామ సర్పంచ్ వంజరాపు అప్పలనాయుడు చెప్పారు. దేవాంగులకు గుత్తు, తూట, పిచ్చికవంటి కొన్ని ఇంటిపేర్లు వీరికి ఈ మందుగుండు సంబంధంతోనే వచ్చాయని చెప్పవచ్చు. వీరికోసం వీధులు ఏర్పచినప్పుడు పాతవీధుల్ని ఇంకొకచోటికి తరలించడమో, లేక కొంచం అటుఇటు నరిచేయడమో జరిగింది. అందుచేత ఇంతకు ముందు చెప్పిన పూర్వవృత్తులవారి వీధులు చిన్నవై, మూలలకు చేరాయని చెప్పవచ్చు.

మరికొన్ని వీధులు : రాజాంలో సంత ఏర్పడిన తరువాత మేదర్లు వెదురు వస్తువులు తయారుచేసి ఆసంతలో అమ్ముకోవడం ప్రారంభించి ఉంటారు. అలా వచ్చినవారు చినచెఱువు గట్టుమీద గుడిసెలు వేసుకొని స్థిరనివాసం ఏర్పాటు చేసుకొని ఉంటారు. ఆ ఇళ్ళు ఇప్పుడు పక్కా ఇళ్ళుగా మారాయి. పరిసరగ్రామాల నుండి తరువాతి రోజుల్లో ఆర్యవైశ్యులు ఈ రాజాం చేరుకున్నారు. ఇటీవల కళింగ వైశ్యులు కూడ గ్రామాలను వదలి రాజాం వంటి పట్టణాలకు చేరిపోతున్నారు. ఈరాజాంలో బ్రాహ్మణుల్ని మూడుచోట్ల చూడగలం. అగ్రహారంవీధి, మెయిన్‌రోడ్డు, పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా లోగిలి. రామలింగేశ్వర ఆలయ నిర్మాణంతోపాటు అగ్రహారం వీధి ఏర్పడిందని ఇంతకు ముందరే చెప్పుకున్నాం. అలాగే కాకర్లవీధికి తూర్పు అంచున ప్రాచీనమైన శివాలయం ఉంది. దానిని నిర్మించినపుడే అర్చనాది విధులకోసం, ఆ సమీపంలో రాజవంశీయులు ఒకలోగిలి ఏర్పాటుచేసి, బ్రాహ్మణులకు ఇచ్చి ఉంటారు. అగ్రహారంవీధి బ్రాహ్మణులు ఎక్కడెక్కడికో తరలిపోగా, ఈ లోగిలిలోని వారు మాత్రం ఇంకా ఉన్నారు. కోటలో కోర్టు ఏర్పడిన సందర్భంలో బొబ్బిలి నుండి బ్రాహ్మణ లాయర్లువచ్చి మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా భవంతులు నిర్మించుకున్నారు. మెయిన్‌రోడ్డు ప్రాంతంలో భూస్వాములైన తెలగాలు ఉన్నారు. శ్రీనివాసా హాలునుండి అగ్రహారంవీధి చివరి వరకూ మరికొంత మంది మధ్యతరగతి తెలగాలను చూడవచ్చు. 1900 తరువాత పొట్టా సత్యనారాయణగుప్త అనేవ్యాపారి పర్లాకిమిడి నుండి పారిశుధ్య కార్మికులను తెచ్చి వారి పెట్రోల్‌బంక్ ప్రక్కన ఇళ్ళు కట్టుకోమని ఇచ్చినట్టు విన్నాను. అప్పుడన్నీ కచ్చా పాయఖానాలు కాగా, వారుండే వీధి గాసీవీధిగా ఏర్పడింది. ఈ విధంగా 1980 ప్రాంతానికి రాజాంకు వాయవ్యాన బొబ్బిలి రోడ్డులో ఆర్.సి.ఎమ్ పాఠశాల, చర్చి, పోలిపల్లి పైడితల్లి అమ్మవారి గుడి, సమితి ఆఫీస్, దానికి దక్షిణాన ఆర్ & బి బంగ్లా, చివరన ఎఫ్.సి.ఐ గోడౌన్స్, మార్కెట్ యార్డు ఉండేవి. పడమర సరిహద్దులుగా చీపురుపల్లి రోడ్డు, ఎర్రచెఱువు, ఎర్రచెఱువుకు నైరుతిన యాతవీధి, దక్షిణ సరిహద్దుగా ఆశపువీధి, ఠాణావీధి, చిన్నచెఱువు, సంత, కాకర్ల వీధి, తూర్పుహద్దు పెట్రోల్ బంక్, దానికి తూర్పున డా. కృష్ణం రాజు ఇల్లు, ఎదురుగా ప్రసుత్తం ఉన్న గ్రామీణ బ్యాంక్ ఉండే నరసింహమూర్తి మేడ ఉండేవి. అక్కడినుండి దక్షిణానకు వెళ్తే శ్రీనివాసా టాకీస్, కూరాకుల, అగ్రహారం వీధులు, ఆగ్నేయాన రామలింగేశ్వర ఆలయం ఉండేవి. చీపురుపల్లి, బొబ్బిలి, పాలకొండ, శ్రీకాకుళంరోడ్లను ఆనించి చాలాదూరం వరకూ ఆయిల్ మిల్లులు, ధాన్యం మిల్లులు విసిరి పారేసినట్టు ఉండేవి. ఇది రాజాం పట్టణ ప్రాచీన భౌగోళిక స్వరూపం.

ఈ జమీందారులు రాజాం పట్టణానికి ఉత్తరాన గల కొత్తవలస, మెంతిపేట, కొండంపేటలలో చెఱువులు నిర్మించడమే కాకుండా రాజాంను ఆనించి కూడ తూర్పున తప్ప మూడు దిశలలోనూ చెఱువులను నిర్మించారు. దక్షిణాన చిన్న చెఱువు, దానినే ప్రస్తుతం మేదరవీధి చెఱువు అంటున్నాం. దాని దక్షిణగట్టును ఆనించి రంగప్ప చెఱువు నిర్మించారు. రాజురంగారావు పేరన కావచ్చు. పడమరన ఎఱ్ఱచెఱువు, వాయవ్యాన చాకలివీధి చెఱువు నిర్మించారు. ఉత్తరాన మెయిన్‌రోడ్డును అనుసరించి గుఱ్ఱప్పచెఱువు,

అప్పటి గుఱ్ఱాలశాలకు ఎదురుగా ఉందది. గుఱ్ఱాలు నీరు తాగడానికి దానిని కట్టారని చెబుతారు. దాని ఉత్తరగట్టును ఆనించి డోలపేట వరకు మల్లమ్మచెఱువును నిర్మించారు. అగ్రహారం వీధి కోవెలను అనుసరించి ఒక కోనేరు ఉంది. కోవెలకు వచ్చిన భక్తుల స్నానాలకోసం అయి ఉంటుంది. రంగప్పచెఱువుకు అడ్డుగా గట్టు కట్టి రాణుల జలవిహారం కోసం చిన్న చెఱువును, మల్లమ్మ చెఱువుకు అడ్డుగా గట్టు కట్టి, గుఱ్ఱాలు నీరుత్రాగడం కోసం గుఱ్ఱప్ప చెఱువును ఏర్పాటు చేశారని భావించవచ్చు.

గొలుసుకట్టు చెఱువులు: బొబ్బిలి రాజులు రాజాంలో కాలిడిన తరువాత అంచలంచెలుగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారు. అందులో నీటి పారుదల వ్యవస్థ ఒకటి. విజయనగరం జిల్లా మెరక ముడిదాం మండలం, సాతాంవలస కొండల్లో పుట్టిన ఒకవాగు రాజాం, సంతకవిటి మండలాల్లో ప్రవహించి లైదాంగెడ్డలోకి చేరి నాగావళి నదిలో విలీనమౌతుంది. దీనినే ఆయాగ్రామాలను బట్టి గెడ్డవలసగెడ్డ, సారది గెడ్డ, మండాకురిటి గెడ్డ అని పిలుస్తారు. పూర్వం నాగరికత నదీతీరాల్లోనే వెల్లివిరిసిందని చెప్పడానికి ఈ గెడ్డకు ఉత్తరాన రాజాంను నిర్మించడం కూడ ఓచిన్న ఉదాహరణ. గెడ్డనీటికి అడ్డుగా చెఱువులను, ఆనకట్టలను నిర్మించి, ఆనీటిని సాగు, త్రాగు అవసరాలకు వాడుకోవడం నాగరిక లక్షణాల్లో ఒకటి. ఈవిధానం సాధారణం అనుకుంటే, ఈ బొబ్బిలి రాజులు ఆనాడే ఈ గెడ్డకు అడ్డంగా ఒక చెఱువును నిర్మించి, అది నిండగా దాని పైభాగంలో ఒకకాలువను తవ్వి ఆ నీరు మరొక చెఱువుకు వెళ్ళేటట్టు ఇలా ఒకదాని నుండి మరొకటి వంతున చెఱువులను కట్టారు. వీటినే గొలుసుకట్టు చెఱువులంటారు. గెడ్డవలస నుండి గెడ్డద్వారా వస్తున్న నీటికి అడ్డుగా బొబ్బిలి రాజులు మల్లమ్మ చెఱువును తవ్వారు. అది వంద ఎకరాలకు సాగునీటిని అందిస్తుంది. దానిపై మెరక నుండి ఒకపాయ పెంటవాని చెఱువు, వీర్రాజు చెఱువు, కొత్త చెఱువులు నింపుకొని గోపాలపురం చెఱువుకు చేరుతుంది. అక్కడ నుండి కిష్టమ్మ చెఱువుకు చేరి, మెంటిపేట చెఱువుకు, అప్పనపాత్రుని చెఱువుకు చేరుతుంది. మరొక గొలుసుకట్టు. పైన చెప్పిన మారేడు బాకవద్ద గల మల్లమ్మ చెఱువు నుండి బైటపడిన నీరు కొత్తవలస బుడ్డెపువారి చెఱువు నింపుతుంది. అక్కడినుండి మెంటిపేట చెఱువు, అప్పన పాత్రుని చెఱువులో కలుస్తుంది.ఇంతవరకూ చెప్పిన రెండు రకాల గొలుసుకట్టు చెఱువులు రాజాంకు ఎగువభాగాన, వడమరన నిర్మించినవి.

ఇలా రెండు దారుల ద్వారా నిండిన అప్పనపాత్రుని చెఱువు నీరు, అప్పటి రాజాంకు పడమర హద్దున గల ఎఱ్ఱ చెఱువుకు చేరి, తరవాత చాకలివీధి వెనుక గల అప్పదు చెఱువును నింపుతుంది. అది నిండి రాజాంకు ఉత్తరానగల మల్లమ్మ చెఱువుకు, దానినుండి చెక్‌పోష్టు ప్రక్క నుండి పొనుగుటి వలసకు చెందిన తమ్మినాయుడు చెఱువు, తెంటువాని చెఱువును నింపుకొని తిరిగి సారది గెడ్డలో కలుస్తుంది. ఈ చెఱువులు రాజాంకు పడమర నుండి ఉత్తర, తూర్పు దిశలకు వ్యాపించి పట్టణం చుట్టూ నీరుపారేటట్టు రాజులు ఏర్పాటు చేశారు. మల్లమ్మ చెఱువులు మారేడు బాకలోను, రాజాంలోను ఉండగా, బొబ్బిలియుద్ధంలో ఆత్మాహుతి చేసుకున్న రాణిమల్లమ్మదేవి పేరున నిర్మించిన చెఱువులే ఇవి. ఇక రాజాంకు దక్షిణానపారే ప్రధానమైనగెడ్డ కొత్తవలస బుడ్డెపువారిచెఱువు నిండినతరువాత సప్తాపారి, తిమ్మయ్యపేట, సారథిగ్రామాల ప్రక్కనుండి మండాకురిటిమీదుగా సిరిపురంచెఱువులో కలుస్తుంది. గెడ్డనీటిని ఈ గొలుసుకట్టు చెఱువుల ద్వారా రాజాంపట్టణం చుట్టూ తిరిగేటట్టు చేయగలిగేరు. సాగు విస్తీర్ణం పెంచడంతో పాటు, పట్టణంలో భూగర్భ జలమట్టం పెరగడం కోనం ఈవద్ధతిని వారు అనుసరించారు. ఇంతవరకూ బొబ్బిలిరాజుల ప్రభావంతో నిర్మాణమైన రాజాం అని గుర్తుంచుకోవచ్చు. స్వాతంత్ర్యం వచ్చిన తరువాత విద్యుత్ సౌకర్యం, విజయనగరం-పాలకొండ, శ్రీకాకుళం-బొబ్బిలి మధ్య తారురోడ్లు ఈ పట్టణానికి కలిగిన అదనపు సౌకర్యాలు. కోట ఉత్తర ముఖద్వారాని కెదురుగా చిన్నపాటి బస్టాండ్ ఉండేది. అదిచాలక అక్కడి పార్క్‌ను తొలగించి ప్రస్తుత బస్టాండ్‌ను నిర్మించారు. రాత్రి ఇంటికి చేరలేని వారికోసం అప్పట్లోనే రెండుమూడు లాడ్జ్‌లుకూడ వ్యాపారులు నిర్మించారు.

ఇదంతా ప్రాచీనమైన రాజాంపట్టణచరిత్ర కాగా, 1975 వరకూ ఇలాగే ఈపట్టణం పొడకట్టేది. అప్పుడది పట్టణానికి చిన్నది. గ్రామానికి పెద్దది. నేను నా21 ఏళ్ళ వయస్సులో ఈ రాజాంలో అడుగు పెట్టేసరికి నా మనఃఫలకం మీద ఏర్పడిన చిత్రాన్ని, ఈ ఊరిలోని పెద్దల నుండి సేకరించిన సమాచారాన్ని ఈ విధంగా ఉంచడం జరిగింది. కృషితో నాస్తి దుర్భిక్షం అనికదా పెద్దలన్నారు.

గార రంగనాథం

రాజాం (విజయనగరం జిల్లా), ఫోన్ : 98857 58123

గిరిజనుల జీవనం

– తోట రామకృష్ణ

ఆదివాసీలు

ప్రాచీన మానవుల ఆహార సంపాదన అనేక రకాలుగా సాగింది. మానవుడు కొంతవరకూ తన ఆకలిని తీర్చుకోవడం కోసం జంతువుల్ని వేటాడి తన ఆకలిని తీర్చుకున్నాడు. తాను తలదాచుకోవడానికి కొండ గుహలు, చెట్ల తొర్రలు వెతుకొన్నాడు. పశుపోషణ, వ్యవసాయం చేపట్టిన కొన్ని తెగలు మైదానాలాల్లో నివసించాల్సి వచ్చింది. అప్పుడే చిన్న చిన్న గుడిసెల్ని నిర్మించుకోవడం మొదలు పెట్టాడు. సాధారణంగా ఆదివాసీలు సమిష్టి కుటుంబ జీవనానికి అనువుగా ఉండే విధంగా గృహ నిర్మాణం చేసుకుంటారు. వీటిని పాకలు లేదా గుడిసెలుగా వ్యవహరిస్తారు. కొందరు చుట్టుపాకలు (గుండ్రంగా ఉండే పాకలు) నిర్మించుకుంటే మరికొందరు నిటారు పాకలు (నిలువు పాకలు) నిర్మించుకుంటారు. ఈ పాకల చుట్టూ కర్రల్ని దగ్గరదగ్గరగా పాతి వెదురు బద్దలతో దడికట్టి దాన్ని మట్టితో మెత్తి వాటిని గోడలుగా తయారు చేసుకుంటారు. వాననీరు పాకచుట్టూ రాకుండా కాలువ తవ్వుతారు. ఉత్తరాంధ్ర ఆదివాసీలు ముఖ్యంగా దబ్బ గడ్డితో, ఈతగడ్డితో, పూతిక గడ్డితో ఇల్లు నిర్మించు కొంటారు. ఉత్తరాంధ్రలోని ఎక్కువ ఆదివాసీ తెగలు ముఖ్యంగా పోడు వ్యవసాయం చేస్తారు. శ్రీకాకుళం జిల్లాలో ముఖ్యమైన ఆదివాసీలు గదబలు, జాతావులు, కొండదొర కొంధలు కోటియా, పొర్జ, సవరలు పోడు వ్యవసాయంతో పాటు అటవీ ఉత్పత్తుల్ని సేకరించి వాటి ద్వారా వచ్చిన సొమ్ముతో తమ జీవనాన్ని సాగిస్తారు. తక్కిన ఎరుకల తెగలవారు మాత్రం వెదురుతో బుట్టలు అల్లడం, ఎలుకల్ని పట్టడం, పందుల్ని పెంచడం, తాళ్ళు మొదలైన వృత్తుల్ని వీరు సాగిస్తారు.

కోందులు ఆదిమవాసీలు. వీరు గోమాంస భక్షణ చేయడం వల్ల ఇతర తెగలకు దూరంగా జీవిస్తారు. వీరు ఏ తెగవారి తోనూ కలిసి జీవించడానికి అవకాశం ఉండదు. దీనికి గల ప్రధాన కారణం వీరు పరిశుభ్రంగా ఉండకపోవడమే. వీరి గృహ నిర్మాణ పద్ధతి సామూహిక గృహ నిర్మాణం. ఒకే వరుసలో గృహాలు నిర్మించుకొని జీవిస్తుంటారు. వీరి గృహ నిర్మాణంలో ఆచారాలకు, సాహిత్యానికి వేద సారస్వతం పుట్టినిల్లు. భారతీయుల ఏ ఆచార వ్యవహారాలైన చరిత్రలో సాహిత్య పుటలనే వేద సముద్రంలో ప్రభవించినవే కాబట్టి ఆదివాసులు కూడా తద్వ్యతిరేకులుకారు. ఆదివాసీల పండుగలు సాధారణంగా కన్నెమాసంలో వచ్చే కొర్ర కొత్తతో ప్రారంభమవుతాయి. ఈ పండుగనే వీరు సామకొత్త అని వ్యవహరిస్తారు. ఇది ఆదివాసులకు తొలిపండుగ. ఆదివాసులు చేసే కొండ పోడు వ్యవసాయం. మిశ్రమ పంట వ్యవసాయంలో జొన్నలు, కొఱ్ఱలు, బుడమలు మొదలైన చిరు ధాన్యాల్ని కలిపి జల్లుతారు. అందులో మొదటిగా పండి ఇంటికి చేరేవి కొర్రలు. మూడు నాలుగు నెలల్నుంచి తిండికి కటకటలాడే ఆదివాసులకు ఈ పంట తాత్కాలికంగా కొంత ఆకలిని తీరుస్తుంది. వీటిని కోసి వండుకొనే ముందు చేసే పండుగకాబట్టి యిది కొర్రకొత్త పండుగ. ఆ తరువాత బగుమ ధాన్యం కూడా అందుతుంది. ఇది ఎర్రగా ఉండే ధాన్యం ఈ ధాన్యాన్ని ఆదివాసీలు ఎంతో యిష్టంగా తింటారు. అంబలి కాసుకొని తాగుతారు. గుమ్మడి కూర కూడా ఆదివాసీల ఆహారంలో ప్రధానమైనదే. దీనిని కూడా ఆ పండుగ నుంచే తినడం ప్రారంభిస్తారు. 'మునకలి' మాసంలో వచ్చే పండుగను 'పచ్చిక పండుగ' లేదా 'జల్ద పండుగ' అని పిలుస్తారు. పంటలకు ఏ రకమైన తెగుళ్ళూ ఆశించకుండా ఆ రోజున చేలల్లోకి వెళ్ళి కొత్త కుండతో అన్నం వండి పసుపు, మసిబగ్గుల పొడి, ఆ

అన్నంలో కలుపుతారు. దీనినే 'పెంకవంట' అని పిలుస్తారు. ఆ నైవేద్యాన్ని దేవతగా భావించి చేలల్లో పాతి ఉంచిన నేరేడు తుప్పకు నివేదించి అక్కడ దాన్ని వెదజల్లుతారు. తర్వాత కసిం మొక్కల్ని జొన్న మొక్కల్ని పొడిలో గుచ్చుతారు. దీనివల్ల ఏ చీడపీడలూ పంటలకు పట్టవని వాటి బాధ తొలగిపోతుందని భావిస్తారు. ఎరుపు రంగు దేవతలకు యిష్టమని అందువల్ల అదే రోజున ఎరుపు రంగున్న కోడిని దేవతలకు బలిస్తారు. 'దసరా' నెలలో వచ్చే పండుగను 'దసరా'గా వ్యవహరిస్తారు. కొత్తగా పండిన చింతకాయలతో ఆ రోజు నుంచే పులుసు కాచుకొని తినడం ప్రారంభిస్తారు. సవిత; 'పల్కం' నెలల్లో పండుగ చేసి కొత్తగా పండన కందుల్ని పొట్టుతో సహా తినడం ప్రారంభిస్తారు. తరువాత చేసే పండుగ 'పప్పుకొత్త'. ఈ పండుగ అనంతరం కొత్త కందిపప్పుని తింటారు.

ఆదిమానవుని కాలంలో భావాభివ్యక్తి మాధ్యమంగా రూపుదాల్చిన కళారూపం నృత్యం. ఇదే మానవుని మొట్టమొదట కళారూపం. ఆదివాసీ నృత్యాలలో సామూహిక ధర్మం ప్రధానమైనది. వారి నృత్యాలు లయ ప్రధానమైనది కావు. వారు అడుగులు ముందుకీ, వెనక్కీ వేస్తూ పాటను పెంచుకొంటూ సాగి పోతారే గాని నృతంలో శాస్త్రీయత ఉందా లేదా అనే ఆలోచన ఆదివాసుల్లో ఉండదు. ఆదివానులు ముఖ్యంగా వండుగ సమయాల్లోనూ, వెన్నెల రోజుల్లోనూ ఎక్కువగా నృత్యాలు చేస్తూ ఉంటారు. విటిమ్ పండుగ, గంగాలమ్మ పండుగ, వెళ్ళి తదితర సందర్భాలలో గ్రామంలో ఉత్సాహవంతులైన ఆదివాసీ యువతీ యువకులు బృందంగా ఏర్పడి నృత్యాన్ని చేస్తూ యింటింటికి తిరిగి వారిచ్చే డబ్బుల్ని, బియ్యాన్ని సేకరిస్తూ ఉంటారు.

ఆదివాసీ నృత్య రీతులు	**చేసే తెగలు**
థింసా	– అన్ని తెగల వాసీలు చేస్తారు
మయూరి	– కోందులు
డుడుంగ	– మాలీలు
పెళ్ళి నృత్యం	– భగత్, గొండులు, వాల్మీకి
కంగారి	– గదబ
నంది	– పొర్జ
దీపావళి	– వాల్మీకి

గిరిజనుల నమ్మకాలు : ఆదివాసీల నమ్మకాలు ఎక్కువగా ప్రాకృతిక శక్తుల నుంచి తమను తాము. రక్షించు కోవడానికి, సులభంగా వేటాడడానికి, పోడు వ్యవసాయం సక్రమంగా సాగడానికి ప్రకృతిలోని కనబడని శక్తుల్ని పూజించటం, బలుల్ని ఇవ్వటం, జరుగుతుంది. వీరి జీవితంలో జరిగే ప్రతి సంఘటన ఏదో ఒక నమ్మకాన్ని సూచిస్తుంది. అధికంగా పంటలు పండటానికి, రోగాలు నయం కావడానికి వీరు ఎన్నో పూజలు, జంతుబలులు, నరబలులు ఇచ్చి తద్వారా ప్రకృతిని తమ వశం చేసుకోవడానికి ప్రయత్నిస్తారు.

స్వప్న సంబంధి నమ్మకాలు : ఆదివాసులలో కలలకు సంబంధించి అనేక నమ్మకాలు వారి మనస్సులో చోటు చేసుకున్నాయి. రాత్రిపూట పెళ్ళి చేసుకున్నట్లు కల వస్తే ఉదయం తాము కుటుంబంలోని వారు కాని, తమ చుట్టాలలోని వారు కాని చనిపోతారని నమ్ముతారు. రాత్రిపూట ఏనుగులు, గుర్రాలు ఎక్కినట్లు కలవస్తే మంచి జరుగుతుందని నమ్ముతారు. రాత్రిపూట పాము కలలోకి వస్తే ఉదయాన్నే లేచి ఆవుల్ని కట్టే కలల్ని చూస్తారు. దీనివల్ల తమకు డబ్బులు దొరుకుతాయని వీరి నమ్మకం. వర్షం కురిసినట్లు కలవస్తే అది కన్నీరుకు కారణమౌతుందని నమ్ముతారు.

ఆరోగ్య సంబంధి : ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. ఏ మనిషికైనా ఆరోగ్యానికి మించింది ఇంకే ముంటుంది. ఆరోగ్యాన్ని కాపాడుకోవటం ఆదివాసుల కింకా అబ్బలేదు. ఋతువుల్ని అనుసరించి దానికి అనుగుణమైన చెక్క మందుల మీద ఆధారపడి రోగాల్ని నయం చేస్తారు. ఒకవేళ చెక్క మందులతో జబ్బు తగ్గకపోతే దాన్ని చెడుపుగా ఊహించి గొర్వగాళ్ళ చేత పూజలు చేసి బలుల్నిచ్చి రోగం నయం చేయడానికి ప్రయత్నిస్తారు. ఆరోగ్యపరంగా ఆదివాసులు నమ్మేది చెక్క మందుల్నే. జబ్బు చేసినపుడు గొరవగాడు కోడిని గాని మేకని గాని బలియిచ్చి జబ్బు తగ్గిస్తాడు. జబ్బు తగ్గిన తరువాత గొరవగాడు కోరింది ఇవ్వకపోతే మరలా తిరిగి జబ్బు నమ్ముతారు.

గృహసంబంధి : దీపంతో చుట్ట కాల్చకూడదు. ఆదివాసులు ఎక్కువగా చుట్టా, బీడి తాగుతుంటారు. ఎక్కడంటే అక్కడ, ఎప్పుడంటే అప్పుడు చుట్ట అంటించుకొని పొగతాగు తుంటారు. దీపంతో చుట్ట కాల్చుకుంటే గుడ్డివాళ్ళు అవుతారు. చీపురుకట్టను రాత్రివూట వడుకోబెట్టి ఉంచకూడదు. అలా ఉంచితే దెయ్యం, భూతం గాలి వచ్చి

గిరినవ్వులు

రాత్రిపూట చీపురు కట్టను చిన్న స్థలం అడుగుతాయి. అందుకే చీపురు కట్టను మూలగా నిలబెడతారు. దెయ్యం వచ్చి స్థల మడిగితే నాకే చోటులేక నిలబడి ఉన్నాను ఇంకా నీకెక్కడివ్వను అని చీపురుకట్ట అంటుందట దానితో దెయ్యం వెళ్ళిపోతుందని ఆదివాసుల ప్రగాఢ విశ్వాసం.

దైవ సంబంధి : కొండ ప్రాంతాల్లో చేసే పూజలు ప్రతీ సంవత్సరం కొండరాజుల మాటమీదే చేయాలి. కొండ రాజులంటే ఆదివాసులకు భయభక్తులెక్కువ. వారు ఈ పండుగను అమిత భక్తి శ్రద్ధలతో చేస్తారు. అలా చేయలేదంటే ఆయా దేవతలకు ఆగ్రహ కలిగి తమని నాశనం చేస్తాయని భయం. కాబట్టే ఆదివాసులు అడవి రాజులుండే స్థలానికి వెళ్ళి అక్కడ ధూప, దీప, నైవేద్యాలు సమర్పిస్తారు. ఆ పండుగ చేయకపోయినట్లయితే అడవి రాజులు తమ మీద ఆగ్రహించి అడవి సంపద కోసం అడవులకు వెళ్ళినప్పుడు హాని చేస్తారనీ మరియు వేటాడటానికి అడవికి వెళ్ళినప్పుడు జంతువులు దొరకవని నమ్ముతారు.

పెళ్ళికి ముందు గోర్లు తియ్యకూడదు : ఆదివాసీలు పెళ్ళికి ముందు గోర్లు తియ్యడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తారు దానికి గల కారణం పెళ్ళికి ముందు గోర్లు తీసిన వారికి తొందరగా పెళ్ళి జరగదని నమ్ముతారు. కాబట్టే ఆదివాసులు పెళ్ళి అయిన తరువాత మాత్రమే గోర్లు తీస్తారు.

వారసంబంధి – నమ్మకాలు : వారానికి సంబంధించిన నమ్మకాలు కూడా ఆదివాసీల్లో ఉన్నాయి. లక్ష్మివారం (గురువారం) డబ్బులు అప్పు ఇవ్వకూడదు. అలాగే లక్ష్మివారం ఆడపడుచుని అత్తవారింటికి పంపించకూడదు. దీనికి గల ప్రధాన కారణం ఏమిటంటే లక్ష్మియింటి నుంచి వెళ్ళి పోతుందని నమ్మకం. అలాగే ఆడపడుచుని అత్త వారింటికి పంపించడానికి గల కారణం ఆడపిల్ల లక్ష్మి దేవితో సమానమని వీరినమ్మకం. ఆదివానులు సాధారణంగా శనివారం నాడు కర్మకాండలు జరపరు. దీనికి గల ప్రధాన కారణ మేమిటంటే ఆరోజు కర్మకాండలు జరిపించడం వల్ల శనీశ్వరుడు తమ కుటుంబాన్ని పట్టిపీడిస్తాడని వీరి నమ్మకం.

వస్తు సంబంధి : ఆదివాసులు నిత్యం ఎన్నో వస్తువుల్ని ఉపయోగిస్తుంటారు. ఆ వస్తువుల వాడకంలో, వస్తువుల్ని భద్రపరచడంలో ఎన్నో నమ్మకాలు వీరిలో ఉంటాయి. ఇలాంటి నమ్మకాలు జానపద సమాజంలోనే కాకుండా ఆదివాసీ సమాజంలో కూడ ఎన్నో ఉన్నాయి.

"మనం పడుకొనేప్పుడు దీపం తల పక్కన ఉంచ రాదు", 'చీపురుతో మనిషిని కొడితే చీపురులా ఎండి పోతాడు". 'చీపురును గాని, రోకలిని గాని దాటకూడదు; ఉరుములు ఉరుముతున్నప్పుడు గుమ్మం ముందు యినుప ముక్క ఉంచాలి. అలాచేస్తే పిడుగు ఆ యింటిపై పడదని వీరి నమ్మకం.

పండుగ సంబంధి : ఆదివాసీ గ్రామాల్లో ఊరి వారంతా కలిసి ఒకేసారి పండుగలు జరుపుకోవడం ఆచారం. పండుగ సందర్భంగా ఆదివాసులు ఎన్నో ఆచారాల్ని సంస్కృతీ సంప్రదాయాల్ని విశ్వాసాల్ని ప్రకటిస్తారు.

గంగాదేవి పండుగ సమయంలో బూతు పాటలు పాడకపోతే గంగాదేవికి సరదా ఉండదని వీరికి బలమైన నమ్మకం. అందువల్ల గంగాదేవి పండుగ సందర్భంగా బూతు పాటల్ని ఎక్కువగా పాడుతారు. జొన్నలు, సామలు, మామిడికాయలు మొదలైన పంటలు పండే సమయంలో పండుగల్ని చేయకుండా ఆ పంటల్ని తింటే పులి కరుస్తుందని ఆదివాసీల నమ్మకం. ఆదివాసీలకు ప్రకృతి సంబంధమైన అనేక నమ్మకాలు ఉన్నాయి. వాటిలో రాత్రిపూట తల దువ్వకూడదని, ఆకాశంలో నక్షత్రాలు లెక్కపెట్టకూడదు. కాని అలా చేస్తే మనిషి చనిపోతాడని వీరు నమ్ముతారు.

ఇంతవరకు "గిరిజనుల సాంఘిక జీవనం – ఆచార సాంప్రదాయాలు"లో భాగంగా ఆదివాసీల సాంఘిక జీవనం, నమ్మకాలు మొదలైన వాటిని తెలుపుటకు ప్రయత్నించితిని.

తోట రామకృష్ణ, పరిశోధక విద్యార్థి
తెలుగుశాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం,
రాజమహేంద్రవరం, ఫోన్ : 7569518663

శతక సాహిత్యం

– డి.యువశ్రీ

ఆంధ్ర సాహిత్యం అనంతం. అద్వితీయం. సారసమృద్ధం. దీనిలో అనేక ప్రక్రియలున్నాయి. వాటిలో శతకానికి ఎంతో ప్రాధాన్యత ఉంది. శతకమంటే 100 పద్యాల సమాహారమని అభిప్రాయం. సాధారణంగా స్తుతి శతకాలలో 108 పద్యాలుంటాయి. కొన్నిటిలో అంతకంటే ఎక్కువగా కూడా ఉండవచ్చు. ఒకే ఛందస్సులోగానీ, సమాన మాత్రలు కలిగిన రెండు ఛందస్సుల్లోగానీ శతక రచన సాగుతుంది. ఉదాహరణకి శతకంలో ఉత్పల చంపకమాలలు, శార్దూల మత్తేభాలు వాడుతారు. శతకంలోని పద్యాలు ముక్తకాలు. దేనికది విడిగా ఉంటాయి. మకుట నియమం ఉంటుంది. పాల్కురికి సోమనాథుని వృషాధిపశతకమే మొదటి శతకమని చెబుతారు. దానికి ముందే నన్నయ భారత ఆదిపర్వ ఉదంకోపాఖ్యాణంలో శతక బీజాలు కనిపిస్తున్నట్టు విజ్ఞుల విశ్వాసం. ఈ విధంగా శతకం క్రమపరిణామం చెంది నేటి స్థితికి చేరుకొంది. వస్తువును బట్టి తెలుగు శతకాన్ని అనేక రకాలుగా వర్గీకరించుకోవచ్చు.

భక్తిశతకాలు, శృంగార శతకాలు, నీతి శతకాలు, వేదాంత శతకాలు లేక తాత్త్విక విషయ శతకాలు, హాస్య శతకాలు, చారిత్రక శతకాలు, జీవిత చారిత్రక శతకాలు, స్వీయచరిత్ర ప్రతిపాదక శతకాలు, వ్యాజనిందా స్తుతి శతకాలు, కథా శతకాలు, సమస్యా శతకాలు, నిఘంటు శతకాలు, అనువాద శతకాలు, అచ్చ తెలుగు శతకాలు, చాటు శతకాలు ఇలా మనము శతకాలను చెప్పుకోవచ్చు.

తెలుగు శతకాల్లో సుమతీశతకం, భాస్కరశతకం, వేమన శతకం, ఆంధ్రనాయక శతకం, దాశరథి శతకం, శ్రీకాళహస్తీశ్వర శతకం, నృసింహ శతకం మొదలైనవి చెప్పుకోదగ్గవి. ఇవి మిక్కిలి ప్రచారంలో ఉన్న సంగతి మనందరికీ తెలిసిందే. శతకం సార్వజనీనం. సార్వకాలికం. అయినప్పటికీ కొన్ని ప్రాంతాల్లో శతకాలు ఏవిధంగా వచ్చాయో తెలుసుకోవడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. కాబట్టి రాయలసీమలో శతక సాహిత్యం గురించి రేఖామాత్రంగా మీముందుంచుతాను. రాయలు పరిపాలించిన సీమ రాయలసీమ. రాయలసీమలో నాలుగు జిల్లాలున్నాయి. అవి చిత్తూరు, కడప, కర్నూలు, అనంతపురం. ఈ జిల్లాల్లో అనేక శతకాలొచ్చాయి. వాటిలో నాకు లభించిన శతకాలు దాదాపు 45. జిల్లాల వారీగా పరిశీలిస్తే చిత్తూరు జిల్లాలో ధూర్జటి–శ్రీకాళహస్తీశ్వర శతకం, మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ–తరిగొండ నృసింహ శతకము, సారంగపాణి–వేణుగోపాల శతకము డా॥సముద్రాల లక్ష్మణయ్యగారి శ్రీ మలయాళ సద్గురు శతకం, సి.లక్ష్మీ నారాయణ శాస్త్రిగారి శతకమంజరి, బుర్రిచెంగారెడ్డి గారివి శ్రీ ముకుంద శతకము, శతక సప్తకము; ఆచార్య జక్కంపూడి మునిరత్నం గారివి నటరాజ శతకం, షిర్డిసాయి శతకము, మలయాళ మౌనీంద్ర శతకం, విద్యాప్రకాశ మౌనీంద్ర శతకం, వెంకయ్య శతకం, గణనాథ శతకం, సుబ్రమణ్య శతకం, వేంకటేశ్వర శతకం, కృష్ణ శతకం, మారుతీ శతకం, చంద్రమౌళి శతకం, వివేక సద్గురు శతకం, రామకృష్ణ శతకం, సఖ శతకం, తెలుగు బాల శతకం, దేదీప్య శతకం మొదలైనవి. మధురాంతకం దొరస్వామి విద్వాన్ గారి శ్రీ నుబ్రహ్మణ్యేశ్వర చిద్విలాన శతకము, డా॥ మౌనిగారివి–శ్రీ అలివేలు మంగ శతకము, వేంకటాద్రినాథ శతకము, మౌని శతకము, డా॥రాజనం పల్లి సీతారామారావు గారి రాజనంపల్లి నీతి శతకము.

కడప జిల్లాలో తాళ్ళపాక అన్నమాచార్యుల వారిది – శ్రీ వేంకటేశ్వర శతకం, తాళ్ళపాక పెదతిరుమలయ్య–నీతి శతకము, వేమనది–వేమన శతకము, శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామిది–శ్రీ కాళికాంబానవ్రతశతి, కుందవరపు కవి చౌడప్పగారిది–కవి చౌడప్ప శతకం, డా॥ సి.వి.సుబ్బన్న శతావధాని గారి–శ్రీ వేంకటేశ్వర శతకము, వావిలి కొలను సుబ్బారాయగారి టెంకాయచిప్ప శతకము, డా॥ శ్రీరామకృష్ణకవి – పాలకొండరాయ శతకము. కర్నూలు జిల్లాలో శ్రీమాన్ వైద్యం వేంకటేశ్వరాచార్యులు గారివి – తెలుగుభాష (పద్యశతము), కంబగిరి లక్ష్మీనృసింహశతకము, శ్రీసుదర్శన చక్రరాజ శతకము,

తడకనపల్లె కవిరామయోగి-తారకబ్రహ్మ శతకము, డా॥వెంకటరాజారెడ్డిగారి - వేంకటేశ్వర శతకము.

అనంతపురం జిల్లాలో డా॥ ఆశావాది ప్రకాశరావు గారి-శ్రీ పార్వతీ శతకము, ఆచార్య శలాక రఘునాథ శర్మగారి-శ్రీశంకర శతకము, తెగట వీరక్షత్రియ లక్ష్మణ కుమార్‌గారి-శ్రీ ఆదిశక్తి శతకము ఇవి నాకు లభించిన శతకాలు. ఈ శతకాల్లో ప్రతిదాని గురించి చెప్పుకోవడం వీలుకాదు కాబట్టి కొన్ని శతకాల్లోని పద్యాలను మాత్రమే తీసుకొని విశ్లేషించడం జరిగింది.

దైవస్తుతికి సంబంధించిన శతకాలు : చిత్తూరు జిల్లాకు చెందిన మహాకవి ధూర్జటి అసలు సిసలైన శైవకవి. ఈయన శ్రీకాళహస్తి మాహాత్మ్యం, శ్రీకాళహస్తీశ్వర శతకం రచించాడు. ఈయన మానవులకు ఉండవలసిన సద్గుణాలను గురించి తెలియజేశాడు. రాజయితే మాత్రం ఆ గుణాలన్నీ పోతాయా! అని నిలదీశాడు. రాజులు కూడా సద్గుణాలను అలవరచుకోవలసిన ఆవశ్యకతను బోధపరచాడు. కొందరు రాజులు కాకముందు మంచి వాళ్ళుగానే ఉంటారు. పదవి వచ్చిన తరువాత ఆ మంచితనానికి తిలోదకం ఇస్తారు. ఈ విషయం ధూర్జటికి నచ్చలేదు. కాబట్టే అటువంటి వారిని ఖండించాడు. దయాధర్మాలు, పరంపరవల్ల కలిగే ఆభిజాత్యం పట్ల మక్కువ, విద్యవల్ల కలిగే ఓర్పు, సత్యవాక్పరిపాలనను, విద్వాంసులను అభిమానించడం, పోషించడం, మంచి తనము, కృతజ్ఞత, దైవవిశ్వాసం ఇవన్నీ మంచి లక్షణాలని ఆయన అభిప్రాయపడ్డాడు. తన కాలపు సమాజంలో ఇవన్నీ నశించడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయాడు. పర్యవసానంగా ఈ పద్యం పల్లవించింది.

శా॥ "రాజన్నంతనె పోవునా కృపయుధర్మం బాభిజాత్యంబు వి
ద్యాజాతక్షమ సత్యభాషణము విద్వన్మిత్ర సంరక్షయున్
సౌజన్యంబు కృతం బెఱుంగుటయు విశ్వాసంబు గాకున్నదు
ర్బీజ శ్రేష్ఠులుగా గతంబు గలదే! శ్రీకాళహస్తీశ్వరా!"

(మహాకవి ధూర్జటి - శ్రీకాళహస్తీశ్వర శతకం, పద్య:39, పేజి:53) తర్వాత పేర్కోదగిన వ్యక్తి తరిగొండ వెంగమాంబ. ఈమె చిత్తూరు జిల్లా, వాయల్పాడు తాలూకా, తరిగొండ గ్రామానికి చెందిన భక్తురాలు. తరిగొండ నృసింహస్వామిపట్ల, వేంకటేశ్వర స్వామి పట్ల అపార భక్తి ప్రపత్తులను ప్రదర్శించింది. వెంగమాంబ తరిగొండ నృసింహ శతకమేగాక వేంకటాచల మాహాత్మ్యం, భాగవత దశమస్కంధం, విష్ణుపారిజాతం మొదలైన పలుకృతులు వెలయించింది. వెంగమాంబ లోకరీతిని తరిగొండ నృసింహస్వామికి నివేదించింది. దీనిలో సమాజపు పోకడను సహజసిద్ధంగా ఆమె తెలియజేసింది.

మానవుడికి యవ్వన ప్రాయంలో అనేక భోగభాగ్యాలుంటాయి. సిరిసంపదలుంటాయి. పాడిపంటలుంటాయి. భార్యాబిడ్డలు, బంధువులు ఉంటారు. క్రమంగా వృద్ధాప్యం వస్తుంది. అప్పుడివేవీ పనిచేయవు. పైగా కన్న కొడుకులే నిర్దయగా వీధిలో కూర్చోబెడతారు. కుక్కలు ఇంటిలోకి రాకుండా తోలమని పురమాయిస్తారు. కాబట్టి ఈ లోకంలో ఎవ్వరికెవ్వరు?-అనే యథార్థాన్ని గుర్తించి, లౌకిక పదార్థాల మీద మక్కువమాని దైవాన్ని ఆశ్రయించాలని వెంగమాంబ ఈ పద్యంలో ధ్వనింపజేసింది.

॥ఉ॥ "ఎక్కడిరొక్కయోజనము?లెక్కడి భాగ్యము? లెక్కడింతులున్?
ఎక్కడిపాఁడి పంటలును? ఎక్కడి బాంధవు?లెల్ల నాఁటికిన్
తక్కక వృద్ధరూపమును దాల్చినఁ, బుత్రకులింటి వాకిటన్
కుక్కలఁదోలుమండ్రు; తరిగొండ నృసింహ! దయాపయోనిధీ!

(తరిగొండ వెంగమాంబ-నృసింహశతకము, పద్యం:64,పేజి:65)

తర్వాత చెప్పుకోదగినవారు కడపజిల్లా పూర్వపు రాజంపేట తాలూకా తాళ్ళపాక గ్రామానికి చెందిన తాళ్ళపాక అన్నమాచార్యులవారు. ఈయన తిరుమల శ్రీ వేంకటేశ్వర భక్తుడు. స్వామివారి మీద 32 వేల సంకీర్తనలు వెలయించిన ధన్యజీవి. బహుగ్రంథకర్త. ఈయన రచించిన శ్రీ వేంకటేశ్వర శతకం సుప్రసిద్ధం. శతక వాఙ్మయంలోనే మిక్కిలి ప్రత్యేకతను సంతరించుకొన్న శతకం ఇది. ఇది వేంకటేశ్వర మకుటంతో సాగినా ప్రతిపద్యంలోనూ అలమేలుమంగ ప్రసక్తి వస్తుంది. ఆమె పేరు కూడా చోటుచేసుకొంటుంది. ఈ శతకంలో శృంగార స్పర్శకూడా కనిపిస్తుంది. చెలికత్తెలు అలమేలుమంగను సమీపించి ఆమె చూపులే వల్లభుడైన శ్రీవేంకటేశ్వరుని చూపులకు విందులని ప్రశంసించారు. ఆమెకు ఆనందం కలిగింది. పరవశంతో, పైకొన్న దర్పంతో పతిని చూపుతూపుతోనే పలుకరించింది. ఈ దంపతుల వీక్షణావిలాసాలను పద్యీకరించి పాఠకులకు విందుచేసిన అన్నమయ్య అభినందనీయుడు. ఆరాధ్యుడు. అదే ఈ పద్యం.

॥చ॥ " తొలకరిమించు తొయ్యలి వధూమణి చక్కనితల్లిమానినీ
తిలకమ దేవదేవుని సతీమణి యోయలమేలుమంగ నీ
సొలపులచూపులే విభునిచూపులవిందు లటంచునెచ్చెలుల్
పలుకఁగ నిన్నుఁజూచి నగఁబైకొని నీసతి వేంకటేశ్వరా! "

(అన్నమయ్య-అలమేలుమంగా శ్రీ వేంకటేశ్వర శతకం, పద్యం:14, పేజి:17)

తరువాతి వారు తిరుపతి శ్రీవేంకటేశ్వర ప్రాచ్య కళాశాల పూర్వాధ్యక్షులు, మహామహోపాధ్యాయ డా॥సముద్రాల లక్ష్మణయ్య గారు. సంస్కృతాంధ్ర సాహితీ సముద్రులు. వీరెన్నో జీవిత చరిత్రలు, మరెన్నో ఆధ్యాత్మిక గ్రంథాలు రచించారు. వ్యాసాశ్రమ సంస్థాపకులు, ఆంధ్రదేశానికి అధ్యాత్మ చైతన్యం అందించిన వారు అయిన మహర్షి సద్గురు శ్రీమలయాళ స్వాములవారిపట్ల వీరికెనలేని భక్తి ప్రపత్తులున్నాయి. పర్యవసానంగా వారున్నప్పుడే వారిమీద శతకం వెలయించారు. అదే ''శ్రీ మలయాళ సద్గురు శతకం.'' గురువంటే సామాన్యుడు కాదు. త్రిమూర్తి స్వరూపుడు. అటువంటి గురు చరణసేవ సామాన్యంగా లభించేది కాదు అని గురుఘనతను, ప్రాముఖ్యతను సముద్రాలవారు చక్కగా తెలియజేశారు.

॥చ॥ "గురుడె విధాతడెముకుందు డతండె మహేశ్వరుండటం
చరయు గురుప్రభావము ననంతముగా వచియింత్రు విజ్ఞులా
గురుచరణారవిందములు కోరినమాత్రన చిక్కునే భవాం
తరవిహిత ప్రభూత సుకృతమ్ము వినా? మలయాళ సద్గురూ!"

(డా॥సముద్రాల లక్ష్మణయ్య – శ్రీ మలయాళ సద్గురు శతకం, పద్యం:8, పేజి:3)

మరొకరు అనంతపురం జిల్లాకు చెందిన విద్యా వినయ సంపన్నులు డా॥ ఆశావాది ప్రకాశరావు గారు. పద్యగద్యాల్లోనూ కవిత్వాన్ని పండించే పరమ ప్రజ్ఞాశాలి ఈయన. బహుగ్రంథకర్త. పద్మశ్రీ పురస్కార గ్రహీత. వీరు రచించిన ''శ్రీపార్వతీశతకము'' నర్వులకూ అనుసంధేయమే. ఆశ్రయించిన వారికి పారిజాతంలా పలువిధ ఫలితాలను ప్రసాదించే పార్వతీ తల్లిని ప్రకాశ రావుగారు తమకోసం గాక సమాజం కోసమే కోరికలు కోరారు. పాలనిచ్చే పశువులను, పండ్లనిచ్చే తరువులను, పంటల నిచ్చే భూములను సదా రక్షించమని కోరారు. వీరి లోకోపకార బుద్ధి ప్రశంసనీయం.

" పాలనిడు గోగణంబులన్, పక్వమధుర
ఫలములిచ్చెడు తరువులన్, పంటపండు
భూములన్, రక్షసేయుమా భూరి కరుణ
పార్వతీమాత! ఆశ్రిత పారిజాత! "

(డా॥ ఆశావాది ప్రకాశరావు – శ్రీపార్వతీశతకము, పద్యం:43, పేజి:11)

ఇంకొకరు కర్నూలు జిల్లాకు చెందిన శ్రీశ్రీశ్రీ తడకనపల్లె రామయోగి. బహుగ్రంథకర్త. ఈయన తారకబ్రహ్మను తలపోస్తూ ఒక శతకం రచించాడు. ఇందులోని పద్యాలు ఎంతో హృద్యంగా ఉన్నాయి. భగవంతుణ్ణి నిత్యమూ తలపోయడం కంటే వేరే పురుషార్థం లేదని ఈయన తలపోత. ''దేవదేవుని చింతించు దినము దినము'' అని ప్రహ్లాదుడు తెలియజేసినట్టే ఈయన కూడా గత జన్మాల్లో కనిపించని భగవంతుడి కోసం భక్తితో పరితపిస్తూ ప్రతిదినమూ ఆ స్వామిని స్మరించేవారిదే పురుషార్థమని, అట్టి భక్తుడే మహనీయుడని ఒక పద్యంలో ఈయన తెలియజేశాడు. దైవభక్తి ఆవశ్యకతను, దైవస్మరణావశ్యకతను చక్కగా ధ్వనింపజేశాడు.

॥మ॥ "బహుజన్యంబుల యందుగాన ననుచున్ భక్తిన్ ప్రవర్తింపుచున్
కుహకంబుల్ విడనాడి యాంతరమునన్ గుర్తించి నిన్నాత్మ ప్ర
త్యహమున్ భావన సేయునట్టి పురుషార్థం బెన్న సామాన్యమా
మహనీయుండను భూత నైష్ఠికుడు రామా తారకబ్రహ్మమా!"

(శ్రీశ్రీశ్రీ తడకనవల్లె రామయోగి–తారకబ్రహ్మ శతకము, పద్యం:46,పేజి:10)

మీ ముందుంచిన 6 శతకాల్లోనూ దైవస్తుతి ఉంది. అంతర్గర్భితంగా నీతి కూడా గోచరిస్తుంది. ఈ ఆరుగురు కవులూ ఉద్దిష్ట దేవతలను లోకక్షేమానికై ప్రార్థించడం గమనార్హం.

నీతి శతకాలు : తెలుగు శతకాల్లో భక్తి శతకాల తరువాత నీతి శతకాలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంది. పాఠకులకు నీతులు చెప్పి లోకరీతులకు ఔన్నత్యాన్ని సమకూర్చడమే ఈ శతకాల ఉద్దేశం. ఈ విధంగా నడుచుకోవాలి, ఈ విధంగా నడుచుకోకూడదు అని నీతిశతకాలు మానవులకు సూచిస్తాయి. ఆ శతకాల్లో చెప్పిన విధంగా నడుచుకొంటే మానవులు ఉత్తమ జీవనం సాగించవచ్చు. ఉన్నతంగా మసులుకోవచ్చు. ఏఏ పనులను చేయకూడదో సుమతీ శతకకారుడు ఈ విధంగా తెలియజేశాడు.

॥క॥ 'ఏరకుమీకసుగాయల
దూరకుమీ బంధుజనల దోషముసుమ్మీ
పారకుమీ రణమందున
మీరకుమీ గురువులాజ్ఞమేధిని సుమతీ!"

బద్దెన చెప్పిన దానిని పాటిస్తే జీవితం బాగా ఉంటుందని అభిప్రాయం. ఈ విధంగానే నీతిపద్యాలు సాగుతాయి. రాయలసీమ శతక సాహిత్యంలోనూ నీతిశతకాలు కోకొల్లలుగా కనిపిస్తాయి. వాటిలో కొన్నిటిని గురించి ఆలోచించడం ఇక్కడ సమంజసం.తిరుపతికి సమీప గ్రామస్థులు బుర్రిచెంగారెడ్డిగారు. వీరిపేరు చెప్పగానే వీరి శతకాలే స్ఫురణకు వస్తాయి. ఎక్కువ పాండిత్యం లేకపోయినా పద్యాలు రాయాలనే ఉత్సాహం

వీరిచేత పలుశతకాలను రాయించింది. వీరు రాసినవి చాలామటుకు దైవ సంబంధిత శతకాలే. 7 శతకాలను కలిపి "శతక సప్తకము" అనే పేరుతో ప్రకటించారు. ఇదిగాక వీరు రచించిన శతకాలు చాలానే ఉన్నాయి. శతక సప్తకంలోని 'బాలనీతి శతకము' నేనిక్కడ తీసుకోవడం జరిగింది. పిల్లలకు నీతులు చెప్పేవిధంగా చెంగారెడ్డిగారు ఈ శతకం రాశారు. ప్రపంచంలో ప్రధానంగా రెండే మార్గాలు కనిపిస్తాయి. ఒకటి మంచిమార్గం, మరొకటి చెడుమార్గం. చెడుమార్గాన్ని పరిహరించి మంచి మార్గాన్నే పరిగ్రహించాలి. అలా చేసి మంచిగా మసలుకొనే మానవుడి జీవితం ధన్యం. కాబట్టి మంచి బుద్ధితో మసలుకొమ్మని బాలురకు చెంగారెడ్డి గారు హితవు పలికారు.

॥ఆ॥ "మంచి చెడ్డలనగ మహిరెండు మార్గముల్
గలవుగాని మంచి తెలిసి నడుచు
వాని జన్మ ధన్యమౌనయా పరికింప
మంచిబుద్ధి గలిగి మనుముబాల!"

(బుర్రిచెంగారెడ్డి–శతక సప్తకము: పద్యం:6, పేజి:138)

ఎట్టి పరిస్థితిలోనూ ఇతరుల మనసులకు కష్టం కలిగించరాదు. ఆ విధంగా చేస్తే వారుకూడా తమ మనసులకు కష్టం కలిగింపజూస్తారు. తమకు బాధకలుగ కూడదని భావించేవారు ఇతరులను సైతం బాధపెట్టరాదు. ఈ విషయాన్నే చెంగారెడ్డిగారు లేతపసి హృదయాలకు ప్రీతితో ఈ విధంగా తెలియజేశారు.

॥ఆట॥ "పరుల చిత్తమునకు బాధను గలిగింప
తనకు గల్గుబాధ తప్పకుండ
తానుసేయు కర్మ తనుబొందకుండునా
మంచిబుద్ధి గలిగి మనుము బాల!"

(బుర్రిచెంగారెడ్డి–శతక సప్తకము, పద్యం:25,పేజి :141)

ఈ పద్యం భారతపద్యాన్ని తలపిస్తుంది. భారత శాంతిపర్వంలో భీష్ముడు ధర్మరాజుకు ఒక చక్కని విషయం తెలియజేశాడు. సమస్త భారతంలోనూ గొప్ప నీతిగా ఇది పరిగణింపబడుతూ ఉంది.

॥కం॥ "ఒరులేమేమి యొనర్చిన! నరవర! యప్రియము తన
మనంబున కగుఁదా
నొరులకు నవిసేయకునికి! పరాయణము
పరమధర్మపథముల కెల్లన్"

(శ్రీమదాంధ్ర మహాభారతము–శాంతిపర్వము (పంచమాశ్వాసము), పద్యం:220,పేజి:749)

ఆచార్య జక్కంపూడి మునిరత్నంగారు తిరుపతి వాస్తవ్యులు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు అధ్యయనశాఖలో ఆచార్యులుగా పనిచేసి విశ్రాంతి పొందారు. వీరు అనేక గ్రంథాలు వెలయించారు. వాటిలో శతకాలు దాదాపు 16 ఉన్నాయి. వీరు రచించిన "తెలుగు బాలశతకం" బాలురకు ఎన్నో నీతులు బోధిస్తుంది. ఉత్తేజం కలిగిస్తుంది. ఉత్సాహపరుస్తుంది. స్వంత అభివృద్ధిని కోరుకొనే వారికి సోమరితనమే ప్రభల శత్రువు. అది ఆశ్రయించిన వారి అభివృద్ధిని అన్ని విధాలా నిరోధిస్తుంది. కాబట్టి సోమరితనాన్ని దరిచేరనీయ రాదు. నిద్రతమోగుణ సంకేతం. అతినిద్ర పనికిరాదని ఆర్యుల అభిప్రాయం. వనుల విషయంలో పాలుమారితే తలపెట్టినదంతా పాడైపోతుంది. కాబట్టి సర్వదా జాగ్రత్తగా ఉండాలని మునిరత్నంగారు తెలుగుబాల జగత్తును హెచ్చరించారు.

॥ఆ॥ "చద్దిపొద్దునిద్రసరికాదు ఎవరికీ
సోమరి తనమునకు చోటులేదు.
పాలుమారితేని పాడగునంతయు
తెలివిగలిగి మసలు తెలుగుబాల!"

(డా॥జక్కంపూడి మునిరత్నం – తెలుగుబాల శతకం, పద్యం:2,పేజి:1)

కడప జిల్లాకు చెందిన తాళ్ళపాక అన్నమాచార్య అక్కమాంబలకు జన్మించినవాడు తాళ్ళపాక పెదతిరుమలా చార్యుడు. ఈయన తండ్రిలాగే వేంకటేశ్వర భక్తి తత్పరుడు. ఈయన కూడా ఏడుకొండల వేలుపును ఉద్దేశించి అధ్యాత్మ సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు రచించాడు. 'చక్రవాళ మంజరి' వంటి అనేక కృతులు వెలియించాడు. రేఫరకార నిర్ణయం వంటి వ్యాకరణాంశాలను కూడా తెలియజేస్తూ శతకం రచించిన ఘనత ఈయనకే దక్కుతుంది. పెదతిరుమలాచార్యుడు కూడా తండ్రిలాగే "వేంకటేశ్వర శతకం" రచించాడు. దీన్ని "నీతిసీస శతక మని" కూడా వ్యవహరిస్తారు. దీనిలోనివన్నీ సీసపద్యాలే. ప్రతివారికి సద్గుణాలు ఉండవలసిన ఆవశ్యకతను నేను చెప్పబోయే పద్యం తెలియజేస్తుంది. ఎక్కడ ధర్మంవుంటే అక్కడ జయం వుంటుంది. 'యతోధర్మ స్తతోజయః' అని ఆర్యోక్తి. దయగలవారికే పుణ్యం సంక్రమిస్తుంది. సత్య వంతులకు సమస్త శుభాలు సమ కూరుతాయి. నియమాన్ని పాటించే వాళ్ళకు సంపదలు సంప్రాప్తిస్తాయి. న్యాయంగా ప్రవర్తిస్తే అనుకున్నవన్నీ సిద్ధిస్తాయి. ఇతరుల పట్ల దాక్షిణ్యంతో వ్యవహరిస్తే స్నేహం చిక్కబడుతుంది. ఎవరైతే భక్తితో భగవంతుణ్ణి ఆరాధిస్తారో వారికాయన సత్ఫలాలను అనుగ్రహిస్తాడు. మనసును జయిస్తే అనుపమ సుఖం కలుగుతుంది. వేరే విధంగా మంచివేవీ సమకూరవు.

అయితే భగవంతుడి అనుగ్రహం వుంటే మాత్రం అవన్నీ తప్పక సిద్ధిస్తాయి. ఇది పెదతిరుమలాచార్యుని ఆలోచన. హృద్యమైన ఆయన పద్యంకూడా ఇక్కడ గమనించండి.

।।సీ।। ధర్మంబు గలచోటఁదలకొను జయమెల్ల
దయగలచో సుకృతంబు నిలుచు
సత్యంబు గలచోట సమకూరు శుభములు
నేమంబుగలచోట నిలుచు సిరులు
పాడిగల్గిన చోటఁబంతంబు లీడేఱు
దాక్షిణ్యమున్నచోఁదగులు మైత్రి
భక్తి చేసిన చోట ఫలమిచ్చు దైవంబు
మనసు నిల్పినచోట మలయు సుఖము
లితరమగుచోట వెదకిన నేలయుండు
సొరిది నీ దైనకృపగల చోటఁగాక
కలితలక్ష్మీశ! సర్వజగన్నివేశ!
విమల రవికోటి సంకాశ! వేంకటేశ!

(తాళ్ళపాక పెదతిరుమలాచార్యుడు – నీతి శతకము, పద్యం:2,పేజి:9)

తెలుగు కవులలో వేమనకెంతో ప్రత్యేకత ఉంది. ఆటవెలదిని తన నాలుకమీద ఆడించిన ధన్యజీవి ఆయన. ఈయన జన్మస్థలం ఈ నాటికీ వివాదాస్పదంగానే ఉంది. అనంతపురానికి చెందినవాడని కొందరు, కడపకు చెందిన వాడని మరికొందరు, చిత్తూరు జిల్లాకు చెందిన వాడని ఇంకొందరూ భావిస్తున్నారు. ఏదిఏమైనా వేమన రాయల సీమ ప్రాంతంవాడే. అసలుసిసలైన ఆంధ్రకవే. ఈయనకు తోచినప్పుడల్లా ఒకపద్యం చెప్పేవాడు. ఆ విధంగా వేమన పద్యాలు లెక్కకు మిక్కిలిగా కనిపిస్తాయి. జనవ్యాప్తిలో వున్న వీటన్నిటినీ సేకరించి సి.పి.బ్రౌన్ ప్రకటించాడు. అవే వేమన పద్యాలు. కొందరు పూజలు చేస్తూ ఉంటారు. అయితే వారి బుద్ధి తిన్నగా ఉండదు. పూజకంటే కూడా బుద్ధే ముఖ్యం. మనసు నిలకడ కలిగితే మాటకూడా నిలకడగా ఉంటుంది. కాబట్టి మాటకంటే కూడా మంచి మనసే ముఖ్యం. కొందరు కులాన్ని బట్టే హెచ్చుతగ్గులు పాటిస్తూ ఉంటారు. అది సబబుకాదు. వారివారి గుణాలను బట్టే హెచ్చుతగ్గులు పాటించాలి. ఈ నీతి లోకరీతికి ఎంతో అవసరం. వేమన ఆలోచనల అక్షరరూపమిదే.

।।ఆట।। "పూజకన్న నెంచ। బుద్ధి నిదానంబు
మాటకన్న నెంచ। మనసుదృఢము
కులముకన్న నెంచ। గుణము ప్రధానంబు
విశ్వదాభిరామ । వినురవేమ! "

(వేమన–వేమనశతకం,పద్యం:12, పేజి:7)

వర్షం పడకపోతే కరువు వస్తుంది. వర్షం అధికంగా పడితే వరదవస్తుంది. ఇవి రెండూ ప్రకృతి వైపరిత్యాలే. ఇవి మారిమారి వస్తున్నట్టే మంచీ, చెడులు కూడా మారిమారి వస్తాయి. కాబట్టి సమభావాన్ని అలవరచు కోవాలని ధ్వనిరూప వేమన సూచన.

।।ఆట।। "వాన కురియకున్న। వచ్చును క్షామంబు
వాన గురిసెనేని। వఱద పాఱు
వఱద కఱవురెండు । వరుసతో నెఱుగుడి
విశ్వదాభిరామ । వినురవేమ!"

(వేమన–వేమనశతకం, పద్యం:66, పేజి:35)

సింహం బక్కచిక్కి వుంటే కుక్కయినా దాన్ని బాధపెడుతుంది. ఇక్కడ సింహం పంతం చెల్లదని అభిప్రాయం. అదే విధంగానే బలహీనంగా ఉన్నప్పుడు ఎవరైనా తమ పంతం చెల్లించుకోవాలను కోవడం హాస్యాస్పదమే అవుతుంది. దీన్ని తెలియజేసే వేమన పద్యం ఇది.

।।ఆట।। "చిక్కియున్నవేళ ! సింహంబునైనను
బక్కకుక్క కఱచి ! బాధ చేయు
బలిమి లేని వేళఁ ! బంతంబు చెల్లదు
విశ్వదాభిరామ ! వినురవేమ!"

(వేమన–వేమన శతకం, పద్యం:75, పేజి:40)

కడప జిల్లా బద్వేలు సమీపంలో కందిమల్లయ్యపల్లె గ్రామం ఉంది. ఇక్కడే పోతులూరి శ్రీ వీరబ్రహ్మంగారు జీవించి జీవసమాధి పొందారు. ఆయన అనేక కాలజ్ఞాన తత్వాలు రచించారు. శ్రీకాళికాంబా సప్తశతి అనే కృతిని వెలయించారు. వీరీశతకంలో జీవకోటికి మేలు చేస్తే సద్గతి, భగవత్ప్రాప్తి కలుగుతాయని తెలియజేశారు. జీవకోటిని హింసిస్తే యమదండన తప్పదని హెచ్చరించారు. ఆట వెలదిలో అందరికీ అర్థమయ్యే విధంగా వీరి పద్యాలు అమరాయి.

।।ఆట।। "జీవకోటికెల్ల శ్రేయమ్ముదలచెడు
పారమార్థికునకు పట్టు దొరకు
పరులహింసపెట్టు పాపియాతనలందు
కాళికాంబ! హంస! కాళికాంబ"

(శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారి ఆత్మజ్ఞానం)

పూజ్యభావంతో తల్లిని చూసే మగవారికి పరస్త్రీలు కూడా తల్లిగానే గోచరిస్తారు. అలాకాక పరస్త్రీలను హింసించేవారికి నరకం తప్పదు. ఇది బ్రహ్మంగారి వాక్కు.

।।ఆట।। "మాతృపూజజేయు మగవారికెల్లను
అన్యకాంత తల్లియట్లుతోచు
ఎఱుక మఱచువాడు నరకమ్ముపాలౌను
కాళికాంబ! హంస! కాళికాంబ!

(శ్రీ వీరబ్రహ్మేంద్రస్వాములవారి ఆత్మజ్ఞానం)

ఆచార్య శలాక రఘునాథశర్మగారు అనంతపురంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖలో పనిచేసి విశ్రాంతి పొందారు. వీరు తెలుగు భాషా సాహిత్యాల్లో నిష్ణాతులు. సంస్కృత సాహిత్యంలోనూ చక్కని అధికారం ఉన్నవారు. ఉత్పల చంపకమాల పద్యాలతో శ్రీశంకర శతకము రచించారు. దీనిలో సగటు మానవుల సహజ స్వభావాన్ని చక్కగా ఆవిష్కరించారు. మానవుడు తనలో లేని మంచి గుణాలను కూడా చెప్పి ఎవరైనా పొగిడితే సంతోషిస్తాడు. ఉన్న ఒక దుర్గుణాన్నయినా ఎత్తిచూపితే ఆ విధంగా ఎత్తి చూపిన వారిని నీచులుగా పరిగణిస్తాడు. ఇది సబబు కాదని ఈ పద్యంలోని ధ్వని.

॥చ॥ "తనయెడలేని సద్గుణ వితానముఁబ్రస్తుతిసేయ నెంతయున్
మనమున సంతసించి కడు మాన్యునిగా నొనరించు, నాతఁడే
తనదగు నొక్క దుర్గుణము తప్పక పల్కినఁగోపగించి వా
నినిఁగడు నీచుఁడంచును గణించును నీచుఁడు; గాదె శంకరా!"

(శలాక రఘునాథశర్మ–శ్రీశంకర శతకము, పద్యం: 14,పేజి:13)

మాతృప్రీతి, మాతృదేశం, మాతృభాష మానవత్వ పరిమళానికి హేతువులు. కాబట్టి ఈ మూడింటిని మరువ రాదు. మన మాతృభాష తెలుగు కావడం యాదృచ్ఛికమే అయినా అది మన అదృష్టం అని చెప్పుకోవలసి ఉంటుంది. "ఆంధ్రత్వమాంధ్రభాషాచపూర్వజన్మతపఃఫలం" అని అప్ప కవి చెప్పినట్టు ప్రతీతి. తెలుగు నేలమీద తెలుగువారుగా పుట్టినందుకు మనమంతా గర్వించవలసి వుంది. అయితే దురదృష్టవశాత్తు తెలుగు మీది అభిమానం క్రమంగా తగ్గిపోతూ వుంది. ఇది ఎంతయినా శోచనీయం. తెలుగు భాష ఘనతను గురించి చాలామంది కవులు పాఠకుల దృష్టికి తీసుకువచ్చారు. ఆ అంశాలన్నిటినీ మనసులో కెక్కించుకొని కొత్త చైతన్యంపొందడం ఎంతయినా అవసరం. తెలుగు పద్యం, తెలుగు పాట ఎంతో మధురంగా ఉంటాయని, మొత్తానికి తెలుగుదనమే మిక్కిలి కమ్మదనమని ఆచార్య జక్కంపూడి మునిరత్నంగారు తమ "తెలుగుబాల శతకం"లో తెలియజేశారు. ఆ పద్యం ఇది.

॥ఆట॥ "తెలుగు పద్యమునకు దీటొక్కడున్నది
తెలుగు పాటకంటె తీపిఏది
తెలుగు దనముకన్న కలిమి ఎందున్నది
తెలివిగలిగి మసలు తెలుగుబాల!"

(డా॥ జక్కంపూడి మునిరత్నం–తెలుగు బాలశతకం, పద్యం:51, పేజి:11)

కర్నూలు సిల్వర్ జూబ్లీ కళాశాలలో పనిచేసిన తెలుగు ఉపన్యాసకులు శ్రీమాన్ వైద్యం వేంకటేశ్వరాచార్యులు. వీరు పరిశోధనలో సిద్ధహస్తులనడం 'పరిశోధకరత్న' అనే వీరి బిరుదునుబట్టే తేటతెల్లమవుతుంది. వీరు బహుగ్రంథకర్త. వీరు 'తెలుగుభాష' పద్యశతము రచించి ఆంధ్రభారతికి అనుపమ కైంకర్యం చేశారు. తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేయడం నాలుగు ముఖాలున్న బ్రహ్మదేవుడికి గానీ, చదువుల తల్లి సరస్వతికి గానీ సాధ్యమయ్యే పనికాదని ఈయన అభిప్రాయం. తేనెలొలికే విధంగా తెలుగు పలుకులుంటాయని వైద్యంవారు నొక్కివక్కాణించారు.

॥ఆ॥ "తెలుగుభాష ఘనత దెలుపగా వశమౌనె?
నలువకైన వాని చెలువకైన!
తెలిసినంత కొంత తేట తెల్లము సేతు
తియ్య తేనెలొలుకు తెలుగుభాష

(వైద్యం వేంకటేశ్వరాచార్యులు–తెలుగుభాష (పద్య శతము), పద్యం:2,పేజి:11)

'దేశభాషలందు తెలుగులెస్స' అని కవి సార్వభౌముడు శ్రీనాథ మహాకవి తెలియజేశాడు. ఆయన అభిప్రాయాన్నే ఆంధ్రభోజుడైన శ్రీకృష్ణదేవరాయలు కూడా సమర్థించాడు. వీరి అడుగుజాడలోనే పయనించిన వైద్యం వారు కూడా దేశభాషలన్నిటిలోనూ తెలుగు తేజం గొప్పదన్నారు. అచ్చులు పాదాంతంలో చోటుచేసుకోవడం వల్ల ఇది 'అజంత భాష'గా ప్రసిద్ధి వహించింది. మార్ధవాన్ని, మాధుర్యాన్ని సంతరించుకొని పాఠకుల మన్ననకెక్కింది. ఇందలి ప్రతిమాట ఒక తేనెపూటగా గోచరించి వ్యవహర్త లను మైమరపిస్తూ వుంది. ఈ అంశాన్నే వేంకటేశ్వరా చార్యులు సైతం అద్భుతంగా ఆవిష్కరించారు.

॥ఆట॥ "దేశభాషలందు తేజరిల్లెడు భాష
అందచందముల 'అజంత భాష'
పలుకులందు తేనెలొలుకు చుండెడి భాష
పలుక వలయు గాదె తెలుగుభాష."

(వైద్యం వేంకటేశ్వరాచార్యులు–తెలుగు భాష (పద్య శతము), పద్యం: 6, పేజి:11)

రాయలసీమ శతక సాహిత్యంలోని పద్యాలు రత్నాలు. సూక్తిముత్యాలు. అనుసరణీయ మార్గనిర్దేశకాలు. కాబట్టి వివిధ మేధల నుండి వెలువడిన ఈ హృద్య పద్యాలను పఠించి పరవశిద్దాం. వాటిలోని ఆంతర్యాన్ని గ్రహించి ఆనందిద్దాం.

డా॥ డి.యువశ్రీ
సహాయాచార్యులు, తెలుగు అధ్యయన శాఖ
శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి
చరవాణి : 9885940011

తెలుగు కన్నడ పత్రికలు – ప్రజా చైతన్యం

– డి.కె.ప్రభాకర్

మానవుడు సంఘజీవి. కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ అవసరమయినట్లే సమాజంలో జరిగే సంఘటనల సమాచారాన్ని గ్రహించడం, తనకు తెలిసిన సమాచారాన్ని మరొక చోటికి చేరవేయడం ఆనాటి నుండి నిత్యకృత్యంగా నడుస్తూ వస్తున్న సంగతి. అంటే "సమాచార చేరవేత" ప్రక్రియ మానవుడి అనుదిన జీవితంలో ఒక విడదీయరాని ముఖ్యాంశమయిందని చెప్పొచ్చు. మానవుడు తనచుట్టూ ఉన్న సమాజంలో జరుగుతున్న పరిణామాల్ని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ తనకు తెలిసిన విషయాల్ని ఇతరులకు తెలియజేయడానికి ప్రయత్నిస్తాడు. సమాచార చేరవేత క్రియ మానవ జాతికి లభించిన సహజసిద్ధ వరం. పశుపక్షాదులలో కూడా ఈ తరహా ప్రక్రియ అమలులో ఉన్నప్పటికీ మానవుళ్లా అవి మాట్లాడుకోవటం, ఆలోచించడం చేయలేవు. ఏది ఏమైనప్పటికీ ఈ రెండు క్రియలు ప్రకృతిలో మానవుడి కొక్కడికే పరిమితమవ్వడం ప్రకృతి మానవజాతికి ప్రసాదించిన ప్రత్యేక వరం.

ఆదిమానవుడి ఆటా, పాట జానపద కళారూపాల ఆవిర్భావానికి మూలకారణమయినట్లే మానవుడు కనుగొన్న 'లిపి' జర్నలిజం లేదా పత్రికా రచన ప్రక్రియకు బీజాలు వేసింది. లిపి ఆవిర్భవించింది మొదలు సమాచారం ఇతరులకు అందజేసే ప్రక్రియ మొదలయింది. అయితే ఆధునిక సాహిత్య ప్రక్రియల అభివృద్ధికి పారిశ్రామికాది విప్లవాలు ఏవిధంగా దోహదకారులయ్యాయో 'జర్నలిజానికి' కూడా అదే తరహా విప్లవాలు ఒక స్పష్టమయిన రూపాన్నిచ్చాయని తెలుస్తుంది. ఆధునిక భావజాలానికి పుట్టినిల్లయిన ఐరోపాదేశాలే పత్రికా రచనా ప్రక్రియక్కూడా మూలస్థానా లయ్యాయి. అయితే జొహెన్ గూటెన్ బర్గ్ (1400 –1468) అచ్చుయంత్రాన్ని కనిపెట్టడంతో పత్రికా రంగంలో కనీవినీ ఎరుగని రీతిలో మార్పులు వచ్చాయి. పత్రికారచన ప్రపంచ దేశాలకి విస్తరించింది.

క్రీ.పూ.అయిదో శతాబ్దం ప్రాంతంలో రోమన్ సామ్రాజ్యాధినేత జూలియస్ సీజర్ తన పాలనా ప్రాంతంలోని నగర వీధుల్లో 'ఆక్టడ్యూరా'ల్ని వేయించినట్లే మనదేశంలో క్రీ.పూ. మౌర్యచక్రవర్తి అశోకుడు తన పాలనా నిర్ణయాల్ని శిలల మీద చెక్కించి పాలనా ప్రాంతం నలు మూలలా ప్రతిష్ఠింపచేశాడు. వీళ్ల కాలంలోనే 'వార్తా హరుల్ని' నియమించినట్లు చాణుక్యుడు 'అర్థశాస్త్రం'లో పేర్కొన్నాడు. అయితే మనదేశంలో మొగలాయి చక్రవర్తుల పాలన పత్రికా రచనకు ప్రాణం పోసిందని చెప్పొచ్చు. వీళ్ల కాలంలో 'న్యూస్‌లెటర్స్'ని విస్తృతంగా వాడారు. ఈ న్యూస్ లెటర్స్‌ని 'వహకినియాస్' లు అని పిలిచేవారు. అటు తర్వాత కొన్నాళ్లకు ఆంగ్లేయుల జోక్యంతో పత్రికలకు ఒక స్పష్టమైన రూపం వచ్చింది.

జాతీయోద్యమంలో తెలుగు – కన్నడ పత్రికలు

తెలుగు – కన్నడ ప్రాంతాలలో రాజకీయ చైతన్యాన్ని, దేశభక్తిని చాటడంలో పత్రికలు ప్రధాన పాత్రను నిర్వహించాయి. నిజంగా చెప్పాలంటే తెలుగు జాతిని తట్టి మేల్కొల్పింది పత్రికలే. తెలుగు, కన్నడ ప్రజలలో సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని కలిగించడంలో కూడా పత్రికల పాత్ర అద్వితీయమైనది. ఆనాటి పత్రికలు ముఖ్యంగా కొన్ని ప్రధాన లక్ష్యాల్ని నెరవేర్చాయి. అవి –

1. సమకాలీన పరిస్థితులకు అనుగుణమైన మనోభావాలను ప్రజల్లో రేకెత్తించాయి. 2. తెలుగు – కన్నడ ప్రజల్లో జాతీయ దృక్పథాన్ని, దేశభక్తి భావాన్ని పేరేపించాయి. 3. ఆధునిక విజ్ఞాన అంశాల పట్ల ప్రజల్లో ఆసక్తిని కలిగించాయి. 4. భాషా సాహిత్యాల పట్ల ఆసక్తిని, అభిమానాన్ని పెంపొందించి సాంస్కృతిక రంగంలో మనమెవ్వరికీ తీసిపోమన్న ఆత్మవిశ్వాసాన్ని కలిగించాయి.

తెలుగు పత్రికలు : తెలుగులో తొలి పత్రిక ఏది? ఎప్పుడు ప్రారంభ మయింది? అన్న విషయంలో కొన్ని వివాదాలున్నాయి. కారణం 19వ శతాబ్దం మూడో దశకంలోని సంఘటనల్ని, పరిణామాల్ని మన పూర్వీకులు ఖచ్చితంగా నమోదు చేయలేక పోయారు.

సత్యదూత: తెలుగులో మొదటిసారిగా ప్రచురించబడిన పత్రిక 'సత్యదూత'. అయితే ఇది వివాదాంశమని కొందరు వాదించారు. 1835లో బళ్లారి క్రైస్తవ మిషనరీలు మద్రాసు నుండి సత్యదూత అనే మత పత్రికను ప్రారంభించారనీ

అదే తొలి తెలుగు పత్రికవుతుందని విష్ణుభట్ల నూర్య నారాయణ, నిడదవోలు వెంకట్రావు, నార్ల వెంకటేశ్వరరావు లాంటి ప్రముఖులు అభిప్రాయపడ్డారు. అయితే నేటికీ దీనికి సంబంధించిన ప్రతులు లభ్యం కాలేదు. క్రైస్తవ మిషనరీలు పత్రికల్లో సాగిస్తున్న కృషికి ప్రతిస్పందనగా ఆంధ్రులు కూడా మొదట పత్రికలను మత ప్రచారానికే వినియోగించుకున్నారు. వంగదేశంలో రాజా రామమోహన్‌రాయ్ వంటి వారు కూడా తమ పత్రికలో ఉపనిషత్తుల గురించి, వేదాల గురించి రాసేవారు. క్రైస్తవులు ఆనాడు చేస్తున్న మత ప్రచారాన్ని ఎదుర్కోవడానికి వారు అలా చేయక తప్పిందికాదు. తెలుగు పత్రికల్లో హిందూమత ప్రచారం ప్రతిక్రియగానే జరిగింది తప్ప హిందూ మతమే గొప్పదన్న గర్వభావంతోనో, మతోన్మాదం తోనో సాగింది కాదు. దాదాపుగా 1840లో వెలువడిన 'వృత్తాంతిని' 1842 జూన్ 8న మద్రాసు నుండి ప్రారంభమైన వర్తమాన తరంగిణి, పాశ్చాత్యుడు తెల్ల దొరల్లో గొప్ప తెలుగు పండితుడని పేరొందిన జె.ఎడ్మండ్ షార్క్ 1848లో ప్రారంభించిన హితవాది, 1852లో 'సంవాద కౌముది', 1863లో 'శ్రేయక్షణి', 1864లో 'తత్వబోధి'ని లాంటి పత్రికలు ఎంతోకొంత హిందూమత ప్రచారం సాగించిన మాట వాస్తవం. సుప్రసిద్ధ సంఘసేవ కుడయిన తెలుగవాడు-గాజుల లక్ష్మీ నరసుచెట్టి ఇంగ్లీషులో 'క్రీసెంట్' పత్రికను ప్రచురించాడు. ఈ పత్రిక ఒక పక్క దేశీయుల అభివృద్ధికి కృషిచేస్తూ మరోపక్క మిసనరీలు, ప్రభుత్వ ఉద్యోగులు మొదలైనవాళ్ల అన్యాయాల్ని విమర్శిస్తూ ఉండేది. అందువల్ల ఈ పత్రికపై బ్రిటీషు ప్రభుత్వానికి కోపం ఎక్కువగా వుండేది. 'ఆంధ్ర' పదం మొదట ఉంచి పత్రికకు 'ఆంధ్ర భాషా సంజీవిని' (1871-99) అన్న పేరుతో కొక్కొండ వెంకటరత్నం ప్రారంభించారు. ఈ పత్రికలో ప్రాచీన సంస్కృతిని ప్రస్తుతించే వ్యాసాలు, సాహిత్య చర్చా వ్యాసాలు, సామాజిక రాజకీయ వివాదాంశాలు, గ్రంథ సమీక్షలు, స్త్రీ విద్యను వ్యతిరేకించడం, వితంతు వివాహాల ఖండన వంటి విషయాల్ని ప్రచురించేది.

1872లో ఉమారంగనాయకులు సంపాదకత్వంలో మచిలీపట్నం నుండి కొత్తరకం పత్రిక వెలువడింది. ఈ పత్రిక పైన తెలిపిన పత్రికలకంటే భిన్నమైంది. ఈ పత్రిక తొలిసారిగా శాస్త్రము, భాష, మతము, పద్యము, నీతి, వ్యవసాయము, దోహదము, వర్తకము, కళలు, విద్యా విషయాలు, పురాతన స్థితులు, విగ్రహారాధన, కులతత్వం, స్త్రీ విద్య, స్త్రీ పునర్వివాహం మొదలైన విషయాలను చర్చించి అభ్యుదయ దృక్పథాన్ని కనబరిచింది. తెలుగు ప్రజల్లో గొప్ప చైతన్యం తీసుకు వచ్చింది. ఈ పత్రిక తెలుగు పత్రికలకొక కొత్త ఒరవడిని చూపింది.

కందుకూరి వీరేశలింగం - పత్రికలు : కందుకూరి వీరేశలింగం ఎంత గొప్ప సంఘసంస్కర్తో అంత ఆదర్శ ప్రాయుడైన పత్రికా రచయిత కూడా. ఈయన 1874లో ప్రారంభించిన 'వివేక వర్ధని' పత్రిక తెలుగు పత్రికా రంగంలో నవశకాన్ని ఆవిష్కరించిందంటే అతిశయోక్తి ఎంతమాత్రము కాదు. ఆయన 'హాస్యసంజీవని' పత్రిక ద్వారా ఆనాటి సమాజంలో కొనసాగుతున్న దురాచారాలను, మూఢవిశ్వాసాలను ఖండించడానికి స్త్రీలలో విద్యావ్యాప్తిని పెంపొందించడానికి, వితంతు వివాహ ప్రాధాన్యాన్ని ప్రచారం చేయటానికి వీరేశలింగం పత్రికను ఆయుధంగా వాడుకున్నారు. వీరేశలింగం 'సతీహిత బోధిని' పత్రకను కేవలం మహిళాలోక పునరుజ్జీవనానికి అంకితం చేశారు. 19వ శతాబ్దంలో స్త్రీలు బలహీన వర్గంతో సమానం. ఈ బలహీన వర్గ శ్రేయస్సు కోసం ఎలాంటి ప్రతిఫలం ఆశించకుండా ఆయన పత్రికల ద్వారా కృషి చేశారు. కందుకూరి స్థాపించిన పత్రికలు సాంఘిక మత సంస్కరణలతో పాటు సాంస్కృతిక రాజకీయ చైతన్యానికి ఎంతగానో కృషిచేశాయి.

నెల్లూరు నుంచి శ్రీ వూండ్ల రామకృష్ణయ్య 1885-1909 మధ్య వెలువరించిన 'అముద్రిత గ్రంథ చింతామణి' పత్రిక ఆనాటి తెలుగు పాఠకుల్లో తెలుగు భాషాసాహిత్యాలపై అమితమైన ఆసక్తిని రేకెత్తించింది. ఈ పత్రిక అమూల్యమైన ప్రాచీన గ్రంథాలను పునర్ముద్రించి పాఠకులకు అందజేసింది. ఆనాడే నవలల పోటీని నిర్వహించి చరిత్ర సృష్టించింది. 1885లో మద్రాసులో ఎ.పి.పార్థసారథి నాయుడు సంపాదకత్వంలో 'ఆంధ్ర ప్రకాశిక' అనే రాజకీయ వారపత్రిక వెలువడింది. ఇదే కాలంలో 'శశిరేఖ, రసికోల్లాసిని' అనే పత్రికలు వెలువడ్డాయి. ఇవన్నీ ఆంధ్రలో రాజకీయ చైతన్యానికి తోడ్పడ్డాయి. 20వ శతాబ్దం ప్రారంభం నాటికే తెలుగు పత్రికల స్వభావంలో మౌలిక మార్పు వచ్చింది. ఈ శతాబ్ధం ప్రారంభంలో దాదాపు పత్రికలన్నీ జాతీయ దృక్పథానికీ, ఆంధ్రాభిమానానికీ, దేశభక్తి స్ఫూర్తికీ ప్రాధాన్యం ఇవ్వసాగాయి. స్పష్టంగా చెప్పాలంటే జాతీయ

ఉద్యమం అవసరాలను గుర్తించి అందుకు అనుగుణంగా తెలుగు పత్రికలు స్పందించసాగాయి. ఈ విషయంలో అనన్యమైన సేవచేసి చరితార్థతను సంపాదించిన 'కృష్ణా పత్రిక'ను సంస్మరించకుండా ఉండలేము. 1902 ఫిబ్రవరి 01న కృష్ణా పత్రికను కొండా వెంకటప్పయ్య, దాసు నారాయణరావు సంయుక్త సంపాదకత్వంలో బందరు నుంచి వెలువడింది. అనంతరం సుప్రసిద్ధ సంపాదకుడు ముట్నూరి కృష్ణారావు ఆ పత్రిక బాధ్యతలను 1905లో చేపట్టి తెలుగు ప్రజల్లో రాజకీయ చైతన్యాన్ని, సాహిత్యాభిలాషను, స్వేచ్ఛా భావాలను కలిగించారు. ఆయన రాసిన సంపాదకీయాలు తెలుగు పాఠకులను ఉర్రూతలూపేవి. బిపిన్‌చంద్రపాల్‌చే నడిచే న్యూఇండియా పత్రిక కృష్ణారావును గొప్పగా ప్రభావితం చేసింది. కృష్ణారావు, బిపిన్‌చంద్రపాల్‌తో కలిసి వంగదేశ పర్యటన అనంతరం స్వదేశీ ఉద్యమం స్ఫూర్తితో 'కృష్ణా స్వదేశీ ముద్రాక్షరశాల' పేరుతో స్వయంగా ఏర్పాటు చేసి, జాతీయ స్ఫూర్తితో నూతన చైతన్యంతో కృష్ణా పత్రికను నిర్వహించారు.

దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు 1908లో బొంబాయిలో 'ఆంధ్ర పత్రిక' అనే వార పత్రికను ప్రారంభించారు. తర్వాత 1914 సంవత్సరంలో మద్రాసు నుంచి దినపత్రికగా మార్చారు. గాడిచర్ల హరిసర్వోత్తమ రావు, అవటపల్లి నారాయణరావు, చల్లా శేషగిరిరావు వంటి ఆంధ్రోద్యమ నిర్మాతలు, గాంధేయవాదులు ఇందులో పనిచేశారు. ఆంధ్ర రాష్ట్రోద్యమానికి, తెలుగు భాషా సాహిత్యాలకు, జాతీయ భావాల వ్యాప్తికి ఈ పత్రిక చేసిన కృషి అనన్య సామాన్యం. 1925లో కొమ్మూరి వెంకట్రామయ్య తెనాలి నుంచి 'వార్త' దినపత్రికను ప్రారంభించారు. 1922లో జస్టీసు పార్టీవారు గుట్టి రాఘవయ్య నాయుడు సంపాదకత్వంలో న్యాయదీపిక అనే దినపత్రికను నడిపారు. 1938లో 'ఆంధ్రప్రభ' దిన పత్రికను రామనాథ గోయెంకా స్థాపించారు. ఈ పత్రికకు ఖాసా సుబ్బారావు తొలి సంపాదకులు. ఆ తర్వాత న్యాపతి నారాయణమూర్తి 1942 వరకూ పనిచేశారు. ఆయన తర్వాత నార్ల వెంకటేశ్వరరావు సంపాదకులుగా పనిచేశారు. ఈయన కాలంలో ఆంధ్రప్రభ దినపత్రిక సర్ణయుగంగా పేర్కొనవచ్చు. ఆంధ్ర పత్రిక, ఆంధ్రప్రభ దేశ స్వాతంత్ర్యం కోసం, ఆంధ్రరాష్ట్ర అవతరణ కోసం విశేష కృషి చేశాయి. తెలంగాణ ప్రాంతంలో ప్రజల్లో గొప్ప రాజకీయ చైతన్యం తీసుకొచ్చిన పత్రిక 'గోల్కొండ'. మాడపాటి హనుమంత రావు 1925లో గోల్కొండను పక్ష పత్రికగా ప్రారంభించారు. అనంతరం సురవరం ప్రతాపరెడ్డి నేతృత్వాన తెలంగాణాలో ఆంధ్రోద్యమానికి ఎనలేని కృషి చేసింది. ఆంధ్రోద్యమానికి, జాతీయోద్యమానికి గోల్కొండ పత్రిక ఆయువుపట్టుగా చారిత్రాత్మక మైన సేవ చేసింది. ఆంధ్ర పత్రిక అధినేత 1924లో 'భారతి' అనే మాస పత్రికను ప్రారంభించారు. ఇది తెలుగు భాషా సాహిత్యాల వికాసానికే కాక చరిత్ర పరిశోధనా రంగానికి సైతం తోడ్పడింది. దాదాపు ఇదే కాలంలో కొంపెల్ల జనార్ధనరావు సంపాదకత్వాన 'ఉదయిని', విశ్వనాథ సత్యనారాయణ సంపాదకత్వాన 'జయంతి', పాటిబండ్ల మాధవశర్మ నేతృత్వాన 'వీణ' ముద్దుకృష్ణ సంపాదకత్వంలో 'జ్వాల' పత్రికలు తెలుగు వారి భాషా సాహిత్య వికాసాలకు ఎంతగానో కృషి చేశాయి.

కన్నడ పత్రికలు : కన్నడంలో తొలి పత్రిక ఏది? ఎప్పుడు ప్రారంభమయింది? అన్న విషయంలో కూడా కొన్ని వాదోపవాదాలున్నాయి. నాడిగ్ కృష్ణమూర్తిగారు తన మహా ప్రబంధంలో బళ్ళారి నుండి వెలువడిన 'కన్నడ సమాచార' పత్రికే మొదటి కన్నడ పత్రికని పేర్కొన్నారు. మంగళూరు నుండి ప్రచురితమయ్యే ఈ పత్రిక తదనంతరం 'మంగళూరు సమాచార'గా పేరు మారిందని ఘంటా పథంగా చెప్పారు. అయితే శ్రీనివాస హావనూరు గారు తమ పరిశోధనల ద్వారా 'కన్నడ సమాచార' పత్రిక తొలి పత్రిక కాదని, క్రీ.శ.1843 జులై 1న బాసెల్ మిషనరీ సహాయంతో 'హర్మన్ మోగ్లింగ్' ప్రారంభించిన 'మంగళూరు సమాచార'నే కన్నడ మొట్టమొదటి పత్రికని నిరూపించారు.

కర్ణాటకలో క్రీ.శ.1843 నుండి 1857 మధ్య కాలంలో కొన్ని పత్రికలు ప్రారంభమైనప్పటికి ప్రోత్సాహం, చందాదారులు లేకపోవడంతో అర్ధాంతరంగా నిలిచి పోయాయి. 1860 దశాబ్దం చివరి నాటికి కర్ణాటకలో నూతన భావాలతో పత్రికోద్యమ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. పత్రికలు ప్రజల మంచిచెడులు, జాతీయ రాజకీయ, సామాజిక అంశాలపట్ల దృష్టిని సారించాయి.

బెంగళూరులో 'కర్ణాటక ప్రకాశిక' అనే పత్రిక ప్రారంభం కావడంతో ప్రాంతీయ భావం పుట్టుకకు ముందడు పడింది. అదే సందర్భంలో మైసూరులో 'కర్ణాటక భాషోజ్జీవిని', ధారవాడలో 'కర్ణాటక విద్యావర్ధక' సంస్థలు ప్రారంభమయ్యాయి. ఇవి అత్యంత ప్రముఖ సాంస్కృతిక, సాహిత్య కేంద్రాలుగా ఉండేవి. తరువాయి ఈ రెండు నగరాలు జాతీయోద్యంలో కీలక పాత్రను పోషించాయి. 1890లో రా.హ.దేశపాండె గారు ధారవాడలో స్థాపించిన 'కర్ణాటక విద్యావర్ధక' సంఘం కర్ణాటక ఏకీకరణ, దేశీయ రాజకీయాలు వంటి వాటిని చర్చించడానికి వేదికగా మారింది. బ్రిటీష్ పండితులు,

పరిశోధకులైన రైస్, జోగ్లర్, కిట్టల్ వంటి మహనీయులు చేసిన కృషి ఫలితంగా శతాబ్దాల నుండి మరుగునపడిన చరిత్ర, సాహిత్య వారసత్వ సంపదను కన్నడిగులు తెలుసుకోవడాని సాధ్యమయింది. ఇది జాతీయోద్యం వైపు ఆకర్షితులవడానికి దోహదపడింది. కన్నడ సాహిత్య కార్యక్రమాలు ఎక్కువ కావడంతో కన్నడిగుల్లో సాహిత్య స్పృహ పెరగడంతో పాటు దేశీయతా భావం పెంపొంద డానికి కారణమయ్యింది. నవయుగ, కర్ణాటక, నాగరీక, తాయినాడు, సంయుక్త కర్ణాటక, నవకర్ణాటక, ప్రబుద్ధ కర్ణాటక, జయ కర్ణాటక వంటి అనేక పత్రికలు కథ, కవిత్వం, చరిత్ర వంటి వాటికి సంబంధించిన వ్యాసాల్ని ప్రచురించడం కారణంగా ప్రజల్ని వలస వాదానికి విరుద్ధంగా పోరాడటానికి సన్నద్ధం చేశాయి. బ్రిటీష్ వాళ్లు ప్రవేశపెట్టిన ఆంగ్ల విద్యావిధానం కూడా ప్రజల్ని మేల్కొల్పిందని చెప్పవచ్చు. ఆంగ్ల విద్య కన్నడిగులలో కొత్త ఆలోచనల్ని రేకెత్తించడంలో దోహదపడింది.

బ్రిటీషుల పాలనలో లేని సంస్థానాలలో మైసూరు సంస్థానం ఒకటి. దేశీయ రాజుల్ని, సంస్థానాల స్వయం ప్రతిపత్తిని కాపాడటానికి అనేక స్థానిక పత్రికలు ప్రయత్నించాయి. 1831లో మైసూరు సంస్థానాన్ని ఆక్రమించి, రాజుని నామమాత్రం చేసి బ్రిటీష్ కమీషనర్ పరిపాలనను కొనసాగించారు. దీనికి విరుద్ధంగా ముమ్మడి కృష్ణరాజులు అధికారాన్ని మళ్ళీ చేజెక్కించుకోవటానికి పోరాటం చేశారు. రాజుకు మద్ధతుగా అనేక పత్రికలు, ప్రజలు నిలిచారు. అనంతరం 1881లో అధికారం పదవ చామరాజ ఒడెయర్‌కి దక్కింది. బెంగళూరులో శ్రీనివాస అయ్యంగార్ 'హితబోధిని', రంగరాయలు 'కొడగు చంద్రికె' పత్రికల్ని ప్రారంభించి రాజకీయ అంశాలకు చెందిన వార్తల్ని ప్రచురించేవారు. మైసూరులో జాతీయతా భావాల్ని పెంపొందింపజేయడానికి అనేక పత్రికలు ప్రారంభ మయ్యాయి. బెంగళూరు నుండి 'కర్ణాటక ప్రకాశిక', ధారవాడ 'శోధక', 'చంద్రోదయ', బెళగావి నుండి 'సొబగిన సుద్ది', 'కర్ణాటక వృత్త' వంటి పత్రికలు జాతీయతా భావాల్ని ముందుకు తీసుకెళ్లాయి. 'కర్ణాటక ప్రకాశిక' పత్రిక ప్రారంభంలో బ్రిటీషు ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేనప్పటికి కాలక్రమంలో ప్రభుత్వానికి విరుద్ధంగా పనిచేస్తూ, ప్రజల్లో జాతీయతా భావాల్ని ప్రేరేపించాయి. అదే ధోరణిలో 'మైసూరు స్టార్', 'సాద్వి' లాంటి పత్రికలు దేశంలోని అరాచకత్వాన్ని ప్రజల ముందుంచి ప్రజల్ని సంఘటితం చేయడంలో ముఖ్య పాత్రను పోషించాయి. కన్నడ పత్రికా రంగంలో ఎం.వెంకటకృష్ణయ్య గారి ప్రవేశంతో పత్రికోద్యమానికి గట్టి పునాది పడినట్లయింది. వీరు 1885లో 'వృత్తాంత చింతామణి', 1886లో 'మైసూరు హెరాల్డ్', 1912లో 'సంపదభ్యుదయ', నేచర్‌క్యూర్, సాద్వి వంటి పత్రికల్ని స్థాపించి రాజకీయ, ఆర్థిక, సామాజిక దురాచారాలు, ప్రజల స్థితిగతుల్ని గూర్చి అనేక వార్తల్ని ప్రచురిస్తూ ప్రజల్ని ఉత్తేజితుల్ని చేశారు. అందుకే ఎం.వెంకటకృష్ణయ్య గారిని 'పత్రికోద్యమ తాతయ్య' అని పిలిచేవారు. వీరి పత్రికలలో దేశభక్తి ఎక్కువగా కన్పిస్తుంది. ప్రజల్లో బ్రిటీష్ వ్యతిరేక భావాల్ని, ఆత్మస్థైర్యాన్ని నింపడంలో కృతకృత్యు లయ్యారు. బెంగళూరు నుండి ప్రచురితమయ్యే 'ఈవెనింగ్ మైల్', మైసూర్ స్టాండర్డ్, నడెగన్నడి మున్నగు పత్రికలకు వ్యాసరచనలు రాసే డి.వి.గుండప్ప గారు 'కర్ణాటక పత్రిక'ను ప్రారంభించారు. డి.వి.జి గారి రచనలలో అభ్యుదయ భావజాలం, భాషాశైలి అత్యున్నతంగా ఉండేది.

జాతీయోద్యమంతో పాటు కర్ణాటక ఏకీకరణ భావజాలం కూడా పెరుగుతూ వచ్చింది. జాతీయ నాయకులైన తిలక్ ప్రారంభించిన కేసరి, మరాఠ పత్రికలు కర్ణాటక భూభాగంలోని మైసూరు, కొడగు, మద్రాసు ప్రెసిడెన్సిలలో కూడా ప్రాచుర్యం పొందాయి. జాతీయోద్యమంలో భాగంగా అభివృద్ధి చెందిన కర్ణాటక పత్రికోద్యమం ప్రజల్లో జాతీయభావాన్ని పెంపొందిస్తు, బ్రిటీషుల విరుద్ధంగా పోరాడటానికి ప్రేరణను ఇచ్చింది.

సారాంశం : జాతీయోద్యమ కాలంలో వచ్చిన తెలుగు – కన్నడ పత్రికలు రాజకీయ, సామాజిక, సాంస్కృతిక జీవనంలో ఒక భాగమై ప్రజల్లో చైతన్యాన్ని తీసుకొచ్చాయి. మాతృ భూమి, భాష, సంస్కృతుల పట్ల తెలుగు కన్నడిగుల్లో జాగృతిని పెంచడానికి పత్రికల ద్వారా పరోక్షంగా క్రైస్తవ మిషనరీలు ఎంతో దోహదం చేశాయి. ఆంగ్ల విద్యతో పాటు ప్రాంతీయ భాషల్ని కూడా నేర్చుకునే అవకాశాన్ని క్రైస్తవ మిషనరీలు కల్పించడంతో మాతృభూమి, భాషల గొప్పతనాన్ని తెలుసుకొనే అవకాశం కలిగింది. ఆంగ్ల విద్యావిధానం జ్ఞాన విద్యార్జనకు, సామాజిక వికాసానికి, సాంస్కృతిక పునరుజ్జీవనానికి పత్రికలు చేసిన కృషి చిరస్మరణీయమైనది. బ్రిటీషు పాలకులు పత్రికలపై అనేక నిర్బంధాల్ని విధించినప్పటికి వాటిని లెక్కచేయకుండా ప్రజల్ని చైతన్యపరచి, జాతీయ భావాల్ని నింపి జాతీయోద్యమాన్ని ప్రజా ఉద్యమంగా మార్చి స్వాతంత్ర్య సముపార్జనలో పత్రికలు కీలక పాత్రను పోషించాయనడంలో సందేహం లేదు.

డా॥ డి.కె.ప్రభాకర్
చరవాణి : 7795444919, 7892155603

హాన్స్ హెూల్ బయిన్ - రాయబారులు

హాన్స్ హెూల్‌బయిన్

- తంగెడ విశ్వేశ్వర ప్రసాద్

పదిహేనవ శతాబ్దం నుండి పందొమ్మిదవ శతాబ్దం మధ్యకాలంలో పెయింటర్లు, శిల్పులు, రచయితలు, సంగీతకారులు లాంటి కళాకారులందరూ సొంత ఖర్చులతోనో, అప్పు చేసో ఇటలీకి వెళ్ళి, సాధ్యమైనంత వరకు అక్కడ గడపడం ఒక ఆచారంగా వుండేది. ఇంకా చెప్పాలంటే తప్పనిసరి పరిస్థితి. చిత్రకారులైతే ఇటలీ చిత్రకళను, ప్రఖ్యాత చిత్రకళాకారుల్ని అధ్యయనం చేయడం, వారనుసరించిన పద్ధతుల్ని అనుకరించడం, రచయితలైతే (బైరన్, షెల్లీ, కీట్స్) ఆ సంస్కృతిని వంట బట్టించుకున్నవారే. అందుకు కారణం పాశ్చాత్య ప్రపంచం దాన్ని మహెూన్నత సంస్కృతిగా భావించడం. ఇటలీ కళాస్రష్టలు నిర్ణయించిన ప్రమాణాలు ఆధునిక చిత్రకళకు మూలాధారమైన లియెనార్డో డాలించీ, రాఫేల్‌లు కాన్వాస్ మీద రంగులతో సృష్టించిన కళాఖండాల రహస్యాలను అనుకరించారు. ఈ ఆచారాన్ని ఏదో ఒక రోజు ఎవరో ఒకరు ఛేదించక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఫ్రెంచి కళాకారుడు డెల్‌క్రా మొదటిసారిగా ఇటలీ కళాకారులు అంతగా రాణించడానికి అనుకూలించిన పరిస్థితుల్ని గుర్తించాడు.

ఇటలీ దేశీయులు దేశం వదిలి ఎక్కడికీ పోకుండా, కాలు కదపకుండా ఇండ్లలో వుండే తాము నమ్మిన సిద్ధాంతాలతో, అలవాట్లతో జీవనశైలిలో విజయం సాధించారన్న విషయాన్ని గ్రహించాడు. పునరుజ్జీవన కాలంలో నాటి ఇటలీ చిన్న చిన్ని రాజ్యాల కూటమి. ప్రతి రాజ్యంలో దాని చిత్రకళా సంస్థలుండేది. వాటిని వాళ్ళు గర్వంగా భావించి, పోషించుకున్నారు. ఇంతవరకూ విశ్వవిఖ్యాత చిత్రకళాకారులుగా గుర్తింపు పొందిన అనేకమంది ఇటలీ పెయింటర్ల సంఖ్య చిన్న రాజ్యాలు లేకుంటే వేళ్ళ మీద లెక్కించగలిగిన సంఖ్యకే పరిమితమై పోయి వుండేది అని కళాచరిత్రకారుల అభిప్రాయం.

ఇటలీ నుండి పశ్చిమానికి చూపు సారిస్తే జర్మనీ, హాలెండ్, బెల్జియం, ఇంగ్లండ్ దేశాల చిత్రకారులు ఇటలీ కళాస్రష్టల ప్రభావం నుండి బయటపడడమే కాకుండా, స్వదేశీ చిత్రకారుల పోటీని తట్టుకోవలసి వచ్చింది అని తెలుస్తుంది. జర్మనీ దేశానికి చెందిన ఇరువురు కళాకారులు అల్‌బ్రెక్ట్ డ్యూరర్ (Albrecht Duret), హాన్స్‌హెూల్ బయిన్ ఇటలీ కళా సాంప్రదాయం నుండి బయటపడి తమ దేశ సంస్కృతిని ప్రతిబింబించే చిత్రాలతో జర్మనీ కళా చరిత్రపై చెరగని ముద్ర వేశారు. ఇటలీ పునరుజ్జీవన ప్రభావం ఉత్తర దిశగా మానవస్వేచ్ఛ, మేధావితనం, శాస్త్రీయ కుతూహలం లాంటి లక్షణాలు ఉద్యమ రూపంగా వ్యాపిస్తున్న తరుణంలో - (సంస్కరణ దశ) తమ స్వదేశీ ప్రొటెస్టెంట్ మత విశ్వాసాన్ని కాపాడుకోవడం అనివార్యమయింది. డ్యూరర్ తను నమ్మిన స్వదేశీ మత విశ్వాసానికి కట్టుబడి ధైర్యంగా దక్షిణ సంస్కృతీ ప్రభావాన్ని తట్టుకుని నిలబడగలిగి న్యూరెంబర్గ్‌లో తన స్థానాన్ని నిరూపించుకున్నాడు. డ్యూరర్ తర్వాతి వాడు హెూల్ బయిన్ విదేశీ ప్రభావానికి లొంగిపోకుండా ధైర్యంగా, దృఢంగా నిలబడగలిగిగాడు. విదేశీ, స్వదేశీ కళాకారుల ప్రభావానికతీతంగా స్వచ్ఛమైన, సూటైన శైలితో ప్రత్యర్థులు లేకుండా రాణించాడు. తన దేశపు రైన్ (Rhyne) చిత్రకళా సంస్థల నుండి నేర్చుకోవడమే కాకుండా తన వృత్తి విద్య (Craft)లో నైపుణ్యం సాధించాడు. 20 సంవ్సరాలు నిండకముందే చిత్రకళలో చెక్కడపు పనిలో ఇతరులకు అసాధ్యమైన పరిపక్వను సాధించాడు.

హాన్స్‌హెూల్ బయిన్ యంగర్ జర్మన్ - బవేరియా ఆన్స్ బర్గ్‌లో 1497 ప్రాంతాన కళాకారుల కుటుంబంలో జన్మించాడు. తండ్రి పేరు కూడా హెూల్ బయిన్ అవడం చేత ఇతడు చిన్న హెూల్ బయిన్‌గా (Younger)

పిలవబడ్డాడు. తండ్రి చెప్పిన చిత్రకళా పాఠాలు నిరంతర సాధన వల్ల ఇటు పెయింటింగులోను అటు చెక్కడపు పని (carving)లోనూ ప్రావీణ్యం గడించాడు. 17 ఏండ్లకే చిత్రకళలో తండ్రిని మించిన తనయుడనిపించుకున్నాడు. 1519లో బాసల్ ఆర్టిస్టుస్ గిల్ట్‌లో సభ్యత్వం పొందాడు. ముఖ కవళికలను చిత్రించడంలో నిష్ణాతుడైనాడు. ఇతడు చెక్కిన పోర్ట్రేట్లలో సర్వీసెస్ ఆఫ్ వుడ్ కట్స్, దడాన్స్ ఆఫ్ డెత్ ఉత్కృష్టమైనవిగా గుర్తింపు పొందాయి. జర్మన్ చిత్రకళాచరిత్రలో నిలిచిపోయే ఇరువురు పిల్లల ముఖంలో ఆందోళన, ఏడ్వడం వల్ల కలిగిన భార్య కనురెప్పల్లోని ఎర్రదనాన్ని చూపించాడు. ఇరవై సంవత్సరాలు నిండ కుండానే తన పనితనంలో అద్భుతాలు సృష్టించాడు. లూథరన్ వీరాభిమాని ఐనప్పటికీ రోమన్ కాథలిక్‌లకు బొమ్మలు వేసి పెట్టాడు. మధ్య మధ్యలో స్విట్జర్లాండు, ఇంగ్లండులో పర్యటించాడు. సంస్కరణ (reform) పేరిట ఉన్మాదులు రెచ్చిపోయి పెయింటింగులను స్వాధీనం చేసుకోవడం, ధ్వంసం చేయడాన్ని తట్టుకోలేక ఇంగ్లండ్ వెళ్ళి అక్కడే థామస్‌మోర్ (Thomas Moore) అండతో ఉండిపోయాడు. థామస్‌మోర్ వధించబడిన తర్వాత తన వ్యవహార దక్షత వల్ల హెన్రీ VIII రాజు కొలువులో ఆస్థాన చిత్రకార పదవిని పొంది జీవితాంతం దాన్నే అంటి పెట్టుకుని వున్నాడు. రాజు రాణీలవి, రాజోద్యోగులవి ఎందరివో పోర్ట్రేట్లు రచించాడు. ఒక జర్మనీ వ్యాపార సంస్థకు, ధనిక వ్యాపారులకు పోర్ట్రేట్లు చిత్రించి ప్రఖ్యాతుడైనాడు.

హోల్ బయిన్ ఏ విషయాన్నైనా, ఏ మనిషినైనా చిత్రించగల సమర్థుడు. మోడల్ స్థాయిని పట్టించుకోకుండా అందరి పోర్ట్రేట్లు చిత్రించగలిగాడు. అతని చిత్ర రచనలో ఎక్కడ పొరపాటుగానీ, అనర్హుల పోర్ట్రేట్లు గానీ కన్పించవు. మోడళ్ళతో చాలా తటస్థంగా, నిర్లిప్తంగా వుండి వస్తుగతంగా చిత్రాలు రచించడంలో అగ్రగణ్యుడు. హస్త సాముద్రికులు చేతిలోని గీతలను నిశితంగా పరిశీలించినట్లుగా హోల్ బయిన్ ముఖాకృతులను సమగ్రంగా పరిశీలించి వాటికి పరిపూర్ణ న్యాయం చేకూర్చాడు. ఏ వ్యక్తికా వ్యక్తిని వారి వారి ప్రత్యేకతలతో ఇరాస్మస్ వంటి వారిలోని సుగుణాలను, లోపాలను తెలుసుకున్న తర్వాతనే వారి పోర్ట్రేట్లు వేశాడు. రాజువి, రాజ పరివారంలోని వివిధ వృత్తుల, హోదాల వారివి

హెన్రీ రాజు.

వారి వారి హోదాకు తగ్గ దుస్తుల్లో చూపించాడు. ప్రతి చిత్రంలోనూ తనదైన ముద్రను వేసి చూడగానే ఇది హోల్ బయిన్ పెయింటింగ్ అని గుర్తించగలిగేలా చిత్రరచన చేశాడు. వారి ముఖాల్లో విషాదం, చిరునవ్వు, అంతరంగాల్లోని ఆందోళనలను, పైకి కన్పించే ఉద్వేగాలను చూపించలేదు.

హెన్రీ రాజు. అతని అసంఖ్యాక పరివారానికి హోల్ బయిన్ తన చిత్రాల ద్వారా శాశ్వతత్వం కల్పించాడు. ఏ చరిత్రకారునికీ సాధ్యం కాని విధంగా వారి రూపాలను కళ్ళకు కట్టినట్లుగా, రాజు, లార్డులు, రాచరికపు స్త్రీలు, యోధులు (నైట్స్), వధువులు (బ్రెయిడ్స్) మన ముందు నిల్చున్నట్లు చిత్రించాడు. ఎవరినీ పొగిడినట్లుగానీ, విమర్శించినట్లుగానూ కన్పించదు. రాబర్ట్ ఛెస్‌మన్, రాజు గారికి వేటలో సాయంచేసే ఉద్యోగి ఫాల్కనర్, కాంటర్‌బరీ అర్చిబిషప్, లేడీ ఆడ్లీ, లేడీ గిల్‌ఫోర్ట్, ఆన్ బొలిన్, జేన్‌సెయిమర్ మొదలైన వారంతా గంభీరమైన దృక్కులతో కన్పిస్తారు. ఎడ్వర్డ్ ప్రిన్స్‌ఆఫ్ వేల్స్‌వి అందమైన మీనియేచర్ చిత్రాలు, ఇతరులవి అనేకం హోల్ బయిన్ గ్యాలరీలో కన్పించే పోర్ట్రేట్లు.

రాజు హెన్రీ VIII భార్యలు ఒకరి తర్వాత ఒకరు చనిపోగా, రాజుకు ఆప్తుడిగా పెండ్లి సంబంధాలు చూడడం కోసం ఐరోపా దేశాలు పర్యటించి, వివిధ లార్డుల కుమార్తెలవి క్రిస్టియానా డచెస్ ఆఫ్ మిలన్ పోర్ట్రేట్లు చిత్రించాడు. బ్రస్సెల్స్ యువరాణీ క్రిస్టినా పోర్ట్రేట్ చూసి రాజు ఆమెను వివాహ మాడటానికి నిశ్చయించుకుంటాడు. ఫ్లాండర్స్ యువరాణీ ఏన్ ఆఫ్ క్లీవ్స్ (Anne of Cleaves) బొమ్మను చూసి భార్యగా చేసుకోవాలనుకుంటాడు. కానీ పెండ్లికి ముందు ఆమెలోని నిర్లిప్తతను గమనించి అందగత్తె కాదనున్నా ఆమెనే పెండ్లి చేసుకుంటాడు. ఆ తర్వాత

Ambossadors 1553

పార్లమెంటు అంగీకారంతో ఆమెను వదిలించుకుంటాడు, ఆమె ఇంగ్లండ్‌లో వుండటానికి భవనం. విలాసంగా బ్రతకడానికి ఏలోటు లేకుండా ఏర్పాటు చేస్తాడు.

మోడళ్ళ నుండి సంపూర్ణంగా రాబట్టుకోవడంలో హోల్ బయిన్‌ను మించిన వారు కన్పించరు. వారి రూపురేఖలను సునాయాసంగా చిత్రించాడు. వారి ముఖాలపైనే శ్రద్ధ చూపి కనుకొలకుల్లోని లోతులను, పెదవుల వంపు సొంపులు మొదలైన వారి ఇతర ప్రత్యేక లక్షణాలను పోర్ట్రేట్లలోకి అనువదించాడు.

తర్వాత తరంలో పోర్ట్రేట్ రారాజుగా రెబ్రాంట్ అవతరించే దాకా హోల్ బెయిన్ పోర్ట్రేట్ యువరాజుగా గౌరవం పొందాడు. అభిరుచి, శైలుల అరుదైన సంగమం హోల్ బెయిన్ పోర్ట్రేట్ల లక్షణం. పోర్ట్రేయిట్లకు ప్రాధాన్యత, ఆదరణ తగ్గిపోతున్న ఈ రోజుల్లో చిత్ర కళా ప్రపంచం హోల్ బయిన్‌ను మాత్రం ఎన్నిటికీ మరిచిపోలేదు.

హోల్ బెయిన్ యంగర్, పోర్ట్రేట్‌లో ప్రసిద్ధికెక్కిన పోర్ట్రేట్లు – Self Portrait (1540–43), ఇంగ్లండ్ రాజు హెన్రీ VIII పోర్ట్రేట్, ద అంబాసడర్స్, పోర్ట్రేట్ ఆఫ్ ఇరాజ్‌మస్ ఆఫ్ రోటర్‌డామ్, సర్ థామస్ మోర్ (1527), జార్జి గిస్‌జీ, ఏన్ ఆఫ్ క్లీవ్స్ తదితరాలు మొత్తం పోర్ట్రేట్ల 100 దాకా చిత్రించాడు. ఇంగ్లండ్ ట్యూడర్ (లండన్ నేషనల్ గాలరీ) రాజవంశీయుల పోర్ట్రేట్లలో కింగ్‌హెన్రీ పోర్ట్రేట్ (1536–37) కలికితురాయి వంటిది.

హోల్ బయిన్ – రాజప్రతినిధులు (**Ambossadors, 1553**)

16వ శతాబ్దపు పరిపూర్ణమైన కళాఖండంగా పేరు గాంచిన ఈ గొప్ప పెయింటింగును లండన్ నేషనల్ గాలరీ 1890లో స్వంతం చేసుకుని 12వ నెంబర్ గదిలో 1314వ నెంబర్ చిత్రంగా ప్రదర్శిస్తోంది. ఇది ఓక్ వుడ్ మీద రచించబడ్డ 207 × 209.5 సెం.మీ నిలువెత్తు భారీ ఆయిల్ పెయింటింగ్. ఇందులో కన్పించే ఇరువురు రాజ ప్రతినిధుల వైభవం, హొదాల్నే కాకుండా అనేక యితర విషయాలను తెలుపుతుంది. హాన్స్‌హోల్ బయిన్ యంగర్ 1533లో రచించిన ఈ 'డబుల్ పోర్ట్రేట్' ట్యూడర్ వంశ రాజుల కాలం నాటిది. అదే సంవత్సరంలో రాణీ ఎలిజత్ పుట్టడం విశేషం. పెయింటింగులోని ఇరువురు ప్రతినిధుల్లో ఎడమవైపు వున్న డిన్‌టివిల్ (Jean de Dinte ville) ఫ్రాన్స్ తరఫు దూత. కుడివైపున ఉన్నది జార్జి డిసాల్వే (George de Salve) డిన్ టి విల్‌కు ఆత్మీయ స్నేహితుడు చాలా సందర్భాల్లో వెనిస్, రోమ్‌పోప్, ఇంగ్లండ్, జర్మనీ, స్పెయిన్‌లకు దూతగా వ్యవహరించాడు. వారిరువురూ లండన్ సందర్శించిన సందర్భాన్ని గుర్తు చేస్తుంది. ఇది యూరప్ మత సమస్యల వలయంలో చిక్కుకున్న సమయంలో చిత్రించబడింది.

ఇంగ్లండ్ కింగ్ హెన్రీ VIII ఆరగాన్‌కు చెందిన కేథరీన్‌ను పెండ్లి చేసుకోవడాన్ని ప్రజలు అంగీకరించినా, చర్చి మాత్రం అంగీకరించదు. ఆ తర్వాత ఏన్ బోలిన్‌ను రహస్యంగా వివాహ మాడతాడు. ఫలితంగా రాజు రోమన్ కాథలిక్ చర్చి నుండి విడిపోయి ఇంగ్లండ్‌లో సంస్కరణలకు (Reformation) కారకుడౌతాడు.

అంబాసడర్స్ పెయింటింగ్‌లో హోల్ బయిన్ తన ప్రతిభనంతా ప్రదర్శించాడు. చిత్రంలోని టేబుల్‌పైనున్న వస్తు సముదాయం నాటి చరిత్రక విశేషాలను తెలియజేస్తుంది. ప్రతి వస్తువు వెనకా తెలియని అర్థాలు దాగి వుంటాయి. లౌకిక భావాలను, అభిరుచులను తెలియజేసే సంకేతాలుగా, విరుద్ధాంశాల కూర్పుగా వుంటాయి. వాటిలో హోల్ బయిన్ చూపించిన నిర్దిష్టత, వాస్తవికత, సాంకేతికత ఆకర్షణీయంగా, ఆశ్చర్యకరంగా వుంటాయి. మానవ ప్రగతిని, సాధించిన విజయాలను చూపుతూ అదే సమయంలో అవన్నీ అంతిమంగా నిరర్థకాలని చెప్తాయి.

పెయింటింగ్‌లోని ఇరువురు వ్యక్తుల మధ్య టేబుల్‌పై కన్పించే వస్తువులు నౌకాయానానికి, ఖగోళ పరిశీలనకు, సంగీతానికి చెందినవి కాగా మరికొన్ని సన్‌డయల్ (Sun Dial), తెరిచి వున్న ప్రార్థనా గీతాల పుస్తకం, గ్లోబ్, అరిథ్‌మెటెక్‌బుక్, టేబుల్‌పై పరచి వున్న రగ్గు, వెనక

వేలాడుతున్న తెర, చిత్రాల దిగువ భాగంలో నడవలోని పాలరాతి డిజైన్లు నాటి దేశకాల విశేషాలను తెలియ జేస్తాయి. ఇరువురు దూతల కాళ్ళ వద్ద ఏటవాలుగా పడివున్న మనిషి పుర్రె బొమ్మ చిత్రంలోని వస్తువుల కతీతంగా గూఢార్థాన్ని చెబ్తుంది. ఇది వక్ర (Anamorphic) చిత్రానికి ఉదాహరణగా నిలబడుతుంది.

ఈ పెయింటింగు చిత్రీకరణ పూర్తి ఐన నాటి నుండి నేటి వరకు నాలుగైదు శతాబ్దాలుగా, మరీ ఇటీవలి దశకాలలో ఉద్దండ కళా విమర్శకుల రకరకాల పరీక్షలకు, వ్యాఖ్యానాలకు నిలయమైంది. ఒక్కక్కరూ ఒక్క రకంగా విశ్లేషించారు. టేబుల్ పై అరలోని వస్తువులు అంతరిక్ష వీక్షణను, కింది అరలోని వస్తువులు ఇహలోక విషయాలను ప్రస్తావిస్తాయి. ఇప్పటికీ చిత్రకళా తరగతుల బోధనకు, కళాకారులు అనుకరించడానికి, టి.వి. ఫిల్మ్‌లకు, ఆధార చిత్రంగా (Source painting) ఉపయోగపడడం దీని గొప్పదనం. అంబాసదర్స్ పెయింటింగు వివరణ విశ్లేషణ, సంకేతాలు

హోల్ బయిన్ పోర్ట్రేట్లే లేకపోతే హెన్రీ VIII ప్రాణాంతక రాజాస్థాన విషయాలు చరిత్రక విశేషాలు ఇన్నాళ్ళూ బతికి బట్టకట్టేవికావు. ఆస్థాన కళాకారుడిగా ట్యూడర్ కాలాన్ని వంద చిత్రాల్లో చూపించాడు. వాటిలో థామస్ మోర్, కింగ్‌హెన్రీ, అతని ఆరుగురు భార్యల్లో కొందరు, రాజోద్యోగులు మొదలైన వారి చిత్రాలు, వాటిలో 'అంబాసదర్స్' చిరస్థాయిగా నిలిచిపోయే, అనేక వ్యాఖ్యానాలకు నెలవైనది. ఐదు శతాబ్దాలుగా చరిత్రకారులు నిశితంగా పరీక్షలు చేసి చిత్రంలోని గూఢార్థాలను వెలికి తీశారు. ఈ నిలువెత్తు చిత్ర రహస్యాన్ని తెలుసుకోవడానికి ముందు ఎంతో ప్రమాదకరమైన రాజకీయ ప్రపంచంలో హోల్ బయిన్ విజయవంతంగా బతకగలగడం గొప్ప విషయంగా పరిగణించవచ్చు.

హోల్ బయిన్ దీన్ని 1553లో రచించేనాటికి అది హెన్రీ రాజుకు, పోప్‌ల మధ్య ఆధిపత్య పోరు జరుగుతున్న దశ. రాజు మొదటి భార్యతో విడిపోయి, హెన్రీ ఆన్ బొలిన్‌ను (AnneBoleyn) రహస్యంగా పెండ్లి చేసుకుంటాడు. వారి సంతానమే తరవాతి కాలంలో ఇంగ్లండును పరిపాలించిన ఎలిజబత్ రాణీ. చర్చి నుండి విడిపోవడం అనివార్యమైన పరిస్థితిలో గర్వి, కోపిష్టి హెన్రీ ఇంగ్లండు చర్చి (పోప్) ఆధిక్యాన్ని కాదని తానే చర్చి అధిపతినని ప్రకటించుకుంటాడు. ఇది ఇంగ్లండులో మత, సాంఘిక ఘర్షణకు కారణమౌతుంది.

రాజాస్థానంలో చిత్రకారునిగా నియమానికి ముందు నాటికే హోల్ బయిన్ జర్మనీలో మత సంబంధిత చిత్రాలు రచించి గొప్ప పేరు సంపాదించాడు. చెక్కడపు పనిలో బొమ్మలు చిత్రించడంతో బాసిల్, స్విడ్జర్లాండ్లలో హోల్ బయిన్ పేరు మారు మోగిపోయింది. ఇరాజ్ మస్ (Erosmus) వ్యంగ రచన 'ఇన్ ప్రైయిజ్ ఆఫ్ ఫోలీ' (In Praise of Folly)కి బొమ్మలు, మార్టిన్ లూథర్ బైబిల్ జర్మన్ అనువాద గ్రంథానికి ముఖ చిత్ర రచన చేశాడు. ఇంగ్లండ్ చేరే వరకూ హోల్ బయిన్ పునరుజ్జీవన దశ ప్రభావంతో పుట్టుకొచ్చిన లౌకిక చిత్ర రచనలో ఒకటీ అరాతప్ప లౌకిక చిత్రాలు వేసింది లేదు. ఐనా రాజు హెన్రీ హోల్ బయిన్ గతాన్ని పట్టించుకోకుండా ప్రతిభను గుర్తించి ఆస్థాన కళాకారునిగా నియమించాడు. హోల్ బయిన్ కూడా రాజు విశ్వాసాన్ని వమ్ము చేయకుండా లౌక్యంగా వ్యవహార దక్షతతో చనిపోయేవరకు గడిపాడు.

రాజు హెన్రీ ఇంగ్లండ్ చర్చి మతాధిపత్యం నుండి విడిపోవడానికి బలమైన కారణం రాజ్యానికి వారసుడు లేకపోవడం. అప్పటికే యూరప్ అంతటా రాజకీయ, మతకల్లోలాలు ప్రభుత్వాల్ని అస్థిరపరిచాయి. హెన్రీ, ఫ్రాన్స్‌రాజు ఫ్రాన్సిస్, రోమన్ చక్రవర్తి చార్లెస్ ఎ, పోప్‌లు యుద్ధానికి సిద్ధమైనారు. చర్చి అధికారాన్ని ప్రశ్నించిన మార్టిన్ లూథర్ అనుచరులు ఐరోపా ఉత్తర దేశాల్లో పై చేయి సాధించారు. అటువంటి తరుణంలో రాజు హెన్రీ చర్చి మీద తిరుగుబాటు చేయడం సంస్కరణలకు (Reformation) దారి తీసింది. ప్రజల జీవన దృక్పథంలో మార్పు వచ్చింది. నూతన తాత్విక చింతన మొదలై అనేక సిద్ధాంతాలు పుట్టుకొచ్చాయి.

ఈ నేపథ్యంలో 'అంబాసదర్స్' చిత్రాన్ని పరిశీలిస్తే అనేక ఆసక్తికరమైన నాటి సాంఘిక, రాజకీయ, మత విషయాలు తెలుస్తాయి. 20-21 శతాబ్దాల్లో ఈ పెయింటింగ్‌ను ఎందరో కళా విమర్శకులు సమీక్షించారు. కొత్త విషయాలను, రహస్యంగా దాగి వున్న సంకేతాలను వెలికి తీశారు. వారిలో జూలియాఫియోరి (Julia Fiore) విపులమైన విశ్లేషణ చేసిన వారిలో ముఖ్యమైనది. ఆమె మాటల్లో చిత్ర వివరణ : కళాకారుడు చిత్రించిన 'అంబానడర్స్' చిరస్థాయిగా నిలిచిపోవడమే కాదు

వ్యాఖ్యానాలకు కొరుకుడు పడనిది కూడా. ఈ డబల్ పోర్ట్రేట్‌ను లండన్ నేషనల్ గాలరీ సగర్వంగా ప్రదర్శిస్తోంది. ఇందులో ఎడమవైపున వున్నది 29 సంవత్సరాల జాన్‌డి డెంటి విల్. సిల్క్, వెల్వెట్, ఫర్‌ల అలంకరణతో ఖరీదైన దుస్తుల్లో వుంటాడు. ఈ నిలువెత్తు పెయింటింగును తన పోలిసీ (Polisy)లోని భవనంలో (Chatean) పెట్టు కోవాలనుకుంటాడు. ఇతడు ఇంగ్లండ్ రాజాస్థానంలో జరుగుతున్న సమాచారాన్ని చేరవేయడానికి ఫ్రాన్స్ కాథలిక్ రాజు చేత పంపబడిన రాయబారి. బహుశా వెస్ట్ మిన్‌స్టర్ ఏబీలో వివాదాస్పద బౌలిన్ పట్టాభిషేకానికి (కిరీటధారణ కార్యక్రమాన్ని) చూడటానికని అంత ఖరీదైన దుస్తుల్ని ధరించి వుంటాడు. కుడివైపున నిరాడంబర దుస్తుల్లో కన్పించేది జార్జెడి సాల్వే (25 సంవత్సరాలు), డింట్ విల్ స్నేహితుడు. జార్జెస్ చర్చి పూజారి (Cleric). తర్వాత అతడే లేవర్ బిషప్ అవుతాడు. లూథరన్ సంస్కరణల ఉప్పెనను తట్టుకుని, కాథలిక్ చర్చి ఆధిపత్యానికి చేసిన విఫల కృషితోనే అతని వృత్తి జీవితం గడిచిపోతుంది. ఇతడు లండన్ పర్యటించడం కూడా ఆ ఉద్దేశందే చేసిందే కావచ్చు. ఇద్దరు దూతలూ ఇంగ్లండులో జరుగుతున్న పరిణామాలను నిస్సహాయంగా చూస్తూ ఉండిపోవలసి వస్తుంది. చిన్ననాటి ఎలిజబత్ బాప్టిజంలో పాల్గొని వుంటారు. నాటి రాజకీయ కల్లోల సందర్భంలో వారి స్థానాన్ని తెలియజేస్తుంది.

పునరుజ్జీవ యుగ నమ్మకం 'మనిషే మహాత్ముడు' అన్న భావానికి ప్రతీకలుగా నిలబడతారు. పెయింటింగ్‌లోని ప్రతి అంశమూ మానవ జీవిన చక్రంలోని జీవితం, నిర్యాణానికి అద్దం పడ్తూ కళాత్మకంగా చూపిస్తుంది. వారి కాళ్ళ కింద వున్న పాల రాతి డిజైన్ వెస్ట్‌మిన్‌స్టర్ ఏబీలో పవిత్ర మందిరంలోని డిజైన్‌ను పోలి వుంటుంది. అది విశ్వాంతరాళపు స్థూల రూపానికి మూలమైతే, మనిషి జీవితం సూక్ష్మరూపానికి ప్రతీకగా విశ్వంలో మనిషి స్థానాన్ని సూచిస్తుంది.

పెయింటింగ్‌లోని శాస్త్రీయ పరికరాలు, గణిత సిద్ధాంత, సంగీత పరికరాలు నాటి ఆర్థిక సంపదను, జ్ఞాన తృష్ణను, మేధాసంపత్తిని తెలియజేస్తాయి. చిత్రంలోని టేబుల్‌పై అరలోని వస్తువులు – విశ్వ సంబంధిత గ్లోబ్ (Globe), సూర్యగమనాన్ని సూచించే గడియారం (సన్‌డయల్) తదితరాలు పరలోక చింతనకు చెందగా, కింది అరలోని భూగోళ గ్లోబ్, దిక్సూచి, లూట్ సంగీత సాధనం, తెరచి వున్న ప్రార్థనా గీతాల పుస్తకం పక్కనే ఫ్లూట్ బాక్సు ఇహలోక సంబంధితాలు. అలాగే ఇరువురు రాయబారులూ ఇహ, పరాలకు ప్రతినిధులుగా వుంటారు. ఇవన్నీ వారి బహుముఖీన అభిరుచులను తెలియజేస్తాయి.

పై అరలో చెల్లాచెదురుగా పడివున్న వస్తువులు విశ్వంలోని గందరగోళానికి, తెరచి వున్న గణిత పుస్తకం లోని రూలర్ కాథలిక్, లూథరన్ విభజనకు సంకేతాలు. ఇది యూరప్‌ను రెండుగా చీలుస్తున్న మత విశ్వాసాలకు ప్రతీక. తెగిపోయిన సంగీత పరికరపు తీగ అపశృతికి, పక్కనే వున్న ప్రార్థనా గీతాల పుస్తకం దేవుని స్తుతి గీతం వున్న పేజీ చర్చీ ఐక్యతకు ప్రతీకలు. కానీ విభేదాల మత విశ్వాసాలు ఏకమవ్వడం నెరవేరని కలగానే మిగిలి పోతుంది. అంబాసడర్లు వారి లక్ష్యసాధనలో విఫలు లైనప్పటికీ వారిని తక్కువ చేసి చూపినట్లుగా కనబడదు. వారిని మించిన శక్తివంతమైన మరో రెండు విషయాలు మరణం, అంతిమ మోక్షం–రక్షణ వస్తురూపంలో చూపించడంలో హోల్ బయిన్ నేర్పు కన్పిస్తుంది. అధిభౌతిక భావాలను అతి సహజంగా చూపిస్తాడు. దూతల్లో ఒకరు ధరించిన దుస్తుల్లో సిల్క్, ఫర్ వాస్తవ ప్రపంచ,భౌతిక విలాసాలకు ప్రతీకలు.

ఇద్దరు దూతల వ్యక్తిత్వాల్లో వైవిధ్యం కన్పిస్తుంది. డిన్‌టివిల్ ఖడ్గం మీద చేయి వుంచుకుని క్రియాశీలుడిగా, జార్జి డి సాల్వే చంకలోని పుస్తకంతో మత విశ్వాసాలకు ప్రతీకలుగా కన్పించినా, ఖడ్గం, పుస్తకం వైన వున్న లాటిన్ అక్షరాలు. మనుజులంతా మర్త్యులే అని చెబ్తాయి. ఇదే విషయాన్ని డిన్‌టివిల్ టోపీ మీది పుర్రె బొమ్మ, దూతల కాళ్ళ వద్ద ఏటవాలుగా పడివున్న పుర్రె బొమ్మ వక్ర చిత్రం చెబ్తాయి. మరణ సంకేతాలన్నిటి కన్నా బలమైన ప్రతీక పుర్రె బొమ్మ. పెయింటింగులో ఇది మామూలు దృష్టికి దొరకదు. ఈ వక్ర చిత్రాన్ని ఒక ప్రత్యేక కోణం – కింది కుడి మూల నుండి చూస్తేనే గాని కన్పించదు. పుర్రె చిత్రం 'మరణం తథ్యం' (a memento mori) అని, మనిషి తప్పించుకోలేనిది కాబట్టి భౌతిక వ్యామోహాలకు లొంగిపోవద్దు, వాటికి దూరంగా వుండాలి అని చెబ్తుంది. వక్రంగా చిత్రించబడ్డ పుర్రె బొమ్మ మనిషి దృష్టిలోపాన్ని

ఎత్తి చూపుతుంది. (దీనికి వ్యతిరేకంగా మనుషులు మరణానికి భయపడ నవసరం లేదు, కాపాడ్డానికి దేవుడున్నాడు (Carpe diem) సుఖాల్ని అనుభవించండి, అవకాశాల్ని వదులుకోవద్దు అని 20 శతాబ్దంలో ప్రచలితంగా వ్యాపించిన దృక్పథం.) చిత్రం పై భాగంలో ఎడమచేతి మూల మీద పచ్చని కర్టెన్ వెనక కన్పించీ కన్పించని క్రీస్తు శిలువ బొమ్మ మనుషుల్ని కాపాడ్డానికి దేవుడున్నాడు అని అభయం యిస్తున్నట్లుగా వుంటుంది.

పోర్ట్రేట్ మరణం అనివార్యం అని చెబ్తూనే, చిత్రంలోని వ్యక్తులను అజరామరం చేస్తుంది. హోల్ బయిన్ లండన్‌లో వ్యాపించిన ప్లేగ్ మహమ్మారికి బలికావడం 45-46 ఏండ్ల వయసునకే అకాలంగా మరణించడం కూడా పై విషయాన్ని స్పష్టం చేస్తుంది.

ఈ ఒక్క చిత్రంతో నిస్సందేహంగా హోల్ బయిన్ జర్మన్ రినై సన్స్ పోర్ట్రెయిట్ చిత్రకారుల్లో ఉత్తమ స్థానాన్ని ఆక్రమించాడు. ఖాన్ అకాడమీ చిత్రంలోని తివాచీలను, గ్లోబ్‌ను గురించి విపులంగా 'నాటి సంపన్న వర్గం మధ్య ప్రాచ్య, తూర్పు దేశాల విలువైన వస్తువుల్ని సేకరించేవారు. టేబుల్ పైన పరచిన తివాచీ అనటోలియా, టర్కీ దేశాల ఖరీదైన ఉత్పత్తి. వాటిలోని పనితనం వల్ల యూరప్‌లో ఆదరణ పెరిగింది. చిత్రంలో కన్పించే తివాచీ చాలా ఖరీదైనది. గొప్ప సంపన్నులకుమాత్రమే వాటిని కొనడం సాధ్యమయ్యేది. విలువైనవి కాబట్టే వాటిని నేల మీద పరచకుండా టేబుళ్ళపైన, గోడల మీద అలంకరణ వస్తువులుగా, హోదాచిహ్నాలుగా ప్రదర్శించేవారు. గ్లోబ్‌లో దేశాలు తలకిందులుగా కనిపిస్తాయి. కింది నుంచి చూస్తే ప్రపంచదేశాల్ని గుర్తించడం సాధ్యమౌతుంది. తివాచీలు, గ్లోబ్‌లు నాటి ఐరోపా దేశాల వ్యాపార నరళిని, వలసవాదాన్ని తేటతెల్లం చేస్తాయి అని వ్యాఖ్యానించింది.

హోల్ బయిన్ కావాలని చిత్రించిన పుర్రె వక్ర చిత్రం నేత్ర భ్రమ (Optical illusion) వల్ల జీవితంలో అనివార్యమైన మరణాన్ని గమనించలేము, ప్రత్యేకంగా దృష్టి సారిస్తేనే గాని సర్వ వ్యాప్తము, నిత్య సత్యము ఐన దాన్ని చూడడం సాధ్యంకాదు అంటుంది అని మరొక విమర్శకుని అభిప్రాయం. ఈ పెయింటింగ్‌లో హోల్ బెయిన్ చూపిన వాస్తవికత, ఎక్కడా లోపం లేని సాంకేతికత బహుధా ప్రశంసనీయం అనీ, ఇది ఎన్నో ప్రతీకలను దాచుకున్న కళాఖండం అనీ జూడ్ వెల్టన్ (Jude Welton) అభిప్రాయ పడుతుంది. అలీసియా డూప్లెసిస్ (Alisia duplesis) పెయింటింగు విశ్లేషణతోపాటు, అందులోని సాంకేతి కాంశాలనూ, ఉపయోగించబడిన వివిధ రంగులను గురించి విపులంగా వర్ణిస్తుంది. ఆర్టిస్టుగా హోల్ బయిన్, దయంగర్ ప్రతిభకు, యూరపు రాజకీయ, మత కల్లోల కాలానికి దృశ్య రూప సాక్ష్యంగా నిలిచే ఈ పెయింటింగుది చిత్రకళా చరిత్రలో చెరగని స్థానం అని ప్రశంసలు కురిపిస్తుంది.

అంబాసడర్స్ చెప్పే చారిత్రక విషయాలు

- అంబాసడర్స్ చిత్రం యూరప్ ఉత్తర దేశాల పునరుజ్జీవ కాలపు లౌకిక చిత్రాల నూతన ధోరణికి నాంది పలుకుతుంది.
- చర్చి సార్వభౌమాధికారాన్ని, పోప్ ఆధిపత్యాన్ని మార్టిన్ లూథర్ సవాలు చేస్తాడు.
- హెన్రీ VIII కాథలిక్ చర్చిపైన చేసిన తిరుగుబాటు ఇంగ్లండ్‌లో సంస్కరణలకు తలుపులు తెరుస్తుంది.
- మానవతా వాదం, తాత్విక చింతన యూరప్ అంతటిని సమూలంగా మార్చి వేస్తాయి. సృష్టిలో మనిషి ఆధిక్యతకు గుర్తింపు వస్తుంది.
- అనేక విభేదాలు, సంఘర్షణల్ని ప్రతిబింబిస్తుంది కనుకనే హోల్ బయిన్ (జూనియర్) అంబాసడర్స్ పెయింటింగు చారిత్రక సాక్షిగా నిలుస్తుంది.
- ఇంగ్లండ్ చారిత్రకత, రాజకీయ నేపథ్యాన్ని కళ్ళకు కట్టినట్లు చూపించే ఈ పోర్ట్రేట్‌ది ప్రత్యేక స్థానం.
- అంబాసడర్స్ పెయింటింగు దానిలోని అనేక విశేష గూడార్థాల వల్ల ఇటీవలి పలు దశాబ్దాలుగా తీవ్రమైన చర్చకు దారి తీయడం విశేషం.
- ఇంగ్లండ్ క్వీన్ ఏన్ బోలిన్ (Anne Boleyn) రాయబారి జీన్ డింటివిల్‌కు బహుమతిగా ఇవ్వడంకోసం హోల్ బయిన్‌ను ఈ చిత్ర రచనకు పురమాయించి వుండవచ్చని కొందరు చరిత్రకారుల అభిప్రాయం.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్ (టి.వి.ప్రసాద్)
ఫోన్ నెం. 7981398250

సుబ్బయ్య గారి మేడ

– వీరమాచనేని ప్రమోద్‌కుమార్

ప్రమోద్‌కుమార్ గారి వృత్తి, వ్యావృత్తి నలభై సంవత్సరాల పైన సినిమారంగం. ఆయన పత్రికా విలేఖరిగానే కాక పి.ఆర్.ఓ.గా కూడా వ్యవహరించారు. కొన్ని సినిమాల నిర్మాత. ఇదంతా ఎందుకంటే ఆయన సినిమాని కేవలం వ్యాపార రంగంగానో, గ్లేమర్ ప్రపంచం గానో చూళ్ళేదు. ప్రజలతో విడదీయలేని అనుబంధం వున్న చరిత్రగా చూశారు. ఆ దృష్టితోనే 'తెరవెనుక తెలుగు సినిమా' రాశారు. అది సినిమా చరిత్ర.

ఇంక 'సుబ్బయ్య గారి మేడ' విచిత్రమైన శిల్పంతో రూపుదిద్దుకున్న పుస్తకం. చరిత్ర అంటే ప్రమోద్‌కుమార్ స్వయంగా చూసిందో లేదా నమ్మకమైన దగ్గరివారు చూసిందో అవ్వాలి. అవి రికార్డ్ చేస్తూనే కాలయంత్ర ప్రయాణం చేసి పాఠకులనీ ఆ యాత్ర చేయించారు. ఇంతకీ ఈ పుస్తకంలో వస్తువు ఏమిటంటే ఏలూరికి దగ్గరలో వున్న 'దెందలూరు' గ్రామచరిత్ర. ఆ చరిత్ర చెప్పటానికి సుబ్బయ్యగారు నిర్మించిన తెల్ల మేడని కేంద్రంగా తీసుకున్నారు. ఆ మేడని, అందులో నివసించిన రెండు మూడు తరాల వందల కొద్దీ వ్యక్తుల గురించి మనకు చెపుతారు. శిల్ప జటిలత, సరళగ్రాంధిక భాషాశైలివల్ల ఓ క్రమంలో కథ లేకపోటం వల్ల మనకి ఏదీ బలంగా గ్రాహ్యం కాదు. పోతే ఈ పుస్తకం ప్రత్యేకత ఏమిటంటే, ప్రమోద్ కుమార్ గారి చారిత్రిక దృష్టి దీన్నొక చారిత్రకి నవల చెయ్యాలన్న తపన.

హేలాపురి రాజధానికి సైనికస్థావరం దండులూరు. కాలక్రమంలో అదే దెందులూరుగా నామాంతరం పొందింది. 642 కీ.శ. నుండి కీ.పూ 935 వరకు వేంగియే రాజధాని అని చరిత్ర. అక్కడ సోమేశ్వరాలయం చరిత్ర ప్రసిద్ధం. సుబ్బయ్య గారి తండ్రి నరసింహులు గారి చేతుల మీదుగా శంఖుస్థాపన జరిగింది. అనతికాలంలోనే ధవళ భవంతి సుబ్బయ్యగారి మేడ నిర్మాణం పూర్తయింది. అందులో నివసించిన అయిదుతరాల, వందల పాత్రల పరిచయం చేశారు ప్రమోద్‌కుమార్ గారు.

ఏ పాత్ర తాలూకు కథగానీ, సంఘటనలు గానీ లేవు. అన్ని పాత్రలు నీడల్లా ఉంటాయి. ఒక్క తులశమ్మ పాత్ర తప్ప. ఆమె భర్తని పొలంలో నాగుపాము కరిచింది. ఆయన మరణించాడు. ఆ వార్త వినగానే తులశమ్మ నూతిలో దూకింది. బైటకు తీసి బతికించారు. ఆ మాత్రం కథే ఉంది. చరిత్ర నవలగా మార్చాలన్న రచయిత ప్రయత్నం ఫలించలేదు. చారిత్రిక నవలకి ఉండాల్సిన ప్రధాన లక్షణాలు ఈ నవలలో అంతగా లేకపోవడంతో ఓ సాధారణ నవలగానే చదువుకోవాలి.

అయితే రచయిత భాష, శైలి, సినిమాటిక్‌గా వుంటుంది. కొన్ని కొన్ని అతి విపులంగా వివరిస్తారు. కొన్ని అసలేమీ చెప్పకుండా దాటవేస్తారు. మనం ఇందులో ఈ సాంఘిక చరిత్రలోకి ప్రవేశించి ప్రయాణం చేసి బయటకు వచ్చి మననం చేసుకుంటే ఒకటి కాదు వందల ఏళ్ల నాటి మనుషులు – బంధాలు – కళ్లముందు కదులుతాయి!

ఇదొక అనుభవం కింద మిగిలిపోతుంది.

రచయిత తపనలో మనమూ తడుస్తాము.

వి. రాజారామమోహనరావు
ఫోన్ : 9394738805

రాజస్థాన్ లోని కోటలు

- యన్. లక్ష్మీ అయ్యర్

రాజస్థాన్ యొక్క గౌరవం రాజస్థాన్ తల మానికంగా పిలువబడేది చిత్ర కూట్ దుర్గం అనబడే చిత్తౌడ్గడ్. గడ్ అంటే కోట లేదా దుర్గము అని అర్థం. ఈ చిత్తౌడ్గడ్ శ్రేష్టమైన రాజుల వీర శౌర్యానికి ప్రతీకగా త్యాగానికి సమర్పణానికి గుర్తుగా మిగిలిపోయింది. ఇది త్యాగుల పవిత్ర త్యాగానికి ప్రతీక. ఈ కోట గంభీరి, బేడచ్ నదుల సంగమ స్థానంలో అరావలి పర్వతమాల యొక్క విశాల పర్వత శిఖరంలో 1850 అడుగుల పొడవుతో రాజా చిత్రాంగ ద్వారా కట్టబడింది. ఈ కోట యొక్క పొడవు ఎనిమిది కిలోమీటర్లు వెడల్పు రెండు కిలోమీటర్లు. కోట యొక్క వ్యాసము 16 కిలోమీటర్లు చిత్తౌడ్గడ్ దుర్గము యొక్క ఆకృతిని వేల్ చేప లాగ వుంటుంది ఢిల్లీ నుండి మాల్వా గుజరాత్ పోయే దారిలో ఈ కోట అందంగా రాజ ఠీవితో కనబడుతుంది

చిత్తౌడ్గడ్ రాజస్థాన్ యొక్క పెద్ద లివింగ్ ఫోర్ట్. ఫోర్ట్ అంటే నివసించే దుర్గము అని ప్రసిద్ధి చెందింది. క్షేత్ర ఫలాన్ని అంటే విస్తీర్ణాన్ని బట్టి చూస్తే ఇది రాజస్థాన్‌లో ఉన్న కోటలన్నింటికన్నా చాలా విశాలమైన పెద్ద కోట. రాజస్థాన్‌లో ఉన్న కోటలన్నింటిలో చిత్తౌడ్గడ్ కోటలో వ్యవసాయం చేసి పంటలను కూడా పండిస్తారు. ఇక్కడ ప్రజల మధ్య ఈ కోట గురించి ఒక సామెత కూడా ఉంది. ప్రసిద్ధి కోటంటే కోట చిత్తౌడ్గడ్ కోట, బాకీ కోటలన్నీ ఉత్త గుట్టలు మాత్రమే అని" ఈ కోటను అన్నీ కోటలకు రాజు అని కూడా చెప్తారు. దీన్ని దుర్గాధిరాజు అని కూడా అంటారు. మహారాణా కుంభాను ఈ చిత్రకూట దుర్గం యొక్క ఆధునిక నిర్మాత అని కూడా చెబుతున్నారు. ఈ దుర్గము అన్ని కోటలకు తలమానికంగా ఉండి రాజస్థాన్ యొక్క దక్షిణ తూర్పు ద్వారము మరియు మాలవా స్థలపు ప్రవేశద్వారంగా నిలబడి ఉంది.

ఈ కోటలో మూడు సాకేలు అయ్యాయి. ఇక్కడ సాకే అనే స్థానిక పదం వాడుకలో వుంది. సాకే అంటే దండ యాత్ర జరిగినపుడు లేదా యుద్ధం జరిగినపుడు ఆ రాజులు వీర గతిని పొందడం లేదా అతని రాణులు అగ్నికి ఆహుతి అవ్వడం. రాజస్థాన్‌లోని ప్రతి కోటలో జౌహర్ కుండ్ అనబడే పెద్ద విశాల లోతుగల స్థలం కట్టబడి వుంటుంది. భారత దేశంలో ఏ రాష్ట్రంలోను ఇది చూడము. తన స్త్రీత్వాన్ని కాపాడుకునేందుకై

చిత్తౌడ్గడ్ దుర్గము

రాణులతో సహా సమస్త స్త్రీలు ఈ అగ్ని కుండంలో సంతోషంగా దూకి ప్రాణ త్యాగం చేసిన స్థలం. అంటే చిత్తౌడ్గడ్‌లో జరిగిన మూడు ప్రముఖ యుద్ధాల వల్ల రాణి జౌహర్ స్వీకరించడం లేదా రాజు వీర గతి ప్రాప్తించడం. జౌహర్ అంటే ఇక్కడ ఒక 400 అడుగుల అడుగులో ఉన్న పెద్ద అగ్నిగుండంలో స్వేచ్ఛగా ఇక్కడ ఉన్న రాణులు తమ స్త్రీత్వాన్ని కాపాడుకునేందుకై అగ్ని సమాధిని స్వీకరిస్తారు. మొదటిది సాకా 1303లో అల్లావుద్దీన్ ఖిల్జీ మరియు రాణా రత్నసింహ్ మధ్య యుద్ధం జరిగింది. దానిలో రాణి పద్మావతి జౌహర్ చేసింది అంటే అగ్నిగుండంలో దూకి 16 వేలమంది స్త్రీలతో అగ్నికి ఆహుతి అయ్యింది సమాధి చేసుకుంది. వీరులైన గోరా, బాదల్ ఇద్దరు వీర గతిని చెందారు. అప్పుడు అల్లావుద్దీన్ ఖిల్జీ పైశాచికానికి బలి అయ్యారు. ఆ దుర్గం యొక్క పేరును ఖిల్జీ ఖిజాబాద్ అని మార్చాడు. ఇది రెండవ సాకా. (ఇంతకూ ముందు రణ తంభోర్ కోటాలో మొదటిది జరిగింది) రణతంభోర్ కోట ముట్టడించబడినప్పుడు కూడా రాణి అగ్ని సమాధి చేసుకుంది.

1534లో గుజరాత్ యొక్క సుల్తాన్ బహుదూర్ షా మరియు మహారాణా విక్రమాదిత్యల మధ్యలో యుద్ధం జరిగింది. అప్పుడు రాజమాత హాడి రాణి కర్మవతి జౌహర్ కుండ్‌కు తనని సమర్పించింది. 1567లో మొగల్ బాద్ షా అక్బర్ మహారాణా ఉదయ్ సింగ్ మధ్య ఘోరయుద్ధం జరిగింది. జయమల్ మరియు పత్తా అనబడే రాజులు వీర గతిని పొందారు. ఈ భూమిలో వీర స్వర్గాన్ని అలంకరించారు. చిత్తౌడ్గడ్‌లో నౌ కోతా మహల్. నవ్లఖ్ మహల్ (బన్వీర్ ద్వారా కట్టబడ్డ లక్కతో నిర్మితమైన) (బన్వీర్ద్వారా నిర్మితమైన) హరామియోం కా బడా, ఖీతేల్ కీ బావడి (అంటే నెయ్యి నూనె ల బావులు) వున్నాయి, ఈ దుర్గంలో వీర కల్లా రాథోడ్ మరియు బాఘ్ సిశేహ్యొక్క (చతరీలు) మేడల పై కప్పులు కూడా ఉన్నాయి. ఇదే దుర్గంలో విజయ స్తంభము జైనుల కీర్తి స్తంభముకూడా ఉంది. చిత్తౌడ్గడ్ దుర్గములో అన్నిటి కంటే పెద్దదిగా అందరి చేత ఆకర్షించబడినది రాణా రతన్ సిశేహ్ యొక్క రాణి పద్మావతి మహల్. శృంగార్చంవరి అనబడే శాంతి నాధుని జైన మందిరాన్ని కూడా కోటలో చూడవచ్చు.

ఇక్కడే గోరా, బాదల్ అనే వీరుల నవ్ల ఖా బుర్జ్. భీం లతా కుండ్కూడా ఉన్నాయి. ఈ దుర్గంలో మొత్తము 7 అభేధ్యములైన ప్రవేశ ద్వారాలు ఉన్నాయి .

బైంస్‌రోడ్ ఘడ్ దుర్గము

కుంభ శ్యాం మందిరము, మీరాబాయి మందిరము, సామ సిద్ధేశ్వర మందిరము, నీలకంఠ మహాదేవ మందిరము, తులజా భవాని యొక్క మందిరము కుకడేశ్వర్మహా దేవమందిరము, సాత్బీస్దేవరి జైన మందిర్. చిత్రంగమోరితాలాబొ మొదలగునవి దర్శనీయ స్థలాలు.

చిత్తౌడ్గడ్‌లోని రెండవ కోట బైంస్ రోడ్ గడ్కా కిలా అని పిలవబడుతున్నది. ఈ జలదుర్గము చిత్తౌడ్గడ్ యొక్క చంబల్, బామని నదుల మధ్య స్థానంలో నిర్మితమైంది. దీన్ని బైంసా షా అనే వ్యాపారి రోడాచారన్ అనే వ్యక్తితో కలిసి నిర్మించాడు. దీన్ని రాజస్థాన్ యొక్క వెల్లోర్ అంటారు. కర్నల్ టాడ్డీన్ని అభేద్య దుర్గమని కొనియాడాడు దానితో బాటు ఇది ప్రముఖ వ్యాపారుల నివాస స్థానానికి రక్షణార్థం ఉపయోగపడే దుర్గము అని రాశాడు.

ఇక మూడవ దుర్గము కుంబల్గడ్ దుర్గము. ఇది రాజసమంద్ అనేచోట ఉంది. మేవాడ్ మరియు మార్వాడ్ యొక్క ఎల్ల ప్రాంతంలో సాదడి అనే గ్రామానికి సమీపంలో రాజస మంద్ అనే జిల్లాలో ఆరావళి పర్వతమాల యొక్క 3568 ఫీట్ పొడవున విశాలమైన పర్వత శిఖరాన గిరిదుర్గం అనే రీతిలో కట్టబడింది. మహారాణా కుంభా గారు శిల్పి మండన్ పర్యవేక్షణలో 1448 నుండి 58 మధ్య దీన్ని నిర్మించారు. దీనికి అనేక పేర్లు కలవు. మత్స్యేంద్ర, కుంభల్మేర్, కుంభ ల్ కర్, మాహోర్, మేవాడ్ –మార్వాడి సీమ యొక్క కాపలాదుర్గము. మార్వాడి వక్షస్థలపు ఖడ్గము, మేవాడ్ యొక్క నేత్రశీ, మచ్చేంద్ర పురము కుంభల్మేరు మీరు దుర్గము కమల్ మీర్ అనే విభిన్న పేర్లతో పిలువబడుతున్నది. కుంభల్గడ్ దుర్గము ఆరావళి పర్వత శిఖరాల శృంఖల మధ్య జరగాహేమకూట్ నీల హిమవంత్, గంధమాదన్ అనే పర్వతాల మధ్య ఉంది. దీన్ని చూసిన అబుల్ ఫజల్ ఇలా రాశారు “ఇది ఎంత ఎత్తుగా ఉందంటే కింద నుండి

కుంబల్గడ్ దుర్గము

పైకి చూసినప్పుడు రాజస్థానీ వాళ్ళ పగడి అంటే తలపాగా తానుగా కింద పడిపోతుంది" ఇది అంత పొడవుగా ఉంది అని అభివర్ణించారు.

కర్నల్ జేమ్స్ టాడ్గాయి దీన్ని ఎట్రుస్కన్ దుర్గంతో పోల్చారు. కుంభల్గడ్ దుర్గంలో ఒక చిన్న కోట కటార్గడ్ ఉంది. దీన్ని మేవాడ్ యొక్క త్రినేత్రం అని పిలుస్తున్నారు. ఇందులో ఝాలి రాణి కా మాలియా మహల్ మరియు బాదల్ మహల్ అన్నవి ప్రసిద్ధి చెందినవి. కటార్గడ్ దగ్గర ఉత్తర భాగాన ఝాలిబాబ్ బావ డీ మరియు మామా దేవ్ కుండ్ వుంది. ఇక్కడే కుంభా రాజు ద్వారా నిర్మించ బడిన కుంభాస్వామి విష్ణు మందిరం ఉంది. ఇదే కోటలోనే తన యజమానికి విశ్వాస పాత్రురాలైన పన్నాధాయి మహారాణా ఉదయ్ సింగ్‌ను కాపాడేందుకై తన ప్రియమైన పుత్రుడిని పండబెట్టి హత్య కావించి తన స్వామి భక్తిని చాటుకుంది. ఏ తల్లీ చేయని సాహసాన్ని చేసి తన స్వామి భక్తిని నిరూపించి భారతమాత ముద్దుబిడ్డగా సాహిత్యంలో చరిత్రలో పన్నాధాయి కీర్తి శేషు రాలై మిగిలిపోయింది. ఇదే కోటలోనే ఉదయ్ సింహ్ గారు మేవాడ్ యొక్క మహారాణాగా రాజ్యాభిషేకం కావించుకున్నారు. ఈ దుర్గంలో మహారాణా ఫతేహ్సింహ్ ద్వారా నిర్మించబడ్డ బాదల్ మహల్‌ను (ప్యాలెస్ ఆఫ్ క్లౌడ్స్) అని ఇంగ్లీషులో చెబుతారు. ఇదే మహల్‌లో మహారాణా ప్రతాప్ జన్మించారు. గోగుందా అనే చోట తన రాజ తిలకాన్ని ధరించి మహారాణా ప్రతాప్ కుంభల్గడ్ నుండి మే వాడ్ యొక్క శాసకునిగా తన రాజ్యపాలన ప్రారంభిం చారు. మహారాణా ప్రతాప్ ఈ దుర్గం నుండి హాల్దిఘాటి యుద్ధానికి సిద్ధపడ్డారు. 1578లో ఈ దుర్గం పైన అధికారాన్ని మొట్టమొదట అక్బరు సేనాపతి శాహ్ బాజ్ ఖాన్ తన చేతిలో తీసుకున్నాడు. కుంభల్గడ్ యొక్క తూర్పు భాగంలో హాతియాగడ్ అని చిన్న జలధార కలదు. ఇక్కడ ఆ జలధార పక్కన కోట సమీపాన మహారాణా రాయ్‌మల్ యొక్క పెద్ద కుమారుడు రాణా సాంగా యొక్క సహోదరుడు కున్వర్ పృథ్వీరాజ్ యొక్క 12 స్తంభాల గొడుగును (వాస్తుశిల్పి ఘుషణ్‌పనా ద్వారా నిర్మితమైన) దాన్ని చూడవచ్చు. దీన్ని ఉడనా రాజ్ కుమార్ అన్న పేరుతో పిలుస్తున్నారు. ఈ దుర్గము 36 కిలోమీటర్ల పొడవు మూడవ సురక్షత ద్వారం ద్వారా రక్షిస్తూ కోట చుట్టూ నిర్మితమై ఉంది. దీన్ని ఇంటర్నేషనల్ రికార్డ్‌లో నమోదు చేశారు. ఇది భారత దేశం యొక్క అతి పెద్ద గోడ అని పిలవ బడుతున్నది. ఈ దుర్గము ఆపద కాలములో మేవాడ రాజుల శరణ శిబిరంగా పనిచేసింది. కుంభల్గడ్ దుర్గం యొక్క ఉత్తర భాగంలో నడిచే దారిలో టూట్యాకాహోడా, తూర్పుదిక్కున హాథీగుఢా యొక్క జలదారులు పోయేదానికి ఒక మార్గము కూడా ఉంది. దాన్ని దాణివటా మరియు దుర్గము యొక్క పశ్చిమ దిశకుకు చెందిన మార్గాన్ని టీడాబారీ అంటారు. ఈ దుర్గము ఆపద కాలములో మే వాడు రాజుల ఆపద కాలపు శరణస్థలంగా ఉండేది.

ఆచార్య యన్. లక్ష్మీ అయ్యర్
హిందీవిభాగం, రాజస్థాన్ కేంద్రీయ విశ్వవిద్యాలయం
జైపూర్, రాజస్థాన్, ఫోన్ : 9680276038

చిత్రగీతాలు
హిందూస్థానీ బాణీలు

– ఎమ్. పురుషోత్తమాచార్య

ఆమని డాసెనే

చిత్రం : శాంతినివాసం (1960)
రచన : సముద్రాల జూనియర్
సంగీతం : ఘంటసాల
గానం : ఎస్.జానకి & పి.లీల

కామోద్–కహర్వా

ఆమని డాసెనే తొలి
॥ఆ॥ మనమున వనమున
మధురిమ విరియ ॥ఆ॥
1. కలికి వాలుకనుల
కులికి వయసు కలలా
లలితరీతుల పలికె కోయిల
ఆలపించె మధుగీతి ॥ఆ॥
2. సొగసు ఒలకబోసి
వగల సిరులు జూసి
వలపు పాటల తేనెమాటల
వలలు వేసె ఎలదేటి ॥ఆ॥

వసంతఋతువు ఎలా వచ్చిందో కవి వర్ణిస్తున్న పాట ఇది. మనస్సులోనూ,తోటలోనూ మధురిమ విస్తరించింది. మొదటి చరణంలో కోయిల,రెండవ చరణంలో తుమ్మెద వసంతాన్ని ఎలా తెచ్చాయో వివరిస్తున్నారు. తరుణి వాలు కన్నులలో కులికే వయసు కలలాగా కోయిల ఎన్నో రీతులుగా పలుకుతున్నది. సొగసులతో, వగలతో కలిసిన తియ్యనైన వలపుపాట అనే వల వేస్తున్నది ఒక తుమ్మెద.

చక్కని, చిక్కని భావుకత ఇది. వసంతకాలాన్ని కవి తనదైన క్రొత్త కోణంలో వ్యాఖ్యానించడం అపురూపమైన విషయం. ఏవో నాలుగైదు పదాలు తప్ప మిగిలిన రచనా శైలి అంతా చక్కని దేశి తెలుగు నుడికారంతో సాగడం ఎంతో హర్షణీయం. అనుపల్లవిలో యతిని, చరణాల్లో ప్రాసను చక్కగా పాటించారు. నాయికానాయకుల సమక్షంలో వేదికమీద జరుగుతున్న నృత్యకార్యక్రమం కోసం రాసిన పాట ఇది. ఈ ప్రదర్శనలో జానపదం,శాస్త్రీయం అనే రెండు విభాగాలను చక్కగా చూపారు. అప్పటికే బాగా ప్రసిద్ధులైన శాయి, సుబ్బులక్ష్మి అనే నర్తకీమణులు ఈ పాటకు నర్తించారు. వీరు 'అగ్గిరాముడు' మొదలైన సినిమాలలో డ్యాన్సర్స్‌గా పేరుపొందియున్నారు.

మొదట 'సెలయేటి గలగల' అంటూ జానపద ధోరణిలో పాట ప్రారంభమవుతుంది. తరువాత కథక్ నృత్యరీతిలో నృత్యం చేయాల్సివచ్చినప్పుడు స్వరకర్త ఘంటసాల మాస్టారు 'ఆమని డాసెనే' అనే రెండో భాగానికి హిందూస్తానీ పద్ధతిలో బాణీ చేశారు. ఈ పాటను స్వరపరచడానికి మాస్టర్‌గారు మనస్సులో నిశ్చయించుకున్న రాగం కర్ణాగకసంగీతంలోని హంసనాదం. దీన్ని మనం హిందూస్తానీసంగీతపరంగా చెప్పుకుంటే 'కామోద్' అని భావించవచ్చు. ఈ రాగం కల్యాణ్‌ఠాట్‌కు చెందినది.

ఆరో : సరిపమ పనిదమమ నిదపసా
అవ : సపదప మప మరిస

సినిమాపాటలు.

1. జయజయజయశారదా.....మహాకవికాళిదాసు
2. ఎవరో అతడెవరో ఆ నవ...శ్రీవేంకటేశ్వర మహాత్మ్యం
3. ముద్దుల జానకి.....పెద్దరికం
4. సంధ్యారాగం.....ఆనంద్
5. ఓమ్ నమఃశివాయ.....గీతాంజలి

ఈ పాటలో దైవతం స్పష్టంగా సంచారంలో, ముఖ్యంగా సంగతులలో బాగా పలికింది. అక్కడక్కడా శుద్ధమధ్యమ్ రంజకస్వరంగా పనిచేసింది. 'నాధింధినా' అనే నడకగల కహర్వాతాళంలో పల్లవిని ప్రారంభించారు. 'దనిరిసపా' అనే బాణీలో ఇద్దరు కలిసి పల్లవి పాడారు. హిందూస్తానీ సంప్రదాయం ప్రకారం 'డాసెనే'లో 'నే' మీదుగా తబలావాదన ప్రారంభమైంది. పల్లవిని, అను పల్లవిని ఇద్దరు కలిసి ఆలపించారు. తరువాత సితార్ బిట్ అనాగతంగా ప్రారంభమైంది. రెండున్నర ఆవర్తాలలో సితార్, వయొలిన్స్ బిట్ అయ్యాక అర ఆవర్తంలో మృదంగం ముక్తాయింపును ఇచ్చింది. అప్పుడు 'కలికి వాలుకనుల' ను లీల ఎత్తుకున్నారు. రెండో పంక్తిని జానకి పాడారు. మూడో పాదాన్ని చెరి సగం, నాల్గవ పాదాన్ని ఇద్దరు కలిసి పాడారు. 'మధుగీతి' తరువాత ఇద్దరూ ఒకే విధమైన అనుస్వరసంగతిని మూర్ఛనాగమకంతో రవ్వంత కూడా తేడా రాకుండా పాడి పల్లవిని అందుకున్నారు.

'మపనిసరీ' అంటూ రెండో చరణానికి ముందు సితార్,వయొలిన్స్ బిట్టును ప్రారంభించి రెండున్నర ఆవర్తాలు ఇచ్చాక ఇద్దరూ రాగాలాపనను 'సా...నిరిసరి నీదపామరీ' అని అందుకుని మూడున్నర ఆవర్తాలలో పాడారు. తరువాత లీల 'సొగసు' అంటూ నిషాదంలో ప్రారంభించారు. తరువాత జానకి 'వగల' అని తార్‌రిషభ్ నుంచి అందుకుని శుద్ధమధ్యమ్‌ను స్పృశిస్తూ అనుస్వరాన్ని

ప్రదర్శించారు. తరువాత మొదటి చరణంలాగానే మూడో పంక్తిని చెరిసగం పాడి నాలుగో పంక్తిని అందమైన సంగతితో పాడి పల్లవిని ఎత్తుకున్నారు. వెంటనే 'బోల్'ను ఇచ్చారు. అంటే కొనగోలు అన్నమాట. ఇవి మూడు ఆవర్తాలుగా సాగాక మళ్ళీ పల్లవిని అందుకున్నారు. తరువాత నాలుగు ఆవర్తాలలో 'బోల్' వినిపించారు. ఇక్కడినుండి వాద్యసంగీతం పది ఆవర్తాలుగా సాగింది. క్రమంగా వేగాన్ని పెంచుతూ నాలుగు ఆవర్తాలలో వాద్యసంగీతం ముగిసింది. ఈ స్వరసంపుటిని దృశ్యం కోసం ఉపయోగించారు. కాంతారావు పాత్ర వేగంగా కారు నడపడం మీద దీన్ని చిత్రించారు.

నీ మధుమురళీగానలీల



చిత్రం : భక్తజయదేవ (1961)
రచన : సముద్రాల
సంగీతం : ఎస్.రాజేశ్వరరావు
గానం : ఘంటసాల

శుద్ధసారంగ్-కహర్వా

నీ మధుమురళీగానలీల
మనసులు చిగురిడురా కృష్ణా ॥నీ॥
చ॥ యమునాతటమున మ్రోడులు మురిసి
పువులు పూచినవి గోపాలా ॥నీ॥

స్వరం: మప సససససస నిరిసస నిరిసస
నిసస నిరిరిరి నిసస నిరిరిరి
నిసస నిరిరి నిసస నిరిరి నిసదప
మపనిస రిసదప మపసనిదప
మదపమ గమరిసనిసట

శ్రీకృష్ణుని మురళిపాటకు మనస్సులే కాదు, యమునా తీరంలోని మ్రోడులు కూడా చిగురించి, మురిసి, పూవులు పూస్తాయిట. చిత్రంలో భక్తి పరీక్ష వంటి దృశ్యం ఒకటుంది. లక్ష్మణసేన మహారాజు ఆస్థానంలోకి ఇతరదేశం నుండి ఒక సంగీత విద్వాంసుడు వచ్చి తన పాండిత్యంతో పోటీ చేయగలవారు ఆస్థానంలో ఉన్నారా అని సవాలు చేస్తాడు. రాజు పరీక్ష పెట్టాడు. వచ్చిన ఆ విద్వాంసుడు 'హరహరా జయకరా' అనే పాటను ఉధృతంగా పాడి ఆ ప్రక్కనే ఉన్న పూలచెట్టును నిలువునా దహించేస్తాడు. ఈ పాటను ఇంతకు ముందు ముచ్చటించుకున్నాం. సభలోనే ఉన్న జయదేవుడు లేచి ఎంతో భక్తిశ్రద్ధలతో ఈ పాటను ఆలపిస్తాడు. వెంటనే దహింపబడిన చెట్టు తిరిగి చిగురించి పూలు పూస్తుంది. ఈ విషయాన్నే పాట సాహిత్యంలో సూచించారు.

సాలూరువారు ఈ పాటను శుద్ధసారంగ్ రాగంలో బాణీ చేశారు. ఇది కర్ణాటకసంగీతంలో 'సారంగ' రాగానికి సమాంతరంగా ఉంటుంది. ఇది కల్యాణ్ ధాట్‌కు చెందినది. శుద్ధమధ్యమ్ అన్యస్వరంగా, ప్రముఖంగా వినవస్తుంది.

ఆరో : సరిసమ గమపనిస
అవ : సదపమ గరి గమరిస

అవరోహణలో శుద్ధనిషాద్ ఛాయామాత్రంగా ఉంటుంది. ప్రారంభంలో రాగస్వరూపాన్ని ఆవిష్కరిస్తున్నట్లుగా ఘంటసాల మనోహరమైన రాగాలాపన చేశారు. తరువాత పల్లవిని ఎత్తుకున్న తరువాత తబల 'తిరికిట' ఇచ్చి 5వ అక్షరం మీదుగా అంటే, 'గాన' మీదుగా 'నాధింధింనా'తో కహర్వా లయను ప్రారంభించి పాట అంతా 8 అక్షరాల కాలాన్ని ఖచ్చితంగా పాటించారు సాలూరువారు. కర్ణాటక సంగీతంలో మొదటి అక్షరానికి ప్రాముఖ్య మిస్తే హిందూస్తానీలో 5వ అక్షరానికి ఎక్కువ ప్రాధాన్యత నిస్తారు. అందుకే 5వ అక్షరం నుండి లయగతి ప్రారంభ మైంది. రెండోసారి 'మురళీ' ని 'మపసద' అనే సంగతితో పాడారు. 'గానలీల' ను 'మాగమమపా' అని శుద్ధ, తీవ్రమధ్యమ్‌లు రెంటినీ ఉపయోగించి పాడారు.

పల్లవిని, అనుపల్లవిని పాడాక సితార్ అనుసరిస్తూ ఉండగా రెండు ఆవర్తాలలో క్లుప్తంగా, అందమైన ఆలాప్ చేసి పల్లవిని ఎత్తుకున్నారు. ఒక ఆవర్తంలో వేణువు బిట్టును ఇచ్చారు. అప్పుడు చరణాన్ని ప్రారంభించారు. 'పదమప ససస' అనే బాణీలో 'యమునాతటమున'ను పాడాక రెండోసారికి ఆలాపన ప్రారంభించారు. 'సా..నిపా సానిరిసా' అంటూ సంప్రదాయబద్ధంగా ఒకటిన్నర ఆవర్తాలు ఆలపించాక అర ఆవర్తంలో వేణువు బిట్టునిచ్చారు. తరువాత రెండు ఆవర్తాలలో ఆలాప్‌ను ముగించి చరణం ఎత్తుకుని పాడి మళ్ళీ పల్లవిని అందుకున్నారు. తరువాత ద్రుతగతిలో అంటే, పైకాలంలో స్వరాన్ని ఆలపించారు. వేణువు బిట్టును కలుపుకుని రెండు ఆవర్తాలలో స్వరాన్ని పాడారు. చివరలో ఒక ఆవర్తం స్వరాన్ని,మరో ఆవర్తం అవే స్వరాలలో ఆలాప్‌ను పాడారు. వెంటనే దృశ్యంలో మార్పు వస్తున్న సూచనగా వయొలిన్స్ బిట్ ప్రారంభమైంది. ఉద్వేగంగా సాగిన ఈ వాద్యబృందవాదనాసంరంభం 'మపనిసరీ' అంటూ తారాస్థాయిలో స్వరవిహారం చేసింది. తరువాత ఒక ఆవర్తంలో మాస్టారు మరోసారి ఆలాప్ చేశారు. తరువాత వాద్యసంగీతం ఒకటిన్నర ఆవర్తాలలో బిట్టు ఇచ్చింది. అక్కడినుంచి మాస్టారు తారస్థాయిలో 'నిరిసరి' స్వరాలను చక్రభ్రమణం చేయించి ఒక్కసారిగా ఆధారషడ్జమానికి వచ్చి ఆరోహణగమకంతో మరో ఒకటిన్నర ఆవర్తాలలో ఆలాప్ చేసి తార్‌షరజ్‌లో ముగించారు. ముక్తాయి 5వ అక్షరం మీద ముగిసింది.

జాతీయ పురస్కార గ్రహీత
డా. ఎమ్. పురుషోత్తమాచార్య
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

సూక్తి సురభి

– రెంటాల సాంబశివరావు

ఉదారస్య తృణం విత్తం
శూరస్య మరణం తృణమ్।
విరక్తస్య తృణం భార్యా
నిస్పృహస్య తృణం జగత్ ॥

ఉదారస్య–ఔదార్యం గలవానికి, విత్తం–సంపద, తృణం–గడ్డిపరక వంటిది, శూరస్య–పరాక్రమ వంతునికి, మరణం–చావే, తృణం–లక్ష్యము కానిది. విరక్తస్య–వైరాగ్యం చెందిన వానికి, భార్యా–భార్యయే, తృణం–గణింపదగినది కాదు. నిస్పృహస్య–ఆశే లేనివానికి, జగత్–ఈ లోకమే, తృణం–విలువ లేనిది.

ఔదార్యం గల వానికి సంపద లక్ష్యింపదగినది గాదు. పరాక్రమవంతుడు మరణాన్ని గణింపడు. వైరాగికి భార్య అవసరమే లేదు. ఏ ఆశా లేనివానికి ఈ లోకమే గుణింపదగినది కాదు।

– – –

వసంత యౌవనాః వృక్షాః
పురుషాః ధన యౌవనాః ।
సౌభాగ్య యౌవనాః నార్యో
యౌవనాః విద్యయా బుధాః ॥

వృక్షాః–చెట్లు, వసంత–వసంత ఋతువులోనే యౌవనాః–శోభ కలిగి ఉంటాయి, పురుషాః–మనుష్యులు, ధన–తమ సంపదయే, యౌవనాః–శక్తిగా గలిగి యుంటారు, నార్యః–స్త్రీలు, సౌభాగ్య–భర్త వలన కలిగిన సౌభాగ్యము వలననే, యౌవనాః–శోభిస్తారు, బుధాః–పండితులు, విద్యయా–జ్ఞానము చేతనే, యౌవనాః–కీర్తి పొందుతారు।

చెట్లు వసంత ఋతువులో శోభిస్తాయి. మానవులు తమ సంపదలతోనే శక్తివంతులౌతారు. సౌభాగ్యం వలననే పుణ్య స్త్రీలుగా గౌరవాన్ని పొందుతారు. ఇంక పండితులు తమ విశిష్ట జ్ఞానముచేతనే కీర్తిమంతులౌతారు ॥

– – –

కార్తికస్య స్యాంతిమః పక్షః
మార్గశీర్షస్య చాదిఃమః
ద్వా వేతౌ యమ దంష్టాఖ్యౌ
మితాశీ తత్ర జీవతి।।

కార్తికస్య–కార్తీక మాసము యొక్క, అంతిమ–చివరిదైన, పక్షః–కృష్ణ పక్షమును, చ–మరియును, మార్గశీర్షస్య–మార్గశిరము యొక్క, ఆదిమః–తొలి దైన శుక్ల పక్షమును, ఏతా ద్వౌ–ఈ రెండును, యమ–యమధర్మరాజు యొక్క, దంష్టా–కోరలని, ఆఖ్యౌ–పేర్లు గలవి, తత్ర–ఆ మధ్య కాలంలో, మిత–తక్కువగా, ఆశీ–ఆహారముగా గలవాడు, జీవతి–ఆరోగ్యంగా బ్రతుకుతాడు।

కార్తికమాసం కృష్ణ పక్షమును, మార్గశిర మాసం శుక్ల పక్షమును, యమధర్మరాజు "కోరలు" అని అంటారు. ఆ కాలంలో తక్కువగా భుజించేవాడు ఆరోగ్యంగా జీవిస్తాడు. (శాస్త్రప్రకారం ఈ నెల రోజులును పగటి పొద్దు తక్కువగా ఉంటుంది. రాత్రి పొద్దు ఎక్కువగా ఉంటుంది అంచేత తినే తిండి అరుగుదల తక్కువౌతుంది.)।।

– – –

కృతే యుగే తపః కుర్యాత్
త్రేతాయాం జ్ఞాన మేవ చ ।
ద్వాపరే యజ్ఞ మే వాహుః
దానం కలియుగే స్మృతః।।

కృతే యుగే–కృత యుగమున, తపః–(ముక్తి కోసం) తపస్సు, కుర్యాత్–చేయవలెను, చ–మరియును, త్రేతాయాం–త్రేతాయుగమున, జ్ఞానం ఏవ–దివ్య జ్ఞానమే (ముక్తి దాయకము), ద్వాపరే–ద్వాపర యుగమున, యజ్ఞం ఏవ–యజ్ఞమే (మోక్షదాయమని), ఆహుః–చెప్పిరి, కలియుగే–కలియుగమున, దానం–దాతృత్వము, స్మృతః–చెప్పబడినది।

కృతయుగంలో తపస్సు వలన ముక్తి లభిస్తుంది. త్రేతా యుగంలో దివ్య జ్ఞానము ద్వారానే మోక్షం కలుగుతుంది. ద్వాపర యుగాన యజ్ఞమే మోక్షదాయకము. ఇక కలి యుగంలో దానశీలతయే ముక్తి దాయకము.

– – –

అభిగ మ్యోత్తమం దానం
ఆహూ యైవ చ మధ్యమమ్ ।
అదమం యాచమానాయ
సేవా దానం తు నిష్ఫలమ్ ॥

అభిగమ్య–ఎదురు వెళ్లి (చేసిన), దానం–దానము, ఉత్తమం–శ్రేష్ఠమైనది, చ–మరియును, ఆహూయ ఏవ–ఇంటికి పిలిచి (చేసిన దానం), మధ్యమం–మధ్యరకమైనది, యాచమానాయ–యాచించిన వానికి (చేసిన దానం), అదమం–నీచమైనది, సేవాదానం తు–సేవ చేసిన వాని కిచ్చిన దానమైతే, నిష్ఫలం–ఉపయోగమే లేనిది।

దాత తానే స్వయంగా ఎదురు వెళ్ళి చేసిన దానం ఉత్తమమైనది. తన యింటికి పిలిచి చేసిన దానం మధ్యమమైనది. యాచకునకు చేసిన దానం నీచమైనది. ఇంకా సేవ చేయించుకొని ఇచ్చిన దానమైతే నిష్ఫలమే ॥

- - -

అకృత్యం నైవ కర్తవ్యం
ప్రాణ త్యాగేప్యుపస్థితే ।
న చ కృత్యం పరిత్యాజ్య
మేష ధర్మ స్సనాతనః ॥

ప్రాణ త్యాగే-ప్రాణాలే పోయే స్థితియే, ఉపస్థితే అపి-దాపురించినా కూడా, అకృత్యం-కాని పని, న కర్తవ్యం ఏవ-చేయనే కూడదు. చ-మరియును, కృత్యం-కర్తవ్యాన్ని, న పరిత్యాజ్యం-విడిచి పెట్టరాదు, ఏషః-ఇదే, సనాతనః-ప్రాచీనమైన, ధర్మః-ధర్మమై యున్నది ॥।

ఎంత ప్రాణాపాయం కలిగినా కూడా "కాని పని" చేయనే రాదు. అంతేకాక తన విద్యుక్త ధర్మాన్ని విడిచి పెట్టనూ రాదు. ఇది ప్రాచీనమైన ధర్మము.

- - -

ప్రాణాః యథాఽఽత్మనోఽన్యేషాం
భూతానా మపి తే తథా ।
ఆత్మోపమ్యేన భూతేషు
దయాం కుర్వంతి సాధవః ॥

ఆత్మనః-తన యొక్క, ప్రాణాః-ప్రాణాలు, యథా-ఎలాంటివో, తే-ఆ ప్రాణాలు, అన్యేషాం-ఇతరములైన, భూతానాం అపి-జీవులకు కూడా, తథా-అలాగే (తీపి కదా), (కాబట్టి), సాధవః-సజ్జనులు, ఆత్మా ఔపమ్యేన-తమతో పోల్చుకుని, భూతేషు-జీవులందు, దయాం కుర్వంతి-దయ చూపుతారు॥

ఈ లోకంలో మానవునకు తన ప్రాణాల వంటివే ఇతర ప్రాణుల ప్రాణాలు కూడా అనే భావన ఉండాలి. కావుననే సజ్జనులు ఇతర జీవులను కూడా తమతో పోల్చుకుని దయ చూపుతారు ॥

- - -

యథా హ్యేకేన చక్రేణ న
రథస్య గతి ర్భవేత్ ।
ఏవం పురుషకారేణ వినా
దైవం న సిద్ధ్యతి ॥

ఏకేన-ఒకే ఒక్క, చక్రేణ-చక్రంతో, రథస్య-రథానికి, గతిః-గమనము, యథా-ఏవిధంగానైతే, న భవేత్-జరగదో, ఏవం-అలాగే, దైవం వినా-దేవుని దయ గనుక లేకపోతే, పురుషకారేణ-కేవలం మానవ ప్రయత్నంతోనే (ఫలితం), న సిద్ధ్యతి-లభించదు॥

ఈ లోకంలో ఒకే ఒక్క చక్రంతో రథం నడవనట్లుగానే, దేవుని దయ లేకపోతే కేవలం మానవ ప్రయత్నంతో మాత్రమే ఏ కార్యమైనా సిద్ధింపదు॥

రెంటాల సాంబశివరావు
కొవ్వూరు, ఫోన్ : 7893855174

చింతన

ఒక భాష మాట్లాడే టప్పుడు
ఇతర పదాలు కూడా వస్తాయి
కాకపోతె స్నేహంగా.
అవి ఆ భాషను భగ్నం చెయ్యవు
యాసను భంగ పరచవు.

స్వచ్ఛత అనేది
ఎక్కడా వుండదు
ఏడు రంగులున్నా
ఇంద్రధనుస్సు ఒక్కటే
ఎంత సుందరమైన దృశ్యమది!

దేశాలకు వేరు వేరు పేర్లుంటాయి
జాతులూ అంతె
అందరూ కూడితే
మనుషుల పక్కన మనుషులే.

ఫలానా వారు
ఫలానా చోట పుట్టడంలో
వారి ప్రమేయ మేమి వుండదు.

మంటలో వేడి వుంటుంది
వేడి లోని వెలుగును విస్మరిస్తే ఎలా!
వాక్కు లోని ధ్వని మాత్రమే కాదు
దాని లోని సత్యాన్ని గ్రహించాలి.

ఒకే సంవేదన
ఒకే శేముషి
భేదాలను ఊదేస్తే
తేలేది మనిషే.

ఆచార్య ఎన్. గోపి
ఫోన్ : 9391028496

నగ్నముని

నగ్నముని గారితో ....

- మిసిమి

(క్రిందటి సంచిక తరువాయి)

నగ్నముని : నేను 1956 నవంబర్ ఒకటిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడినప్పుడు నేనో చిన్న ఉద్యోగంలో చేరానని చెప్పాను కదా! అప్పుడు సమాజం ఏమనుకుందంటే హైదరాబాద్ రాష్ట్రం, ఆంధ్రరాష్ట్రం కలసిపోతున్నాయి కాబట్టి తెలుగు ఆచరణలోకి రాబోతున్నది అని. తెలుగు ఈ రాష్ట్ర భాష కాబోతున్నది అని సమాజం మానసికంగా సిద్ధమయింది. అంటే తెలుగేతరులందరు తెలుగును అంగీకరించడానికి సిద్ధంగా ఉన్నారు. చాలా ప్రైవేటు కంపెనీలు తెలుగులో ఉత్తర ప్రత్యుత్తరాలు జరపటానికి పూనుకున్నాయి. నాలాంటి వారితో ఆ సంగతి చెప్పాయి కూడా. రెండు రాష్ట్రాలు కలిశాయి కానీ, తెలుగును పరిపాలనా రంగంలోకి తీసుకురాలేదు. అదే ఇప్పుడు కొనసాగుతోంది. బోర్డులన్నీ తెలుగులో ఉంటాయి ఇక అనుకున్నారు. తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వాలి అనేది అప్పుడే లేదు. రెండు రాష్ట్రాలు ఎందుకు కలసి పోదామనుకున్నాయి. మాతృభాషలో పాలన సాగాలని కదా. భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడ్డ తొలి రాష్ట్రం కూడా ఆంధ్రప్రదేశే కదా. అసలా ధోరణి లేనేలేదు. ఆవైపు పాలకులు చూడలేదు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య కొంత గ్యాప్ ఏర్పడింది. అసలు ఎంపికైన ప్రజా ప్రతినిధులకు కూడా ఐదేళ్లలో ఈ పనులు చేయాలి అని నిర్దేశింప బడలేదు. ఎమ్మేల్యేగా ఎంపికైతే చాలనుకుంటున్నారు. ఎలక్షన్ కమీషన్ కూడా ఆ అంశంపై దృష్టి పెట్టలేదు. దాంతోటి ప్రజాప్రతినిధులు జీతభత్యాలపైనే దృష్టి పెట్టారు. శాసనాలు రూపొందే సమయంలో శాసనాల పరిజ్ఞానం లేనివారందరినీ మనం ఎన్నుకుంటున్నాం. దీన్నే ప్రజాస్వామ్యం అంటున్నాం. నిర్దేశింపబడిన బాధ్యతలు లేకపోవడం ఒక లోపం అని నాకనిపిస్తుంది.

మిసిమి : ఆ పని ఎగ్జిక్యూటివ్ నిర్వహిస్తుంది కదా. లెజిస్లేచర్ వేరు ఎగ్జిక్యూటివ్ వేరు కదా.

నగ్నముని : అయినప్పటికీ తను నిర్దేశించే పరిస్థితిలో ప్రజాప్రతినిధి ఉండాలన్నది నేను చెప్పేది. శాసనం నిర్మాణానికి, అమలుకు మధ్య ఒక కన్ఫ్యూజన్ ఏర్పడుతోంది. డబ్బుంటే ఏదయినా చేయవచ్చు అన్న భావన కలుగుతోంది. వృత్తి, నైపుణ్యం ఎవరికయినా అవసరం నా అభిప్రాయం ప్రజాప్రతినిధి ఐదేళ్లే ఉంటాడని అనుకుంటాం కానీ, ఐదేళ్ల తర్వాత అతనే రావొచ్చు. మరో కొత్త అతను రావొచ్చు. కానీ వ్యవస్థలో మార్పులేదన్నది నేను చెప్పేది.

మిసిమి : మనం మరీ రాజకీయాల్లోకి వెళ్లిపోతున్నాం... మీరన్న ముందు విషయానికి వస్తే తెలుగు అమలుకు సమాజం సిద్ధంగా ఉంది. ప్రభుత్వం లేదు అన్న పాయింట్ దగ్గర ఆగాం. 1974లో అధికార భాషా సంఘం ఏర్పాటయ్యేవరకు తెలుగును పట్టించుకున్నవారు లేరు. అధికార భాషాసంఘం ఏర్పడ్డాక పెద్ద ఒరిగిందేమీ లేదు. అది వేరే విషయం మీ పుస్తకాల్లో ప్రముఖమైనవి విలోమ కథలు.. కొయ్యగుర్రం... వాటి గురించి మాట్లాడుకుందాం.

నగ్నముని : అంతకంటే ముందు మరో విషయం చెప్పాలి. మన సమాజంలో ప్రజల కాంక్షల వెనక ఉద్యమాలున్నాయి. కర్నూలు రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పాటు వెనక వందేళ్ల ఉద్యమం ఉంది. అలాగే నైజాముకు వ్యతిరేకంగా, భూస్వాములకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రజలు ఉద్యమించారు. కానీ ఆంధ్రరాష్ట్రం, హైదరాబాద్ రాష్ట్రం

కలపటం వెనక ఏ ఉద్యమం లేదు. భాష ఒకటే అని చెప్పారు. ఒక ఉద్యమం ద్వారా ఈ రెండు రాష్ట్రాలు కలిసి ఉంటే తెలంగాణ రాష్ట్రం ఏర్పడేది కాదు కదా. ఆంధ్రులు మమ్మల్ని అణిచి వేస్తున్నారు అన్న భావనలోంచే కదా తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. రెండు రాష్ట్రాలు కలవటం వలన ఎంతో అభివృద్ధిని పోగొట్టుకున్నారు. సామాన్యుడికి ఎంత అన్యాయం జరిగింది. 1921లో ఉన్నవ లక్ష్మీనారాయణ తదితరులు 'విశాలాంధ్ర' మాకు కావాలి అంటే అది 'బళ్లారి నుంచి బరంపురం' వరకు అడిగారని మనం గ్రహించాలి. తెలుగు దేశంలోనే ద్వితీయ భాషగా బ్రిటీషు వాడు గుర్తించాడు. అందుకే రూపాయి నాణెం మీద తెలుగు ఉంటుంది. హిందీ కాదు తెలుగే గుర్తించుకోండి.. అప్పటికే స్థిరపడిన రెండు తెలుగు రాష్ట్రాలను ఎలాంటి ఉద్యమం లేకుండా 1956లో ఎందుకు కలపవలసి వచ్చింది అన్న అంశం మీద నా ఆవేదన అది. ఇక మీరడిగిన విషయంలోకి వస్తాను. 1975లో ఎమర్జెన్సీ విధించారు. ఇందిరాగాంధీ ఎలక్షన్‌ని ఎప్పుడయితే హైకోర్టు కొట్టేసి ఇరవై రోజులు సమయం ఇచ్చిందో, సుప్రీంకోర్టులో అపీల్ చేసుకోవడానికి అప్పుడు ఎమర్జెన్సీ డిక్లేర్ చేశారు. భారతదేశంలోని ప్రతిపక్ష నాయకులందరి అరెస్టులు జరిగాయి. రాజకీయ రంగానికి సంబంధించి నేనొక చీమను. ఒక చిన్న ఉద్యోగిని. ఒక రైటర్‌ని. కానీ నాకోసం పోలీసులొచ్చారంటే నాకే ఆశ్చర్యం వేసింది. అప్పుడు నేను ఇంట్లో లేను. అయితే ఎమర్జెన్సీ విధించవలసిన అవసరం లేనేలేదప్పుడు. పదవికోసం ఏర్పాటు చేసుకున్న వ్యవహారమే తప్ప మరొకటి కాదు. భారతదేశంలో అంత విప్లవమేమీ రాలా. దేశమొక జైలుగా మార్చారు. ఆలోచించే వారందరినీ లోపలేశారు. పత్రికలు ఎడిటోరియల్ రాయటానికి వీల్లేదు. ఎడిటోరియల్ పేజీని బ్లాంక్‌గా వదిలేశారు. ప్రభుత్వం అలా వదిలేయటానికి వీల్లేదన్నది. అప్పటికి నా ఉద్యోగం కూడా పోయింది. నా ఉద్యోగం పోవటానికి కారణం దిగంబర కవిత్వం, విరసం, నా ఉపన్యాసాలు. ఇవన్నీ వ్యక్తులపై ఇంటలిజెన్స్ నివేదికలుగా ప్రభుత్వానికి చేరాయి. నా కవితలు అవీ వారు అనువాదం చేశారు. బాగా చేశారు. ఉత్తరాలు పరిశీలించేవారు. మీమీద నిఘా ఉంటుంది. నా ఉద్యోగం పోయే ముందర ఒకరోజు ఫ్యూన్ వచ్చి మీకోసం ఎవరో వచ్చారు అని చెప్పాడు. అక్కడ అసెంబ్లీలో ఇండియన్ కాఫీ హౌస్ ఉంది. అక్కడకు రమ్మనమని చెప్తే అక్కడకు వెళ్లాను. అక్కడో వ్యక్తి కూర్చుని ఉన్నాడు. మీమీద పదేళ్లుగా నిఘాలో పనిచేస్తున్నానని అతను చెప్పాడు. "మీరు చాలా మంచివారు. ఎందుకు సార్ ఈ రాతలు" అని నామీద జాలిపడ్డాడు. "నాకు ప్రమోషన్ వచ్చింది సార్, ఇక నేను సెలవు తీసుకుంటున్నాను" అని చెప్పడానికి వచ్చాడతను. దీనిమీద ఒక కథ రాశాను. ఒకాయన లెక్చరర్‌గా ఉంటాడు. ఆయన శిష్యుడు ఒకతను నక్సలైట్‌గా మారతాడు. ఆతని కదలికలు తెలియాలంటే ఈ లెక్చరర్ గారిపై నిఘా ఉంచాలని నిఘా పెడతారు. ఈ లెక్చరర్ రామకృష్ణ 70ఎమ్.ఎమ్‌లో 'రెడ్‌సన్' సినిమా చూడటానికి వెళ్లాడు. నిఘా వేసిన వ్యక్తి అతన్ని ఫాలో అయ్యి రెండు టికెట్లు కొంటాడు. మా ఫ్రెండ్ వస్తానని రలేదు, టికెట్ మిగిలిపోయింది సర్. మీకేమన్నా కావాలా అని అడుగుతాడు. ఇద్దరు కలసి చూస్తారు. అంటే అలా వాడు ఆయన్ని నీడలా ఫాలో అవుతాడు. చివరికి ఆ లెక్చరర్ గారికి ఆ నిఘా ఇంటిలిజెన్స్ ఆఫీసర్ ఓ ఆకాశరామన్న ఉత్తరం రాస్తాడు. మీకు ఇద్దరాడపిల్లలున్నారు. తాడేపల్లిగూడెం సంబంధం ఖాయం చేసుకోండి అంటూ. అంటే నిత్యం అతను ఇతని జీవితంలో ఓ భాగమై పోయాడు. సరదాగా చెబుతున్నాను.

ఇంతకీ నేను ఎమర్జెన్సీ కథలు రాయడం జరిగింది. 1975లో ఉద్యోగం పోయింది. పద్దెనిమిది నెలలపాటు ఉద్యోగం లేదు.

మసిమ : మిమ్మల్ని అరెస్టు చేశారా?

నగ్నముని : అరెస్టు అంతకుముందే చేశారు. నేను, శ్రీశ్రీ మరికొంతమంది 1974 ప్రపంచ తెలుగు మహా సభలప్పుడు దానికి 'విరసం' తరఫున బాయ్‌కట్ చేద్దామనుకున్నాం. 'విరసం' తీర్మానం చేసింది. వరవరరావు నన్ను ఉస్మానియా యూనివర్శిటీ చూసుకుంటారా అని అడిగితే సరేనని ఉస్మానియా యూనివర్శిటీ వెళ్లి అక్కడో రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ పెట్టాను. తెలుగు మహాసభలను మీలో వ్యతిరేకించేవారెవరని ప్రశ్నించాను. కొంతమంది రచయితలు జైల్లో ఉండగా ఈ మహాసభలు జరుగుతున్నాయి. అదొక కారణం. మేము వ్యతిరేకిస్తున్నామండీ అన్నారు. భావజాలంలో కొంత

తేడాలున్నా అందరికీ ఈ విషయంలో ఏకభావన ఉంది. కొంతమంది పబ్లిక్ గార్డెన్స్ ఎంట్రన్స్ దగ్గరుండండి. కొంతమంది నిజాం షుగర్స్ బిల్డింగ్ దగ్గరుండండి. మేం పిలుపు ఇవ్వగానే నాలుగు వైపుల నుండి వచ్చేయండి ఇదీ ప్లాన్. నేను, శ్రీశ్రీ ఆటో దిగగానే అరెస్టు చేశారు. చెరబండరాజు కూడా వచ్చాడు. ఆడపిల్లల్ని, మగపిల్లల్ని ఇలా అందరినీ అరెస్టు చేశారు. మా పేర్లు రాసుకున్నారు. మమ్మల్ని లక్డీకపూల్ స్టేషన్లో పెట్టారు. నేను పోలీస్‌ను పిలిచి సిగరెట్ తెప్పించాను. ఇక్కడ శ్రీశ్రీ, దిగంబర కవులున్నారు అని గట్టిగా చెప్పాను. జనం వచ్చారు. ఇక లాభంలేదని మమ్మల్ని నారాయణగూడ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ కూడా ఇదే కథ. సిగరెట్లు తెప్పించటం.. రండయ్యా అని జనాన్ని కేకేయటం... ఇలా లాభంలేదని చివరికి బోయిన్‌పల్లి పట్టుకుపోయారు. ఆడపిల్లలున్నారు. వాళ్లకు వేరే సెల్ ఏర్పాటు చేయండయ్యా అన్నాము. అట్లాగే సర్ అన్నారు. రాత్రి శ్రీశ్రీ గారు ఆయనకు చెళ్లపిళ్ల గురించి, ఆయనకున్న గొడవలు చెబుతున్నారు. వింటున్నా. పోలీసు స్టేషన్ దరిదాపుల్లో ఇళ్లులేవు. ప్రశాంతంగా ఉంది. ఇంతలో ఎవడో వచ్చాడు. శ్రీనివాసరావు ఎవడు అంటూ. నేనే..నేనే అని లేచాడాయన. బయటకు రండి అని పిలిచాడా వ్యక్తి. ఇంతకీ ఏమిటి? ఎవరో అభిమాని ఆయనకు మందు బాటిల్ పంపించాడు. తీసుకోమంటావా అంటే వద్దని ఆయన్ని ఆపాను. మర్నాడు పేపర్లో ఏమొచ్చిందో తెలుసా.. మమ్మల్ని జడ్జిగారు ముందు ప్రవేశపెట్టినట్లు మూడు రోజులు రిమాండ్ విధించినట్లు వచ్చింది. వెంటనే హిందూ పేపర్ రాజేంద్రప్రసాద్‌కు టెలిఫోన్ చేశాను. ఏమిటిది అంటూ. మాకు ఇచ్చిన వార్త అది అన్నాడు. అక్కడ ఆ పోలీసు స్టేషన్లో సి.ఐ. ఉన్నాడు. మీరిలా వార్త రాశారు. తర్వాత అసెంబ్లీ ఉంది. నేను అసెంబ్లీ ఉద్యోగిని. మీ సంగతి చూస్తా అని ఉద్రేకంగా అరిచాను. ఆయన భయపడ్డాడు. ఆరోజు ఆదివారం. తిన్నగా బర్కత్‌పుర క్వార్టర్స్‌కు తీసుకెళితే అక్కడ మెజిస్ట్రేట్ ఉన్నాడు. మమ్మల్ని ప్రవేశపెట్టారు. పోలీసులు మామీద రాంగ్ రిపోర్టు ఇచ్చారు సర్ అని చెప్పాను. ఇది తప్పని చెప్పండి లేదంటే బయటకు వెళ్లి ప్రెస్ కాన్ఫరెన్స్ పెడతాను అన్నాను. లేదు.. లేదు.. వెంటనే విడుదల చేయండి అన్నాడాయన. బయటకొస్తే మొత్తం యూనివర్శిటీ బయటే ఉంది. పెద్ద ఊరేగింపు... మళ్లీ ఆయన నా మందుబాటిల్ అని నసిగాడు...(నవ్వు). మళ్లీ విలోమ కథల్లోకి వస్తాను. అప్పట్లో కవి దేవిప్రియ ప్రజాతంత్ర పత్రికకు సంపాదకుడుగా ఉండేవాడు. నాకు మంచి మిత్రుడు. టీ తాగి సిగరెట్ తాగుతున్నాను. నగ్నమునిగారు మన పత్రిక ఉంది కదా. మీరో కథ పంపించాలి అన్నాడు. నేనామాటను పట్టించుకోలేదు. మళ్లీ ఇంకొకసారి అడిగాడు. మూడోసారి గట్టిగా అడిగాడు. నేను చెప్పాను. ఒక కథ రాయలేనయ్యా, ఎక్కువ కథలు రాస్తాను అన్నాను. సార్ అలా మాట్లాడి తప్పించుకోకండి. మూడు కథలు రాసివ్వండి ముందు అన్నాడు దేవిప్రియ. వెంటనే మూడు కథలు రాశాను. అతనికిచ్చాను. అవే "విలోమ కథలు". సాహిత్యంలో కవిత్వంలో ఉద్యమాలున్నాయి. కథల్లో ఆ ఉద్యమాలు లేవు. ప్రయోగాలు లేవు. సరే సంసారం.. కుటుంబం... ఇలాంటి అంశాలున్నాయి. రాజకీయ రంగానికి సంబంధించిన కథలు అసలు లేవు. అవి దృష్టిలో పెట్టుకుని 'విలోమ కథలు' పేరుపెట్టి మూడు కథలు రాశాను. రెండు కథలు దేవిప్రియ ప్రచురించాడు. మొదటి కథ వేయగానే ఇంటెలిజెన్స్ పోలీసులు వచ్చేశారు. "సార్ మీరు ఇలాంటి కథలు వేయటానికి వీల్లేదు" అని వార్నింగ్ ఇచ్చారు. ఎమర్జన్సీ ఇంకా ఉంది. సరే అలాగే అన్నాడు దేవిప్రియ. "ఆ రచయితకు కూడా చెప్పండి, ఇలాంటి కథలు రాయొద్దని" అని చెప్పారు. ఓకే అన్నాడు గానీ, సాహసించి ఇంకో కథ వేశాడు దేవిప్రియ. మళ్లా వచ్చారు. ఈసారి గట్టి వార్నింగ్ ఇచ్చారు. పబ్లికేషన్స్‌కు సంబంధించిన లైసెన్స్ కాన్సిల్ చేస్తామని గట్టిగా చెప్పారు. దాంతో మూడోకథ ఆగిపోయింది. ఆ కథను ఆంధ్రప్రభకు ఇచ్చాను. ఆ కథ తర్వాత వేశారు. నగ్నముని పేరుతోనే రాశాను. ఆశ్చర్యమేమంటే ఎమర్జెన్సీ వ్యతిరేకిస్తూ శ్రీశ్రీతో సహా ఎవరినుంచి ఓ స్టేట్‌మెంట్ లేదు. శ్రీశ్రీ, ఆరుద్ర ఇంకా చాలామంది ఎమర్జెన్సీ సపోర్ట్ చేశారు. నాకు ఆశ్చర్యం కలిగించింది. ఎమర్జెన్సీ మీద నేను రాసినవి తప్ప తెలుగులో కథల్లేవు.

ఈ సమయంలోనే అంటే ఎమర్జన్సీ తర్వాత నేను "కొయ్యగుర్రం" రాశాను. అది ఆలిండియా రేడియోలోనే ప్రసారమయింది. అది నేనప్పుడు భరద్వాజ గారికి ఇచ్చాను. అది దివిసీమ తుఫాను మీద రాశాను. అందులో ఫిలాసఫీ కూడా ఉంది. అప్పుడు హిందూ చంద్రకాంత్ నన్ను

ఇంటర్వ్యూ చేయటానికి వచ్చాడు. 1980లో పబ్లిష్ అయింది. ఆ ఇంటర్వ్యూ ఆధారంగా ఒక వ్యాసం రాశాడు. దివిసీమ తుఫాను మీద కవిత్వం రాశాడు. ఈ కవిత తెలుగు సాహిత్యంలో తుఫాను తెచ్చింది అని రాశాడు. ఈయన రాసేవిధానం సోక్రటీసు తరహాలో ఉంటుందని రాశాడు. ప్రభుత్వం అనేది ఓ కొయ్యగుర్రం. దాన్ని పట్టుకు ఊరేగుతాం మనం. ఒక మనిషి పట్టపగలు రోడ్డుమీద కాగడాలో వెళుతుంటాడు. ఏమిటయ్యా ఇది అంటే మనిషి కోసం వెతుకుతున్నాను అంటాడు. ఇదీ కొయ్యగుర్రం. దాని తర్వాత కొన్ని పోయెమ్స్ రాశాను. 1972లో తూరుపుగాలి వేశానని చెప్పాను కదా. అందులోవి కొన్ని.. మరికొన్ని పబ్లిష్ కాని పోయమ్స్ అన్నీ కలిపి "నిరసన శకం" అనే కవిత్వ సంపుటి రాబోతోంది. పెద్ద పుస్తకమే అవుతుంది.

***మిసిమి* : మళ్లీ మీరు విలోమకథలు లాంటివి రాయక పోవటానికి కారణమేమిటి?**

నగ్నముని : స్వాతంత్ర్యం తర్వాత మనకు వచ్చిన ఉద్యమాలు... దిగంబరకవులు ఉద్యమం. కొయ్యగుర్రం (అదొక దీర్ఘకవితనుకోండి) ఒక ఉద్యమం. ఈ రెండు కూడా రాజకీయ అంశాలలో కూడినవి. తెలుగు సాహిత్యంలో రాజకాయాంశాలు మాతోనే (దిగంబర కవిత్వంతో) మొదలయింది. 80లలో స్త్రీవాద ఉద్యమం వచ్చింది. మాతృస్వామ్య, పితృస్వామ్య వ్యవస్థల మధ్య గొడవలు అందులో ఉంటాయి. నిర్మాణానికి సంబంధించిన ఉద్యమం. తర్వాత దళితోద్యమం వచ్చింది సామాజిక పరమైన ఉద్యమం. నిర్మాణ పరమైన అంశాలు అందులో ఉన్నాయి. పుట్టిన దగ్గర్నుంచి మమ్మల్ని శత్రువులుగా చూస్తున్నారు అన్న భావనతో మైనారిటీ ఉద్యమం వచ్చింది. ముస్లిం సోదరులు మొదలుపెట్టారు. అది కూడా వ్యవస్థకు సంబంధించిన ఉద్యమమే. కానీ లేటెస్ట్‌గా వచ్చినది ప్రజాస్వామ్యవాదం. కొంత కొయ్యగుర్రంలో ఆ ప్రయత్నం కనిపిస్తుంది. నినాద కవిత్వం కాదది. It is a political text. It is a menifesto. ఇదొక ఉద్యమం అన్నారు. 'విరసం' వాళ్లతో అప్పుడే చెప్పాను నేను. మీ Jargon (పదజాలం) వాడను అని. నిజానికి 'విరసం' వాళ్ళు వేయాలి. 'విరసం' భూస్వామ్య వర్గం తప్ప మరొకటి మాట్లాడదు. కొన్ని మాటలు వాడి వాడి అరిగిపోయాయి. లవ్ అనే మాటలకు ప్రేమ అనే పదం ఒకటే మనకు కనిపిస్తుంది. అదే ఉర్దూలో అనేక మాటలు కనిపిస్తాయి. అందుకే ప్రేమ మనకు అరిగిపోయిన పదం.

***మిసిమి*: 50ల నాటి రాజకీయ చరిత్ర చెప్పారు. మీ రచనల గురించి చెప్పారు. విలోమకథలు, కొయ్యగుర్రం గురించి చెప్పారు. ఇప్పుడు తెలుగు రాష్ట్రాలలో ఉన్న డెమొక్రటిక్ సిస్టం గురించి ఏం చెబుతారు! డెమోక్రసి ఎలా Mockeryకి గురవుతుందో చూస్తున్నాం. దీని గురించి మీరు రచన చేయాలని మా కోరిక.**

నగ్నముని : ప్రజాస్వామ్యం అర్థం కోల్పోయిందేమో అనిపిస్తుంది. దేనికి బాధ్యత లేకుండా ప్రజాస్వామ్యం ఉన్నంతకాలం వ్యవస్థ ఈ రకంగానే ఉంటుంది. అందరికి ఓటు హక్కు ఇస్తున్నారు. ఓటు గురించి, రాజకీయ వ్యవస్థ గురించి తెలియని వారు లక్షలాది మంది ఉన్నారు. చివరకి ఎవరు డబ్బులు ఇస్తే వారికి ఓటు వేసే విధంగా తయారయ్యింది. వెనక్కి వెళితే, మొట్టమొదటి రోజుల్లో ఒక్క పార్టీకి ఒక బాక్సు ఉండేది. అడ్డంగా తెర ఉండేది. శ్రావణం అనే చిన్న పరికరంలో వేసిన ఓట్లను అటు, ఇటు తారుమారు చేసేవారు. కాంగ్రెస్ బాక్సులో వేసినవి కమ్యూనిస్టులకు, కమ్యూనిస్టులకు వేసినవి కాంగ్రెస్ బాక్సులోను వేస్తుండేవారు. వోటింగ్ జరిగినప్పుడు ఇదొక రిగ్గింగ్. అదే వోట్లను జేబులో పెట్టుకుని వేరే పార్టీల వాళ్లకు ఇచ్చేస్తాడు. పదో పరకో పుచ్చుకుంటాడు. ఆ తర్వాత ఇలాంటివి నివారించటానికి ఒకే బాక్సు పెట్టి అందులో వేయటం మొదలు పెట్టారు. దాంట్లో ఇంకు పోసేవారు. ఇదెందుకు జరుగుతుందంటే వచ్చే జీతం సరిపోదు. దానికోసం ఇలాంటివి. నాకు వందరూపాయలు జీతం. అప్పులు చేస్తుంటాను. వాడెవడో వచ్చి రెండొందల రూపాయలిస్తాను. చెయ్యి అంటే ఎందుకు చేయను. జీవితం ఈ పక్కన భయంకరంగా ఉంది మరి. నేను ఉద్యోగం చేస్తున్న కొత్తల్లో నా జీతం 96 రూ. రెండుపూటల భోజనం టిక్కెట్లు 30 రూపాయలు. మా నాన్నకు 10 రూపాయలు పంపించేవాడిని. పది రూపాయలు మిగిలేది నాకు. అప్పటికి పెళ్లవలేదు (నవ్వు). జీవితమన్నాక అవసరాలుంటాయి. పిల్లల చదువులు దగ్గరనుంచి ఎన్నో. అందువలన మీరు అనుకున్న వ్యక్తి ఎన్నుకోబడతాడు అన్న గ్యారంటీ లేదు. మీరు

ఇంటలెక్చ్యుయల్‌గా ఆలోచించి చదువుకున్నవాడు ఎన్నుకోబడతాడు అన్న దానికి ఆస్కారం లేదు. వోటు కొనడానికి, అమ్మకానికి అవకాశం ఉన్న కాలం ఇది. ఇంకొంచెం ముందుకు వెళ్లి అవసరమున్నా లేకపోయినా అధికారంలో ఉన్నవారు ప్రతిపక్ష సభ్యులను కొంటున్నారు.

మిసిమి : ఆటోబయోగ్రఫీ ఏమన్నా రాస్తున్నారా?

నగ్నముని : రాయాలనే ఆలోచనలో ఉన్నాను. లేకపోతే చాలా విషయాలు బయటపడవు.

మిసిమి : మీరు చెప్పిన అంశాల్లో రెండు రాష్ట్రాలను ఎలాంటి ఉద్యమం లేకపోయినా కలపటం, అప్పుడు తెలుగు భాష పాలనా భాషగా అమలుకు వీలున్నా చేయకపోటం ఇంకా అంశాలు.

నగ్నముని : ఒక చెరువు ఉన్నది. అది పాడయిపోయింది. అందులో చేపలు అవీ పెరగటం లేదు. ఏం చేస్తారు. ఇంకో చెరువు తవ్వుతారు కదా. చాలామంది ఆదర్శాలు, ఆకాంక్షలు దృష్టిలో పెట్టుకుని Utopian Society కలగంటారు. స్వప్నించటాన్ని ఎవరాపగలరు. అది దృష్టిలో పెట్టుకుని నేనొక వ్యవస్థ గురించి ఆలోచించాను. అది "ద్విముఖస్వామ్యం" ప్రచురణలు అని అనౌన్స్ చేశాను. ప్రజాస్వామ్యం తర్వాత వస్తుంది. దీనిమీద వర్క్ చేస్తున్నాను. ఇది. ఇంకో విషయం, అప్పుడు ఈ రెండు రాష్ట్రాలు కలపడం వెనకున్న రహస్యం నాకు తెలుసు. అది పుస్తకాలలో కనపడదు. కర్నూల్ రాజధానిగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడింది. అప్పుడు ఈ ఇష్యూను చూస్తున్నవాడు పటేల్. రాష్ట్రాల ఏర్పాటు గురించి చూస్తున్నవాడు పటేల్. మిగిలిన విషయాలు ఇప్పుడు చెప్పను కానీ అవకాశమొస్తే నా ఆటోబయోగ్రఫీ, మరొకటి ద్విముఖ స్వామ్యం సిద్ధాంతం... ఈ రెండు పుస్తకాలు తేవాలని ఉంది. కొత్త సిద్ధాంతం రాస్తున్నప్పుడు రిఫరెన్స్ పుస్తకాలు దొరకవు. ఒక ఊహను సిద్ధాంతంగా ప్రతిపాదిస్తున్నప్పుడు దానికి పుస్తకాలు ఎక్కడా దొరకవు. మీ వ్యవస్థలో కొన్ని ప్రశ్నలకు సమాధానాలు దొరకవు. అది కొత్త వ్యవస్థ ఆలోచనకు దారితీస్తుంది. అలా కొత్త సిద్ధాంతం ఆవిర్భవిస్తుంది.

మిసిమి : ఈరోజు మిసిమి కి వచ్చి మీ ప్రయాణాన్ని సమీక్షించారు కదా! రెండు రాష్ట్రాలను తొలిరోజుల్లో కలపటాన్నే మీరు వ్యతిరేకించారు కదా! భాషకు సంబంధించిన ముచ్చట్లు కూడా చెప్పారు. తెలుగు భవిష్యత్తు ఏమిటి?

నగ్నముని : ఒక సభలో తెలుగు భాష గురించి మాట్లాడవలసిన వచ్చినప్పుడు నేనో విషయం చెప్పాను. తెలంగాణ, రాయలసీమ, ఆంధ్ర, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లో నాగలి వంటి ఒక వస్తువుని ఏమని పిలుస్తారు. ఒక Comprehensive dictionery (సమగ్ర పదకోశం) వస్తే బావుంటుందని చెప్పాను. అలాగే ప్రాంతాలేవయినా తెలుగుజాతి అన్న భావన పెరగాలని ఆకాంక్షించాను. నాకు వెంటనే సి.పి.బ్రౌన్ గుర్తుకొచ్చాడు. ఒక డిక్షనరీ తయారు చేశాడు. వేరే భాషల నుంచి తెలుగులోకి వచ్చిన పదకోశం తయారు చేశాడు. ఇప్పటికీ అదే ప్రమాణికంగా ఉండటం విచిత్రం అనిపిస్తుంది నాకు. ఈ నాలుగు ప్రాంతాలకు చెందిన డిక్షనరీ మనకు అవసరం. ముఖ్యంగా ఒక కవికి, ఒక రచయితకు చాలా అవసరం. సామాన్యుడు ఏ ప్రాంతం వాడయినా చదువుకోవటానికి వీలుగా ఉండేది ఒక ఉదాహరణ చెబుతాను. తెలంగాణాలో మీ కూతురుని తీసుకొచ్చావుట కదా! ఎప్పుడు తీసుకొచ్చావు అంటే 'గాంధారి' సమయానికి అన్నాడనుకోండి. అంటే గాంధారి పడుకునేముందు కళ్లకు గంతలు విప్పేస్తుందట. అది 'గాంధారి' సమయం. ప్రతి ప్రాంతంలో ఒక నుడికారం ఉంటుంది. అది చాలా ఆత్మీయంగా ఉంటుంది అర్థం చేసుకుంటే. సరిహద్దు రాష్ట్రాలలో మరో నుడికారం. విశాఖపట్నం దాటితే ఒకలా ఉంటుంది. చిత్తూరు దాటితే ఇంకోలా ఉంటుంది. భాష మీద మనం చాలా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఇవి సంస్థలు చేయవలసిన పని. ప్రభుత్వం తీసుకోవలసిన బాధ్యత అనుకోవచ్చు. ఇప్పటికే చాలా పోయింది. ఇప్పటికన్నా మిగిలిన మాణిక్యాలను ఏరుకుందాం. ఇంగ్లీషు వలన చాలా పోయింది. ఆంధ్ర, తెలంగాణ వలన కొంత పోయింది. ఇతర దేశాలకు వెళ్లటంలో కొంత పోయింది.

మిసిమి : మిసిమి గ్రంథాలయానికి వచ్చి ఎన్నో విలువైన విషయాలు చెప్పారు. ఆకాశవాణితో మీ బంధం?

నగ్నముని : ఆకాశవాణి గురించి మొదట్లో కొంత మీకు చెప్పాను. ఇంకా కొన్ని విషయాలున్నాయి. అవికూడా చెప్పే ప్రయత్నం చేస్తాను. ఆకాశవాణిలో దేవులపల్లి కృష్ణశాస్త్రి గారితో తొలి పరిచయం. ఎన్నోసార్లు స్థానం నరసింహా

రావు గారి నాటికలు, నాటకాల్లో నటించాను. కవిత్వం చదివాను. నిజానికి ఆలిండియా రేడియో లేకపోతే కొయ్యగుర్రం లేదు. సుధామ నన్ను కథల గురించి చక్కటి ఇంటర్వ్యూ చేశాడు. ఆకాశవాణి నా చిన్నతనంలో (1940-50) నాకు రెండో ప్రాణం. మద్రాసులో ఆచంట జానకీరాం గారు చెప్పిన విషయాలు మర్చిపోలేం. అప్పట్లో మహామహులందరూ ఆకాశవాణి నుంచి వచ్చినవారే. శ్రీశ్రీ కూడా రేడియోవాడే. ఉన్నవ లక్ష్మీనారాయణ గారి 'మాలపల్లి' నవలని గుర్తు తెచ్చుకోవాలి. 1921లో ఒక పితూరీ వ్యవహారంలో ఆయన్ని జైల్లో పెట్టినప్పుడు అక్కడ రాశాడాయన. ఈ నవల బయటకు వచ్చాక అంటే పబ్లిష్ అయ్యాక బ్రిటీషు ప్రభుత్వం ఆ నవలను నిషేధించింది. సర్వేపల్లి రాధాకృష్ణన్ గారు తలుచుకోవటం వలన అది బయటకు వచ్చింది. 1936లో కమ్యూనిస్టులు ఆ నవలలోని ఒక పాటను పాడుతుండేవారు. రెండోసారి ఆ నవలను నిషేధించింది బ్రిటీషు ప్రభుత్వం. అప్పుడు రాజమన్నార్ కృషి చేసి ఆ నిషేధాన్ని ఎత్తేయించారు. నాటక ప్రయోక్త, పద్మభూషణ్ ఎ.ఆర్. కృష్ణ ఒకసారి నా దగ్గరకి వచ్చి మాలపల్లి నాటకంగా రాసిస్తారా అని అడిగారు. నేను అంత తొందరగా ఒప్పుకోలేదు. దానికి అంత సమర్థత నాకుందా అని నాకు అనుమానం వచ్చి 24 గంటలు సమయం కోరాను. రెండు విషయాలు ఆలోచించాను. ఉన్నవ లక్ష్మీనారాయణ 'గాంధియన్' (గాంధీని అనుసరించేవాడు). నేను గాంధేయవాదిని కాను. రెండోది అంత పెద్ద కేన్వాసున్న నవలను మూడు గంటల నాటకంగా కుదించటం సాధ్యం కాకపోవచ్చు. ఒప్పుకున్న తర్వాత కొన్ని కండిషన్లు నేను పెట్టాను. రోజుకు ఒక ప్రదర్శన చొప్పున వంద ప్రదర్శనలు ఇవ్వాలి! మీరిస్తారా! నాకు రూపాయి ఇవ్వక్కర్లేదు, సిగరెట్ కూడా ఇవ్వక్కర్లేదు అని అన్నాను. బెంగాల్, మరాఠీ ధియేటర్లతో పోలిస్తే మన నాటకరంగం దయనీయమయిన స్థితిలో ఉంది. అందువలన మీరు రోజుకో ప్రదర్శన ఇవ్వాలి అని కోరాను. ఆయన ఒప్పుకున్నాక స్క్రిప్టు రాశాను. అద్భుతంగా ఉంది అన్నాడాయన. రోజుకు ఒక ప్రదర్శన చొప్పున ఇచ్చారు. రెండు ప్రదర్శనల చొప్పున శ్రీకాకుళం నుంచి ఈమూల వరకు ప్రదర్శించారు. ఒకరోజు ఆలిండియా రేడియో నుంచి వేటూరి సహజానందగారు ఈ నాటకం చూశారు. "అబ్బాయి చాలా బావుంది నాటకం. రేడియోకి కూడా రాసిపెట్టాలి" అన్నాడు. రెండున్నర గంటల స్టేజి నాటకాన్ని గంటకు కుదిస్తే, అయిపోతుందేమో అన్న భయాన్ని వ్యక్తపరిచాను. ఏం ఫర్వాలేదు. ముఖ్యమయిన సన్నివేశాలలో నాటకాన్ని గంటకు తయారు చేయండి అన్నాడు సహజానంద. గంటకు రాశాను. రంగస్థలంమీద వేసిన నటులే వేశారు అప్పట్లో. "వాణి" పత్రిక ఉండేది. అందులో ఫోటోలు కూడా వేశారు. అలా నా అనుబంధం రేడియోతో మరింత గట్టిపడింది. రెండవది రవీంద్రనాథ్ గారి గురించి చెప్పాలి. ఆ మహానుభావుడు ఎన్నో ప్రయోగాలు చేసినవాడు. మాకంటే ముందున్నవాడు. మేం ఆ రోజుల్లో అసెంబ్లీ ప్రొసిడింగ్స్‌ని పుస్తకాలుగా తయారు చేసి న్యూస్ పేపర్లకు పంపేవాళ్లం. ఏరోజుకారోజు అచ్చు వేస్తాం. వాటి ప్రింటింగ్ కళాజ్యోతి ప్రెస్‌లో జరుగుతుండేది. శర్మగారని ఒకాయన **మిసిమి** తరపున వచ్చి కలుస్తుండే వాడు. ఆ ప్రొసెస్‌లో రవీంద్రనాథ్ గారిని వచ్చి కలుస్తూ ఉండేవాడిని. ఎంత స్టైల్‌గా ఉండేవాడాయన. ఒకరోజు శర్మకోసం టెలిఫోన్ చేశాను. "గొంతు గుర్తుపట్టాను... రండి" అన్నారాయన. అదో జ్ఞాపకం వారితో. ఆయన దినచర్య ఆశ్చర్యం కలిగించేది. టైం మేగ్‌జైన్ ఆ రోజుల్లోనే తెప్పించే వాడాయన. ఆయన తొలి సంస్మరణ సభలో ఆయన గురించి మాట్లాడ్డమో గొప్ప అనుభూతి. గొల్లపూడి వంటి వారు చాలామంది వచ్చారు. భరద్వాజను పరిచయం చేసింది ఆయనే. రావూరి భరద్వాజ కథకు సంబంధించి కోర్టు ఫైన్ వేస్తే ఆయన తరపున రవీంద్రనాథ్ గారు చెల్లించారు ఆ జరిమానాను. ఏది ఏమయినా **మిసిమి** ఆఫీసుకి వచ్చి ఇలా మీతో మాట్లాడుతుంటే నాకు రవీంద్రనాథ్‌గారే గోచరిస్తున్నారు. అటు ఆకాశవాణి, ఇటు **మిసిమి** రెండింటితో చక్కటి అనుబంధం నాది. అవన్నీ **మిసిమి** పాఠకులకు తెలియచేసే అవకాశం కలగడం ఒక గొప్ప అవకాశంగా భావిస్తున్నాను.

మిసిమి : ధన్యవాదాలు నగ్నముని గారూ. మీరు చెప్పినది ఒక సాంఘిక చరిత్ర!! సమీప చరిత్ర!!

(ఈ ధ్వని ముద్రణను రాతిప్రతి చేసినది
సి.ఎన్. రాంబాబు)
ఫోన్ : 8374818961

శ్రీవేంకటేశ పదములు

– మోదుగుల రవికృష్ణ

(క్రిందటి సంచిక తరువాయి)

విశేషాలు – వివరణలు

1వ పదం: ప్రియుని అనుమానం :

"కావలసి నా చనుగవల నే నొత్తితే
ఆవలి మోమై చూచే వదేమో వోయి!
నా వక్షమున నవి నాటి వెడలెనో యనుచు
యీవలి మోమయితినే యింతిరో యిపుడు"

49వ పదంలో కూడా యిలాంటి భావమే ఉంది.

"మొనల గుబ్బలు రెండు చెనకి నాటించగా
అనుమానమున విభుడు అవలి మోమాయను"

ఏకాలం నాటిదో, ఏకవి చెప్పినదో ఒక చాటుపద్యం ఉంది. *"చతురులలోన నీవు కడు జాణవటంచును నెంచి కౌగలించితి నిటు మారుమోమిడగ చెల్లునె యో రసికాగ్రగణ్యా? అద్భుతమగునట్టి బంగరపు బొంగరపుంగవబోలు నీ కుచద్వితయము తొమ్మనాట అలవీపున మూసెనటంచు చూచితిన్.*

పదం ముందో, పద్యం ముందో మనకు తెలియదు. ఒకే భావం రెండు పదాలలోను ఉండటం వలన ఈ రెంటి కర్త ఒక్కరే అయి ఉండవచ్చు.

పదం-4: అడపముసఖి : విజయనగర చక్రవర్తుల కాలంలో చక్రవర్తి సముఖంలో ఉండే ప్రధానమైన ఉద్యోగాలలో ఒకటి అడపగాడు; రాణుల వద్దనైతే అడపగత్తె (అడపముసఖి). విజయనగరం కంటే ముందు రాజ వంశాలలో యీ ఉద్యోగం ఉందో లేదో శిల్పాల ద్వారా, సాహిత్యంద్వారా తెలియటం లేదు. విజయనగర కాలంలో యిది ఒక ముఖ్యోద్యోగం. రాజచిహ్నాలలో ఛత్రం, చామరాలతో పాటు అడపం కూడా చేరింది. సాహిత్యంలో యిందుకు అనేక ఉదాహరణలు ఉన్నాయి. తమిళనాడులో విజయ నగరచక్రవర్తులు, వారి సామంతులు కట్టించిన ఆలయాలలో అడపకాడు, అడపగత్తె శిల్పాలు కాన వస్తాయి. అడపము అంటే తమల పాకులు, వక్క, తాంబూలంలో వేసే ఏలక, లవంగం, కాచు, జాజికాయ, జాపత్రి, పచ్చ కర్పూరం వంటి దినుసు లుంచే సంచి లేదా చిన్న పెట్టె. అడపంలో సున్నం ఉండదు. దాన్ని ఒక చిన్నబుడ్డిలో పట్టి, ప్రత్యేకంగా ఉంచుతారు. ఎంతో గౌరవనీయ కుటుంబంలో పుట్టిన, ఎంతో విశ్వాస పాత్రుడైన, ఎంతో పరాక్రమ శాలియైన వాడికే చక్రవర్తి వద్ద అడపకానిగా కొలువు దొరుకుతుంది. మధుర నాయక రాజ్య స్థాపకుడైన విశ్వనాథ నాయకుడు శ్రీకృష్ణదేవ రాయల అడపకాడు. ఉన్నత సామంత రాజ కుటుంబానికి చెందిన కన్య రాణివద్ద అడపము సఖిగాఉంటుంది. వీళ్లు ఆంతరంగిక కార్యదర్శుల వంటివారు. రాజు, రాణి సంబంధించి వీరివద్ద రహస్యం అంటూ ఏమీ ఉండదు, వారి పడకగది ముచ్చట్లతో సహా. అడపము సఖిచేత నాయకునికి నాయిక విడెము (తాంబూలం) పంపిందంటే ఈ రాత్రికి నీవు రావచ్చును. అని చెప్పినదని అర్థం. "నేను విడెము పంపిస్తే, దీన్ని వాడవనిత (వేశ్య)కి యిచ్చావు. ఇందుకు శిక్షగా నిన్ను నా జడతో కొడతాను" అంటున్నది నాయిక.

కుడిచేత్తో వక్క, ఎడమ చేత్తో తమలపాకులతో అడపముసఖి.

13వ పదం: రకరకాల వలపులు: ఈ పదంలో పదకర్త కోడెకారువారి మధ్య నడిచే రకరకాల ప్రేమల గురించి చెబుతున్నాడు.

1. సంతవలపు బేరం : వారానికో, పక్షానికో, నెలకో జరిగే సంతలో రకరకాల వస్తువుల క్రయవిక్రయాలే కాదు, 'వలపు బేరాలు' కూడా జరుగుతుంటాయి. ప్రబంధాలలో కానవచ్చే పుష్పలావికల, యువకుల ప్రణయ సల్లాపాలు యిలాంటివే కదా! సంతవలపు ఆనాటికానాటితో సరి. ఆ ముచ్చట తీరాక ఎవరికి వారే యమునాతీరే. **2. జంపు వలపు :** ఫలితానికి రాని వలపు ప్రసంగం జంపువలపు. ఎంతసేపు మాటాడినా కాంతకు నమ్మిక కుదరక ప్రియుడిని దూరంగానే ఉంచుతుంది కానీ కోరింది యివ్వదు. మాటలతోనే ముగిసే వలపు యిది. **3. చద్దివలపు :** నిన్ననో మొన్ననో కుదిరి, సఫలీకృతమై కూడా బెడిసికొట్టిన వలపు. పునరుద్ధరించుకోవటానికి ప్రయత్నించినా విఫలమైన వలపు. "మొన్న ఆ నది ఒడ్డున కలిశాం కదా", "అటుమొన్న ఆ సత్రం వద్ద కలిశాం కదా, గుర్తులేదా?" అని నాయకుడు గుర్తుచేస్తున్నా కూడా నాయిక నిరాకరిస్తుంది. **4. చల్లువలపు :** ఒక నాయిక మీదేకాక అనేకమంది నాయికల కోసం ఏక సమయంలో ప్రయత్నిస్తూ ఉండటం చల్లువలపు.

18వ పదం : "పట్టిన తామరమొగ్గ పదనేటి కాయనే" నాయిక చేతితో పట్టుకొన తామరమొగ్గ పదను అయ్యిందట. అంటే పక్వమై విచ్చుకొంది. తామరలు సూర్యదర్శనంతోనే వికసిస్తాయని కవిసమయం. అందుకే కదా, సూర్యునికి కమలాప్తుడు అని నామాంతరం. అంటే కొంతవేడి సోకితేనే తామరలు వికసిస్తాయి. విరహాగ్నితో నాయిక ఒడలంతా వెచ్చబడిపోయింది. ఆ వెచ్చదనం ఏస్థాయిలో ఉందంటే, చేతితో పట్టుకొన్న తామరమొగ్గ ఆ వేడికి పుష్పంగా పక్వమై సంపూర్ణంగా వికసించింది.

24వ పదం : యెడవొత్తు : ఈ పదంలో రాగతాళాలు సూచించే చోట తాళం వద్ద 'యెడవొత్తు' అనేమాట ఉంది. ఈ పేరుతో ఉన్న తాళం తాళలక్షణ గ్రంథాలలో కనిపించలేదు. తమిళనాడు విద్వాంసులు, తాళము మొదలైన తరువాత, కీర్తన ప్రారంభించటానికి మధ్య ఉండే స్థానాన్ని చెప్పడంలో 'ఎడము' అనే పదాన్ని ఉపయోగిస్తున్నారు. తెలుగు విద్వాంసులు యిదే అర్థంలో 'జాగా' అనే మాటను ఉపయోగిస్తారు. లక్షణం ప్రకారం దీన్ని 'అనాగతగ్రహం' అంటారు. తాళం నడిచిన పిమ్మట గీతము నడిస్తే 'అనాగతము' అంటారు.

ప్రముఖ తాళవాద్య నిపుణులు డాక్టర్ భూసురపల్లి వెంకటేశ్వర్లు ఈ విషయాన్ని తెలిపారు.

25వ పదం: జూదం :

'సొక్కుచు ఆపె నీతో జూదము లాడగా
నిక్కుచు నెత్తులు చెప్పనేమా నీకు"

భారతీయ జూదం, చదరంగం యిద్దరు ప్రత్యర్థులు మాత్రమే ఆడే ఆటలు కాదు. ఆటగాళ్లు యిద్దరివైపునా నలుగురో ఐదుగురో సలహాదారులు ఉంటారు. ఒక ఆటగాడు ఒక ఎత్తు వేయగానే రెండవవైపు ఆటగాడి తరపు సలహాదారులంతా చేరి ఆ ఎత్తుకి ముందువెనుకలు ఆలోచిస్తారు. తమ ఎత్తుని ఆటగాడికి సూచిస్తారు. సలహాదారుల్లో ఒకడు ఒక ఎత్తుని సూచిస్తే, దానివలన కలిగే పరిణామాలను వివరించి, ఆ ఎత్తు వద్దంటాడు యింకో సలహాదారు. ఇలా కోలాహలంగా సాగుతుంది ఆట.

శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి 'వడ్లగింజలు' నవలలోనూ, నోరి నరసింహ శాస్త్రి 'ధూర్జటి' నవలలోనూ యీ వాతావరణాన్ని కనులకు కట్టినట్లు వర్ణించారు.

32వ పదం : వివిధ ప్రాంతాలపేర్లు : రాగాల పేర్లను, ఊళ్ల పేర్లను, చెట్ల పేర్లను, మందుల పేర్లను సందర్భోచితంగా యిమిడ్చి పదాలు రాయటంలో పద కర్తలు సిద్ధహస్తులు. ఈ పదంలో కటకం, గోరంట్ల, మధ్యదేశం, మధురాపురం, కాశ్మీరం, కుంతల రాజ్యం, కుంభకోణం, గోల్కొండ, తామరకొలను, కల్యాణం అనే ఊళ్ల, దేశాల పేర్లు ఉన్నాయి. కటకం నేటి ఒడిషా రాష్ట్రంలో ఉంది. మధ్యదేశం అంటే మధ్యప్రదేశ్, కుంతలం అంటే కన్నడదేశం. కల్యాణం కూడా కన్నడదేశంలోనే ఉంది. తామరకొలను కూడా ఒక ప్రాంతం పేరే. తమిళదేశంలో తామరైకుళం (కుళం అంటే కొలను) పేరుతో నాలుగైదు చారిత్రక ప్రాంతాలు ఉన్నాయి. జింజిలోనే చక్రకుళం, ఆనైకుళం, శెట్టికుళం పేర్లతో యిప్పటికీ చెరువులు ఉన్నాయి. కమల కన్నియమ్మ, కమలగిరి ఉన్న ప్రాంతంలో ఒక తామరకొలను కూడా ఉండటం అబ్బురమేమీ కాదు.

బహ్మనీ రాజ్యం నుండి విడివడి స్వతంత్ర రాజ్యంగా గోలకొండ క్రీ.శ. 1518లో ఏర్పడింది. కాబట్టి యీ పదం పుట్టుక 1518 తర్వాతే.

"వరుస చీకాకాయ నెరి కుంభకోణంబు"

కుంభకోణం అంటే మోసం, తెలియకుండా జరిగి పోయిన అక్రమం అనే అర్థాలలో తెలుగు జాతీయంగా వాడుతున్నాము. కుంభకోణం అంటే ఏదో చికాకైన అంశం అనే అర్థం ఎప్పటినుండో ఉన్నట్లు 32వ పదం ద్వారా తెలుస్తున్నది.

52వ పదం : రకరకాల తేనెలు : పదకర్త ఈ పదంలో చెంచువారి సంతలో దొరికే రకరకాల తేనెలను రుచి చూపించాడు. తేనెలే కాదు, చెంచువారు అలంకరించుకొనే దండలను, చెంచులు అడవులలో ఏరే రకరకాల పండ్లనూ తెలిపాడు.

1. ముసురుతేనె : చెట్టుకొమ్మకు, యిండ్లలో దూలాలకు పట్టే తేనెపట్టు నుండి తీసినది. **2. జుంటితేనె :** తేనెటీగలలో జుంటీగలు ఒక రకం. ఇవి చిన్నవిగా ఉండే ఈగలు. ఇవి చెట్టుతొర్రలలో తేనెపట్టును పెడతాయి. జుంటీగలు తేనెని కూర్చడానికి చాలా శ్రమపడతాయి. మిగతా రకాల తెనేటీగలకన్నా జుంటీగల ఎక్కువదూరం తిరుగుతాయట. ఇతర రకాల తేనెటీగలు మంచి పుష్పాలనుండే కాక విషపుష్పాలనుండి కూడా తేనెను సేకరిస్తే, జుంటీగ కేవలం మంచి పుష్పాల నుండి మాత్రమే మకరందాన్ని సేకరిస్తుందట. అందుకే ఎక్కువదూరం తిరుగుతుంది. కనుకనే 58వ పదంలో నాయకుడిని నాయిక చెలి "వంతకు వాసికి జుంటియొగెవలె వాడవాడ నేల తిరిగేవయ్య" అని మందలిస్తుంది. **3. పుట్టతేనె :** చెదలు పెట్టే పుట్టలలో తేనెటీగలు పట్టును తయారుచేసి తేనెను నిల్వచేస్తాయి. పుట్టనుండి తేనెపట్టును తీయడానికి చాలా నైపుణ్యం కావాలి. అన్నిరకాల తేనెలకన్నా యిది శ్రేష్ఠమైనదట. **4. పూపుతేనె :** ఒకే రకమైన పూలమొక్కలు ఉన్న తోటలో పెరిగే తేనెపట్టులోని తేనె. **5. పెరలతేనె :** జలాధారం పక్కనే ఉండే పెద్దపెద్ద శిలల మధ్య ఖాళీలో పెరిగే తేనెపట్టు

నుండి వచ్చే తేనె. గిరిజనులైన చెంచులు తేనె సేకరణలో మిక్కిలి నిపుణులు. చెంచువారి సంతలో యిన్ని రకాల తేనెలు ఉంటే, వెంకటనాయకుడు వచ్చి ఆ తేనె, ఈ తేనెవల్ల కాదంటూ చెంచు పడుచులు మోవితేనె అడిగాడట. చెంచువారి సంతకు వెళ్లాడు శ్రీవెంకటనాయకుడు. దొడ్డదీర వచ్చాడని సంతసాన చెంచుసానులు పరికిదండ, పొగడదండ, బండిగురిగింజదండ, పికిలిదండ లాంటివి కానుకియ్య బోతే, 'ఈ దండలు వద్దు, మీ మేనిదండలు (శరీరం) కావాలి' అన్నాడు నాయకుడు. ఈ భావం ఆముక్త మాల్యద కావ్యంలోని (2.19)–"వెలది! యీ నీ దండ వెలయెంత?" అని మధురాపుర కోడెగాండ్రు కోడిగమాడితే, "నా దండకును వెలబెట్టుట నెవ్వని తరంబు" అని సమాధానమిచ్చే పుష్పలావికలు గుర్తుకువస్తారు.

57వ పదం: చెరకుపండు: చెరకుకు పండు పండదు. చెరకుగడ ఎంతో తియ్యగా ఉంటుంది కదా! వగరు, చేదు రుచులు ఉండే మొక్కలకే మధురమైన ఫలాలు కాస్తాయ్, మరి సహజంగానే తియ్యగా ఉండే చెరకుకు పండు ఉంటే అది యింకా ఎంత తియ్యగా ఉండాలి! మధురాతి మధురం అనే అర్థం యిచ్చే చక్కటి తెలుగు జాతీయం "చెరకుకు పండు పండినట్లు."

58వ పదం : "తాచుపాము నంటి దేవరమీద ఆన బెట్టెద" పూర్వం సత్యశోధనకు చేసే పరీక్షలు కొన్ని ఉన్నాయి, సలసలకాగే నూనెలో చేతులు ముంచి తీస్తే, చేతులు కాలకుండా, బొబ్బలెక్కకుండా ఉంటే సత్యం చెప్పినట్లు. ఎర్రగా కాలి ఉన్న గడ్డపారను రెండు చేతులతో పట్టుకొని దూయాలి. అరచేతుల నిరపాయంగా ఉంటే సత్యం చెప్పినట్లు. వీటిని 'దివ్యపరీక్షలు' అంటారు. అలాంటిదే తాచుపాము పడగమీద చెయ్యిపట్టి దేవుడి మీద ఒట్టు పెట్టుకోవటం."నీకై నాయిక సముద్రమంత కోరికతో ఎదురెదురు చూస్తుండగా, యింకెవర్తెకోసమో సైగ చేస్తున్నావు, అదేమిటని అడిగితే నేనేపాపమూ ఎరుగను, కావాలంటే పామునంటుకొని ప్రతిజ్ఞ చేస్తానంటున్నావు" అని నాయికచెలి నాయకుడిని మందలిస్తున్నది. 65వ పదంలో మొదటి చరణభావానికి పసుపులేటి రంగాజమ్మ పద్యానికి మరీ దూరంకాని చుట్టరికంఉంది.

"మంచిగందము నెరపూత బూసుకొని మావాడ కాతడు రాగా పోగా జూచి
పొంచులు మా యింటి పంచ నుందువట బోగాల వారమటె
యెంచనేటికె తప్పు నీ మొగుడైతే యిల్లు వెళ్లకుండ వల
పించవలె గాక వూరివారి మీద పొంచులుండ వచ్చునా వో చెలియ"

తంజావూరు నాయకరాజులలో చివరివాడు విజయరాఘవ నాయకుడు. అతని భోగపత్ని రంగాజమ్మ. విజయరాఘవుడు నిరంతరం రంగాజమ్మ సాహచర్యంలో ఉంటూ ధర్మపత్నిని కన్నెత్తైనా చూడటం లేదు. ఇందుకు రాణి కినిసి రంగాజమ్మను ఏమో అన్నదట. అప్పుడు రంగాజమ్మ ఆశువుగా చెప్పిన పద్యం యిది.

"ఏ వనితల్ మముందలుప పనేమిపనో తమరాడువారు కారో, వలపించు నేర్పెరుగరో! తమ కౌగిలిలోన నుండగా, 'రావదియేమిరా విజయరాఘవ' అంచిలుదూరి బల్మియై, తీవరకత్తెనై, పెనగి తీసుకవచ్చితినా తలోదరీ!"

66వ పదం : పండుజిగురున దగులు పక్షి: కొన్ని వృక్షాలలో మంచిజిగురు తయారవుతూ ఉంటుంది. కాండంపై, కొమ్మలపై చిన్నదెబ్బ తగిలినా ఆ జిగురు బయటికి స్రవిస్తుంది. ఒక ముద్దలాగా తయారవుతుంది. గాలికి, వేడిమికి ఎండిపోయి గట్టిగా తయారవుతుంది ఆ జిగురుముద్ద. కొన్ని చెట్లలో అలా ఎండిపోక ఎన్నాళ్ళైనా మృదువుగానే ఉంటుంది. అలాంటి జిగురును పండు జిగురు అంటారు. ఏదైనా పక్షి పొరపాటున పండు జిగురుపై వాలితే కాళ్లు అందులో కూరుకుపోతాయి. జిగురుపట్టేసి పక్షి విడిపించుకోలేదు. అలా జిగురుకు అతుక్కుపోవలసిందే. విడిపించుకోలేని బంధాన్ని "పండు జిగురులో పక్షి" అంటారు. "నాయిక శోభనాద్రీశుని అందమైన మేనిపై పండుజిగురులో పక్షిలాగా ఉంది" అంటున్నాడు పదకర్త. ఈ పదాలలో యింకొక అరుదైన విశేషం ఉంది. శృంగార వర్ణనలలో నాయికను ఆపాదమస్తకం వర్ణించడం సహజం. కుచద్వయ వర్ణన అత్యంత సాధారణం. కండలు దేరిన పురుషుని ఉబ్బెత్తు ఛాతీని స్త్రీకుచములతో సమానంగా వర్ణించడం అరుదు. ఆ అరుదు యీ పదాలలో ఉంది.

1) "నీ గట్టిగుబ్బల మీద కస్తూరి చెమటలను చెల్లాచెదరు చేస్తాను" అంటున్నది నాయిక.–8వ పదం.
2) "నీ చనుమొనలు నాకు నాటుకుంటాయేమో, మరీ ఎక్కువగా పెనగులాడకు" అంటున్నది నాయిక. –19వపదం. 3) నా గుబ్బలను కసిదీరా గుమ్ముదువు కానీలే" అంటున్నాడు నాయకుడు. – 44వ పదం. 4) "కులుకు గుబ్బలరాజ గోవిందరాజ" అని నాయికచెలి నాయకుడిని పొగుడుతున్నది. –62 వ పదం.

ఈ పదాలలోనే 24, 26, 49, 59 సంఖ్యగల పదాలలో స్త్రీపరంగా కూడా 'గుబ్బలు' విశేషణాన్ని పద కర్తలు ఉపయోగించారు. నాయకుడి పరంగా కూడా ఆ విశేషణాన్ని ప్రయోగించటం అరుదైన విషయమే.

మోదుగుల రవికృష్ణ
MTS ఉపాధ్యాయుడు, లేమల్లెపాడు,
ఫోన్ : 94403 20580



విట్‌గెన్‌స్టీన్

చివరి తత్వవేత్త
విట్ గెన్ స్టీన్

– ముక్తవరం పార్థసారధి

తనే 'చివరి' తాత్వికుణ్ణి ప్రకటించుకున్నాడు. విట్‌గెన్‌స్టీన్. సోక్రటీస్, ప్లేటో లాంటి గ్రీకు తత్వవేత్తలతో ప్రారంభమై, ఇరవై అయిదు శతాబ్దాలుగా సాగిన పాశ్చాత్య తాత్విక ప్రస్థానం ముగిసింది. నేనే "Last Philosopher" నని చెప్పుకోవటం వెనక అదీ ఆయన అభిప్రాయం. లుడ్విగ్ విట్‌గెన్‌స్టీన్ తార్కిక ప్రతిభ అసామాన్యం. తాత్విక సమస్యల్ని చర్చిస్తున్నప్పుడు వచ్చే సమస్యలకు పరిష్కారం ఎలా దొరుకుతుంది? సింపుల్. అన్ని సమస్యల్నీ తర్కబద్ధంగా విశ్లేషించాలి. తర్కానికి లొంగని మెటాఫిజిక్స్, ఈస్థటిక్స్, ఎథిక్స్, చివరికి ఫిలాసఫీ అయినా ప్రస్తుతం చర్చనీయాంశం కాదు. తాత్విక చర్చలను తార్కిక విశ్లేషణలుగా మార్చే ప్రయత్నం ఒకసారి కాదు రెండుసార్లు చేశాడు విట్‌గెన్‌స్టీన్. మొదటి ఆయన కథా కమామీషు ఏమిటో తెలుసుకుందాం. 1889 ఏప్రిల్ 26 నాడు జన్మించాడు. విట్‌గెన్‌స్టీన్ తండ్రి ప్రముఖ పారిశ్రామికవేత్త, అపరకుబేరుడు. మొత్తం యూరోపులోనే అంతటి ధనవంతుడు లేడు. ఇక ఇంట్లో ఆయన 'నియంత' కేమీ తీసిపోడు. అయినా, సాంస్కృతిక పరంగా ఆయన అభిరుచి గొప్పది. Brahms లాంటి సంగీతకారులు ఇంటికి వచ్చి మరీ కచేరీలిచ్చేవారు. అయితేనేం, కుటుంబసభ్యులకు మాత్రం ఆయనను చూస్తే హడల్. లుడ్విగ్ అన్నలు నలుగురు భయంతో బిక్కచచ్చి హోమో సెక్సువల్స్‌గా మారారు. తరువాతి రోజుల్లో (వీళ్ళలోని) ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారు.

వియన్నాలో, సిగ్మండ్ ఫ్రాయిడ్ ఇంటికి అల్లంత దూరంలో పెరిగాడు లుడ్విగ్. 1903లో లింజ్ నగరంలోని ఒక స్కూల్లో గణితం, సైన్సు చదువుకున్నాడు. కాకతాళీయంగా, ఆ కాలంలో హిట్లర్ కూడా అక్కడే విద్యార్థిగా వున్నాడు. ఇద్దరిదీ ఒకే వయసు. బహుశా క్లాస్‌మేట్స్ కూడా అయివుండవచ్చు.

ఆ తర్వాత, బెర్లిన్‌లో రెండేళ్ళపాటు మెకానికల్ ఇంజనీరింగ్ అభ్యసించాడు విట్‌గెన్‌స్టీన్. 1908లో ఇంగ్లండువెళ్ళి మాంచెస్టర్ యూనివర్శిటీలో ఏరోనాటిక్స్‌లో పరిశోధన చేశారు. ఆ క్రమంలోనే తన జీవిత గమ్యం ఏం కాబోతున్నదో తొలిసారి గ్రహించాడు. అప్పటికతడికి ఫిలాసఫీ గురించి ఏమీ తెలియదు. బ్రిలియంట్ కాదు గాని తెలివైనవాడే అన్నారు సహవిద్యార్థులు. కాకపోతే కొద్దిగా ఎక్సెంటిలిక్. మర్యాదగానే వుండేవాడు. కాని, వున్నట్లుండి అణచుకోలేని కోపంతో అందరిమీదా అరవటం ఆశ్చర్యం కలిగించేది. అయితే, నలుగురితో కలిసి తిరగడం 'సోషల్'గా వుండటం ఎలాగో విట్‌గెన్‌స్టీన్‌కు తెలియదు. క్షణం విరామం లేకుండా రోజంతా కష్టపడి పనిచేసి సాయంత్రం బాత్‌టబ్‌లో పడుకుని ఆత్మహత్య గురించి ఆలోచించటం అతడి రొటీన్ వ్యవహారం.

తన రీసెర్చ్ ప్రాజెక్టులో భాగంగా, ప్రొపెల్లర్ డిజైన్ చెయ్యటానికి పూనుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. ఈ క్రమంలో తలెత్తిన సమస్యలు అతణ్ణి మాథమాటికల్ థియరీ గురించి తెలుసుకోవటానికి ప్రోత్సహించాయి. సరిగ్గా అక్కడే అతడి జీవితం మలుపు తిరిగింది. కేంద్రీకరించిన మేధోశక్తితో ఆలోచనలు కొత్తదారుల్లో పయనించాయి. ప్రొపెల్లర్ ఏమైందో తెలియదుగాని గణితశాస్త్రమూలాల గురించిన అన్వేషణ ప్రారంభమైంది. ఈ దృశ్యజగత్తుకు ఆధారమేది అనే ప్రశ్న ఎదురైంది. అవును. అసలు తెలుసుకోవలసిన విషయం అదీ. ఈ కాలంలోనే అతని సోదరులు

ఆత్మహత్యలు చేసుకున్నారు. తండ్రికి క్యాన్సర్ అని తెలిసింది.

గణితశాస్త్ర మూలాల గురించి ఇవ్వటికే పరిశోధించిందెవరు? బెర్ట్రాండ్ రసెల్ రాసిన 'ప్రిన్సిపల్స్ ఆఫ్ మాథమాటిక్స్' క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. అప్పటికి ఆ రంగంలో వచ్చిన అత్యాధునిక ప్రామాణిక గ్రంథం అదే. గణితశాస్త్ర మూలాలు తార్కిక నిరూపణలే అన్నాడు రస్సెల్. తర్కశాస్త్ర సూత్రాలన్నీ ప్యూర్ మాథమెటిక్స్, అయితే రసెల్ నంబర్లను కొన్ని క్లాసెస్‌గా విభజించి మరీ నిర్వచించాడు. ఈ రంగంలో పరిశోధన కొనసాగిస్తూ 1911లో, కేంబ్రిడ్జిలో వున్న రసెల్‌ను చేరుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. ఇంజనీరింగ్‌కు స్వస్తిపలికి, అతడి వద్ద ఫిలాసఫీ నేర్చుకోవాలనుకున్నాడు. అప్పటికి రసెల్, యూరోప్‌లోని ప్రముఖ ఫిలాసఫర్లలో ఒకడు. విట్‌గెన్‌స్టీన్ ఫిలాసఫీ గురించి ఒక పుస్తకం కూడా చదవలేదు. అయినా, రసెల్ కతడు కొరకరానికొయ్యే. లేదా గురువును మించిన శిష్యుడే. రాత్రి, పగలు అని తేడా లేకుండా రసెల్‌తో కూర్చుని "ఫిలాసఫీ", కొన్నిసార్లు లాజిక్, అప్పుడప్పుడూ 'ఆత్మహత్య'ల గురించి చర్చించేవాడు. "రహస్యాన్ని శోధించి తెలుసుకోవాలి లేదా చావాలి" అనే తత్వం అతనిది.

ఆత్మానుభవం గురించి రసెల్ చెప్పిన దాన్తో అతడు అంగీకరించలేదు. స్వానుభవం వల్ల జ్ఞానార్జన సాధ్యం కాదు. విట్‌గెన్‌స్టీన్ ప్రకారం జ్ఞానమంటే తర్కమే. ఉదాహరణకు ఒకసారి రసెల్ "ఈ గదిలో ఖడ్గమృగం లేదు" అన్నాడు. విట్‌గెన్‌స్టీన్ అంగీకరించలేదు. లాజికల్‌గా అక్కడ ఖడ్గమృగం వుండే అవకాశముంది. కుర్చీలవెనకా, బల్లల వెనకా వెదికారు. కనిపించలేదు. అయితే మాత్రం రసెల్‌లాగ లేదని ఖచ్చితంగా ఎలా చెప్పగలం?

విట్‌గెన్‌స్టీన్ చేస్తున్నది మూర్ఖపు వాదన కాదని తెలుసుకోవడానికి రసెల్ కెక్కువ రోజులు పట్టలేదు. అయితే, తన శిష్యుడు తర్కశాస్త్ర ప్రాథమిక సూత్రాలను మరింత బాగా అధ్యయనం చెయ్యాలి. తన పరపతిని ఉపయోగించి కేంబ్రిడ్జిలో వున్న ప్రముఖ లాజిషియన్ W.E. Johnson వద్ద విట్‌గెన్‌స్టీన్. లాజిక్ నేర్చుకోవడానికి ఏర్పాటు చేశాడు రసెల్. అయితే, అదో ప్రహసనంగా ముగిసింది. "అతని వద్ద నేను నేర్చుకోవలసిందేమీ లేదని ఒక గంటలోనే తెలిసిపోయింది" అన్నాడు విట్‌గెన్‌స్టీన్. "అవును. మా మొదటి పరిచయంలోనే అతడు నాకు లాజిక్ నేర్పించే ప్రయత్నం చేశాడు" అన్నాడు జాన్సన్. దూకుడు, పరుషవాక్కు, ఎదుటివ్యక్తి మాట ఆలకించే ప్రయత్నం కూడా చేయకపోవటం, విట్‌గెన్‌స్టీన్ వ్యక్తిత్వంలోని ప్రధాన లక్షణాలు. ఇలాంటి మనిషితో గడిపిన రోజుల్ని "Most exciting intellectual adventures of my life" గా వర్ణించాడు రసెల్. ఇద్దరూ మాథమాటికల్ లాజిక్ చర్చించారు. ఇదెంత సంక్లిష్టమైన విషయమంటే లోకంలో అరడజను మంది మాత్రమే (ఆరోజుల్లో) అర్థం చేసుకోగలిగేవాళ్ళని అంటారు. అయినా "రెండేళ్ళలోనే నేను నేర్పగలిగిందంతా నేర్చుకున్నాడతడు" అంటూ కితాబిచ్చాడు రసెల్. దీన్ని మరో అర్థంలో చెప్పుకుంటే ఇంక రసెల్ చెయ్యగలిగిందేమీ లేదు. ఫిలాసఫీని ముందుకు తీసుకుపోగలిగినవాడు తనే అని కూడా విట్‌గెన్‌స్టీన్ రసెల్‌ను నమ్మించాడు. అలా తనకు ఫిలాసఫీ నేర్పిన రసెల్ కృషికి ముగింపు పలకడమే గాక, దాన్ని ధ్వంసం చేయ్యటానికే పూనుకున్నాడు. అతడి మేధోపటిమ అపారమైనది. సత్యాన్వేషణలో తర్కం అనే పరశువుతో అడ్డొచ్చిన వాళ్ళెవరైనా సరే శిరచ్ఛేదం చెయ్యటానికి వెనుకాడలేదు. యాదృచ్ఛికంగా ఫిలాసఫీలో తలదూర్చిన విట్‌గెన్‌స్టీన్‌కు అదే జీవన్మరణ సమస్యగా మారింది. "ఫిలాసఫీ'ని ఇంత సీరియస్‌గా తీసుకోని వాళ్లను అతడు అసహ్యించుకున్నాడు.

జీవితలక్ష్యాన్ని ఇంత స్పష్టంగా చూడగలిగిన విట్‌గెన్‌స్టీన్ ఆ వెంటనే అద్భుతాలేమీ సాధించలేదు. తనలో హెూవెూసెక్సువల్ లక్షణాలున్నాయని మాత్రం గ్రహించాడు. యువకులతో ఒంటరిగా మేధోపరమైన సంభాషణలు కొనసాగించాడు. కాని ఈ లక్షణం వాటిని మలినపరుస్తుందేమోననే భయంతో వాళ్ళగాక మరెక్కడో పార్కుల్లో రాత్రులు గడిపి ఇంటికి చేరుకోవటం అలవాటు చేసుకున్నాడు. జీవితంలోని పరస్పర విరుద్ధమైన కోరికలతో, మానసికమైన ఒత్తిడి పెరిగింది. ఒకవైపేమో అసమానమైన, అరుదైన జీనియస్. మానవ మేధోసాగర మథనంలో కొత్త సత్యాలను ఆవిష్కరించ బోతున్నాడు. మరోవైపు అణచుకోలేని కోరికలు. వియన్నా వెళ్ళి, తండ్రి మరణం తర్వాత, కేంబ్రిడ్జికి తిరిగి వచ్చి 'లాజిక్'తో యుద్ధం పునఃప్రారంభించాడు.

1913 లో, మరో యువ మాథమెటీషియన్ డేవిడ్ విన్సెంట్‌తో కలిసి నార్వేలో కొన్నాళ్ళు గడిపాడు విట్‌గెన్‌స్టీన్. ఇద్దరూ స్కూలు కుర్రాళ్ళలా ఎంజాయ్‌చేశారు. రోజూ అనేక గంటలపాటు లాజిక్ గురించి చర్చించాడు. ఆ క్రమంలో తనలో తానే ఏదో గొణుక్కుంటాడు, కొంత జర్మన్, కొంత ఇంగ్లీష్‌లలో, ప్రశాంతంగానే వుంటాడు. కాని అంతలోనే అకారణంగా రెచ్చిపోతాడు. ఎదుటి మనిషిమీద పెత్తనం చలాయించాలనే తపన అది అన్నాడు విన్సెంట్. విట్‌గెన్‌స్టీన్ మానసిక స్థితి దిగజారింది. అది ఉన్మాదమో కాదో చెప్పలేని స్థితి. గురువుగారికి పిచ్చెక్కిందనే అనుకున్నాడు విన్సెంట్. రసెల్ కనుగొనలేని Logical foundation for mathematics తనకు తెలిసిందని గ్రహించాడు విట్‌గెన్‌స్టీన్. అయితే ఒక భయం పట్టుకుంది. తన ఆవిష్కరణలు ప్రపంచానికి తెలిసేలోగా తను చచ్చిపోతాడు. అర్జెంటుగా రసెల్‌కు సందేశం పంపించాడు. వీలైనంత త్వరలో తాము సమావేశం కావాలి. రసెల్ ఎక్కడ తప్పు చేశాడో తన నాయనకు వివరిస్తాడు.

సెలవుల నుండి తిరిగివచ్చిన విట్‌గెన్‌స్టీన్ రసెల్‌తో సమావేశాలు కొనసాగించాడు. అదొక ఉద్విగ్నస్థితి. వాక్ ప్రవాహం కొనసాగింది. తన శిష్యుడు వాదన రసెల్‌కు సరిగా అర్థం కాలేదు. మాట్లాడటమెందుకు కాగితం మీద రాయమన్నాడు. విట్‌గెన్‌స్టీన్ నిరాకరించాడు. చివరకు ఒక స్టెనోగ్రాఫర్ తమ సంభాషణను రికార్డు చెయ్యడానికి అతణ్ణి ఒప్పించాడు రసెల్. విట్‌గెన్‌స్టీన్ తొలి రచన 'Notes on Logic' ఆధారం ఈ స్టెనోగ్రాఫర్ తీసుకున్న నోట్సే. (రసెల్ నంబర్లను క్లాసెన్‌గా నిర్వహించాడని ఇప్పటికే తెలుసుకున్నాడు) సులభంగా కనిపించినా కొన్ని మౌలికమైన విషయాలను ప్రతిపాదించాడు విట్‌గెన్‌స్టీన్. (ఉదాహరణకు 'A', 'A' రెండూ ఒకటే) క్లాసెస్‌లో వున్న తేడాలను మనం ప్రతీకలుగా మాత్రమే గుర్తించవచ్చు. వీటిని పదాల్లో చెప్పడం సాధ్యంకాదు. అంటే, ఉచ్చరించటానికే వీలుపడదు. ఇలాంటి Conceptsని అర్థం చేసుకోవటం కూడా కష్టమే. విట్‌గెన్‌స్టీన్ చెప్పింది రసెల్ కొక్కడికే అర్థమైవుంటుంది. ''తను నిజమనుకున్నది చెప్పి ఊరుకుంటే లాభంలేదు. అదెందుకు నిజమో వాదనా పూర్వకంగా నిరూపించాలని చెప్పాను. కాని అలాంటి ఆర్గ్యుమెంట్ల వల్ల ప్రతిపాదనలోని అందం తగ్గుతుందనీ, గులాబీ పువ్వును మురికి చేతులతో ముట్టుకున్నట్లుగా వుంటుందనీ అన్నాడు" అని రాశాడు రసెల్. విట్‌గెన్‌స్టీన్ ఒక పర్ఫెక్షనిస్టు. అతను చెప్పింది మనం తక్షణమే, సంపూర్ణంగా అర్థం చేసుకోలేకపోతే దాని గురించి చర్చించటమే అనవసరం.

ఈ 'Notes on Logic'లో ఫిలాసఫీ గురించి విట్‌గెన్‌స్టీన్‌కున్న అభిప్రాయాలు కొన్ని మనకు స్పష్టంగానే తెలుస్తాయి. అవి చాలా ఒరిజినల్ అభిప్రాయాలనటంలో సందేహం లేదు. కనీసం, 1921లో మరెవరూ అలా ఆలోచించలేదు. ఫిలాసఫీలో నిర్ధారణలుండవు. అది కొన్ని వివరణలకు మాత్రమే పరిమితం. ఫిలాసఫీ వాస్తవికతను ప్రతిబింబించదు. శాస్త్రీయ పరిశోధనలను అంగీకరించదు. నిరాకరించదు. లాజిక్, మెటాఫిజిక్స్ కలిస్తే ఫిలాసఫీ. లాజిక్ ఆధారంగానే ఫిలాసఫీని అర్థం చేసుకోవాలి. అయితే, ఈ క్రమంలో వ్యాకరణ సూత్రాలను దూరంగా పెట్టాలి. "ఇలాంటి ప్రతిపాదనలు వాస్తవిక పరిస్థితులను అర్థంచేసుకోవటానికి ఎంత మాత్రం సాయపడవు. పైగా ఈయన భాషా సమస్యల గురించి ఎక్కువ వ్యాఖ్యానిస్తున్నాడా అనిపిస్తుంది.

విట్‌గెన్‌స్టీన్ ప్రకారం ఫిలాసఫీ అంటే లాజిక్. అతణ్ణి అర్థం చేసుకోవటానికి ప్రాతిపదిక ఇదే. ఈ ఒక్క విషయాన్ని వివరించటానికే అతడు తన శేష జీవితమంతా కృషి చేశాడని కూడా చెప్పవచ్చు. ఫిలాసఫీలో తను కొత్తదారుల్లో వయనించబోతున్నానని తెలుసుకున్నాడు. పాత ఫిలాసఫర్లేం రాశారో తెలుసుకోవాలనుకుని "తొలినుండి అందర్నీ చదివాడు. అధ్యయనం చేశాడు. గొప్పవాళ్ళు మహానుభావులని తను ఇన్నాళ్ళూ ఆరాధించిన వాళ్ళు ఇంత మూర్ఖంగా, ఆత్మద్రోహం చేసుకుంటూ ఇంత తప్పులతడక రాతలు ఎలా రాశారని విస్తుపోయాడు" అంటాడు విన్సెంట్.

కొత్త సత్యం ఆవిష్కరించబడే సమయం ఆసన్నమైంది. నార్వేకు వెళ్ళి ఒంటరిగా, రెండేళ్ళక్కడ గడపాలనుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. ఒంటరిగా అంటే ఒంటరిగా కాదు. 'లాజిక్' అనే తన ఇష్టసఖితో. ఇది 'ఉన్మాదచర్య' అనుకున్నాడు రసెల్. వెళ్ళకుండా నిరోధించటానికి తీవ్రంగా ప్రయత్నించాడు. అక్కడ చీకటిగా ఉంటుందన్నాడు. తనకు వెలుగంటే అసహ్యమన్నాడు విట్‌గెన్‌స్టీన్. ఒంటరిగా ఎలా వుంటావంటే, మనుషులతో సంపర్కం మానసిక వ్యభిచారమన్నాడు. "నీకు పిచ్చెక్కిందంటే" తననలా పుట్టించినందుకు భగవంతుడికి

సదా కృతజ్ఞుణ్ణన్నాడు. అంతే. ఎంతమంది ఎన్ని ప్రయత్నాలు చేసినా, విట్‌గెన్‌స్టీన్ నార్వే వెళ్ళకుండా ఆపలేక పోయారు. ఉత్తర ధృవానికి సమీపంలో వుంటుంది నార్వే. ఆ దేశానికి ఉత్తరాన వున్న ఒక కుగ్రామానికి చేరుకుని, తొంభైమైళ్ళు బోటులో ప్రయాణించి మరో ఏకాంత ప్రదేశంలో నివాసం ఏర్పరచుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. యూరోపులో నర్వసుఖాలకూ, నదుపాయాలకూ అలవాటుపడిన మనిషి అక్కడ మనగలగటం కష్టమే, కాని విట్‌గెన్‌స్టీన్ ప్రత్యేకత అది.

అది ఒంటరి జీవితం. నెలల తరబడి చీకటిగా ఉంటుంది. 'లాజిక్' మీద కృషి కొనసాగిందక్కడ. త్వరలోనే "నాకు పిచ్చెక్కేలావుంది" అంటూ రసెల్‌కు రాశాడంటే మనం ఆశ్చర్యపడనక్కరలేదు అయితే ఆయన మానసిక పరిస్థితి ఎలా వున్నా ఆ ఉత్తరాల్లో లాజిక్ గురించిన కొన్ని అద్భుత ఆవిష్కరణలు కూడా తళుక్కుమన్నాయి. రసెల్ మాథమాటిక్స్‌కు Logical foundation గురించి కృషిచేస్తే, విట్‌గెన్‌స్టీన్, లాజిక్‌కు foundation ఏమిటి పరిశోధించాడు.

లాజికల్ ప్రతిపాదన నిజమో కాదో స్పష్టంగా తెలిసిపోతుందన్నాడు విట్‌గెన్‌స్టీన్. ఉదాహరణకు :- 'పండు ఎర్రగా వుంది, ఎర్రగా లేదు' అంటే టాటాలజీ (ఎప్పుడూ నిజమే) అవుతుంది. పండు, ఎర్రగా ఉన్నా, లేకపోయినా ఆ ప్రతిపాదన నిజమే అవుతుంది. లేదా 'పండు' ఎర్రగాలేదు, కాని ఎర్రగా లేదని అనలేం' అంటే ఆ ప్రతిపాదనలో అంతర్ వైరుధ్యం స్పష్టం. ఒక ప్రతిపాదన టాటాలజీయో కాదో తెలుసుకోవాలంటే కొన్ని మౌలిక సూత్రాలవసరం. అదే లాజిక్‌కు Basis అన్నాడు విట్‌గెన్‌స్టీన్. 'పిచ్చెక్కటం' లాంటి చిన్న విషయాలకు భయపడి, తన చీకటిస్వర్గం వదిలి వచ్చే స్వభావం కాదాయనది. తల్లికి జబ్బుగా వుందని తెలియటంతో వియన్నా వెళ్ళక తప్పలేదు. డబ్బుకెప్పుడూ కొదవలేదు. ఇప్పుడు బాగా ఆస్తి కలిసివచ్చిందని కూడా తెలిసింది. అయితే, వారసత్వంగా సంక్రమించిన సంపద తనకు అవరోధం కాకూడదని దాన్ని వీలైనంత త్వరగా వదిలించు కోవటానికి ప్రయత్నించాడు. అనేకమంది ఆస్ట్రియన్ కవులకు గుప్తదానాలు చేశాడు. అందులో ఒకడు Rilke (ప్రముఖ కవి) మరొకడు Trackl.

మొదటి ప్రపంచ యుద్ధం ప్రారంభం కావటంతో ఆస్ట్రో - మంగేరియన్ సైన్యంలో చేరి స్వచ్ఛందంగా సేవలందించాడు విట్‌గెన్‌స్టీన్. అతడి మిత్రుడు విన్సెంట్ బ్రిటిష్ సైన్యంలో చేరాడు. రెండూ శత్రుపక్షాలు. ఆస్ట్రియాలోనే పెద్ద పేరున్న విట్‌గెన్‌స్టీన్ కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి సైన్యంలో ఆఫీసర్‌గా చేరటం చాలా సులభం కాని మామూలు సైనికుడిగా వుండటానికి ఇష్టపడ్డాడు. ఇది అత్యంత ప్రమాదకరమైన నిర్ణయం అనటంలో సందేహంలేదు. తూర్పు సరిహద్దులో రష్యన్లతో తలపడే దళంలో వున్నాడు విట్‌గెన్‌స్టీన్. యుద్ధరంగంలో డ్యూటీ చేస్తున్నప్పుడు కూడా లాజిక్ గురించీ, ఫిలాసఫీ గురించి నోట్స్ రాసుకుంటూనే వున్నాడు. సైన్యంలో చేరి ప్రాణాన్ని పణంగా పెట్టినప్పుడు కూడా విట్‌గెన్‌స్టీన్‌కు ఆత్మహత్య గురించి ఊహలు తొలగిపోలేదు. ధైర్యంగా పోరాడినందుకు, అధికారులాయన్ని రెండు మెడల్స్‌తో గౌరవించారు. (మనకు తెలిసిన మరొక సైనిక ఫిలాసఫర్ సోక్రటీస్.)

జీవితం ఒక "Intellectual Problem and a moral duty" అన్నది విన్‌గెన్‌స్టీన్ అభిప్రాయం. యుద్ధరంగంలో కూడా అతని అంతస్సంఘర్షణ తగ్గలేదు. ఆత్మహత్యను గురించిన ఆలోచనలు తరచూ వేధించాయి. ఒక సెలవు రోజున పుస్తకాల షాపుకెళ్లిన విట్‌గెన్‌స్టీన్‌కు టాల్‌స్టాయ్ రాసిన Gospels in Brief కనిపించింది. తను క్రైస్తవ వ్యతిరేకి. కుటుంబ నేపథ్యం వల్ల మతమంటేనే అసహ్యించు కున్నాడు. కాని టాల్‌స్టాయ్ పుస్తకం చదివి క్రైస్తవంలో విశ్వాసం పెంచుకున్నాడు. తన మేధోపరమైన అన్వేషణకూ, మత విశ్వాసాలకూ మధ్యనున్న వైరుధ్యాలను పరిష్కరించ టానికి పూనుకున్నాడు. నోట్‌బుక్స్‌లో లాజిక్‌తోపాటు మతపరమైన వ్యాఖ్యానాలు కూడా చేరాయి. అయితే, అందులో ఒక లాజికల్ విశ్లేషణ వుంటుంది. "ఈ లోకం వుందని తెలుసు. అందులో వీక్షించే కన్నులా నేనున్నాను" ఈ లోకంతో కొన్ని సమస్యలున్నాయి. వాటినే మనం అర్థం వెతకటం అంటున్నాం. కాని లోకానికి అర్థం లోకంలో లేదు. దాని వెలుపలవుంది. జీవితానికి అర్థం అంటే లోకానికర్థం - దాన్నే మనం దేవుడంటాం. ప్రార్థన అంటే జీవితార్థాన్ని అన్వేషించమని విట్‌గెన్‌స్టీన్ అభిప్రాయం. (అంటే, దేవుణ్ణి నమ్మని రోజుల్లో కూడా, జీవితమంతా అతడు ప్రార్థిస్తూనే వున్నాడన్నమాట. అది అతడి స్వభావం తానెప్పుడూ ఏ తప్పు చెయ్యలేదనే గట్టి నమ్మకం.

ఆ తర్వాత Will-ఇచ్ఛ, సంకల్పం గురించి ఆలోచించాడు విట్‌గెన్‌స్టీన్ ప్రారంభం నుండే అతని

జీవితాన్ని శాసించిందే. సంకల్పం వల్లనే మనకు లోకంతో సంపర్కం ఏర్పడుతుంది. అది మంచిదీ, చెడ్డదీ కావచ్చు. అంటే లోకానికి మనం కల్పించుకునే అర్థంలో మన సంకల్పమే ముఖ్యపాత్ర పోషిస్తుంది. కాని, సంకల్పం మంచిదో చెడ్డదో ఎలా తెలుస్తుంది. ఎవరు నిర్ణయిస్తారు? అసలీ రెండు పదాల అర్థాలేమిటి? సంకల్పం లోకంలో ఒక భాగమే అయితే, ఈ లోకాన్ని అర్థం చేసుకోవడానికి దాన్ని వెలుపలినుండి చూడవలసిన అవసరమే వుంటే రెంటికీ (సంకల్పం–అర్థం చేసుకోవటం) ఏమిటి సంబంధం?

సహజంగానే, వాదించటానికి నిరాకరిస్తాడు విట్‌గెన్‌స్టీన్. "వాదన పువ్వు అందాన్ని మలినం చేస్తుంది". తాత్విక చర్చల్లో ఇలా మాట్లాడడం ఒక చెడ్డ అలవాటని రసెల్, అతణ్ణి చాలాసార్లు మందలించాడు. ఇప్పుడు మరోసారి హెచ్చరించటానికి రసెల్ అందుబాటులో లేడు. యుద్ధ వ్యతిరేక ప్రదర్శనలకు గాను బ్రిటిష్ ప్రభుత్వం అతణ్ణి నిర్బంధించింది. అకస్మాత్తుగా వాదించటానికి నిరాకరించే ఈ దురలవాటే, అతడికొంత అపఖ్యాతి తీసుకొచ్చింది. అయితే, ఈ లోపం అతడు గుర్తించలేదా? ఒక ప్రతిపాదన చేసి, దాన్ని వివరించకపోవటమంటే, ఎవరో మిస్టిక్స్, తమకు తోచింది చెప్పి 'ఇదింతే' అన్నట్లుగా వుండదా? 1918లో అధికారులు అతణ్ణి ఆఫీసర్‌గా ప్రమోట్ చేసి ఇటాలియన్ యుద్ధ రంగానికి పంపించారు. ఇన్నాళ్ళుగా అతడు అప్పుడప్పుడూ విన్సెంట్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు కొనసాగిస్తూనే వున్నాడు. "మా వాడు మరణించాడు. వాడికి నువ్వంటే ఎంతిష్టమో" అంటూ రాసింది విన్సెంట్ తల్లి. తన తొలి ముఖ్య రచనను 'డేవిడ్ విన్సెంట్ స్మృతికి' అంకితమిచ్చాడు విట్‌గెన్‌స్టీన్.

1918లో ఇటలీ విజయంతో యుద్ధం ముగిసింది. పరాజితుడైన ఆస్ట్రియన్లు చెల్లాచెదరై దొరికిన రైలెక్కి ఎలాగొలా సరిహద్దులు దాటారు. పిరికితనమంటే తెలియని లెఫ్టినెంట్ విట్‌గెన్‌స్టీన్ పారిపోవటానికి నిరాకరించాడు.ఇటాలియన్లకు బందీగా చిక్కిన విట్‌గెన్‌స్టీన్ వద్ద ఇన్నాళ్ళూ తను రాసుకున్న నోట్‌పుస్తకం దొరికింది. అదే చరిత్ర సృష్టించిన Tractatus - Logico - Philosophicus. ఆధునిక తాత్విక చరిత్రలో అంతకన్న ముఖ్యమైన గ్రంథం మరొకటి లేదు. అందులోని మొదటి వాక్యంతోనే స్పష్టమవుతుంది. తాత్విక అవగాహన కొత్త దశకు చేరుకున్నదని.

ఈ ప్రతిపాదనలు తెలుగులోకన్నా ఇంగ్లీషులోనే ఎక్కువ సులభగ్రాహ్యంగా వుంటాయి.

1. The world is all that is the case.

లోకం వుంది అంటే.

1.1. The world is the Totality of Facts, Not of Things.

లోకం ఒక యథార్థ సత్యాల సమాహారం. వస్తువుల సముదాయం కాదు. ఏ ఒక్కదాని గురించీ, వివరణ ఇవ్వకుండానే, అనేక ప్రతిపాదనలు కొనసాగుతాయి.

1.13. The Facts in Logical Space are the world.

తర్కానికి లొంగే యథార్థ సత్యాలు (మాత్రమే) ఈ లోకం.

1.2. The world divides into facts.

యథార్థ సత్యాలుగా ఈ లోకాన్ని విభజింపబడుతుంది.

ఇక, చివరి ప్రతిపాదన చదివి మనం ఉలిక్కిపడక తప్పదు.

7. What we cannot speak about, we must pass over in silence.

మాట్లాడలేని విషయాల గురించి మాట్లాడకూడదు.

రెండు మూడు పదాల్లో, సంక్షిప్తంగా ఇంత ప్రగాఢ తాత్వికతను వ్యక్తం చేసిన మహానుభావులు చరిత్రలోనే అరుదుగా కనిపిస్తారు. అలాంటి కొందరు : సోక్రటీస్ – Know thyself - నిన్ను నువ్వు తెలుసుకో. Descartes : I think, therefore I am., Nietzsche - God is dead.

గంభీరమైన విషయాలను సులభంగా చెప్పటం విట్‌గెన్‌స్టీన్‌కే సాధ్యపడింది. ఇది ఫిలాసఫీయా లేక కవిత్వమా అని కొన్నిసార్లు ఆశ్చర్యం వేస్తుంది. మనం మాట్లాడుకోగలిగిన విషయాలను, అర్థవంతంగా వివరించటానికి చేసిన ప్రయత్నం Tractatus. ఇప్పుడు మరో ప్రశ్న తలెత్తుతుంది. భాష అంటే ఏమిటి?

లోకాన్ని మనకు దర్శనీయం చేస్తుంది భాష అంటారు విట్‌గెన్‌స్టీన్. ఈ అభిప్రాయానికి కారణం ఒక కోర్టు కేసు. ఒక కారు ప్రమాదం ఎలా జరిగిందో నిరూపించటానికి మోడల్‌కార్లను ఉపయోగించారు ప్రాసిక్యూషన్‌వారు. అంటే, వాస్తవాన్ని అర్థం చేసుకోవటానికి కొన్ని ప్రతీకలు అవసరమవుతాయి. మోడల్‌కార్ల లాంటిదే భాష కూడా. వాస్తవికతలను పునఃసృష్టించటమే కాదు, దానికొక హేతుబద్ధతను, తార్కికతను తీసుకొస్తుంది భాష. ఈ మోడల్ కార్లను ఉపయోగించి మనం కొన్ని ఊహాజనిత

సంఘటనలను – ఉదాహరణకు ఢీకొట్టే స్థితి, ట్రాఫిక్‌జాం, ప్రమాదానికి కారణమైన కారు, ప్రమాదానికి గురైన కారు కూడా సృష్టించవచ్చు. ఇక నిర్మాణమూలాలను పరీక్షిస్తే, భాష, వాస్తవికత మొక్క చిన్నచిన్న అంశాలకు ప్రతీక అని స్పష్టమవుతుంది. హేతుబద్ధత, తార్కికత భాషకు ప్రామాణికం. ఆలోచనకున్న పరిమితులే భాషకూ వర్తిస్తాయి. రెండూ తర్కాతీతమైనవి కావు. భాషను అధిగమించకుంటే తార్కికతను అధిగమించినట్టే. అంటే కొన్ని విషయాలు మనం మాట్లాడామని కూడా గ్రహించవచ్చు. దురదృష్టవశాత్తూ, Tractatusలో చేసిన ప్రతిపాదనలన్నీ ఈ కోవలోకే వస్తాయి. అంటే, ఇవేవీ వాస్తవికతను ప్రతిబింబించటం లేదు. ఈ విషయం గ్రహించాడు విట్‌గెన్‌స్టీన్. కొన్నింటిని మనం నిరూపించలేక పోయినా, అవి వున్నట్టుగా మనకు తెలుస్తూనే వుంటుంది. నిరూపించలేని వాస్తవికత గురించి మాత్రమే Tractatusలో ప్రస్తావించానన్నాడు. ఇంతాచేసి, చివరికి ఇప్పటికే చెప్పుకున్నట్టుగా, “What we cannot speak about we must pass over in silence” అంటాడు.

ఈ మాట్లాడలేని విషయాల కోవలోకి ‘దేవుడు’ రాకతప్పదు గదా. భాష వాస్తవికత గురించి మాత్రమే వివరిస్తుంది గనుక, మనం దేవుడి గురించి మాట్లాడలేం. అతడి గురించి మాట్లాడలేకపోయినా, ఆలోచించలేక పోయినా, దేవుడున్నాడంటాడు విట్‌గెన్‌స్టీన్. ఉన్నాయని తెలిసినా మాటల్లో పెట్టలేని విషయాలు ఎన్నో. అవి అనుభవగ్రాహ్యమే. వీటినే మనం మిస్టికల్ లేదా మార్మిక విషయాలు అనాటి. చివరివాక్యం Tractatusలోని చివరి వాక్యంలో లాజిక్, మిస్టిసిజం కలగలిశాయన్నది స్పష్టమే. దీన్ని ‘గాలికబుర్లు’ అని తీసివెయ్యటానికీ లేదు. అర్థం స్పష్టంగానే వుంది. నిజాయితీ కూడా కనిపిస్తుంది. కాని అది ఫిలాసఫీ అవుతుందా? ‘‘అద్భుతమైన తాత్విక కవితాచరణం అనటంలో మాత్రం సందేహం లేదు.

Tractatus గురించి చాలామంది చాలా అభ్యంతరాలు వ్యక్తం చేశారు. భాషకూ, వాస్తవికతకూ సంబంధముందంటే ఎవరూ కాదనరు. అయితే. అది తార్కికమైన సంబంధమని నిర్ణయించటం ఎలా? ఒకరకంగా విట్‌గెన్‌స్టీన్ ఈ సమస్యను దాటేశాడు. తర్కబద్ధంకాని అనేక విషయాలు మనం రోజూ మాట్లాడుకుంటూనే వున్నాం. ఒక నాగరిక ప్రపంచంలో బతకాలంటే ఇది తప్పదు.

తార్కికంగా మాట్లాడాలంటే మంచి – చెడూ, తప్పు – ఒప్పుల గురించి మనం ఏ వ్యాఖ్యలూ చెయ్యకూడదు. ఏ అభిప్రాయమూ వ్యక్తపరచకూడదు. మరి, కళ, సాహిత్యం వగైరాలు గురించి కూడా నోరు మెదపకూడదు. లాక్షణికంగా చూసినపుడు, కళాకృతిలో కనిపించేదీ, కనిపించనిది కూడా ఉంటుంది. కనిపించని దాని గురించి మాట్లాడుకోలేం గనక అది లేదన్నట్టు కాదుగద. వ్యక్తపరచ గలిగినదీ, వ్యక్తపరచలేనిదీ అనేసమస్య అసలు భాషలోనే వుందన్నారు పలువురు. తర్కబద్ధమైన విషయాలు సుస్పష్టంగా వుంటాయి గనక Tautologous గనక – అవేవీ వ్యక్తపరచనట్టే అన్నాడు విట్‌గెన్‌స్టీన్. ఈ ప్రతి పాదనతో ఫిలాసఫీ కథ ముగిసినట్టే అనిపిస్తుంది. Tractatusకు రాసిన ముందుమాటలో ఆయన ఈ విషయం స్పష్టం చేశాడు. ఎన్ని అభ్యంతరాలున్నా, తాత్విక దివాళాకోరుతనం గురించి ఎన్ని ప్రతిపాదనలు చేసినా, ప్రపంచవ్యాప్తంగా తాత్వికులను బాగా ప్రభావితం చేసింది. దీని ప్రేరణతో వియన్నా తాత్వికుల ‘Logical Positivism’కు తెరదీశారు. ఫిలాసఫీ ప్రస్థానం ముగిస్తే ముగిసి వుండవచ్చు గాని, కాని Logical Positivists, Tractatus ఆధారంగా కొత్త ఫిలాసఫీని రూపొందించటానికి కృషి చేశారు. వాళ్ళ ప్రకారం, నిరూపించ బడినప్పుడు మాత్రమే ఏ ప్రతిపాదన నైనా నిజమని నమ్మాలి.

ఈ ప్రకారం అర్థవంతమైన ప్రతిపాదనలు రెండు రకాలు. ఒకటి : గణితంలో లాజిక్‌లో చేసేవి. ఇవి Tautologous. ప్రతిపాదనలోనే అర్థం అంతర్గతతంగా ఉంటుంది. ఉదాహరణకు : పన్నెండులో నుండి పది తీసేస్తే రెండు. రెండో రకం : రాయి కొండపై నుండి కిందికి దొర్లుతోంది. ఏదిఏమైనా, నిరూపించలేని ప్రతిపాదనకు అర్థం లేదు. కాని మెటాఫిజికల్ లేదా మతపరమైన విషయాల గురించి నిరూపణలుండవు. ‘దేవుడున్నాడా?’ అనే ప్రశ్నకు జవాబుండదు సరిగదా, ప్రశ్న అడగటమే అర్థరహితం. Tautologous లేదా Veritiable by observatior రాని విషయాల గురించి మాట్లాడలేం. తనను అనుకరించిన Logical Positivists నమ్మకపోయినా, విట్‌గెన్‌స్టీన్ దేవుణ్ణి నమ్మడు. ఆ విషయం గురించి మాట్లాడడం తర్కం అనిపించుకోవడమంటే అది వేరే సంగతి. Tractatus లోని చివరి ప్రతిపాదన (మాట్లాడలేని విషయాల గురించి మౌనంగా ఉండక

తప్పదు) కొన్ని సమస్యల్ని సృష్టిస్తుంది. అర్థవంతంగా మాట్లాడలేకపోతే మాట్లాడకూడదు. దేవుడు, నైతిక విషయాలు, కళలు, లేదా గెలిచే రేసు గుర్రం దేనిగురించీ నోరు మెదపకూడదా?

కాసినో (నగరం) యుద్ధ ఖైదీల క్యాంపులో ఉన్నప్పుడు Tractatus Logico-Philosophicus కు తుదిమెరుగులు దిద్దాడు విట్‌గెన్‌స్టీన్. అప్పుడే రసెల్‌తో సంప్రదింపులు కూడా జరిపాడు. చివరికి, రసెల్ ఉపోద్ఘాతంతో ప్రచురిత మైంది Tractatus అయితే, అది చదివి విట్‌గెన్‌స్టీన్‌కు కోపమొచ్చింది. తను రాసింది రసెల్ అర్థం చేసుకోలేక పోయాడనుకున్నాడు. దాన్ని సరిచేస్తూ, తను మరో ఉపోద్ఘాతం రాస్తానన్నాడు. నిర్ద్వంద్వమైన, ఎవరూ ఖండించలేని వాస్తవిక విషయాలను, ఫిలాసఫీ సమస్యలకు అంతిమ పరిష్కారాన్ని తాను కనుగొన్నానన్నాడు. అయినప్పటికీ వీటివల్ల ఒరిగేదేమిటి?" అని పెదవి విరిచాడు. ఫిలాసఫీకి చరమగీతం పలికినా విట్‌గెన్‌స్టీన్ తర్కబద్ధంగానే, ఇక దానితో మనకు పని లేదనుకున్నాడు. విడుదలై, వియన్నాకు తిరిగివచ్చి మరేదైనా కొత్త రంగంలో కృషి కొనసాగించాలనుకున్నాడు. మొనాస్టరీలో చేరాలనుకుని మనసు మార్చుకుని, అక్కడే తోటమాలిగా పనిచేశాడు. సెయింట్ (SAINT) గా మారితే ఎలాగుంటుందని కూడా ఆలోచించాడు. (ఆయన ఫిలాసఫీ ప్రకారం సెయింట్‌లది అర్థవంతమైన జీవితం కాకపోయి నప్పటికీ) మొత్తం మీద విట్‌గెన్‌స్టీన్‌తో మళ్ళీ మానసిక సంఘర్షణ తీవ్రమైంది. యుద్ధరంగంలో అనుభవించిన క్రౌర్యం, కాఠిన్యం అతనిలో ఆధ్యాత్మిక చింతనని పెంచాయి. (టాల్‌స్టాయ్ తన చివరి సంవత్సరాలలో కూడా ఇలాంటి మార్పునకు లోనయ్యాడు)

ఆస్ట్రోహంగేరియన్ సామ్రాజ్యం పతనమైంది. ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా ఆస్ట్రియా దివాళా తీసింది. అయితే మరణించే ముందు కార్ల్ (తండ్రి) విట్‌గెన్‌స్టీన్ ఆదేశాల ప్రకారం కుటుంబ సంపదనంతా అమెరికాలో పెట్టుబడి పెట్టారు. కొడుక్కు చిర్రెత్తించిన విషయమదే. అతడి సంపద అనేకరెట్లు పెరిగింది. తోటమాలి పనుల నుండి తీరిక చిక్కిన సమయంలో వియన్నా కెళ్ళి, తన ఆస్తినంతా దానధర్మాలకు ఎలా వినియోగించాలో స్పష్టంగా తన లాయరుకు ఆదేశించాడు. అయితే లాయర్ ఆ మాటల్ని నమ్మటానికి కొంత సమయం పట్టింది. అది అపారమైన సంపద. అంతా యిచ్చేయ్యాల్సిందేనా! అదంతా ఇతరుల చేతుల్లోకి పోవటం ఇష్టపడని అక్కాచెల్లెళ్ళకు చాలామటుకు బదలాయించాడు. తాగుబోతు కవులకు ఎంతిచ్చినా అదెలా సద్వినియోగమవుతుంది.

సంపదనూ, ఫిలాసఫీని వదిలించుకున్న విట్‌గెన్‌స్టీన్ ఆస్ట్రియాలోని ఒక కుగ్రామంలో స్కూలు టీచరుగా కొత్త జీవితం ప్రారంభించాడు. స్కూల్లో చిన్న పార్క్, వాటర్‌ఫౌంటెన్ ఉందని, ఏ సదుపాయాలూ లేవని నిజమైన గ్రామీణ పాఠశాల (అతిపేద గ్రామం ట్రాటెన్‌బాక్‌లో ఉందది) కు వెళ్ళాడు. అక్కడ పిల్లలకు ఈ అపర కుబేర సన్యాసి, పేదరికం గురించి, నిరాడంబర జీవితం గురించీ బోధించాడు. పిల్లల తల్లిదండ్రులకు కోపమొచ్చింది. పేదలకు పేదరికం గురించి పాఠాలు చెప్పవలసిన అవసరం ఉందా? 'దొరికిందేదో తినాలి' అంటాడు. ఇప్పుడు చేస్తున్నదదేగా. పల్లెలో జనానికి భయభక్తులెక్కువ. 'చర్చికి వెళ్ళొద్దు. అక్కడి బోధనలు వినొద్దు' అంటే ఈయన వాళ్ళకో ప్రమాదకరమైన వ్యక్తిలా కనిపించాడు. స్థానికులకు అతని మీద కోపం రావటానికి మరో ముఖ్యమైన కారణం. సాయంత్రాలు వాళ్ళు లోకల్ బీర్ ఏదో తాగుతుంటే ఈయన వాళ్ళ ఆహ్వానాన్ని తిరస్కరించి, తన ఇంటిపై గదిలో కూర్చుని క్లారినెట్ వాయించటం. (ఆత్మహత్య గురించి ఆలోచించ లేదంటారా!! అదాయన రోజూ చేసేపనే) రెండేళ్ళ తర్వాత ఇక అక్కడ వుండలేని పరిస్థితి వచ్చింది. క్లాసులో ఓ కుర్రాణ్ణి కొట్టాడు. దీనికి కొంత అనవసరమైన పబ్లిసిటీ కూడా వచ్చి, స్థానికులు, మన ఫిలాసఫర్ సెయింట్ బెడద వదిలించుకున్నారు.

వియన్నా తిరిగి వచ్చాడు విట్‌గెన్‌స్టీన్. అతడి మానసిక స్థితి కుటుంబసభ్యులకు ఆందోళన కలిగించింది. ఆయన సోదరి తనకో ఇల్లు కట్టించివ్వమంది. డిజైను దగ్గర్నుండి, అన్ని విషయాలూ స్వయంగా నిర్ణయించాడు విట్‌గెన్‌స్టీన్. సింపుల్‌గా కనిపించినా చాలా ఖరీదైన ఇల్లది. యుద్ధానంతరం వీధుల్లో జనం ఆకలితో అలమటిస్తున్నప్పుడు ఆ నిర్మాణం జరిగింది. డాన్యూబ్ (నది) తూర్పు కాలువకు సమీపంలో ఆ ఇల్లింకావుంది. "వియన్నా సర్కిల్" ఫిలాసఫర్లతో పరిచయం పెంచుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. అతడి Tractatus ప్రతిపాదనలను Logical Positivism గా మార్చింది వీళ్ళే. తమ గురువుగారైన విట్‌గెన్‌స్టీన్‌లో ఆధ్యాత్మికత దాగివున్నదని తెలిసి వాళ్ళు నమ్మలేక పోయారు. అసలు Tractatusలోనే ఉంది ప్రచ్ఛన్న



మార్మికత. (ఈ లోకంలో మిస్టికల్ విషయాలెలా ఉన్నాయన్నది కాదు ప్రశ్న – ఉన్నాయంతే) ఇది సరిపోవన్నట్టు. Tractatusలో తను చెప్పిన విషయాలకన్న చెప్పనివే ఎక్కువ ముఖ్యమన్నాడు విట్‌గెన్‌స్టీన్. యూరోపులోని మేధావులెవరికీ ఈ మాటలు అర్థం కాలేదు. చెప్పని విషయాలను ఎలా వివరిస్తాడు? ఇది ఇండియన్‌రోప్ ట్రేక్ లాంటిది. తాను ఫిలాసఫీని చంపటానికి ప్రయత్నించిన మాట వాస్తవమేగాని, అందులో పూర్తిగా కృతకృత్యుడిని కాలేకపోయానేమోనని అనుకున్నాడు విట్‌గెన్‌స్టీన్. తాత్విక చరిత్రలో జరిగిన ఒక అపూర్వ సంఘటన ఇది. తాను చెప్పిందంతా తప్పని ఇంతవరకే తాత్వికుడూ అంగీకరించ లేదు. విట్‌గెన్‌స్టీన్ ఆపని చేశాడు. అయితే, ఈ విషయంలో అతడు మరో అడుగు ముందుకు వేశాడు. ఇంతా లాజికల్‌గా నిరూపించిన తన ఫిలాసఫీయే తప్పు గనుక, అసలు ఫిలాసఫీ అంతా తప్పులతడక అన్నాడు. అలా ఫిలాసఫీని తుదముట్టించడానికి రెండో ప్రయత్నం ప్రారంభమైంది.

1929 లో కేంబ్రిడ్జికి తిరిగి వచ్చాడు విట్‌గెన్‌స్టీన్. అతడు చెప్పింది అర్థం చేసుకున్న మనిషి ఈ లోకంలో ఒక్కడైనా ఉన్నాడంటే అతడు రసెల్. అయితే మాట్లాడుతున్నదేదో తన శిష్యునికే అర్థం కావటం లేదని కూడా గ్రహించాడు రసెల్. అయినప్పటికీ ట్రినిటీ కాలేజ్ యాజమాన్యం, విట్‌గెన్‌స్టీన్‌ను తమ ఫ్యాకల్టీగా నియమించుకున్నారు. (ఈయనకు ఏ అకడమిక్ డిగ్రీ కూడా లేదు!) ఆ తర్వాత పద్దెనిమిదేళ్ళపాటు కేంబ్రిడ్జిలో లెక్చర్లిస్తూ గడిపాడు విట్‌గెన్‌స్టీన్. కాని అతడికి ఉద్యోగమంటే అసహ్యం. 'Dishounest Job' ఫిలాసఫీ ఒక 'Living Death' తన లెక్చర్లల్లో తన కొత్త ఫిలాసఫీ లేదా Anti Philosophy బోధించాడు. క్లాసురూంలో అతడు మాట్లాడింది తక్కువ. ఆలోచిస్తూ గడిపిందెక్కువ. అయినా, కేంబ్రిడ్జిలోని అత్యంత బ్రిలియంట్ బ్రెయిన్స్‌గా గుర్తింపు పొందిన యువకులు ఆయనను వినటానికి ఇష్టపడ్డారు. అప్పుడప్పుడు ప్రశ్నలు వేసి తన విద్యార్థుల్ని పరీక్షించేవాడు విట్‌గెన్‌స్టీన్. అది Spanish Inquisition కన్నా తక్కువేమీ కాదన్నారు తెలిసినవాళ్ళు. అతని వ్యక్తిత్వంలో ఒక అద్భుత గాంభీర్యముండేదట.

అతణ్ణి చూస్తే కేంబ్రిడ్జిలో అందరికీ భయమూ, భక్తీ. వారంవారం జరిగే ఫిలాసఫికల్ క్లబ్ సమావేశాల్లో పాల్గొన్న విట్‌గెన్‌స్టీన్, సహాధ్యాయుల, విద్యార్థుల వాదనలను చీల్చి, చెండాడి అందర్నీ హడలగొట్టాడు. ఒంటరి జీవితం, ఏకాంతం ఇష్టపడేవాడు. ఒక యువకుడితో మాత్రం కొంత సాన్నిహిత్యం పెంచుకున్నాడు. చర్చల సంగతెలా వున్నా, అందరూ టాల్‌స్టాయ్‌లాగ నిరాడంబర జీవితం గడపాలని బోధించి (ఫ్యాక్టరీలో కూలీగా, ఆస్పత్రిలో వార్డ్‌బాయ్‌గా) విద్యార్థులకు కొంత అపకారమే చేశాడు.

రెండవ ప్రపంచయుద్ధంలో విట్‌గెన్‌స్టీన్ కూడా హాస్పిటల్ పోర్టర్‌గా పనిచేశాడు. అదృష్టవశాత్తూ అప్పటికే ఉన్నతస్థానాలలో ఉన్న మిత్రులు అతనికి బ్రిటిష్ పౌరసత్వం ఇప్పించారు. తనిక్కడ సుఖంగానే ఉన్నాడు. కాని నాజీ ఆక్రమణలో ఉన్న వియన్నాలో తన అక్కాచెల్లెళ్ళిలా ఉన్నారోనని బెంగ మొదలైంది. వీళ్ళు యూదులు. ఎంత సంపన్నులైనా నాజీలకు యూదులే ప్రథమ శత్రువులు. (ఆత్మాభిమానమో, అహంకారమో గాని విట్‌గెన్‌స్టీన్‌ల వంశంలో అందరికీ తలబిరుసు కాస్త ఎక్కువే. వియన్నాలో ఒక నాజీ అధికారి, విట్‌గెన్‌స్టీన్ సోదరికి, తాను ఆమెను 'యూదు'గా నమోదు చెయ్యనని వాగ్దానం చెయ్యబోతే, ఆమె ఏది ఏమైనాసరే, నన్ను యూదుగానే మీరు అధికారికంగా గుర్తించాలని పట్టుబట్టింది).

యుద్ధానంతరం కేంబ్రిడ్జికి తిరిగి వచ్చిన విట్‌గెన్‌స్టీన్ తన కొత్త ఫిలాసఫీ పుస్తక ప్రచురణకు సన్నాహాలు ప్రారంభించాడు. దీని పేరు Philosophical Investigations. రచయిత మరణానంతరం 1953లో అచ్చయింది. తను ప్రచురణకు అంగీకరించిన పుస్తకాలు ఇదీ, Tractatus మాత్రమే. (Tractatusను తర్వాత Disown చేశాడు) తరువాత, మరో అరడజను విట్‌గెన్‌స్టీన్ రచనలు వెలువడ్డాయిగాని అవన్నీ ఆయన కేంబ్రిడ్జి లెక్చర్లు తనకోసం రాసుకున్న నోట్‌బుక్స్ ఆధారంగా తయారు చేసినవి. తన నోట్సును, సన్యాసిలాగ జీవించిన ఎట్‌గెన్‌స్టీన్ ఒక 'సేఫ్' లో దాచుకున్నాడు. కొందరు దీనిలో ఒక ప్రతీకాత్మకత చూశారు. జీవితంలోనూ, మేధోమథనం లోనూ 'స్పష్టత' కావలన్న వ్యక్తి తన అభిప్రాయాలను

సేఫ్'లో నెందుకు దాచుకున్నాడు? "మనం మాట్లాడలేని విషయాల గురించి మాట్లాడకూడదు. "ఉన్నా ఆయన ప్రతిపాదనలో కొందరికి ఆయన హోమోసెక్సువల్ పార్శ్వం కనిపించింది. విట్‌గెన్‌స్టీన్ వంటి అసాధారణ మేధావి జీవితంలో వైరుధ్యాలుండక తప్పదు. అతడు చేసిన ప్రతిపనికీ అనేకమంది అనేక అర్థాలు తీయటం సహజమే. మళ్ళీ, విట్‌గెన్‌స్టీన్ మాటల్లోనే "మాట్లాడుకోలేకపోయినా కొన్ని విషయాలున్నాయిగదా మరి!"

Tractatusతో పోల్చితే, Philosophical Investigations. అందర్నీ నిరాశకు గురిచేసింది. Tractatusలో ఉన్న స్పష్టత, ధైర్యంగా (తాత్విక చరిత్రలోనే అసమాన ధైర్యమది!) చేసిన ప్రతిపాదనలకు బదులు Logical Analysis అవసరమైన ఆక్షేపణలతో, పదాల అర్థాలను గురించిన చర్చలతో నిండి ఉంటుంది. చర్చించటం లేదు. ప్రతిదాన్నీ Philosophise చెయ్యడం వేరు. మన ఆలోచనా ధోరణిలోని లోపాలను ఎత్తి చూపటాన్ని Philosophising అనొచ్చు. ఈ పొరపాట్లెందుకు జరుగుతాయి? భాష ద్వారా వ్యక్తీకరించే క్రమంలో పొరపాట్లు దొర్లే అవకాశముంది. భాష వాస్తవ జీవిత దృశ్యం కాదు. అది దారాలతో అల్లిన సన్నటి వలలాంటిది. సరైన సమయంలో, సరైనపదం ఉపయోగించనప్పుడు చిక్కుముడి పడుతుంది. ఈ ముళ్ళను విప్పటమే ఫిలాసఫీ చెయ్యాల్సిన పని. అసలు ఫిలాసఫీ ఇంత సంక్లిష్టంగా, ఇంత బోరింగ్‌గా ఉండటానికి కారణమిదే. మన సుదీర్ఘ తాత్విక సాంప్రదాయం, మన సత్యాన్వేషణ, అస్తినాస్తి విచికిత్స, వగైరా అన్నీ కేవలం 'భాషాసమస్య'గా మారిపోయాయి. తరువాత దశలో విట్‌గెన్‌స్టీన్ ప్రతిపాదించిన ఫిలాసఫీని సూపర్‌స్ట్రింగ్ థియరీతో పోల్చారు. (దీనిప్రకారం ఈ విశ్వాంతరాళానికి కారణమైన Subatomic Particles ఒక దాన్నొకటి పెనవేసుకున్న గొలుసులాగుంటాయి.) ఈ పోలిక బాగుందనిపించినా, ఇది శుద్ధ తప్పు అన్నారు కొందరు. అలా తన ఫిలాసఫీ ప్రస్థానం రెండు దశల్లో ముగించి, మళ్ళీ సెయింగ్‌గా మారిపోయాడు విట్‌గెన్‌స్టీన్. ఐర్లండ్‌లోని ఒక మారుమూల ప్రాంతంలో నివాసం ఏర్పరచుకుని ఆలోచిస్తూ సీగల్స్‌కు ఆహారం వేస్తూ గడిపాడు. కఠిన నియమాల వల్ల ఆరోగ్యం పాడైంది. శేషజీవితం, ఇంగ్లండులో, ఆమెరికాలో మిత్రుల వద్ద గడిపాడు. కాన్సర్ సోకిందని తెలిసింది. కేంబ్రిడ్జిలో 1951, ఏప్రిల్ 29 నాడు మరణించాడు. ఎప్పుడూ చర్చికి వెళ్లకపోయినా, కేథలిక్స్ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు నిర్వహించాలని కోరాడు. ఆత్మహత్యను సూసైడ్ అంటారు. విట్‌గెన్‌స్టీన్‌ది ఫిలాసఫీ సైడ్ (Philosophicide) అయినా ఆయన శిష్యగణమంతా తాత్వికులే.

Ray Monk, David Pears, Joachim Shulte, Paul Stratherne రచనలు ఆధారంగా...

ముక్తవరం పార్థసారథి
ఫోన్ : 9177618708

కమ్మతెమ్మెరలు

"... అపురూప చిత్రాల ఆకర్షణాయుత
ముఖపత్రములతోడ ముందుకురికి
చింతనాత్మకమైన చింతనవెలిగించి
తెలుగుభాషాకాంతి తేజరిల్ల,
పరభాషలోని పాతమధురిమల
మేలుపలుకులతో మిసిమి విరిసె
చారిత్రపుటలను చతురత చూపించి,
మాధుర్యములదీసిమసలె మిసిమి

తే॥గీ॥ విమల తెల్గుభాషారశ్మివెల్గుసోకి,
తెలుగు అందాల చిందుల తీరు లెగసి,
పరిడవిల్లెను సాహిత్య పాత్రమగుచు
సాగె మిసిమి యై మరి లేదు సాటియనుచు

బండారు పురుషోత్తం
తిరుపతి, ఫోన్ : 9441526803

సరిహద్దులు దాటి...

జీవితమనండి, డెస్టినీ అనండి.. మనకు ఎన్నో అవకాశాలు ఇస్తుంది. కాదనుకుంటూ ఎటో సాగిపోతుంటాం. చాలా కొద్దిమంది ఆ అవకాశాల్ని అందిపుచ్చుకుంటారు. అదెలా సాధ్యమంటే వారిలో ఉన్న క్రమశిక్షణ, పట్టుదల ఏదన్నా కావొచ్చు. అనుకున్న బాటలో సాగిపోతారు. ఆ కోవకు చెందుతారు డా. నిమ్మగడ్డ శేషగిరి రావు. నిజామాబాద్ జిల్లాలో బోధన్ దగ్గరున్న చిన్నపల్లె రాణంపేట వారి సొంతూరు. తాత గుంటూరు జిల్లా దుగ్గిరాల నుంచి వచ్చారు. తండ్రి సాంబశివరావుకు చదువు విలువ తెలుసు. విజయవాడ లయోలా కాలేజీలో ఆయన చదివారు. భార్యాభర్తలిద్దరు పిల్లలకు చదువుతో జీవితంలో ఎంత ముందుకెళ్ళొచ్చో అర్థమయ్యేలా వివరించారు. పెద్దవాడయిన శేషగిరికి డాక్టర్ చదవాలని కోరిక. తండ్రి ప్రోత్సహించారు. ఐదో తరగతి పూర్తి కాగానే బోధన్‌లో ఉన్న విజయ్ మేరీ కాన్వెంట్‌లో చేర్పించారు. శేషగిరి ఎక్కడున్నా క్లాస్ ఫస్ట్. స్కూలింగ్ అయిపోగానే ఇంటర్మీడియట్ కోసం తండ్రి చదివిన విజయవాడ లయోలా కాలేజీలో చేర్పించారు. అక్కడి క్రమశిక్షణ శేషగిరికి తన లక్ష్యం వైపు సాగేలా చేసింది. ఎమ్ సెట్ లో మంచి ర్యాంకు వచ్చింది. నాన్ లోకల్ కోటాలో కాకినాడ రంగరాయ కళాశాలలో చేరారు. కాకినాడ కళాశాల ఎన్నో కొత్త విషయాలు నేర్పింది. ఎమ్.బి.బి.ఎస్. పూర్తయిన తరువాత పి.జి. అవకాశాలు తక్కువ ఉండటంతో హైదరాబాద్‌లో ఒక హాస్పటల్‌లో రెసిడెంట్ డాక్టర్‌గా చేరారు. అప్పుడు ఆయన సివిల్స్ పరీక్షలు రాసారు. మొదటి ప్రయత్నం లోనే ఇంటర్వ్యూ కు దాకా శేషగిరి ప్రయాణం సాగింది. ఇంటర్వ్యూ బోర్డు ఛైర్మన్ అనుభవశాలి, ఎనభైల్లో పంజాబ్ ఉగ్రవాదాన్ని అణచి వేయటంలో ముఖ్య పాత్ర పోషించిన ఐపిఎస్ అధికారి జూలియో రిబేరియో. డాక్టర్ కోర్సు చదివి సివిల్ సర్వీసెస్‌కు ఎందుకొస్తున్నావని అడిగారు. దేశాలు తిరగటం ఇష్టమని శేషగిరి చెబితే అప్పుడు ఇండియన్ ఫారిన్ సర్వీస్‌కు వెళ్లాలి. కానీ చాలా ఆంక్షలు ఉంటాయని చెప్పారు.

డా. శేషగిరి రావు

సివిల్స్‌లోనే తెలుగు, పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్, చరిత్ర క్షుణ్ణంగా చదివారు. అయితే రాత పరీక్షలో రావలిసినన్ని మార్కులు రాక సివిల్స్ రెండు ప్రయత్నాలతో వదిలేసారు. తను చదివిన తెలుగు, చరిత్ర, పబ్లిక్ ఎడ్మినిస్ట్రేషన్ తన జీవితంలో ఎంతో ఉపయోగపడినవని చెబుతారు. తరువాత సైకియాట్రీలో పి.జి. చేయడానికి నిర్ణయించుకొని అవకాశాలు కోసం వెదికి లండన్ నగరాన్ని ఎంచుకున్నారు. ఫోరెన్సిక్ సైకియాట్రీ లో పిజి పూర్తి చేసి అక్కడే ఒక హాస్పిటల్‌లో మెడికల్ డైరెక్టర్‌గా స్థిరపడ్డారు. పద్దెనిమిదిమంది డాక్టర్ల బృందానికి నాయకుడయ్యారు. మెడికల్ కాన్ఫరెన్స్‌ల్లో దేశాలు తిరగటం అలవాటయిన డా. శేషగిరికి కొత్త ప్రదేశాల సందర్శనతో రీఛార్జ్ అవటం మొదలయింది. సంవత్సరానికో నెలరోజుల్ని తనకోసం కేటాయించుకోసాగారు. ఇప్పటి వరకు నూట ఇరవై దేశాలు పర్యటించారు. ఇందులో పాకిస్థాన్, సూడాన్, ఇథియోపియా, క్యూబా వంటి ఎన్నో దేశాలన్నాయి. తన అనుభవాలను డైరీగా రాసుకొని కొంతకాలం ఫేస్‌బుక్‌లో పెట్టారు. అవి చదివిన స్నేహితులు విపులంగా రాయమని ప్రోత్సహించారు. తరువాత ఇంగ్లీషులో రాసిన డా. శేషగిరి యాత్రా విశేషాలను ప్రొఫెసర్ ఆదినారాయణ, దాసరి అమరేంద్ర, అట్లూరి జయశ్రీ వంటివారు తెలుగులో అనువాదం చేయటం మొదలుపెట్టారు. మొదటి పుస్తకం మొరాకో అనుభవాలుగా వస్తే, రెండో పుస్తకం సరిహద్దులు దాటి యాత్రాకథనాలుగా ఇప్పుడు ఆవిష్కరింపబడింది.



డా. శేషగిరితో సంభాషిస్తే మన మనసు తేలిక పడుతుంది. ఆయన నిరాడంబరత మనల్ని కట్టిపడేస్తుంది. యాత్ర చేసేవారికి ఓపికుండాలి. ఓపెన్ మైండెడ్‌నెస్ ఉండాలంటారు. స్థానికులతో కలిసిపోవాలంటారు. స్థానిక రుచులు ఆస్వాదించాలంటారు. ఆయనదో గొప్ప ఫిలాసఫీ అని ఆయన రచనలు చదివితే మనకు అర్థమవుతుంది. ఇవి ఆయన ప్రవృత్తికి సంబంధించిన అంశాలు. వృత్తిరీత్యా ఆయనో ఫోరెన్సిక్ సైకియాట్రీ నిపుణులు. ఆయన వృత్తి చాలా క్లిష్టమైనది. ఆ అనుభవాలను వచ్చే సంచికలో తెలుసుకుందాం.

- సి.యస్.రాంబాబు

పేజీలు : 312, వెల : రూ. 299, ప్రతులకు : **మిసిమి** కార్యాలయం, ఫోన్ : 9949516567.

చదవండి...

– మిసిమి

ఆధునిక కావ్యం కొయ్యగుర్రం : నగ్నముని రాసిన ఈ ఆధునిక మహా కావ్యం (చే.రా) దివిసీమ ఉప్పెన సందర్భం. తెలుగు సాహిత్యంలో ఉప్పెన ఉవ్వెత్తున లేచి బడబాగ్నిని మిగిల్చింది. అర్ధశతాబ్దం తరువాత కూడా దీని దరిదాపుల్లోకి వచ్చిన వచన, కవిత్వ, కావ్యాలు లేవనే చెప్పాలి. ఇది అపౌరుషేయం. అంటే ఏ పురుషులోను చెప్పలేదు. ఇందులో ఏముంది? ప్రభుత్వాల వైఫల్యం, ప్రజా ప్రతినిధుల అలక్ష్యం, అధికారుల బధిరత్వం, సామాన్యుని ఆగ్రహం, ఆరాటం, అసహాయ దుఃఖం, పరిష్కారం కనపడని పెంజీకటి. నాగలి మోసే క్రీస్తు, శిలువ మోసే రైతు! ఇవన్నీ చరిత్ర పుటల్లోని మాటల్లో చెప్పాలంటే ఒక ద్రష్ట అయి ఉండాలి. అందుకే ఇది కాలాతీతం. చదవి నేను చెప్పింది నిజమో కాదో తెలుసుకోండి.



వెల : రూ. 120, ప్రతులకు : ఫోన్ : 9441081922

పరంపర నవల - రచయిత : శిరంశెట్టి కాంతారావు : గ్రామీణ ప్రజల సంబంధాలలో వృత్తులు ఎంత గాఢంగా పెనవేసుకుపోతాయో తెలుసు కోవాలంటే ఈ నవలలోని గ్రామాలని నందర్శించాలి. మనిషికి అవసరమయిన ప్రతి వస్తువు, లోహ పాత్రలను కళాత్మకంగా తయారు చేసే కంచర వృత్తికారుల జీవన గమనాన్ని పరంపర ఆవిష్కరిస్తుంది. దీనికోసం రచయిత ఎంతో అధ్యయనం చేసి తన అక్షరాలను నిప్పుకణికల్లా మార్చి ఈ పుటలలో పేర్చారు. వృత్తి కళాకారులకు ఈ నవల పెద్ద నివాళి. తప్పక చదవండి.



పుటలు :290, వెల : రూ. 250,
ప్రతులకు : ఫోన్ : 9849890322

కారున్ కథలు - రచయిత : చక్రవర్తుల శ్రీమాన్ : వీరు గతి తార్కిక భౌతిక వాదాన్ని వామపక్ష భావాలని వంట పట్టించుకుని రచనలు చేస్తున్నారు. ఉపాధ్యాయ ప్రజా సంఘాల నాయకుడిగా కూడా వీరికి అనుభవం ఉంది. ఆదివాసీ, రైతాంగ, కార్మిక వర్గాల వైవిధ్యభరితమైన జీవితాలను దగ్గరగా చూసారు. ఈ అనుభవ నేపధ్యంలో వారు ఈ అయిదు కథలు రాశారు. శ్రీమాన్ లోపల ఏ దుఃఖాలు గడ్డకట్టాయో తాను నొక్కిపట్టుకున్న కోప తాపాలు అసంబద్ధ దోపిడీ సమాజం మీద ఆగ్రహం ఈ అయిదు కథల్లో కనిపిస్తుంది, వినిపిస్తుంది.

పుటలు : 67, వెల : రూ. 80,
ప్రతులకు : పాలపిట్ట, ఫోన్ : 9848787284

అంతర్ధితం - రచయిత : డా. రూపకుమార్ డబ్బికార్ : ఇవి సాహిత్య వ్యాసాలు. సృజనాత్మక సాహిత్యాన్ని పరామర్శించే విమర్శకుడు సృజనకారుడై ఉండాలి. నిశిత బుద్ధితో విషయాన్ని ఆకళింపు చేసుకొని మనకు చెప్పగలిగి ఉండాలి. తులనాత్మక అధ్యయనం చేయగలిగి ఉండాలి. రచయితల రచనాశక్తి మీద గౌరవం కలిగి ఉండాలి. ఇవన్నీ రూపకుమార్‌లో నిండుగా ఉన్నాయి. వారిలో నిజాయితీ ఉంది. అభిప్రాయంలో స్పష్టత ఉంది. వారి వాక్యాలలో పారదర్శికత ఉంది. *పేజీలు: 175, వెల: రూ. 150/-*



లచ్చుంబాయి కథలు - రచయిత - డా. రూపకుమార్ డబ్బికార్ : రూపకుమార్ రాసిన కథలు ఇవి. ఇవన్నీ జీవ సంఘర్షణలని ప్రాణవంతంగా చిత్రించి మనసులోని తడుల్ని, ఒత్తిడుల్ని మంచి కథలుగా తీర్చిదిద్దిన రచయిత డా. రూపకుమార్. వారు రచించిన పదకొండు కథల సంపుటి ఈ లచ్చుంబాయి కథలు. వీరి కథలలోని పాత్రలు, సంభాషణలు, సన్నివేశాలు, సంఘర్షణలు జీవితంలోంచి వచ్చినవి కాబట్టి అంత ఆర్ద్రంగా ఉంటాయి. ప్రధానంగా నల్లగొండ పట్టణ పరిసరాలు గ్రామీణ పరిమళాలు నేపధ్యంలో అక్కడి ప్రజలు చేస్తున్న జీవన పోరాటానికి సంబంధించిన ఇతివృత్తాలతో ఈ కథలు నిండి ఉన్నాయి.



పేజీలు : 111, వెల : రూ. 100, ఈ రెండు పుస్తకాల కొరకు పాలపిట్ట, ఫోన్ : 9848787284 వారిని సంప్రదించగలరు.

గోల్కొండ చరిత్ర - ఆంగ్లమూలం అబ్దుల్ మజీద్ సిద్ధిఖి అనువాదం - డా. రూపకుమార్ డబ్బికార్ : 1939లో మిజీద్ సిద్ధిఖి గారు ఉర్దూలో రాసిన గోల్కొండ చరిత్ర ఆంగ్లంలోకి రావడానికి పదిహేడు సంవత్సరాలు పట్టింది. తెలుగులోకి రావడానికి 80 సంవత్సరాలు పైన పట్టింది. అది

రూప్‌కుమార్ పూనుకొని, డా. ఏనుగుల నర్సింహా రెడ్డి గారి సూచన మేరకు తెలుగులో అనువాదం చేసి మనకందించారు. ఈ గ్రంథ ప్రచురణకు మామిడి హరికృష్ణ గారు సంపాదకీయం వహించి రూప్‌కుమార్ గారిని ఎంతో ప్రోత్సహించారు. గోల్కొండ చరిత్ర సమగ్రంగా అవగాహన రావాలంటే తప్పనిసరిగా ఈ అనువాద గ్రంథాన్ని, ఎంతో మేలైన ప్రతిని అందించిన భాషా సాంస్కృతిక శాఖ వారిని తప్పనిసరిగా ప్రశంసించాలి. *పేజీలు : 330, వెల : 330 ప్రతులకు : రవీంద్రభారతి సాంస్కృతిక శాఖ కార్యాలయం, ఫోన్ : 040-29703142*

అమ్మకు ఓ జత చెప్పులు కొనాలి (కవితలు) - రచయిత - లేదాళ్ల రాజేశ్వర రావు : బరువైన భావాలు, సరళమైన భాష, తేలికపాటి అభివ్యక్తి ఇవన్నీ కలిపితే లేదాళ్ల కవిత్వం. దీనిలో ఒక లయ ఉంది. అది శబ్దప్రధానమే కాదు భావ ప్రధానం కూడా. సమాజంలోని జీవితంలోని అనేకానేక సంఘటనలు స్పందించడం కవి స్వభావం. అది పుష్కలంగా ఈ రచయితకు ఈ రచనల్లో కనపడుతుంది.

పేజీలు :50, వెల రూ. 150,
ప్రతులకు : పాలపిట్ట, ఫోన్ : 9848787284

ఆజాదీ (కవిత్వం) - కలిపె రాజ్‌కుమార్ : ప్రతి పొద్దుపొడుపులో కనిపించే గద్దర్‌కు అంకితమిచ్చిన ఈ కవితలు. సమాజంలోని అసమానతలను చూసి మనసు వేడెక్కి భావాలు ఉడికి జలజలా రాలేదే కవితా పంక్తులు. రాజ్‌కుమార్ గారికి తనుచుట్టూ జరుగుతున్న అన్యాయాల్ని చూసి స్పందించిన మనసే ఈ కవిత్వాన్ని రాయించింది.

పేజీలు : 168, వెల రూ. 150,
ప్రతులకు : పాలపిట్ట, ఫోన్ : 9848787284

పునాస - తెలంగాణ సాహిత్య అకాడమి త్రైమాసిక పత్రిక : డా. నందిని సిద్ధారెడ్డి సంపాదకత్వంలో వెలువడుతున్న ఈ సాహిత్య త్రైమాసిక పత్రిక. తెలంగాణ నీటి ఘోసతో ప్రతిధ్వనిస్తోంది. ఇందులో వ్యాసాలు, కథలు, అనువాద కథలు, సమీక్షలు, కవితలు ఉన్నాయి. తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబచేసే ప్రయత్నం పునాస.

పేజీలు: 100, సంవత్సర చందా : 100., విడిప్రతి 25/-

కవికోకిల దువ్వూరి రామిరెడ్డి - కవిత్వం - వ్యక్తిత్వం - రచన - డా. కోడూరి ప్రభాకర రెడ్డి : దువ్వూరి రామిరెడ్డి కవి కోకల. వారు ఆధునికుల్లో సంప్రదాయవాది – సంప్రదాయకుల్లో ఆధునికులు. బాధ్యత తెలిసిన స్వేచ్ఛా వాది. కవి స్వాతంత్ర్యాన్ని కోరిన బాధ్యతా వాది. ఆంధ్రసాహితీ నందనంలో కవి కోకిల బిరుదాంకితులు. ఆంధ్రులకు కవి కోకిల ఒక్కడే అంటారు కోడూరి ప్రభాకర రెడ్డి.



పేజీలు : 161, వెల : 200, ప్రతులకు : ఫోన్ : 9440170808

ముసునూరి ప్రోలయ్య- రచయిత - యడ్లపల్లి అమర్‌నాథ్ : ముసునూరి వంశీకుల గురించి గత దశాబ్దంగా పరిశోధనచేస్తూ పాతిక సార్లు పైగా రేకపల్లి అటవీ ప్రాంతాన్ని సందర్శించి ఎలుగుబంటి దాడిని ఎదుర్కొని ముసునూరి ప్రోలయ్య నాయకుని ఆనవాళ్ళను ప్రపంచానికి పరిచయం చేశాడు యువచరిత్ర కారుడు యడ్లపల్లి అమర్‌నాథ్. అనేక శాసన సాహిత్య ఆధారాలతో వెలుగులోకి తీసుకొచ్చాడు. *పేజీలు : 164, వెల : 250/-*

ముసునూరి కాపయ్య - రచయిత - యడ్లపల్లి అమర్‌నాథ్: ఢిల్లీ సుల్తాన్‌ల మీద విప్లవ పోరాటాలు చేసి, విజయాలు సాధించి ఓరుగల్లుకోట మీద తెలుగువారి జెండా ఎగురవేసి తుగ్లక్ బారినుండి స్వాతంత్ర్యం తీసుకొచ్చిన మహానాయకుడు ముసునూరి కాపయ్య నాయకుని చరిత్ర ఇది.

పేజీలు : 160, వెల : 250/-, ప్రతులకు: నవోదయ బుక్ హౌజ్, ఫోన్: 040-24652387

కథాస్రవంతి : సంఘసంస్కరణ కోసం స్త్రీ జనోద్ధరణ కోసం జీవితాన్ని త్యాగం చేసిన కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు అప్పటి జీవితాన్ని, స్వాతంత్ర్యపు కాలంనాటి సంఘటన లతో కథలుగా చెప్పారు. చక్కని వ్యావహారిక భాషలో కొద్దిగా పసుపులో గంధం కలిసినట్లు శిష్ట గ్రాంధిక పదాలు న్నాయి. నా జీవితం, ధర్మం, నా మతం, నీవు, నా లక్ష్యం సత్ శ్రేయస్సు, ఈ విధంగా చెప్పగలిగిన మహిళ కనువర్తి వరలక్ష్మమ్మ, సమాజానికి స్త్రీ శ్రేయస్సు ముఖ్యం. అదే కథా వస్తువుగా రాసిన కథలు ఈ తరం తప్పని సరిగా చదవ వలసినవి. అభ్యుదయ రచయిత సంఘం ప్రచురించింది. అయితే ఈతరం ఎక్కడుంది?



పేజీలు : 111, వెల : 65/-, ప్రతులకు: నవోదయ, నవచేతన, విశాలాంధ్ర పుస్తకాల షాపులు.

మిసిమి
మాసపత్రిక

మీరు చందాదారులుగా చేరండి బహుమతిగా పంపండి

మీకు ప్రియమైనవారు, స్నేహితులు - మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితుల కోసం చందా **మిసిమి** పేర పంపి, చిరునామా వివరాలు మాకు ఫోన్ *(994 951 6567)* లేదా ఇ-మెయిల్ *(misimi90monthly@gmail.com)* ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

A/C Name : Misimi Publication
HDFC Current Account No. 50200069769243
IFSC Code : HDFC0000472

చందా వివరాలు:
₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

Scan QR to Pay
Misimi Publication

మిసిమి ప్రచురణలు

నోబెల్ వ్యాసాలు


మిసిమి పార్థసారథి వ్యాసాలు


చిత్రకళా నీరాజనం

దూరతీరాలలో...

పురస్కార సాహిత్యం

వ్యాస మంజూష


సాధ్యత వ్యాసాలు

చార్లీ చాప్లిన్

రజ్జు సర్పభ్రాంతి

భైరన్


సిద్ధార్థ

సప్తపర్ణి

షెల్లీ జీవిత కథ


దోసిట చినుకులు


సృత్యభారతి

పారిజాతం

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: 994 951 6567.

మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.